సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 276

శనివారం 27-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

పిల్లలూ ప్రపంచమూ..

'2025'.. పిల్లలకు ఏం నేర్పింది? ఎలా స్ఫూర్తినిచ్చింది?.. -11లో

రేణుక, షఫాలీ మెరుపులు

మూడో టి20లో శ్రీలంకపై భారత్ విజయం -13లో



సిక్కుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

సిక్కుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని.. వారి ప్రాణత్యాగం దేశ ధైర్యసాహసాలు, వీరత్వానికి ప్రతీక అని ప్రధాని మోదీ కొనియాడారు.

వివరాలు 6లో ▸



పాక్ గుండెలో 'సింధూర్ 2.0'

పాకిస్తాన్‌ను 'ఆపరేషన్ సింధూర్ 2.0' భయం వెంటాడుతోంది. దీంతో ఎల్‌ఓసీ వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది.

వివరాలు 6లో ▸

ఆ బాలలు దేశానికి గర్వకారణం

రాష్ట్రీయ బాల పురస్కారాలు స్వీకరించిన చిన్నారులు దేశానికి గర్వకారణంగా నిలిచారని రాష్ట్రపతి ముర్ము ప్రశంసించారు.

వివరాలు 6లో ▸

..'పాండోరా బాక్స్' తెరిచినట్టే!

ఎయిర్ ప్యూరిఫయర్లపై జీఎస్టీని తగ్గిస్తే అది 'పాండోరా బాక్స్' తెరిచినట్లవుతుందని కేంద్రం ఢిల్లీ హైకోర్టులో వ్యాఖ్యానించింది.

వివరాలు 6లో ▸

భూములిస్తే.. బలి తీసుకున్నారు!

గుండె పగిలిన రాజధాని రైతు

సభలో కుప్పకూలిన రైతు రామారావును తీసుకెళ్తున్న స్థానికులు

ఇప్పటికే రెండు ఎకరాలు ఇచ్చా.. ఈ ప్రభుత్వం మమ్మల్ని ముంచేసింది!

నేనిచ్చిన భూమికి బదులుగా వాగులో ప్లాటు ఇచ్చారు..

ఇప్పుడు నా ఇంటిని కూడా లాక్కుంటామంటే ఎలా?

సభలో మాట్లాడిన అనంతరం కుప్పకూలి రైతు రామారావు మృతి

ఎన్-8 రోడ్డు బాధితులతో మందడంలో నిర్వహించిన గ్రామసభలో తీవ్ర విషాదం..

రాజధాని కోసం లక్ష ఎకరాల దిశగా బాబు సర్కారు అడుగులు

గతంలోనే 50 వేల ఎకరాలకుపైగా సేకరణ.. అది చాలదంటూ మళ్లీ పూలింగ్

29 గ్రామాలకే పరిమితమైతే అమరావతి.. ఓ చిన్న మున్సిపాలిటీనే అంటూ బెదిరింపులు

మొత్తం ఏడేళ్ల పాటు అధికారంలో ఉన్నా రైతులకిచ్చిన హామీలను నెరవేర్చని బాబు

సారవంతమైన భూములే కాదు.. తమ ఇళ్లపై కూడా గురి పెట్టడంతో రైతన్నల్లో తీవ్ర మానసిక వ్యథ.. తామిచ్చిన భూములకు బదులుగా వాగులు, చెరువు భూములు, నీట మునిగే ప్రాంతాల్లో ప్లాట్లు ఇవ్వడంపై ఆగ్రహావేశాలు

ఈ నమ్మక ద్రోహాన్ని ప్రశ్నిస్తూ మందడం సభ సాక్షిగా మానసిక క్షోభతో రామారావు మృతి

2లో

చనిపోవడానికి కొద్ది క్షణాల ముందు తన ఆవేదనను తెలియజేస్తున్న రైతు రామారావు

ఇళ్లిచ్చి.. మేం బొచ్చెలు పట్టుకుని బజార్ల వెంబడి పడి ఏడవడం ఏంటి?

రోడ్డు కోసం మీరు ఇళ్లు తీసుకునే లెక్కనైతే తీసుకోండి.. మాకు ఎక్కడిస్తారంటే.. సీడ్ యాక్సిస్ రోడ్డు వెంబడి స్థలాలు ఇవ్వండి. పొలాలు ఇచ్చాం.. సింగపూర్ వాళ్లకు ఇచ్చిన దాంట్లో రెండు ఎకరాలు తీసుకొచ్చి వాగులో కొట్టారు.. లాటరీ అని.. ఎవరికి చెప్పుకోవాలి..? ఇచ్చిన చోట ఇంత లోతు (ఛాతీ చూపిస్తూ) నీళ్లు పడ్డాయి. ఈ ఇళ్లు ఇచ్చి.. మేం బొచ్చెలు పట్టుకుని బజార్ల వెంబడి పడి ఏడవడమేంటి? అడుక్కోలేం కదా...! సింగపూర్ వాళ్లకు ఇచ్చిన సీడ్ యాక్సిస్ రోడ్డుకు అవతల ఊళ్లో వాళ్లందరికి కలిపి ఒకేచోట స్థలాలు ఇవ్వండి... ఎవరికి వాళ్లకు ఇచ్చారనుకో.. హైదరాబాద్‌లో మాదిరి గొంతు కోసుకున్నారుగా.. అలా కోసుకుంటారు (పీక కోసుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు). ఆ తరువాత రామారావు హఠాత్తుగా కుప్పకూలిపోయారు.

- మందడం సభలో రైతు రామారావు ఆక్రందన ఇదీ..

'స్మార్ట్'గా రూ.20 కోట్ల దోపిడీ

రూ.77.98 కోట్ల స్మార్ట్ ఫోన్ డీల్‌లో ప్రజాధనం లూటీ

అంగన్‌వాడీలకు 58,204 ఫోన్ల కొనుగోలులో అవినీతి

#	आइटम विवरण | Item Description	आइटम विवरण | Ordered Quantity	इकाई | Unit	इकाई मूल्य (INR) | Unit Price (INR)
	उत्पाद का नाम | Product Name : SAMSUNG 4 GB RAM Smartphone ब्रांड | Brand : SAMSUNG ब्रांड प्रकार | Brand Type : Registered Brand कैटलॉग की स्थिति | Catalogue Status: OEM verified catalogue बेचा जा रहा है | Selling As : OEM verified Reseller श्रेणी का नाम और चतुर्थांश | Category Name & Quadrant : Smartphone (V2) (Q2) मॉडल | Model: Samsung Galaxy Smart Phone A06 5G (4/64 GB)	58,204	pieces	13,398

శామ్‌సంగ్ ఏ06 5జీ ఫోన్‌కు ప్రభుత్వ ధర రూ.13,398

Samsung Galaxy A06 5G (Light Green, 64 GB) (4 GB RAM)

₹9,380 32% off

ఆన్‌లైన్‌లో ఉన్న ధర రూ.9,380

- 4 జీబీ ర్యామ్, 64 జీబీ మెమరీ ఫోన్‌కు రూ.13,398 వ్యయం
- ఆన్‌లైన్‌లో ఇదే కాన్ఫిగరేషన్ మొబైల్ ధర రూ.10 వేలలోపే
- భారీగా కొంటే ఆన్‌లైన్ కంటే తక్కువకే ఆఫ్‌లైన్‌లో లభ్యం
- కానీ, ఆన్‌లైన్ కంటే అధిక ధర చెల్లింపుతో చంద్రబాబు ప్రభుత్వ దోపిడీ
- చార్జర్లలోనూ కక్కుర్తి... మొబైల్ కంపెనీనే చార్జర్ ఇవ్వాలని నిబంధన
- అదీ ఎగ్గొట్టేందుకు ఎత్తులు... సాగకపోడంతో థర్డ్ పార్టీ చార్జర్‌తో సరి
- కంపెనీ చార్జర్ రూ.వెయ్యిపైనే.. థర్డ్ పార్టీదైతే రూ.400లోపే

3లో



రేపటి 'ఫన్‌డే' కి బదులుగా సాక్షి 2026 క్యాలెండర్‌ను ఉచితంగా అందుకోండి...

వెండి @ రూ.2.36 లక్షలు

వెండి వెలుగులు

2025 సిల్వర్‌నామ సంవత్సరం

పుత్తడి కంటే వేగంగా పరుగులు

ఆల్ టైమ్ గరిష్టానికి చేరిన ధర..

ఏడాదిలో 154 శాతం పెరిగి కిలో రూ.2.36 లక్షలకు చేరిన వైనం

అదే సమయంలో 79 శాతం పెరిగిన పది గ్రాముల బంగారం

ఉత్పత్తి తగ్గడంతోపాటు పారిశ్రామిక డిమాండ్ పెరగడమే వెండి ర్యాలీకి కారణమంటున్న నిపుణులు

2లో

పారిశుధ్య కార్మికులకూ

జీతాలు ఇవ్వరా!

- గ్రామాల్లో జీతాలు అందక పారిశుధ్య కార్మికుల ఇక్కట్లు
- 20 రోజులుగా సీఎఫ్‌ఎంఎస్‌లో ఆగిపోయిన బిల్లులు
- జనరల్ ఫండ్ నిధులనూ నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చిన నిధులపైనా ఆంక్షలు

10లో

చంద్రబాబును అరెస్టు

చేసే దమ్ముందా?

- బ్యాంకు రుణాలు ఎగ్గొట్టినవాళ్లు, క్రిమినల్స్‌కు రాజ్యాంగ పదవులు కట్టబెడతారు
- చంద్రబాబులాగా గంటకు రూ.కోట్లు వెచ్చించి లాయర్లను పెట్టుకునే స్తోమత సీపీఎంకు లేదు
- సీపీఎం నేత అప్పలరాజు అరెస్ట్ దుర్మార్గం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

10లో

ఇదండీ సంగతి

'సీఎం కుర్చీ'లో కూడా ఈ విధానం ఉంటే చెప్పండని ప్రైవేటు భాగస్వామ్యం వాళ్లు అడుగుతున్నారు సార్!

కూటమి నేతల

'బరి'తెగింపు

కోడి పందేలు, జూద క్రీడలకు హైటెక్ ఏర్పాట్లు

ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరిలో భారీగా బేరాలు

- మూడు రోజుల్లో చేతులు మారనున్న రూ.వందల కోట్లు
- రూ.కోట్లు దండుకోనున్న కూటమి ప్రజాప్రతినిధులు
- కేసరపల్లి బరికి నియోజకవర్గ ప్రజాప్రతినిధికి రూ.2 కోట్లు
- పెనమలూరు నియోజకవర్గంలో క్యాసినోకు రూ.70 లక్షలు
- పెద్దఎత్తున బరులు... బేరం పెట్టి రేటు నిర్ణయం..
- సంక్రాంతి సంప్రదాయం మాటున డబ్బు లూటీ
- చక్రం తిప్పుతున్న కూటమి పార్టీల నాయకులు..
- అడ్వాన్స్‌లు చెల్లిస్తున్న జూదాల నిర్వాహకులు

10లో

JASPER INDUSTRIES LTD.: 9133357030

క్లుప్తంగా...

వంగవీటి రంగాకు వైఎస్ జగన్ నివాళి

సాక్షి, అమరావతి: వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. 'పేద ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, వారి గొంతుకగా నిలిచిన గొప్ప నాయకుడు వంగవీటి మోహన రంగా. ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులు' అంటూ వైఎస్ జగన్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

సమ్మెలోకి 108 ఉద్యోగులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినట్టు ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పలు దఫాలుగా ప్రభుత్వం దృష్టికి తెచ్చినా స్పందన లేకపోవడంతో ఈ నెల 18న విజయవాడ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ప్రభుత్వానికి గడువు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో 26న సమ్మె నోటీసు ఇవ్వాలనే యూనియన్ నిర్ణయం మేరకు నోటీసు అందజేసినట్టు తెలిపారు. సమ్మె కాలంలో ప్రజలకు జరిగే అసౌకర్యానికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

బాబు సర్కారు మళ్లీ అప్పు
సెక్యూరిటీల వేలం ద్వారా రూ.4 వేల కోట్లు..

సాక్షి, అమరావతి : వచ్చే మంగళవారం చంద్రబాబు సర్కారు మరో రూ.4 వేల కోట్లు అప్పు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలను వేలం వేయడం ద్వారా ఈ మొత్తాన్ని ఆర్బీఐ సమీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వనుంది. ఈ మేరకు శుక్రవారం ఆర్బీఐ నోటిఫై చేసింది.

పట్టా భూములు తీసుకుని.. చెరువులు, వాగుల్లో ప్లాట్లు ఇస్తారా!?
వైఎస్సార్‌సీపీ తాడికొండ సమన్వయకర్త బాల వజ్రబాబు

పట్నంబజారు (గుంటూరు తూర్పు) : రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని.. రైతుల నుంచి పట్టా భూములు తీసుకుని చెరువులు, వాగు భూముల్లో ప్లాట్లు ఇస్తోందని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త బాల వజ్రబాబు (డైమండ్ బాబు) తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గుంటూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్–8 రోడ్డు నిర్మాణానికి ఇచ్చిన భూమికి ప్రత్యామ్నాయంగా తనకు చెరువులో ప్లాట్ కేటాయించడాన్ని తట్టుకోలేకపోయిన రైతు రామారావు.. మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ముందు తన గోడు వెళ్లబోసుకున్నా ఫలితం దక్కలేదన్నారు. ఆ ఆవేదనతోనే ప్రాణాలు కోల్పోయాడని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డైమండ్‌బాబు డిమాండ్ చేశారు. రైతులకు చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రశ్నిస్తే.. అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడాన్ని తప్పుపట్టారు. రైతులకు మద్దతుగా వారి తరఫున పోరాటం చేస్తామని స్పష్టంచేశారు.

రవికుమార్ ఆస్తులపై నివేదిక సమర్పించిన ఏసీబీ
విచారణ జనవరి 5కి వాయిదా

సాక్షి అమరావతి : తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ కేసు నిందితుడు రవికుమార్ ఆస్తులపై ఏసీబీ తన మధ్యంతర దర్యాప్తు నివేదికను శుక్రవారం హైకోర్టుకి సమర్పించింది. దీనిపై స్పందించిన హైకోర్టు నివేదికను పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామంది. తదుపరి విచారణను జనవరి 5కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పరకమణిలో రూ .72 వేల విలువ చేసే 900 డాలర్ల చోరీ చేస్తూ రవికుమార్ అనే వ్యక్తి దొరికిన నేపథ్యంలో అతని ఆస్తులపై హైకోర్టు ఏసీబీ విచారణకి ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం ఏసీబీ అదనపు డీజీ తన దర్యాప్తునకు సంభందించిన మధ్యంతర నివేదికను కోర్టుకి సమర్పించారు .

మూడు రోజుల సిట్ కస్టడీకి జనార్దన్‌రావు

ములకలచెరువు: అన్నమయ్య జిల్లా ములకలచెరువు కల్తీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు ఎ.జనార్దన్‌రావును సిట్ అధికారులు శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. ఇతడితో పాటు జగన్మోహన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, రమేష్, అల్లాభక్షులను కస్టడీకి తీసుకున్నారు. వీరందరినీ మదనపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో రహస్యంగా విచారిస్తున్నారు. వీరు ఇబ్రహీంపట్నం కల్తీ మద్యం కేసులో సైతం నిందితులుగా ఉన్నారు. వీరిని మూడు రోజుల పాటు సిట్ అధికారులు విచారించనున్నారు.

● వెండి @ రూ.2.36 లక్షలు

వెండి వెలుగులు

2025 సిల్వర్‌నామ సంవత్సరం



సాక్షి, అమరావతి : మరో నాలుగు రోజుల్లో ముగియనున్న 2025 సిల్వర్‌నామ సంవత్సరంగా రికార్డులకు ఎక్కనుంది. మార్కెట్‌లో వెండి ధరలు పరుగులు తీస్తూ బంగారం తళుకులు వెలవెలబోయేలా ఆకాశాన్నంటుతున్నాయి. నూతన గరిష్ట స్థాయిలకు చేరుకోవడమే కాకుండా ఒక్క ఏడాదిలోనే ఏకంగా 154 శాతం పైగా వృద్ధి చెందిందంటే ఏ స్పీడ్‌తో పరుగులు తీసిందో అర్థం చేసుకోవచ్చు. గతేడాది డిసెంబర్ 26న కేజీ వెండి రూ.91,600గా ఉంటే అదిప్పుడు ఏకంగా రూ.2,36,350ని తాకి రికార్డులు సృష్టించింది. అక్టోబర్ 28న అంతర్జాతీయ మార్కెట్లో కేజీ వెండి ధర 45.43 డాలర్లుగా ఉంటే అదిప్పుడు నూతన గరిష్ట స్థాయి 72.70 డాలర్లకు అంటే రెండు నెలల్లో 69 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి 72.70 డాలర్లు తాకడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. గడిచిన ఏడాదికాలంలో పది గ్రాముల బంగారం ధర రూ.77,730 నుంచి 79.10 శాతం పెరిగి రూ.1,39,216కు చేరింది. బంగారం కూడా నూతన గరిష్ట స్థాయిలకు చేరినా ఏడాదిలో వెండి పరుగుతో పోలిస్తే వెనుకపడిపోయింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లైతే ఈ ఏడాది కాలంలో కేవలం 10 శాతం రాబడులను మాత్రమే అందించాయి.

న్యూ ఏజ్ టెక్నాలజీ వల్లే భారీ పెరుగుదల

పారిశ్రామికంగా ఇప్పుడు వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోలార్ విద్యుత్, సెమీకండక్టర్స్, డేటా సెంటర్స్, రక్షణ పరికరాలు వంటి అనేక విభాగాల్లో వెండిని వినియోగిస్తారు. ప్రపంచవ్యాప్తంగా తయారవుతున్న సిల్వర్‌లో 60 శాతం పారిశ్రామిక అవసరాలకే వినియోగిస్తారంటే వెండి ఎంత కీలకపాత్ర పోషిస్తోందో అర్థం చేసుకోవచ్చు. 2024లో సుమారు రెండు కోట్ల కేజీల వెండిని పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించినట్లు అంచనా. ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాలు, ఏఐ, సెమీ కండక్టర్స్ వంటి రంగాలు వేగంగా వృద్ధి చెందుతుండడంతో సిల్వర్‌కు భారీ డిమాండ్ ఏర్పడింది. ఉత్పత్తి కంటే పారిశ్రామిక డిమాండ్ పెరుగుతుండటం వెండి ర్యాలీకి ప్రధాన కారణంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. దీనికితోడు యుద్ధ భయాలు, అమెరికా టారిఫ్ బెదిరింపులతో పెట్టుబడులను బంగారం, వెండి, ప్లాటినం, కాపర్ వంటి కీలక లోహాల్లోకి తరలిస్తుండటంతో అన్నీ రికార్డు స్థాయి ధరలకు చేరుకున్నాయని, ఒడిదుడుకులు అధికంగా ఉండే వెండి మరింత ఎక్కువగా పెరిగిందంటున్నారు. దీనికితోడు మన దేశీయ కరెన్సీ ఈ ఏడాదిలో 8 శాతంపైగా పతనం కావడం మరింత కలిసొచ్చిందంటున్నారు.

ఇంకా పెరిగితే రిస్కే ఎక్కువ

ఇతర మెటల్స్‌తో పోలిస్తే వెండి ఎంత వేగంగా పెరుగుతుందో అంతకంటే వేగంగా పతనమవుతుందని గత అనుభవాలు స్పష్టం చేస్తుండటంతో ప్రస్తుతం పెట్టుబడి పెట్టాలనుకునే వారు ఆచితూచి అడుగులు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. బంగారం – వెండి ధరల మధ్య ఉండే తేడాని గోల్డ్ సిల్వర్ రేషియోగా లెక్కిస్తారు. 2025లో 107గా ఉన్న గోల్డ్ సిల్వర్ రేషియో నిష్పత్తి వెండి పరుగుతో అది 64కి పడిపోయింది. 2016, 2021లో కూడా ఈ నిష్పత్తి ఈ స్థాయికి చేరినప్పుడు వెండి ధరలు బాగా పతనమైన విషయాన్ని వీరు గుర్తు చేస్తున్నారు. కేజీ వెండి ధర రానున్న రోజుల్లో రూ.2.50 లక్షల మార్కును చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో పది గ్రాముల బంగారం రూ.1.65 లక్షలకు చేరుకోవచ్చని... ఈ స్థాయికి చేరుకున్న తర్వాత ధరల్లో కొంత సర్దుబాటు జరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని బంగారం, వెండిలో ఒకేసారిగా కాకుండా సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేసుకోవాల్సిందిగా వీరు సూచిస్తున్నారు.

కరెక్షన్‌కు అవకాశం

కొత్త ఏడాదిలో బంగారం, వెండి ధరలు మరికొంత పెరిగినా దిద్దుబాటుకు గురయ్యే అవకాశాలు అంతకంటే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వెండి ఎంత వేగంగా పెరిగిందో పతనం కూడా అంతే వేగంగా ఉంటుందన్న విషయాన్ని మర్చిపోకూడదు. సాంకేతికంగా చూస్తే రికార్డు స్థాయికి చేరిన సిల్వర్‌లో లాభాల స్వీకరణకు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. 2026లో వెండి ధరలు పెరిగే అవకాశాలున్నా మధ్యలో ఒక భారీ కరెక్షన్ వచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

– సతీష్ కంతేటి, డైరెక్టర్, జెన్ సెక్యూరిటీస్

● భూములిస్తే.. బలి తీసుకున్నారు!

గుండె పగిలిన రాజధాని రైతు

మరణించిన రైతు రామారావు

ఇప్పటికే రెండు ఎకరాలు ఇచ్చా... ఈ ప్రభుత్వం మమ్మల్ని ముంచేసింది!

నేనిచ్చిన భూమికి బదులుగా వాగులో ప్లాటు ఇచ్చారు..
ఇప్పుడు నా ఇంటిని కూడా లాక్కుంటామంటే ఎలా?

సభలో మాట్లాడిన అనంతరం కుప్పకూలి రైతు రామారావు మృతి
ఎన్-8 రోడ్డు బాధితులతో మందడంలో నిర్వహించిన గ్రామసభలో తీవ్ర విషాదం..

సాక్షి ప్రతినిధి, గుంటూరు, తాడికొండ, సాక్షి, అమరావతి: రాజధాని పేరుతో చంద్రబాబు సర్కారు పదేపదే చేస్తున్న బలవంతపు భూసేకరణ ఒత్తిళ్లతో తల్లడిల్లిన ఓ రైతన్న గుండె ఆగింది! గతంలోనే భూసమీకరణ కింద రెండు ఎకరాల భూమి ఇచ్చిన రాజధాని రైతు దొండపాడు రామారావు(68) ఇప్పుడు తాను ఉంటున్న ఇంటిని కూడా ప్రభుత్వం రోడ్డు కోసం సేకరిస్తుండటంతో తీవ్రంగా కలత చెందాడు. తాను ఇచ్చిన రెండెకరాల పొలానికి బదులుగా.. వాగులో ముంపునకు గురయ్యే ప్రాంతంలో రిటర్నబుల్ ప్లాటు ఇవ్వడంతో మానసికంగా కుంగిపోయిన రామారావు.. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, ప్రభుత్వం నిర్వహించిన సభలోనే ఆందోళనతో కుప్పకూలి మృతి చెందాడు. రాజధాని ఎన్–8 రోడ్డు నిర్మాణంలో భాగంగా తుళ్లూరు మండలం మందడం గ్రామంలో ఇళ్లు కోల్పోతున్న రైతులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ విషాదం చోటు చేసుకుంది. చంద్రబాబు సర్కారు నిరంకుశ వైఖరి, బలవంతపు భూ సేకరణపై రాజధాని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నమ్మి భూములిస్తే రోడ్డు పాలు..!

గుంటూరు జిల్లా తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల పరిధిలోని 29 గ్రామాల పరిధిలోని 217 చదరపు కిలోమీటర్ల (53,749.49 ఎకరాలు) ప్రాంతాన్ని ప్రభుత్వం 2015లో రాజధానిగా ప్రకటించింది. రాజధాని నిర్మాణానికి ఎంపిక చేసిన ప్రాంతంలో 15,807.91 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగతా 37,941.58 ఎకరాలు రైతులది. భూ సమీకరణ కింద 34,396.87 ఎకరాలను అప్పట్లోనే సమీకరించింది. మిగతాది సమీకరణ కింద ఇచ్చేందుకు రైతులు అప్పట్లో అంగీకరించలేదు. 2024లో చంద్రబాబు సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ భూమిని సేకరించడానికి పావులు కదుపుతూ వస్తోంది. ఈ క్రమంలో ఆ భూమిని సమీకరణ కింద ఇస్తే సరి.. లేదంటే బలవంతపు భూసేకరణ చేసేందుకు గత అక్టోబర్ 3న కేబినెట్ అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో మందడం, ఉండవల్లి, పెనుమాక, యర్రబాలెం, నిడమర్రు, కురగల్లు, బేతపూడి, నవులూరు గ్రామాల్లో సమీకరణ కింద భూములు ఇవ్వని రైతులతో మంత్రి నారాయణ వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. సమీకరణ కింద భూములు ఇవ్వకుంటే.. భూసేకరణ చట్టం–2013 కింద సేకరిస్తామంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. ఇప్పటికే సమీకరణ కింద వేల ఎకరాల భూములు ఇచ్చామని, దీనికి బదులుగా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని నమ్మబలికి నీరు నిల్వ ఉండే పల్లపు ప్రాంతాల్లో ప్లాట్లు అంటగట్టారంటూ రైతులు మండిపడుతున్నారు. ఇక ఇప్పుడు తాము నివాసం ఉంటున్న ఇళ్లను కూడా తీసుకుంటే రోడ్డున పడతామని ఆక్రోశిస్తున్నారు.

వేదిక దిగి కుప్పకూలిన రైతన్న..

రాజధానిలో ఎన్–8 రోడ్డు నిర్మాణంలో భాగంగా తుళ్లూరు మండలం మందడం గ్రామంలో ఇళ్లు కోల్పోతున్న బాధిత రైతులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి నారాయణతో పాటు స్థానిక శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్, సీఆర్‌డీఏ అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో రైతులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తుండగా.. గ్రామానికి చెందిన రైతు దొండపాటి రామారావు స్పందిస్తూ.. 'మమ్మల్ని ముంచేశారు. అప్పుడు భూసమీకరణలో రెండెకరాలు పొలం ఇస్తే.. మాకు ఇవ్వాల్సిన ప్లాట్లు వాగులో ఇచ్చారు. ఇప్పుడు మాకున్న ఇంటి స్థలం కూడా తీసుకుంటున్నారు. గతంలో నేను రాజధాని భూ సమీకరణ కోసం రెండెకరాల భూమి ఇస్తే అందుకు బదులుగా ప్లాట్లు వాగులో ఇచ్చారు. అక్కడకు వెళ్లి మేం ఎలా నివాసం ఉండాలి..?' అంటూ ఆక్రోశించారు. ఈ ప్రభుత్వం తమను ముంచేసిందని మండిపడ్డారు. రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న వారందరికీ సీడ్ యాక్సెస్ రోడ్డులో ఒకేచోట స్థలాలివ్వాలని కోరారు. ముక్కలు ముక్కలుగా ప్లాట్లు ఇస్తే.. హైదరాబాద్‌లో రైతు గొంతు కోసుకున్నట్లుగా తాము కూడా గొంతు కోసుకోవాల్సి వస్తుందని ఆవేదనగా చెప్పాడు. రైతు రామారావు తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ఉండగా.. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ కల్పించుకుని ఆయన్ను మాట్లాడనివ్వలేదు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామంటూ నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వేదిక నుంచి వెనుతిరిగిన రైతు దొండపాటి రామారావు రెండడుగులు వేయగానే ఒక్కసారిగా గుండెనొప్పితో కుప్పకూలారు. సభలో ఉన్న స్థానికులు, రైతులు వెంటనే ఆయన్ను వెంటనే మణిపాల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మారిన అలైన్‌మెంట్..

రాజధాని అమరావతిలో ఎన్–8 రహదారి నిర్మాణంలో భాగంగా మొదటి అలైన్‌మెంట్ ప్రకారం 117 మంది ఇళ్లు కోల్పోతుండగా గ్రామంలో పురాతన ఆలయాలు తొలగించకుండా సవరించారు. దీని ప్రకారం రెండోసారి 160 మంది వరకు రైతులు ఇళ్లు కోల్పోతున్నారు. వీరందరికీ పరిహారం, ఇతర విషయాలు చర్చించేందుకు నిర్వహించిన గ్రామసభలో ఈ విషాదం చోటుచేసుకుంది.

స్థలాలిచ్చిన చోట వరద నీరు..

రాజధానికి భూములిచ్చిన రైతుల్లో సుమారు 70 శాతం మంది సన్న, చిన్నకారు రైతులే కావడంగమనార్హం. వారికి ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. వాగులు, చెరువు భూముల్లో ప్లాట్లు కేటాయించింది. భారీ వర్షాలు పడితే ఆ స్థలాల్లో మూడు నుంచి నాలుగు అడుగుల మేర వరద నీరు నిలబడుతోంది. ఈ నేపథ్యంలో తమకు సీడ్ యాక్సిస్ రోడ్డుకు సమీపంలో భూములివ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రాజధాని అమరావతికి భూసమీకరణ కింద భూములు ఇవ్వని రైతులపై చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తూ మానసికంగా వేధిస్తోందని ఆక్రోశిస్తున్నారు. గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ ఇదే అంశాన్ని తెగేసి చెబుతున్నారని పేర్కొంటున్నారు. ఈ ఒత్తిళ్లకు తాళలేక గత 19 నెలల్లో 542.24 ఎకరాల భూమిని భూసమీకరణ కింద సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ)కు రైతులు అప్పగించేశారు. మిగతా భూమి కోసం గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు.

వాగు, చెరువు భూముల్లో రైతులకు ప్లాట్లు..

రాజధానికి భూములిచ్చిన రైతులకు ల్యాండ్ పూలింగ్ స్కీం కింద అభివృద్ధి చేసిన రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు సీఆర్‌డీఏ ఇవ్వాలి. ఆ ప్లాట్లను భూసమీకరణ కింద తీసుకున్న భూములలోనే ఇవ్వాలి. చెరువు భూముల్లో ఇవ్వకూడదు. కానీ.. పిచ్చుకలపాలెం చెరువు భూమిలో 78 మందికి, తుళ్లూరు చెరువు భూమిలో 65 మందికి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయడం బట్టి చూస్తే.. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకూ చంద్రబాబు సర్కారు వెన్నుపోటు పొడిచిందన్నది స్పష్టమవుతోంది. ఆ ప్లాట్లలో ఇళ్లను నిర్మించుకుంటే.. చట్టప్రకారం భవిష్యత్‌లో వాటిని కూల్చేయడం ఖాయమని, అప్పుడు తమ పరిస్థితి ఏమిటని రైతులు నిలదీస్తున్నారు. చెరువును మాయం చేస్తే భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, వాతావరణ సమతుల్యత దెబ్బతిని తీవ్ర ఇబ్బందులు పడతామని పిచ్చుకలపాలెం, తుళ్లూరు వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష ఎకరాల దిశగా..!

రాజధాని ముసుగులో బలవంతంగా భూములను గుంజుకుంటున్న చంద్రబాబు సర్కారు లక్ష ఎకరాలను గుప్పిట పట్టేందుకు బరి తెగిస్తోందని అన్నదాతల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. భూములిచ్చిన అన్నదాతలను దారుణంగా వంచించి పొట్టనబెట్టుకుంటోందని మండిపడుతున్నారు. గతంలోనే టీడీపీ హయాంలో అమరావతి కోసం 50 వేల ఎకరాలకుపైగా సేకరించగా.. అది చాలదంటూ ఇప్పుడు విడతలవారీగా మరో 50 వేల ఎకరాలను తీసుకునేందుకు సన్నద్ధం కావడం .. 29 గ్రామాలకే పరిమితమైతే అమరావతి ఓ చిన్న మునిసిపాలిటీగా మిగిలిపోతుందని బెదిరింపులకు దిగడం.. సారవంతమైన పొలాలే కాదు.. ఇళ్లను కూడా లాక్కోవడం.. దాదాపు ఏడేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ చంద్రబాబు తమకిచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో రాజధాని రైతన్నలు రగిలిపోతున్నారు. ఒకపక్క ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్ పేరుతో రైతుల నుంచి కారుచౌకగా భూములు కాజేసే కుట్రలకు తెరతీయడం.. ఇళ్లను సైతం రోడ్డు నిర్మాణం పేరుతో సేకరిస్తుండటం.. మరోపక్క గతంలో భూములిచ్చిన అన్నదాతలకు వాగులు వంకల్లో నీట మునిగే ప్రాంతాల్లో రిటర్న్‌బుల్ ప్లాట్లు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు కాల'రాశారు'

ఏయూ దూరవిద్యలో మాస్ కాపీయింగ్

- కూటమి పాలనలో దిగజారుతున్న ప్రమాణాలు
- మార్చి–ఏప్రిల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షల నిర్వహణ
- నిర్వహణలో అడుగడుగునా లోపాలు
- విశాఖ కొత్తవలసలోని వాగ్దేవి కళాశాలలో భారీగా మాస్ కాపియింగ్
- అప్పట్లో పరీక్ష కేంద్రాన్ని మూసివేసిన ఏయూ అధికారులు
- పరీక్షలను రద్దు చేయకుండా తీరిగ్గా ఇప్పుడు మూల్యాంకనం
- ఆ ఒక్క సెంటర్‌లోని జవాబు పత్రాలను గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు వ్యక్తులతో దిద్దిస్తున్న దూరవిద్య డైరెక్టర్
- రాజకీయ ఒత్తిళ్లు, ప్రలోభాలే కారణమని విమర్శల వెల్లువ

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిష్ట మసకబారుతోంది. శతాబ్ది వేడుకల వేళ ఏయూ ఘనకీర్తి అభాసుపాలవుతోంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన దూరవిద్య కేంద్రంలో ప్రస్తుతం పారదర్శకత కొరవడింది. పరీక్షపత్రాల ముద్రణ, పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల మూల్యాంకనంలో అధికారులు నిబంధనలను కాలరాస్తున్నారు. ఫలితంగా అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఏడాదికి రెండు సార్లు దూరవిద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, వాటిని సవ్యంగా నిర్వహించలేని దుస్థితి నెలకొంది. ఐఐటీ నుంచి తీసుకొచ్చిన వ్యక్తిని వైస్ చాన్సలర్‌గా నియమించామని గొప్పలు పోయిన చంద్రబాబు సర్కారు విద్యా ప్రమాణాలను దారుణంగా దిగజారుస్తోంది.

పరీక్షలు ఎందుకు రద్దు చేయలేదు?

ఏయూ దూరవిద్యలో భాగంగా ఈ ఏడాది మార్చి–ఏప్రిల్‌లో ఒకసారి పరీక్షలు నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 కేంద్రాల్లో పరీక్షలు పెట్టగా కొత్తవలసలోని వాగ్దేవి కళాశాలలో భారీ స్థాయిలో మాస్ కాపీయింగ్ జరిగింది. దీంతో ఆ కళాశాల సెంటర్‌ను మూసివేసి పక్కన ఉన్న ప్రగతి కళాశాలకు పరీక్ష కేంద్రాన్ని మార్చారు. అయితే, వాగ్దేవి సెంటర్‌లో జరిగిన పరీక్షలను రద్దు చేయకుండా ఇప్పుడు తాపీగా మూల్యాంకనం జరిపి ఫలితాలు ఇచ్చేందుకు సిద్ధపడడం అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడ రాజకీయ ఒత్తిళ్లు, ఇతర ప్రలోభాలకు ఏయూ అధికారులు లొంగిపోయారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి జవాబు పత్రాల మూల్యాంకనం చేసేవారికి ఆ పేపర్ ఏ సెంటర్ నుంచి వచ్చింది? ఎవరు రాశారు అనే వివరాలు లేకుండా కోడింగ్, డీకోడింగ్ పద్ధతిలో చేపడతారు. అలాంటిది నిబంధనలకు విరుద్ధంగా మాస్ కాపీయింగ్ చేసిన సెంటర్‌లోని పరీక్ష పత్రాలను ప్రైవేటు వ్యక్తులతో మూల్యాంకనం చేయిస్తుండటంతో అవి ఏ సెంటర్‌లోనివో, అక్కడి రాసిన విద్యార్థులు ఎవరో సమాచారం బహిరంగ రహస్యంగా మారిపోయిందనే వాదన వినిపిస్తోంది. ఇలాంటప్పుడు ఆ ఫలితాల పారదర్శకతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వాస్తవానికి జవాబు పత్రాల మూల్యాంకనం దూరవిద్యలోని ప్యానల్ నామినేట్ చేసిన వ్యక్తులు మాత్రమే చేయాలి. ఈ లిస్టును వీసీ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇక్కడ సైకాలజీ పేపర్లను ప్రైవేటు కళాశాలలకు చెందిన లెక్చరర్లతో గుట్టుచప్పుడు కాకుండా మూల్యాంకనం చేయిస్తుండటం గమనార్హం. ఇక్కడే, కనీస నియమాలను పాటించకుండా దూరవిద్య డైరెక్టర్ ఇష్టారీతిన వ్యవహరిస్తుండటంతో వర్సిటీ ఖ్యాతి దిగజారిపోతోంది.

మార్చిన పరీక్ష కేంద్రంలోనూ కాపీయింగ్!

ఇదిలా ఉంటే వాగ్దేవి పరీక్ష కేంద్రం నుంచి ప్రగతి కళాశాలకు పరీక్ష కేంద్రాన్ని మార్చినా మాస్ కాపీయింగ్ ఆగట్లేదు. నవంబర్ నుంచి జరుగుతున్న దూరవిద్య పరీక్షల్లోనూ మరోసారి మాస్ కాపీయింగ్ కలకలం సృష్టించింది. ఏయూ దూరవిద్య కేంద్రంలో సుమారు 1400 మందికిపైగా పరీక్ష రాసే వసతి అందుబాటులో ఉంది. ఒకప్పుడు ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ వంటి దూరవిద్య పరీక్షలు ఏయూ కేంద్రంలోనే పారదర్శకంగా జరిగేవి. అలాంటి కేంద్రాన్ని పట్టించుకోని అధికారులు ప్రైవేటు కళాశాలల్లో పరీక్షల నిర్వహణకు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

‘స్మార్ట్’గా రూ.20 కోట్ల దోపిడీ

- రూ.77.98 కోట్ల స్మార్ట్ ఫోన్ డీల్‌లో ప్రజాధనం లూటీ
- అంగన్‌వాడీలకు 58,204 ఫోన్ల కొనుగోలులో అవినీతి

సాక్షి, అమరావతి సామాన్యులు సైతం ఏదైనా వస్తువు కొనుగోలు చేయాలంటే ఎక్కడ తక్కువకు దొరుకుతుందా? అని ఆలోచిస్తారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో ధరలను పోల్చి చూస్తారు..! కానీ, చంద్రబాబు ప్రభుత్వం మాత్రం తక్కువ ధరకు లభ్యమయ్యే చాన్స్ ఉన్నా విస్మరించింది..! అధిక ధర చెల్లింపుతో దోపిడీకి పాల్పడింది..! ప్రజాధనం లూటీ చేసింది..! చివరకు చార్జర్లలోనూ కక్కుర్తి పడింది...! ఇదంతా అంగన్‌వాడీ వర్కర్లకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అందించిన స్మార్ట్‌ఫోన్ల కొనుగోలులో జరిగిన తతంగం. కీలక నేతలు ఈ అవినీతి కథ నడిపారని తెలుస్తోంది. 58,204 మొబైల్ ఫోన్లను అధిక ధరకు కొని రూ.20 కోట్లకు పైగా స్వాహా చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ‘హలో...’ అంటూ చంద్రబాబు సర్కారులో ‘స్మార్ట్ దోపిడీ’ సాగింది ఇలా..!

టెండర్లలోనే నిబంధనలకు పాతర

అంగన్‌వాడీ సిబ్బందికి స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) ద్వారా అక్టోబర్‌లో టెండర్లు పిలిచారు. వాస్తవానికి కనీసం మూడు ఏజెన్సీలు బిడ్ దాఖలు చేయాల్సి ఉండగా ఒకే సిండికేట్‌కు చెందిన రెండు ఏజెన్సీలు బిడ్ వేశాయి. వీటిలో ఒకదానికి టెండర్ కట్టబెట్టారు. తద్వారా మొదటే నిబంధనలకు పాతరేశారు. నవంబర్‌లో హైదరాబాద్‌లోని హల్లో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ఈ నెల 10వ తేదీన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఫోన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు.

శాంసంగ్ వెబ్‌సైట్‌లో 4జీబీ ర్యామ్, 64జీబీ మెమోరీతో మొబైల్ ఫోన్ ధర ఫొటో

ఆన్‌లైన్ వద్దు.. అధిక ధరే ముద్దు

4 జీబీ ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ మెమోరీ సామర్థ్యం ఉన్న 58,204 శాంసంగ్ స్మార్ట్ ఫోన్లను ఒక్కోటి రూ.13,398 చొప్పున కొనుగోలు చేసేందుకు రూ.77.98 కోట్లకు పైగా చెల్లించారు. చిత్రం ఏమంటే, శాంసంగ్ 4 జీబీ ర్యామ్, 64 జీబీ మెమరీ ఫోన్ ధర ఆ సంస్థ వెబ్‌సైట్‌లో రూ.9,899గా ఉంది. ఇదే రేటుకు రాష్ట్ర ప్రభుత్వం ఖరీదు చేసి ఉంటే రూ.61.10 కోట్లు అయ్యేది. ఇక అమెజాన్‌లో అయితే శుక్రవారం ఆఫర్ ధర రూ.8,499, ఫ్లిప్‌కార్ట్‌లో రూ.9,380గా ఉంది. ఈ లెక్కన 58,204 ఫోన్ల కొనుగోలుకు రూ.58 కోట్లు వ్యయం అవుతుంది. పెద్దసంఖ్యలో కావాల్సినప్పుడు నేరుగా కంపెనీని సంప్రదిస్తే... రూ.10 వేల కంటే తక్కువకే లభించే అవకాశం ఉంటుందని మార్కెటింగ్ నిపుణుడు ఒకరు పేర్కొంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ఆన్‌లైన్ ధర కంటే అధిక మొత్తానికి కొనుగోలు చేసింది. రూ.20 కోట్ల ప్రజాధనాన్ని కాజేసింది.

#	Item Description	Ordered Quantity	Unit	Unit Price (INR)	Tax Bifurcation (INR)	Price (Inclusive of all Duties and Taxes in INR)
	Product Name : SAMSUNG 4 GB RAM Smartphone; Brand : SAMSUNG; Brand Type : Registered Brand; Catalogue Status : OEM verified catalogue; Selling As : OEM verified Reseller; Category Name & Quadrant : Smartphone (V2) (Q2); Model : Samsung Galaxy Smart Phone A06 5G (4/64 GB); HSN Code : HSN not specified by seller	58,204	pieces	13,398	NA	779,817,192
Total Order Value (in INR)						779,817,192

4జీబీ ర్యామ్ 64జీబీ ఇంటర్నల్ మెమోరీతో మొబైల్ ఫోన్‌ల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వర్క్ ఆర్డర్

చార్జర్లలోనూ చేతివాటం

మొబైల్ ఫోన్ల కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ చార్జర్ ఇవ్వకుండా డబ్బులు మిగుల్చుకునే ప్రయత్నం చేసింది. ఫోన్‌తో పాటు చార్జర్ ఇవ్వాలని వర్క్ ఆర్డర్‌లో స్పష్టంగా ఉంది. కానీ, కాంట్రాక్టు సంస్థ ఎగ్గొట్టాలని చూసింది. అధికారులు గట్టిగా మందలించడంతో చార్జర్ ఇచ్చింది. కానీ, ఇక్కడా కక్కుర్తే. శాంసంగ్ కంపెనీ చార్జర్ రూ.1,699 కాగా ఆన్‌లైన్‌లో రూ.850కు కూడా వస్తుంది. కనీసం శాంసంగ్ చార్జర్ కాకపోయినా మరో మంచి కంపెనీది కూడా ఇవ్వలేదు. మార్కెట్‌లో రూ.400 కంటే తక్కువకు దొరికే థర్డ్‌పార్టీ చార్జర్ ఇచ్చింది. అవి హీటెక్కి ఎప్పుడు పేలిపోతాయో అన్నట్లున్నాయని అంగన్‌వాడీలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఆర్భాటంగా పంపిణీ చేసిన ఫోన్లు తమ ప్రాణాల మీదకు వచ్చేలా ఉన్నాయని వాపోతున్నారు. కాగా, స్క్రీన్ గార్డును మీరే వేయించుకోండని కాంట్రాక్టు సంస్థ చెప్పగా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఏజెన్సీ నిర్వాహకులు వేయకతప్పలేదు.

అంగన్‌వాడీ.. కొనుగోలు ఏదైనా దోపిడీ!

- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందించే అంగన్‌వాడీ కేంద్రాలను చంద్రబాబు ప్రభుత్వంలోని కీలక నేతలు తమ అవినీతికి కేంద్రంగా మార్చేశారు. కేంద్రాలకు వస్తువుల కొనుగోలులో జరిగిన అక్రమాలే దీనికి అద్దం పడుతున్నాయి.
- సాక్షం అంగన్‌వాడీ మిషన్–2లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.వంద కోట్లలో రూ.25 కోట్లతో నిరుడు 9,664 అంగన్‌వాడీ కేంద్రాలకు స్మార్ట్ టీవీల కొనుగోలు చేశారు. ఇందులో లోపాయికారీ ఒప్పందాలకు పాల్పడ్డారు. నిబంధనలు ఉల్లంఘించారు. చాలా టీవీలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికీ సద్వినియోగం కావడం లేదు.
- అంగన్‌వాడీ చిన్నారుల ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్‌లలోనూ బాబు సర్కారు చేతివాటం ప్రదర్శించింది. 257 ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో 55,746 సెంటర్లకు ఈ కిట్‌ల కొనుగోలులో డీల్ కుదిరిందనే ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రూ.7.31 కోట్ల విలువైన వర్క్ ఆర్డర్‌ను నామినేషన్‌పై కేరళకు చెందిన కండోమ్స్ తదితర వస్తువుల తయారీ కంపెనీకి అప్పగించారు. చిత్రం ఏమంటే ఈ కిట్‌లు ఇంకా అంగన్‌వాడీలకు చేరలేదు.

క్లుప్తంగా...

డిజిటల్ ఎంబుక్‌లో ఇంజినీరింగ్ పనుల నమోదు తప్పనిసరి

సాక్షి, అమరావతి: డిజిటల్ ఎంబుక్‌లో ఇంజినీరింగ్ పనుల కొలతల నమోదు తప్పనిసరి చేయాలని అన్ని శాఖలు, విభాగాలకు ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ కార్యదర్శి డి.రొనాల్డ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలతోపాటు ఇంజినీరింగ్ పనులు నిర్వహిస్తున్న అన్ని విభాగాలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు వచ్చే నెల 1 నుంచి డిజిటల్ ఎంబుక్‌లో కొలతలు వివరణాత్మకంగా నమోదు చేయాలని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆ బిల్లులనే అనుమతించాలని వర్క్స్ అకౌంట్స్ డైరెక్టర్‌ను ఆదేశించింది. దీన్ని ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణించడంతో పాటు సంబంధిత డీడీవోలు, పీఏవోలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు గ్రామ పంచాయతీ పనులకు వర్తించవని తెలిపింది.

శ్రీశైలం టోల్‌గేట్ వద్ద 200 కిలోల మాంసం పట్టివేత

నలుగురు అరెస్ట్

బుట్టలో తీసుకొచ్చిన మాంసం

శ్రీశైలం: శ్రీశైలం దేవస్థానం పరిధిలోని టోల్‌గేట్ వద్ద చేపట్టిన తనిఖీల్లో భారీగా మాంసం, మద్యం పట్టుబడ్డాయి. అట్టపెట్టెలు, కవర్లు, బుట్టల్లో సుమరు 200 కిలోల మాంసాన్ని తీసుకువస్తున్న నలుగురు యువకులను చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) శ్రీనివాసరావు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడ్డ మాంసాన్ని టోల్‌గేట్‌కు దూరంగా అడవిలో పూడ్చిపెట్టినట్లు సీఎస్‌వో తెలిపారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనను క్షేత్ర పవిత్రత దృష్ట్యా బయటకు పొక్కకుండా చేయాలని ప్రయత్నించినా కొందరు వీడియోలు తీయడంతో గురువారం రాత్రి వెలుగులోకి వచ్చింది. శ్రీశైలంలోని కొత్తపేటకు చెందిన యువకులు రవి, ఏలియా, రాజు, సుబ్బయ్య మూడు స్కూటీలు, ఒక బైక్‌పై సున్నిపెంట నుంచి శ్రీశైలానికి మాంసం, మద్యం తీసుకొచ్చినట్లు సీఎస్‌వో తెలిపారు. నలుగురు యువకులను, వాహనాలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. అలాగే వివిధ వాహనాల నుంచి భారీ స్థాయిలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని వారితోనే పారబోయించినట్టు తెలిపారు.

పత్తి రైతుల రాస్తారోకో

ప్రత్తిపాడు (గుంటూరు): సీసీఐ తీరుతో విసిగిపోయిన పత్తి రైతులు గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో రోడ్డెక్కారు. నిబంధనల పేరుతో సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు చేయకుండా అడ్డగోలుగా తిరస్కరిస్తుండడంతో పత్తి రైతులు పాత మద్రాస్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అమరావతి ప్రాంతానికి చెందిన రైతులు పత్తి విక్రయించుకునేందుకు స్థానిక సహజానంద కాటన్ మిల్లులో సీసీఐ కేంద్రానికి శుక్రవారం తెల్లవారుజామున తీసుకొచ్చారు. తొలుత అసిస్టెంట్ బయ్యార్ నవీన్ పత్తిని పరిశీలించి నాణ్యత లేదంటూ తిరస్కరించారు. రైతులు ఇదేమని గట్టిగా ప్రశ్నించడంతో సమాచారాన్ని బయ్యార్ భరత్‌కు అందించారు. దీంతో బయ్యార్ భరత్ ప్రత్తిపాడు సీసీఐ కేంద్రానికి చేరుకుని రైతులు తెచ్చిన పత్తిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వెళ్లిపోయిన అనంతరం కూడా పత్తిని తిరస్కరించినట్టు అసిస్టెంట్ బయ్యార్ రైతులకు తెలిపారు. దీంతో రైతులు సీసీఐ తీరుతోపాటు బయ్యార్ల నిర్వాకంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత మద్రాస్ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు.

ప్రశ్నిస్తున్నామనే తప్పుడు కేసులు

- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్ రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైఫల్యాలు, కూటమి నాయకుల అవినీతి, అత్యాచారాలపై ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పుకోలేక.. వైఎస్సార్‌సీపీ నాయకులపైనా, కార్యకర్తలపైనా తప్పుడు కేసులు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్ రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు దేశవ్యాప్తంగా వైభవంగా జరగడంతో చంద్రబాబు కూటమి ఓర్వలేకపోతోందని చెప్పారు. ‘అనంతపురం జిల్లా బొమ్మ కానిపల్లెలో పొట్టేలు మాంసంతో విందు చేసుకున్న ఆరుగురిపై యానిమల్ క్రూయల్టీ యాక్ట్ కింద కేసు పెట్టారు. సత్యసాయి జిల్లా బాగకోటలో కూడా జీవహింస కేసుతోపాటు అక్రమ ఆయుధాలు కలిగి ఉన్నారని కూడా తప్పుడు కేసు పెట్టారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు సీహెచ్‌సీలో ప్రభుత్వ అనుమతితో, వైద్యుల పర్యవేక్షణలో రక్తదాన శిబిరం నిర్వహించినా, తప్పుడు ఫిర్యాదు చేయించి కేసులు పెట్టారు. ద్వారకా తిరుమలలో ఒక ఫ్లెక్సీ విషయంలో ఏడుగురిపై అక్రమ కేసు పెట్టారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలంలో 16 మందిపై తప్పుడు కేసు పెట్టారు. ఇంకా చాలా చోట్ల తప్పుడు కేసులు పెడుతున్నారు. టీడీపీ కార్యకర్తలు 20 పొట్టేళ్లను నరికి, వాటి తలలతో బాలకృష్ణ కటౌట్‌లకు హారం వేశారు. కానీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇలాంటి వికృత, జుగుప్సాకర పనులు చేయలేదు’ అని మనోహర్ రెడ్డి చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఇన్నాళ్లూ బీఎన్ఎస్ 111 సెక్షన్ కింద, గంజాయి కేసులు పెట్టిన ప్రభుత్వం.. కోర్టులు మొట్టికాయలు వేస్తుండటంతో కొత్తగా రాజద్రోహం కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు.

డిప్యూటీల నడుమ డీఎస్పీ బలి

- హాట్ టాపిక్‌గా భీమవరం డీఎస్పీ బదిలీ వ్యవహారం

సాక్షి ప్రతినిధి, ఏలూరు : ప్రజలకు మంచి జరిగే పని విషయంలో కాకుండా తమ మాటే నెగ్గాలన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుల మధ్య వ్యక్తిగత పంతం ఓ డీఎస్పీ బదిలీకి దారితీసింది. తానేంటో నిరూపించుకోవాలనే పట్టుదలతో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్యను పవన్ కళ్యాణ్ ఎట్టకేలకు బదిలీ చేయించడం హాట్ టాపిక్‌గా మారింది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సిఫార్సుతో జయసూర్య భీమవరం డీఎస్పీగా నియమితులయ్యారు. గతంలో భీమవరం సబ్ డివిజన్‌లో పలు పోలీస్‌స్టేషన్లలో సీఐగా పని చేసిన అనుభవంతో నేరుగా పందేలరాయుళ్లు, పేకాట క్లబ్ నిర్వాహకులతో వ్యక్తిగత పరిచయాల వల్ల సబ్ డివిజన్ జూద క్రీడలకు కేరాఫ్‌గా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో డీఎస్పీ వ్యవహార శైలిపై భీమవరం ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో భీమవరంలో కోడి పందేలు, పేకాటను కట్టడి చేసి.. పందేలరాయుళ్లను ఉండి నియోజకవర్గానికి డైవర్ట్ చేశారనేది జనసేన అభియోగం. అక్కడ పూర్తిగా డిప్యూటీ స్పీకర్ కనుసన్నల్లో వాటిని నడిపిస్తున్నారని జనసేన నేతల వాదన. ఈ క్రమంలో ఎమ్మెల్యే రామాంజనేయులు డీఎస్పీ వ్యవహారశైలిపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఎస్పీపై పూర్తి స్థాయి విచారణ చేయాలని పవన్ కళ్యాణ్ అక్టోబర్‌లో ఎస్పీ నయీం అస్మీని ఆదేశించారు. ఆ తర్వాత బాధితుల నుంచి ఫిర్యాదులు ఆహ్వానించినా, ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని పోలీసు అధికారులు తెలిపారు. దీంతో అప్పట్లో మిన్నకుండిపోయిన పవన్ కళ్యాణ్.. కాస్తా సమయం తీసుకుని ఇప్పుడు పట్టుపట్టి బదిలీ చేయించినట్లు తెలిసింది.

మెడికల్ కాలేజీ టెండర్‌లో పాల్గొనలేదు

బిడ్ దాఖలు చేశామన్న ప్రచారం అవాస్తవం: కిమ్స్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ ఒక్క మెడికల్ కాలేజీ టెండర్లో పాల్గొనలేదని, పీపీపీ విధానంలో పాల్గొనాలనే ఉద్దేశం తమకు లేదని కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తున్న మెడికల్ కాలేజీల్లో భాగంగా ఆదోని మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌కు కిమ్స్ ఒక్కటే బిడ్ దాఖలు చేసిందని జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని తెలిపింది. ఆ వార్తలను పూర్తిగా ఖండిస్తున్నామని చెబుతూ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. స్టాక్ మార్కెట్‌లో నమోదైన కిమ్స్ ఎటువంటి చిన్న సంఘటన అయినా స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేస్తుందని, స్టాక్ ఎక్స్ఛేంజీలకు తాము ఏ సమాచారం ఇవ్వలేదని పేర్కొంది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
Union Bank of India
A Government of India Undertaking

ఫైనల్ నోటీసు - 2

ఆర్‌బిఐ సూచనలకు అనుగుణంగా, బ్యాంక్ ప్రస్తుత కస్టమర్ల కెవైసి నిర్ణీత కాలానుగుణంగా అప్‌డేట్ చేసే ప్రక్రియలో ఉంది మరియు సేవింగ్స్ బ్యాంక్ మరియు/లేదా కరెంట్ డిపాజిట్ ఖాతాను నిర్వహిస్తున్నప్పటికీ చాలా కాలంగా వారి ఖాతాలను నిర్వహించని కస్టమర్లతో సంబంధాన్ని పునరుద్ధరించే ప్రక్రియలో ఉంది.

పైన పేర్కొన్న ప్రక్రియలో, జీరో బ్యాలెన్స్ ఉన్న అనేక ఖాతాలు 30.09.2022న లేదా అంతకు ముందు పనిచేయనివి (డోర్మాంట్)గా మారాయని బ్యాంక్ గమనించింది. అటువంటి డోర్మాంట్ ఖాతాల దుర్వినియోగాన్ని నివారించడానికి, గత 5 సంవత్సరాల నుండి నిర్వహించబడని మరియు గత 3 సంవత్సరాల నుండి డోర్మాంట్ స్థితిలో ఉన్న అటువంటి అన్ని ఖాతాలను మూసివేయాలని బ్యాంక్ నిర్ణయించింది.

అటువంటి కస్టమర్లందరికీ మేము తెలియజేస్తున్నాము, వారి జీరో బ్యాలెన్స్ డోర్మాంట్ ఖాతాలను యాక్టివేట్ స్థితికి పునరుద్ధరించాలనుకునే కస్టమర్లతో బ్యాంక్ తన సంబంధాన్ని కొనసాగించడానికి ఆసక్తిగా ఉంది. అందువల్ల ఈ నోటీసు తేదీ నుండి 30 రోజులలోపు వారి కెవైసిని నవీకరించడానికి మరియు కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడానికి సంబంధిత/సమీప శాఖను సంప్రదించవలసిందిగా ఇందుమూలంగా అటువంటి కస్టమర్లందరికీ సలహా ఇస్తున్నాము.

పైన పేర్కొన్న మూసివేత ప్రక్రియ నుండి కింది ఖాతాలు మినహాయించబడతాయి:

PMJDY (BSBDA/BSBDS) స్కీమ్, కోర్టు ఉత్తర్వు / ఐటీ శాఖ లేదా ఏదైనా ఇతర చట్టబద్ధమైన అధికారం ద్వారా ఖాతాలు స్తంభింపజేయబడ్డాయి, డిఇఎ నిధి ఖాతాలు, లాకర్‌కు లింక్ చేయబడిన ఖాతా, ఏదైనా మొత్తానికి తాత్కాలిక హక్కు ఉన్న ఖాతాలు.

ఈ నోటీసు వచ్చిన తేదీ నుండి 30 రోజుల లోపు మీ KYC పత్రాలను సమర్పించి మీ బ్యాంక్ ఖాతాను యాక్టివేట్ చేసుకోని యెడల, అన్ని జీరో బ్యాలెన్స్ ఖాతాలు బ్యాంక్ వారిచే మూసివేయబడతాయని దయచేసి గమనించగలరు.

తేదీ: 27.12.2025

అన్నమయ్య జిల్లా అథ్లెట్‌కు రాష్ట్రీయ బాల్ పురస్కార్

- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు
- పురస్కార గ్రహీతలను అభినందించిన ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లాకు చెందిన అథ్లెట్‌కు ప్రధానమంత్రి బాల పురస్కారం లభించింది. దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్–2025 వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 17ఏళ్ల పారా అథ్లెట్ శివాని హోసూరు ఉప్పర అవార్డు అందుకున్నారు. మెడల్, సర్టిఫికెట్‌తోపాటు రూ.లక్ష నగదు ప్రోత్సాహం వరించింది. కాగా శివాని షాట్‌పుట్, జావలిన్ త్రో లో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో 8కి పైగా అవార్డులు సాధించింది.

చిన్నారులకు ప్రధాని అభినందన

బాల పురస్కారాలు అందుకున్న చిన్నారులను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. భారత్ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ జెన్ జీ పై తనకు పూర్తి విశ్వాసం ఉందని.. ఇక్కడ ఉన్న చిన్నారులంతా జెన్ జీ లే అని ప్రశంసించారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శివాని హోసూరు ఉప్పర

భారత్ విశ్వగురు స్థానాన్ని అధిరోహిస్తుంది

- క్షమాగుణమే మనిషిని ఉన్నత స్థాయికి చేరుస్తుంది
- భారత్ విజ్ఞాన్ సమ్మేళనంలో మోహన్ భగవత్

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్, సీఎం

తిరుపతి సిటీ: భారత్ త్వరలో విశ్వగురు స్థానాన్ని అధిరోహిస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ తెలిపారు. తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా సమగ్ర వికాసానికి భారతీయ చింతన అనే భావంతో నాలుగు రోజులపాటు జరగనున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోహన్ భగవత్ సీఎం చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి జితేంద్రసింగ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనాన్ని ప్రారంభించారు. అనంతరం మోహన్ భగవత్ మాట్లాడుతూ.. క్షమాగుణమే మనిషిని ఉన్నత స్థితిలో నిలుపుతుందన్నారు. ప్రతి ఒక్కరూ స్వయంగా కర్తవ్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. విజ్ఞానశాస్త్రం, ధర్మశాస్త్రాల మధ్య వైరుధ్యమేమీ లేదని, అనుభవంతో విజ్ఞానాన్ని సంపాదించవచ్చన్నారు. సరైన మార్గంలో పయనిస్తే లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోగలమన్నారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ ప్రగతిపథంలో దూసుకెళ్తోందన్నారు. అంతరిక్ష విజ్ఞానం, ఆయుధాల సరఫరా, నూతన ఆవిష్కరణలు, పరిశోధన రంగాల్లో ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిందని తెలిపారు.

యువతకు పురాణాలు బోధించాలి..

గౌరవ అతిథి సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. నేటి యువతకు పురాణాలను బోధించి సంస్కృతి సాంప్రదాయాలను వివరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. భారతీయ విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ అద్భుతంగా కృషిచేస్తోందన్నారు. భారత్ విజ్ఞాన సమ్మేళనంలో కార్యక్రమ ముఖ్యోద్దేశంపై తక్కువగా మాట్లాడిన సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో ఎక్కువగా తన పాలనపై గొప్పలు చెప్పుకునేందుకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. అనంతరం.. విజ్ఞాన భారతి, ఐకేఎస్ డివిజన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా ప్రచురించిన భారతీయ జ్ఞాన పరంపర (ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్) అనే గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యులు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి, వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

> సత్యం కంటే ఉదాత్తమైన మతం లేదు.
> ధర్మం కంటే ఉత్కృష్టమైన మార్గం లేదు.
> – హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 27 డిసెంబర్ 2025

మానసిక స్వస్థతపై దృష్టి

మన దేశంలో ప్రభుత్వాలకూ, సమాజానికీ, కుటుంబానికీ – ఎవరికీ పట్టని అత్యంత కీలకమైన సమస్యల్లో మానసిక అనారోగ్యం ఒకటి. ఆ రోగులకు కూడా హక్కులుంటాయనీ, వాటినీ పరిరక్షించాల్సి ఉంటుందని ఐక్యరాజ్యసమితి చెప్పి రెండు దశాబ్దాలవుతోంది. మానసిక అస్వస్థుల కోసం ప్రత్యేక చట్టం చేయాలని 2007లోనే సూచించింది. వేరే దేశాల మాట అటుంచి పదేళ్లపాటు మన దేశమే ఆ సంగతి పట్టించుకోలేదు. 75 ఏళ్లుగా కొనసాగుతున్న కాలం చెల్లిన చట్టాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి 2017లో పార్లమెంటు కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ ఏం లాభం? అటుతర్వాత నుంచి దేశంలో మానసిక అస్వస్థతకు లోనవుతున్నవారి స్థితిగతులేమిటో, వారికి అందించాల్సిన సహాయ సహకారాలేమిటో కేంద్రానికీ, రాష్ట్రాలకూ కూడా అక్కర లేకపోయింది. ఈ నేపథ్యంలో దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత బెంగళూరులోని నిమ్హాన్స్ ఆధ్వర్యాన ద్వితీయ సర్వే జరగబోతోంది. 2015–16లో జరిగిన తొలి సర్వే వయోజనుల్లో మానసిక అస్వస్థతపై దృష్టి పెట్టగా, ఈసారి పిల్లలు, మహిళలు, వలసదారులతోపాటు వృద్ధుల్లో సైతం మానసిక స్థితిగతులెలా ఉన్నాయో ఆరా తీయాలని ఆ సంస్థ నిర్ణయించింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ మానసిక ఆరోగ్యం గురించి ఇచ్చిన నిర్వచనం సమగ్రమైనది. ఒక మనిషి తనకున్న శక్తి సామర్థ్యాలను సాకారం చేసుకోగల స్థితిలో ఉండి, జీవితంలో ఎదురయ్యే సాధారణ ఒత్తిళ్లను ఎదుర్కొంటూ తన ఉత్పాదకతతో సమాజ పురోగతికి దోహదం చేయగల శ్రేయోస్థితిని మానసిక ఆరోగ్యంగా ఆ సంస్థ నిర్వచించింది. కేవలం మానసిక వైకల్యం లేదా అస్వస్థత లేకపోవటం మాత్రమే ఆరోగ్యకరమైన మానసిక స్థితిగా చూడలేమని ఈ నిర్వచనం చెబుతోంది. ఒక అంచనా ప్రకారం మన వయోజనుల్లో 15 శాతం మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికం. అక్కడ 13.5 శాతం మందికి మానసిక సమస్యలు, ఒత్తిళ్లు ఉండగా... పల్లెసీమల్లో ఇది 6.9 శాతం. శరవేగంతో సాగే పట్టణీకరణ, ఉద్యోగ అభద్రత, జీవన వ్యయం పెరగటం, వృత్తిలో నానాటికీ అధికమయ్యే పోటీ, సామాజిక మాధ్యమాలను అతిగా చూడటం, ఫోన్‌తో అధిక సమయం గడపటం, ఆన్‌లైన్ వేధింపులు వగైరాలు సమస్యకు కారణమవుతున్నాయి.

దురదృష్టమేమంటే ఇతర సమస్యల్లా మానసిక అనారోగ్యాన్ని వెనువెంటనే గుర్తించటం సాధ్యం కాదు. తమను చిన్నచూపు చూస్తారనే భయంతో ఆ స్థితిలోకెళ్లినవారు ఎవరికీ చెప్పుకోరు. తొలి దశలో వారిని గుర్తించటం కూడా కష్టం. అలాంటివారు అప్పుడప్పుడు అస్వాభావికంగా, అసహజంగా లేదా విచిత్రంగా ప్రవర్తించినా అది ఆ క్షణంలో వచ్చిపడిన సమస్యకు తక్షణ స్పందనగా పరిగణిస్తారు. తీరా గుర్తించేసరికి అప్పటికే చేతులు దాటిపోయిన స్థితి ఏర్పడవచ్చు. అందుకే ఈసారి సర్వే మానసిక అనారోగ్యం విస్తృతి ఎలావుందో, దాని పర్యవసానంగా వచ్చే వైకల్యం, అందువల్ల సామాజికార్థిక స్థితిగతుల్లో మార్పు, అలాంటివారి సంరక్షణకు తోడ్పడే మార్గాలు, సేవల లభ్యత వగైరాలను కూడా పరిశీలించబోతోంది. సమాజంలో ఎక్కువగా ఏయే గ్రూపులు ఇలాంటి అనారోగ్య స్థితికి లోనవుతున్నాయో, వాతావరణ పరిస్థితుల ప్రభావం ఏమిటో కూడా తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది.

మన దేశంలో జనాభాకు తగినట్టు వైద్యులు లేరు. ఇక మానసిక అనారోగ్యానికి చికిత్స చేసేవారైతే చాలా అరుదు. లక్షమందికి కనీసం ముగ్గురు మానసిక వైద్యులుండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన. కానీ మనకు లక్షమందికి 0.75 శాతం మందే ఉన్నారు! 2022లో కేంద్రం టెలీ–మానస్ పేరుతో మానసిక ఆరోగ్య కార్యక్రమం మొదలుపెట్టింది. దానికి రోజుకు సగటున 2,500 ఫోన్ కాల్స్ వస్తున్నాయంటే ఈ సమస్య ఎంతగా ఉందో అర్థమవుతుంది. ఇకనైనా సమగ్ర విధాన రూపకల్పనపై దృష్టి సారించాలి. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకూ కౌన్సెలర్లు తగినంత మంది అందుబాటులో ఉండేలా, ప్రజల్లో దీనిపై అవగాహన పెరిగేలా చూడాలి. ఈ సమస్య వల్ల మన ఆర్థిక వ్యవస్థకు కలుగుతున్న నష్టంతో పోలిస్తే దానికి కేటాయించే నిధులు పెద్ద ఎక్కువేం కాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.సప్తమి ఉ.9.01 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర తె.5.18 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి రేవతి, **వర్జ్యం:** ప.3.13 నుండి 4.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.26 నుండి 7.55 వరకు, **అమృత ఘడియలు:** రా.12.31 నుండి 2.02 వరకు.

సూర్యోదయం : 6.32
సూర్యాస్తమయం: 5.29
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

బహుమతి

నేను కనుక ఓ 30 ఏళ్లు వెనక్కి వెళ్లగలిగితే 'ఆ యువకుడికి' నేను చెప్పేదొక్కటే. "నీ మొదటి జీతం నుండి నీకు నువ్వే ఒక చిన్న 'సిప్' (సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్)ను బహుమతిగా ఇచ్చుకో. అదెంత చిన్న మొత్తమే అయినా అది నీ లైఫ్‌ని సెట్ చేస్తుంది" అని!

– కైలాష్ కులకర్ణి, హెచ్.ఎస్.బి.సి. మ్యూచువల్ ఫండ్ సీఈవో

దగ్గర్లోనే...

విజయం సులభం కాదు. సోమరులకైతే అసలే సాధ్యం కాదు. అంకిత భావం ఉండాలి. కష్ట పడాలి. ముందుకు సాగే సంకల్ప బలం ఉండాలి. ఇక వైఫల్యాలంటారా! పడిపోతే లేచి దుమ్ము దులుపుకో. ఆగటం మాత్రం చేయకు. ఆ దగ్గర్లోనే విజయం ఉండొచ్చు!

– సల్మాన్ ఖాన్, బాలీవుడ్ నటుడు

ఆనందం

నిజమైన ఆనందం... ఆరాధన భావంతో అంతా మీవైపు చూస్తున్నప్పుడు కలిగేది కాదు. అది మీరు ప్రేమించే వ్యక్తులతో గడిపిన క్షణాలలో మిమ్మల్ని ఆవరించేది. నింగిలోని తారల మధ్య మీరున్నా... మీకు నిజంగా వెలుగునిచ్చేది మిమ్మల్ని ప్రేమించే వారి కళ్లలోని కాంతులే.

– పాంచి బోరా, టెలివిజన్ నటి

ధైర్యం

కల నెరవేరనప్పుడు తట్టుకోగల ధైర్యం ఉన్నప్పుడే కల కనండి. ఎందుకంటారా! ఒక కల నిజమైనప్పుడు చేసుకునే సంబరాలకు, నెరవేరని ఎన్నో కలలు కలిసి వేదికను నిర్మించి ఉంటాయి. అందుకే ధైర్యంగా కాదు, ధైర్యంతో కలగనండి.

– తుషార్ త్యాగి, చిత్ర దర్శకుడు

పర్ఫెక్షన్!

లోపాలు లేకుండా (పర్ఫెక్షన్) చేయటం కోసం కాదు, అత్యుత్తమంగా (ఎక్సలెన్స్) చేయటం కోసం కష్టపడండి. ఎందుకంటే, పర్ఫెక్షన్ అనేది ఉనికిలో లేని గమ్యస్థానం. ఎక్సలెన్స్ అనేది మీరు ప్రతిరోజూ నడవగల మార్గం.

– అలోక్ బిర్లా, 'ఫోర్‌సైట్' ఫౌండర్

తక్కువ ఖర్చు

'ఇన్నొవేషన్' అంటే అదెప్పుడూ హై టెక్నాలజీకి సంబంధించినదే అయి ఉండక్కర్లేదు. కొన్నిసార్లు అది, సమాజంలోని అత్యంత అణగారిన వర్గాలకు తక్కువ ఖర్చుతో సేవలు అందించటానికి సృజనాత్మక మార్గా లను కనుక్కోవటం కూడా!

– మేఘ విజయ్‌వర్గియా, పీపుల్స్ యూనివర్సిటీ ప్రో–చాన్సలర్

సర్దుబాటుతోనే సాన్నిహిత్యం

విశ్లేషణ

ప్రభు దయాళ్

భారత్–బంగ్లాదేశ్ సంబంధాలు 1971 నాటి బంగ్లా విముక్తి పోరాటం తర్వాత అత్యంత కీలకమైన ఘట్టంలో ఉన్నాయి. భారత్ అనుకూల అవామీ లీగ్ ప్రభుత్వం 2024 ఆగస్టులో హఠాత్తుగా కుప్పకూలి, మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పగ్గాలు చేపట్టాక గత దశాబ్దపు సోనాలీ అధ్యాయ్ (స్వర్ణ అధ్యాయం) ఛాయలు కనుమరుగయ్యాయి. ఎవరి ప్రభుత్వం అధికారంలో ఉన్నదనే దానితో నిమిత్తం లేకుండా రెండు దేశాల మధ్య పొత్తు కొనసాగవలసి ఉంది. ఆర్థిక కారణాల రీత్యానూ ఇది రెండు దేశాలకు అవసరం. ప్రాంతీయ సుస్థిరతకు అదే ప్రాణాధారం.

ఇండియాపై పెరిగిన వ్యతిరేకత

ఈ ఏడాది (2025) బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక భావనలు అసాధారణ స్థితికి చేరుకున్నాయి. యువజన నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హదీ హతుడైన తర్వాత నిరసన ప్రదర్శనలు ముమ్మరమైనాయి. అతని మృతి వెనుక భారత్ హస్తం ఉందని బంగ్లాదేశ్‌లో చాలామంది ఆరోపిస్తున్నారు. నిరసనకారులు భారత దౌత్య కార్యాలయాలను లక్ష్యంగా చేసుకున్నారు. హిందు యువకుడు దీపూ చంద్ర దాస్ దారుణ హత్య సభ్య ప్రపంచాన్ని నిర్ఘాంతపరచింది. బంగ్లాదేశ్‌లో 2026 ఫిబ్రవరిలో జాతీయ ఎన్నికలు జరగవలసి ఉంది. రాజకీయ ప్రయోజనాలను మూటగట్టుకునేందుకు భారత వ్యతిరేక భావనలను ఎగదోస్తున్నారనే అభిప్రాయం ఉంది.

షేక్ హసీనాను అప్పగించడానికి భారత్ తిరస్కరించడం కూడా రెండు దేశాల మధ్య ఘర్షణకు ఒక ప్రధానాంశంగా మారింది. ఢాకాలో అధికారం చేతులు మారడంతో, జమాత్–ఏ–ఇస్లామీ వంటి భారత వ్యతిరేక ఇస్లామీయ వర్గాలకు ఊతం లభించింది. రెండు దేశాల మధ్య భద్రతాపరమైన సహకారానికి ఒకప్పుడు 'అగ్ర ప్రాధాన్యం' లభించేది. బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత అక్కడి ఇస్లామీయ వర్గాల పునరేకీకరణకు వీలు కల్పించి ఈశాన్య ప్రాంతంలో ఆంతరంగిక భద్రతకు బెడదగా పరిణమిస్తుందని భారత్ కలవరపడుతోంది. ఉగ్రవాద ప్రసంగాలు ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, అస్సాంలలో మతపరమైన ఘర్షణలను రేకెత్తించవచ్చు.

ముప్పేట ముప్పు

'పొరుగు దేశాలకే మొదట పెద్ద పీట' అనే భారత్ విధానం కొన్నేళ్ళుగా అవామీ లీగ్‌తో మైత్రి అనే లంగరుపైనే ఎక్కువగా ఆధారపడుతూ వచ్చింది. భారత్ చర్చలు జరిపేటపుడు సంప్రదాయసిద్ధమైన మిత్రులతోనే కాకుండా, యువజన నాయకులను, పౌర సమాజాన్ని కూడా ఆ ప్రక్రియలోకి తేవాలి. ఎన్నికల్లో ప్రధాన పాత్ర వహిస్తుందని భావిస్తున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) వంటి ప్రతిపక్షాలను కూడా కూడగట్టుకోవాలి.

◆ 'పొరుగు దేశాలకే మొదట పెద్ద పీట' అనే భారత్ విధానం... షేక్ హసీనా 'అవామీ లీగ్'తో మైత్రి అనే లంగరు పైనే ఎక్కువగా ఆధారపడుతూ వచ్చింది. బంగ్లాదేశ్‌లో భారత్ ఒక పార్టీకే అనుకూలమనే అభిప్రాయాన్ని తొలగించాలి.

దక్షిణాసియాలో భారత్‌కు బంగ్లాదేశ్ అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌ను మూల బిందువుగా చేసుకున్న విధానం నుంచి మరలి చైనా, పాకిస్తాన్, పశ్చిమ దేశాలతో సంబంధాలను పటిష్టపరచుకుంటోంది. బంగ్లాదేశ్ కూడా పాకిస్తాన్ తరహాలో సైద్ధాంతిక లేదా సైనిక అమరిక వైపు మొగ్గు చూపుతున్న సందేహాలు రేకెత్తుతున్నాయి. ఘర్షణ వైఖరిని అవలంబిస్తున్న బంగ్లాదేశ్ మనకు 'మూడు వైపుల' నుంచి ముప్పును తేవొచ్చు. పశ్చిమ (పాకిస్తాన్), ఉత్తర (చైనా), తూర్పు (బంగ్లాదేశ్) సరిహద్దుల వైపు భారత్ సైన్యాన్ని, వనరులను విస్తరింపజేయక తప్పని స్థితి ఏర్పడుతోంది.

భారతదేశపు ప్రధాన భూభాగాన్ని దాని ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానపరచే 22 కిలోమీటర్ల సన్నని భూభాగమైన సిలీగుడీ కారిడార్ అత్యంత సున్నితమైన భౌగోళిక ప్రాంతం. దీన్నే 'చికెన్ నెక్' అంటారు. పాక్–చైనాలతో సాన్నిహిత్యం బంగ్లాదేశ్‌ను ఈ కారిడార్‌కు సమీపంలో సైనిక మౌలిక వసతుల కల్పన అభివృద్ధికి పురికొల్పవచ్చు. భారత్‌ను సాగర జలాల నుంచి చుట్టుముడుతూ ప్రత్యర్థి దేశాలు చిట్టగాంగ్, మోంగ్లా వంటి వ్యూహాత్మక రేవులను వినియోగించుకోవచ్చు. చైనా సాయంతో పెకువా జలాంతర్గామి కేంద్రాన్ని బంగ్లాదేశ్ అభివృద్ధి చేస్తూండటంతో బంగాళాఖాతంలో భారత నౌకాదళ ఆధిపత్యానికి గండి పడుతోంది.

అన్ని పక్షాలను కలుపుకొంటేనే...

బంగ్లా భూభాగాన్ని ఉపయోగించుకుని అస్సాం సమైక్య విమోచన కూటమి (ఉల్ఫా) వంటి తిరుగుబాటు గ్రూపులు తిరిగి తలెత్తవచ్చు. హసీనా ప్రభుత్వం దాన్ని చాలా వరకు నిరోధించింది. పాకిస్తాన్ ఐఎస్ఐ కార్యకలాపాలు బంగ్లాదేశ్‌లో ఊపందుకుంటే – నకిలీ కరెన్సీ, ఆయుధాలు, మతోన్మాద శక్తులు భారతీయ సరిహద్దు రాష్ట్రాల్లోకి చొరబడటం పెరుగుతుంది. తీస్తా నదీ ప్రాజెక్టులో కూడా పెట్టుబడులకు చైనా ముందుకొస్తోంది.

ఈ చిక్కుముడులను విప్పుకుంటూ, బంగ్లాతో సంబంధాలను మళ్ళీ బలోపేతం చేసుకునేందుకు తగిన ఆచరణాత్మక పంథాను, బహుళ దృక్కోణ వైఖరిని రూపొందించుకునే దిశగా భారత్ కృషి చేయాలి. భారత్ తమ దేశంలో ఒక పార్టీకే అనుకూలంగా ఉందనే అభిప్రాయాన్ని తొలగించాలి. గంగా జలాల ఒడంబడిక వంటి కీలక అంశాలపై సకాలంలో పారదర్శకమైన చర్చలు చేపట్టాలి. ఇతర నదీ జలాల పంపకాలపై విస్తృత నిర్వహణా వైఖరిని అనుసరించాలి. బంగ్లాకు అది సున్నితమైన జాతీయ అంశం కనుక ఈ విషయంలో జాగు చేస్తే, అది ఆ దేశంలో భారత్ వ్యతిరేక అభిప్రాయాలను ఎగదోసేందుకు తోడ్పడుతుంది.

సంక్షుభిత పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆర్థికంగా పరస్పరం ఆధారపడి ఉండటమనే అంశం భవిష్యత్ సంబంధాలకు బలమైన లంగరుగా పనిచేయగలదు. ద్వైపాక్షిక వాణిజ్యం 2024–25లో 13.46 బిలియన్ల డాలర్ల మేరకు ఉన్నట్లు అంచనా. ఏమాత్రం అభివృద్ధి చెందని దేశ స్థాయి నుంచి 2026లోనన్నా బయటపడాలని బంగ్లా తాపత్రయపడుతోంది. అది భారతదేశంతో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకుంటే, వాణిజ్యపరమైన ప్రత్యేక హక్కులను కాపాడుకున్నట్లవుతుంది. భారత్–బంగ్లా స్నేహపూర్వక పైపులైను, (అఖౌడా–అగర్తలా వంటి) సీమాంతర రైలు సంధానం వంటివి భారత్ 'తూర్పు కార్యాచరణ' విధానానికీ, బంగ్లా వృద్ధికీ అవసరం.

వ్యాసకర్త కువైట్, మొరాకోల్లో భారత మాజీ రాయబారి
('ఫస్ట్ పోస్ట్' సౌజన్యంతో)

లక్ష్యం ఒకటే బాధ్యతలు వేరు!

వ్యూ పాయింట్:

పాడ్‌కాస్ట్: లత అండ్ ద లీడర్స్

అతిథి: దువ్వూరి సుబ్బారావు, ఆర్బీఐ మాజీ గవర్నర్

హోస్ట్: లతా వెంకటేష్, కన్సల్టింగ్ ఎడిటర్, సీఎన్‌బీసీ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య జరిగే 'ఘర్షణ'లు తరచుగా వార్తల్లోకి వస్తుంటాయి. ''కానీ, ఇది సంక్షోభానికి సంకేతం కాదు. పాలన లక్షణం'' అంటున్నారు ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు. ఈ ఘర్షణలను ఆయన, వైవాహిక జీవితంలోని విభేదాలతో పోల్చారు. ''కొన్నిసార్లు అవి తీవ్రంగా ఉండొచ్చు. అయితే అవి ఒకే లక్ష్యం పట్ల ఉమ్మడి నిబద్ధతతో జరుగుతాయి'' అని దువ్వూరి చెబుతున్నారు. దేశ ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి కోసం జరిగే సంస్థాగత చర్చల్లోని ఘర్షణలు చివరికి మంచే చేస్తాయన్న అభిప్రాయాన్ని ఆయన ఈ పాడ్‌కాస్ట్‌లో వెలిబుచ్చారు.

ఘర్షణ ఉండటం మంచి లక్షణం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్థిక మంత్రిత్వ శాఖల మధ్య అనివార్యంగా కొంత ఘర్షణ ఉండనే ఉంటుంది. నా అనుభవాన్ని బట్టి, అలా ఉండటం అవసరం కూడా! ఈ రెండు సంస్థలు ఆర్థిక వ్యవస్థను భిన్న దృక్పథాలతో చూస్తాయి. ఆర్బీఐ ద్రవ్య స్థిరత్వం, ద్రవ్యోల్బణ నియంత్రణ, ఆర్థిక వ్యవస్థ భద్రతపై దృష్టి పెడితే; ప్రభుత్వం సహజంగానే అభివృద్ధి, ఉపాధి, ప్రజలకు జవాబుదారీగా ఉండటం వంటి బాధ్యతలపై దృష్టి సారిస్తుంది. ఈ భిన్న దృక్పథాలు కలిసి పని చేయవలసి వచ్చినప్పుడు ఎప్పుడైనా ఒకసారి అభిప్రాయ భేదాలు రావడం సహజమే. ఇది వ్యవస్థలోని లోపం కాదు. ఇండియా వంటి విస్తృతమైన ఆర్థిక వ్యవస్థను నిర్వహించడంలో ఉన్న సంక్లిష్టతకు ఒక లక్షణం మాత్రమే.

దువ్వూరి సుబ్బారావు, లతా వెంకటేష్

ప్రత్యర్థులు కారు, భాగస్వాములు

నేను తరచూ, ఆర్బీఐ–ప్రభుత్వం మధ్య ఉన్న విభేదాలను దాంపత్య జీవితంలోని చిన్న గొడవలతో పోలుస్తాను. మీరు బలంగా వాదించవచ్చు. ఒక్కోసారి తీవ్రమైన ఆవేశంతో కూడా! కానీ, అందువల్ల మీరు ప్రత్యర్థులు అవుతారని కాదు. చివరికి, ఇద్దరూ ఒకే పక్షంలో ఉన్నారన్న గ్రహింపు వస్తుంది. విభేదాలు ప్రమాదకరం కాదు. వాటిని శత్రుత్వంగా లేదా సంస్థాగత వైఫల్యంగా భావించడమే ప్రమాదకరం. పరస్పర గౌరవం ఉన్నంత కాలం ఈ చర్చలు, లేదా ఘర్షణలు నిర్మాణాత్మకంగానే ఉంటాయి.

సంఘర్షణ, సంభాషణలో భాగమే!

ఆర్బీఐ, ఆర్థిక మంత్రిత్వ శాఖ రెండూ కూడా భారతదేశ దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం, సమృద్ధి అనే ఒకే భారీ లక్ష్యం కోసం పని చేస్తాయి. ఆ ఉమ్మడి లక్ష్యాన్ని పంచుకుంటాయి. మా విధానాలు వేరుగా ఉండవచ్చు. మా కాల పరిమితులు కలవకపోవచ్చు, కానీ చేరుకోవాల్సిన గమ్యం ఒక్కటే. ఈ ఉమ్మడి లక్ష్యాన్ని మనసులో ఉంచుకున్నప్పుడు, విభేదాలు సంభాషణల ద్వారా పరిష్కారమవుతాయి. ఆ సంభాషణలకు మరొక స్వరూపమే సంఘర్షణ.

ఇటు దృఢత్వం... అటు సంక్షేమం

చాలామంది ఈ ఉద్రిక్తతలు లేదా ఘర్షణలు, వ్యక్తిగత విభేదాల వల్ల వస్తాయని అనుకుంటారు. అలా జరగడం చాలా అరుదు. అసలు కారణం, సంస్థలకు అప్పగించిన బాధ్యతలే. ఆర్బీఐ గవర్నర్‌గా ప్రజాదరణ లేని, స్వల్పకాలికంగా అసౌకర్యాన్ని కలిగించే నిర్ణయాలైనా సరే తక్షణం తీసుకోవలసి వస్తుంది. ధరల స్థిరత్వం, ఆర్థిక వ్యవస్థ దృఢత్వాన్ని కాపాడటం ఆర్బీఐ బాధ్యత. అదే సమయంలో, ఆర్థిక మంత్రి తక్షణ ఆర్థిక ఒత్తిడులకు, ప్రజల అంచనాలకు స్పందించాల్సి ఉంటుంది. ఈ భిన్నమైన బాధ్యతలే విధానపరమైన విభేదాలకు దారితీస్తాయి.

విభేదాలు పదును పెడతాయి!

పరిపక్వతతో, పరస్పర గౌరవంతో ఈ ఘర్షణను నిర్వహిస్తే, అది విధాన రూపకల్పనను మరింత బలపరుస్తుంది. వాదనలు... ఇరు పక్షాలనూ తమ ఆలోచనలను పదును పెట్టుకునేలా చేస్తాయి. అంచనాలను, అభ్యంతరాలను ప్రశ్నించుకునేలా చేస్తాయి. ఊహించని ప్రభావాలను పరిగణనలోకి తీసుకునేలా ప్రేరేపిస్తాయి. సులభమైన ఏకాభిప్రాయం కంటే లోతైన చర్చల నుంచే మెరుగైన విధానాలు వెలువడతాయి. ముఖ్యంగా... సంస్థల మధ్య నమ్మకం ఉండటం, అంతరాయం లేని స్పష్టమైన సంభాషణ కొనసాగడం అత్యంత ముఖ్యం.

❑ ఎడిటోరియల్ టీమ్

సహజ కవచం... ధ్వంసం

అభిప్రాయం



కె. నారాయణ

భారతదేశ చరిత్రకు ఆరావళి పర్వత శ్రేణి ఒక మౌన సాక్షి. కోట్లాది సంవత్సరాలుగా ఏర్పడిన ఈ పురాతన పర్వత వ్యవస్థ ఉత్తర భారతదేశానికి సహజ రక్షణ కవచంగా నిలిచింది. కానీ నేడు అభివృద్ధి ముసుగులో మైనింగ్ దోపిడీకి బలవుతోంది. ఇది కేవలం పర్యావరణ సమస్య కాదు; ప్రజల జీవన హక్కులపై దాడి.

ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆరావళి పర్వతాలను ప్రధానంగా ఎత్తు (100 మీటర్లు) ఆధారంగా నిర్వచించింది. ఇది కీలక ప్రాంతాలను రక్షణ పరిధి నుంచి తొలగించే ప్రమాదాన్ని తెచ్చింది. ఈ నిర్ణయం చట్టపరంగా సాంకేతికంగా ఉన్నా, దాని ప్రభావాలు దేశ భవిష్యత్తును ప్రభావితం చేయనున్నాయి.

ఆరావళి ఒక పర్వత శ్రేణి కాదు, ఒక జీవ వ్యవస్థ. అవి కేవలం రాళ్ల సమూహం కాదు, భూగర్భ జలాలకు సహజ భండారం; ఎడారీకరణను అడ్డుకునే చివరి గోడ; అడవులు, వన్యప్రాణులకు నివాస స్థలం; ఢిల్లీ – ఎన్సీఆర్‌కు సహజ గాలి శుద్ధి యంత్రం. భౌగోళిక నిర్మాణం, అడవుల విస్తరణ, శిలా స్వభావం, నీటి ప్రవాహం వంటివన్నీ కలిసి ఆరావళిని జీవ వ్యవస్థగా నిలబెట్టాయి. ఎత్తు ఆధారంగా ఈ వ్యవస్థను విభజించడం అంటే శాస్త్రానికే అవమానం. ఆరావళిలో మైనింగ్ నష్టాలు తాత్కాలికం కావు. పర్వతాలను పేల్చడం ద్వారా శిలా నిర్మాణాలు శాశ్వతంగా ధ్వంసమవుతాయి. భూగర్భ జలాల సహజ ప్రవాహం తెగిపోతుంది. అడవులు తిరిగి పునరుద్ధరించలేని విధంగా నశిస్తాయి. 'సస్టెయిబుల్ మైనింగ్' భావన ఒక మిథ్య.

హరియాణా, రాజస్థాన్, ఢిల్లీ ప్రాంతాల్లో నీటి కొరత ఇప్పటికే తీవ్రమవుతోంది. మైనింగ్ వల్ల సహజ వ్యవస్థ దెబ్బతింటే, కోట్లాది ప్రజలు తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆరావళి పర్వత శ్రేణుల అడవులు... ధూళిని, ఇసుక గాలులను అడ్డుకుంటూ సహజ రక్షణ గోడలా పనిచేస్తాయి. ఆ గోడను కూల్చేసి, కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేయడం ప్రభుత్వ ద్వైదీభావానికి ప్రతీక. ఆరావళి పర్వతాలు పశ్చిమ రాజస్థాన్ ఎడారి నుంచి వచ్చే వేడి గాలులను అడ్డుకునే చివరి అవరోధం. ఈ అవరోధం బలహీనపడితే, ఎడారీకరణ హరియాణా, ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ వైపు విస్తరించే ప్రమాదం ఉంది. ఇది భవిష్యత్ తరాలపై విధించే శిక్షతో సమానం.

ప్రకృతి వనరులు కొద్దిమంది కార్పొరేట్ లాభాల కోసం త్యాగం చేయబడితే, అది ప్రజాస్వామ్యానికి విరుద్ధం. అభివృద్ధి అంటే నీటి భద్రత, ప్రజారోగ్యం, పర్యావరణ సమతుల్యత, భవిష్యత్ తరాల భద్రతకు హామీ ఇచ్చేదిగా ఉండాలి. ఆరావళిని కాపాడటం అంటే ఒక పర్వత శ్రేణిని కాపాడటం కాదు, దేశపు జీవనాధారాలను కాపాడటం. నిజమైన అభివృద్ధి ఎప్పుడూ పర్యావరణాన్ని కాపాడుతూ ముందుకు సాగుతుంది.

వ్యాసకర్త చైర్మన్, కంట్రోల్ కమిషన్; కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా

ఆదాయమెంతో... వ్యయమూ అంతే!

డేటా పాయింట్

భారతీయ రైల్వేల ఆదాయంతో పాటు వ్యయం కూడా పెరుగుతోంది. 2025–26లో రక్షణ, భద్రత చర్యల కోసమే రూ.1,16,514 కోట్లు ఖర్చు చేశారు.

(అంకెలు రూ. కోట్లలో)

	2023-24	2024-25
మొత్తం ఆదాయం	2,56,094	2,65,678
మొత్తం వ్యయం	2,52,834	2,63,018
మిగులు	3,260	2,660



ఆధారం: రైల్వే శాఖ

మోక్షానికి మార్గం

జ్యోతిర్మయం

జన్మలన్నింటిలోనూ ఉత్కృష్టమైన మానవ జన్మ లభించినప్పుడు, దాన్ని సద్వినియోగం చేసుకొని మోక్షాన్ని సాధించేందుకు గట్టి ప్రయత్నాలూ, సాధనలూ చేయాలి అంటారు పెద్దలు. అయితే అలాంటి సాధనలు చేయాలంటే పట్టుదలా, ప్రాపంచిక సుఖాలపట్ల వైరాగ్యం, ఆత్మనిగ్రహం, యమనియమాదులూ, దీర్ఘకాలిక జప తప ధ్యానాదులూ అవసరం. ఇవన్నీ సామాన్య మానవుడు తేలికగా ఆచరించగలిగినవి కాదు. అందుకే శాస్త్రాలలో, పురాణాలలో అక్కడక్కడా మోక్షం సాధించేందుకు కొన్ని సూక్ష్మాలూ, ఉపాయాలూ సూచించటం కనిపిస్తుంది. మరణ కాలంలో జీవి దేన్ని స్మరిస్తూ ప్రాణాలు వదులుతాడో, మరణానంతరం ఆ భావాన్నీ, సంస్కారాన్నీ, స్వరూపాన్నీ పొందుతాడు అని సిద్ధాంతం. కాబట్టి, మరణ సమయంలో భగవంతుడిని స్మరిస్తూ శరీరం త్యజించేవాడు, ఆ భగవంతుడి సాయుజ్యం పొందుతాడు... అంటుంది గీత: **అంతకాలే చ మాం – ఏవ స్మరన్ ముక్త్వా కళేబరం, యః ప్రయాతి స మద్భావం యాతి, నాస్తి – అత్ర సంశయః.**

ఈ ఉపాయం సులభమే గానీ, దీనిలో రెండు సమస్యలు ఉన్నాయి. ఒకటి: అలవాటూ అభ్యాసం లేకుండా, అవసాన సమయంలో మాత్రం అకస్మాత్తుగా రమ్మంటే, భగవన్నామం మనసుకు వస్తుందా? ఈ ఉపాయం ఉపయోగించుకోగోరేవారు, సర్వకాలాలలోనూ, తమ కర్మలూ, కర్తవ్యాలూ, కొనసాగిస్తూనే, భగవత్ స్మరణ చేసుకొంటూ ఉండాలి.అంతకాలం ఎప్పుడు వచ్చినా భగవత్ స్మరణ అప్రయత్నంగా జరిగిపోతుంది అని గీత సూచిస్తుంది.

ఇక రెండో సమస్య: మామూలు సమయం వేరు, అంతకాలం వేరు. ప్రాణ ప్రయాణ సమయంలో కఫ వాత పిత్తాలవల్ల కంఠం పట్టుకుపోతే ఏం గతి? అందుకే, 'పూర్తి పటుత్వం ఉన్నప్పుడే నా మనసు అనే రాజహంసను, నీ పాద పంకజాలు అనే పంజరంలో ప్రవేశపెట్టి, అక్కడే నీ అనుగ్రహం కోసం ఉంచేస్తాను' అంటాడు కులశేఖర ఆళ్వారు. మరణ సమయంలో, '**కంపము ఉద్భవమంది, కష్టపడుచు,/ నా జిహ్వతో నిన్ను నారాయణా అనుచు,/ పిలుతునో! శ్రమ చేత పిలువలేనో!**' అని సందేహిస్తూ, శేషప్ప కవి, '**నాటి కిప్పుడె చేతు నామ భజన!**' అంటాడు.

– ఎం. మారుతి శాస్త్రి

మృత్యు 'వే'గం..

రక్తమోడిన రహదారులు

ఎనిమిది మంది దుర్మరణం

ఆళ్లగడ్డలో ప్రైవేటు బస్సును ఢీకొన్న కారు

ఐదుగురు మృత్యువాత

గుంటూరు జిల్లాలో కారును ఢీకొన్న

ప్రైవేటు బస్సు .. ముగ్గురు మృతి

రహదారులు శుక్రవారం తెల్లవారుజామున రక్తమోడాయి. అతివేగం, నిద్రమత్తు ఎనిమిది మంది ప్రాణాలను బలిగొన్నాయి. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో అదుపుతప్పిన కారు.. ప్రైవేటు బస్సును ఢీకొనడంతో ఐదుగురు మరణించారు. గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెంలో వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు రోడ్డు పక్కగా ఆగుతున్న కారును బలంగా ఢీకొనడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఈ రెండు ఘటనలు బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

మృతిచెందిన గుండేరావు, నరసింహులు, సిద్ధయ్య, శ్రావణ్, సిద్ధార్థ కులకర్ణి (ఫైల్)

నిద్రమత్తే యమపాశమై..

దొర్నిపాడు: నంద్యాల జిల్లా ఎన్‌హెచ్–40పై ఆళ్లగడ్డ సమీపంలో డ్రైవర్ నిద్రమత్తు వల్ల కారు అదుపుతప్పి డివైడర్‌ను క్రాస్ చేసి మరో రూట్లో వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మృతులంతా క్యాటరింగ్ పనులు చేసుకుని జీవించేవారు. హైదరాబాద్ బాచుపల్లికి చెందిన గుండేరావు(46), శ్రావణ్(21), సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన నరసింహులు(30), కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన సిద్ధయ్య(50)తోపాటు గుండేరావు కుమారులు సిద్ధార్థ కులకర్ణి(19), శివసాయి కులకర్ణి ఈనెల 11న అయ్యప్ప భక్తులకు వంట చేసేందుకు శబరిమలైకి కారులో వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగించుకొని తిరుగు ప్రయాణంలో తిరుమలకు వెళ్లారు. స్వామి దర్శనం చేసుకొని గురువారం సాయంత్రం కారులో తిరుపతి నుంచి హైదరాబాద్‌కు బయల్దేరారు. శుక్రవారం తెల్లవారుజామున 2.30గంటల ప్రాంతంలో నల్లగట్ల వద్ద డ్రైవింగ్ చేస్తున్న శివసాయి కులకర్ణి నిద్రమత్తులో కునుకు తీయడంతో వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటుకుని మరో రూట్‌లో హైదరాబాద్ నుంచి పుదుచ్చేరి వెళ్తున్న సీజీఆర్ ట్రావెల్స్ బస్సును బలంగా ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో గుండేరావు, శ్రావణ్, నరసింహులు, సిద్ధయ్య అక్కడికక్కడే మరణించారు. సిద్ధార్థ కులకర్ణి, శివసాయి కులకర్ణి తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాలను కారు నుంచి బయటకు తీశారు. క్షతగాత్రులిద్దరిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అక్కడ పరిస్థితి విషమించి సిద్ధార్థ కులకర్ణి మృతి చెందాడు. ఘటనాస్థలంలో చనిపోయిన నలుగురిని ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడే పోస్టుమార్టం పూర్తి చేశారు. విషయం తెలుసుకున్న మృతుల బంధువులు ఆళ్లగడ్డ ప్రభుత్వాస్పత్రికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో 40 మంది ప్రయాణికులు

హైదరాబాద్ నుంచి పుదుచ్చేరి వెళుతున్న సీజీఆర్ ట్రావెల్స్ బస్సులో 40మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ప్రమాదంలో వీరెవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించి ప్రయాణికులను ఇతర వాహనాల్లో వారి గమ్యస్థానాలకు చేర్చారు.

ప్రైవేటు బస్సే మృత్యుశకటమై

నుజ్జు నుజ్జయిన కారు

ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

గుంటూరు రూరల్: వెనుక నుంచి వచ్చిన ప్రైవేటు బస్సు కారును బలంగా ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం, మామిళ్ళమడవ గ్రామానికి చెందిన కంచనపల్లి మధు స్థానికంగా వంటమేస్త్రీ. ఆయనకు భార్య మనీష, పిల్లలు జ్ఞానేశ్వర్, వర్షిత్ ఉన్నారు. పిల్లలిద్దరికీ పుట్టు వెంట్రుకలు తీయించేందుకు తిరుమల వెళ్లాలని కారు మాట్లాడుకున్నారు. కారులో మధు భార్యాబిడ్డలతోపాటు తల్లిదండ్రులు కంచనపల్లి సుశీల(64) వెంకటయ్య(70) మనీష తండ్రి మస్తాన్, కారు డ్రైవర్ సైదులు(28) మంగళవారం సాయంత్రం ఇంటివద్ద నుంచి తిరుమల వెళ్లారు. తిరుపతిలో పిల్లల కార్యక్రమాలు పూర్తి చేసుకుని గురువారం సాయంత్రం విజయవాడకు కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు బయలుదేరారు. శుక్రవారం తెల్లవారుజామున గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెం సమీపంలోకి చేరింది. ఆ సమయంలో డ్రైవర్ సైదులు నిద్ర వస్తుందని కారును పక్కకు తీసి ముఖం కడుక్కుని వెళ్దామని చెప్పాడు. కారును రోడ్డుపక్కన ఆపేందుకు స్లో చేస్తుండగా వెనుకనుంచి అతి వేగంగా వస్తున్న వీఆర్‌సీఆర్ సంస్థకు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కారును బలంగా ఢీకొంది. ప్రమాదంలో సుశీల, వెంకటయ్య, డ్రైవర్ సైదులు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి కారు డోర్లను రాడ్లతో వంచి క్షతగాత్రులను, మృతదేహాలను బయటకు తీశారు. క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించారు. ఎస్పీ వకుల్ జిందాల్, సౌత్‌జోన్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్ ఘటన స్థలికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు.

ఆయుధాల సరఫరా ముఠా అరెస్ట్

అనంతపురం సెంట్రల్: అక్రమంగా ఆయుధాలు సరఫరా చేస్తున్న ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని ఓ జిమ్ నిర్వాహకుడితో పాటు ఆయుధాలు సరఫరా చేసే మధ్యప్రదేశ్ రాష్ట్రం మొరేనా జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం అనంతపురంలో విలేకరులకు ఎస్పీ జగదీష్ వివరాలు వెల్లడించారు. అనంతపురంలో జిమ్ నిర్వహిస్తున్న నల్లి రాజశేఖరరెడ్డి తుపాకీ కలిగి ఉండడాన్ని తీవ్రంగా పరిగణించిన పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టూటౌన్ సీఐ శ్రీకాంత్, త్రీటౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, సీసీఎస్ సీఐ శేషగిరి, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్, టూటౌన్ ఎస్ఐ రుషేంద్రబాబు, సిబ్బంది బృందంగా ఏర్పడి దర్యాప్తు చేశారు. జిమ్ నిర్వాహకుడు నల్లి రాజశేఖరరెడ్డితో పాటు ఆయుధాలు సరఫరా చేస్తున్న మధ్య ప్రదేశ్‌కు చెందిన రోహిత్ పర్మార్, శివం సింగ్ పరివార్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 5 కంట్రీమేడ్ పిస్తోళ్లు, 7 మ్యాగజీన్లు, 30 లైఫ్ బుల్లెట్లు, 3 ఖాళీ బుల్లెట్ షెల్స్, ఒక తల్వార్(కత్తి)ను స్వాధీనం చేసుకున్నారు.

रजिस्ट्री सं. डी.एल.- 33004/99 REGD. No.D.L.-33004/99

భారత రాజపత్రం

सी.जी.-डी.एल.-अ.-11122025-268381
CG-DL-E-11122025-268381

असाधारण
అసాధారణం

भाग II—खण्ड 3—उप-खण्ड (ii)
భాగం-II, సెక్షన్ 3, సబ్-సెక్షన్ (ii)
प्राधिकार से प्रकाशित
అధికారం ద్వారా ప్రచురించబడింది

सं. 5487] న్యూఢిల్లీ, సోమవారం, డిసెంబర్ 8, 2025/అగ్రహాయణం 17, 1947
No. 5487] NEW DELHI, MONDAY, DECEMBER 8, 2025/AGRAHAYANA 17, 1947

రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ

ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబర్ 8, 2025

SO. 5675(E) - జాతీయ రహదారుల చట్టం, 1956(48 ఆఫ్ 1956) (ఇక ముందు చట్టంగా వ్యవహరించెదరు) లోని సెక్షన్ 3ఎ | సబ్ సెక్షన్ (1) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచు కేంద్ర ప్రభుత్వము వారు ప్రజా ప్రయోజనార్థము క్రింద తెలిపిన షెడ్యూల్లో సంక్షిప్తముగా వివరించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో కి.మీ. 0.000 నుండి కి.మీ. 189.900 వరకు అమరావతి రాజధాని నగర ఔటర్ రింగ్ రోడ్ కోసం భూమి నిర్మాణం (ఆరు లేన్లు మొదలైనవి) నిర్వాహణ మరియు కార్యకలాపాల కొరకు అవసరమై ఉందని భావించి తృప్తి చెందిన తర్వాత భూమిని సేకరించేందుకు ఉద్దేశించి ఈ ప్రకటన జారీ చేసినారు.

సదరు భూమి పై ఎవరైన వ్యక్తికి ప్రయోజనం ఉన్నట్లయితే అధికారిక గెజిట్లోని ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి ఇరవై ఒక్క రోజులలోగా సదరు చట్టములోని సెక్షన్ 3(సి) సబ్ సెక్షన్ (1) క్రింద పైన తెలిపిన ప్రయోజనార్థము సదరు భూమి వినియోగించుకొనుట పై వారి అభ్యంతరములను తెలియజేయవచ్చును.

అటువంటి ప్రతి అభ్యంతరములను అర్హత కల్గిన అధికారి మరియు జాయింట్ కలెక్టర్, గుంటూరు జిల్లా, వారికి వ్రాతపూర్వకముగా తగిన ఆధారాలను చూపుతూ అందజేయవలెను. సదరు అభ్యంతరములను వ్యక్తిగతంగా లేదా వారి న్యాయవాదుల ద్వారా వాదనలు వినుటకు తగు అవకాశం కల్పించి మరియు అన్ని అభ్యంతరములు విన్న తరువాత సంబంధిత అర్హత కల్గిన అధికారి మరియు జాయింట్ కలెక్టరు వారు, తదుపరి విచారణ అవసరమైనదని భావించినట్లైతే వాటిపై తదుపరి విచారణ జరిపించి సదరు అభ్యంతరములను స్వీకరించుట లేదా నిరాకరించుటకు క్షుణ్ణముగా యోచించి తగిన ఉత్తర్వులను జారీ చేయుదురు.

సదరు చట్టం లోని సెక్షన్ 3 సి లోని సబ్ సెక్షన్ (2) క్రింద సంబంధిత అధికారి జారీ చేసిన ఉత్తర్వులే తుది నిర్ణయము. సదరు భూమి యొక్క ప్లాన్లు మరియు భూమి యొక్క ఇతర వివరములు ఈ ప్రకటనలో లభ్యమగును మరియు ప్రయోజనము గల వ్యక్తి సంబంధిత అధికారి యొక్క పైన తెలిపిన కార్యాలయము వద్ద తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో కి.మీ. 0.000 నుండి కి.మీ. 189.900 వరకు అమరావతి రాజధాని నగర ఔటర్ రింగ్ రోడ్ కోసం భూమి పరిధిలోకి వచ్చే నిర్మాణాలతో లేదా లేకుండా సేకరించాల్సిన భూమి యొక్క సంక్షిప్త వివరణ. వివరాల కోసం క్రింద ఉన్న QR కోడ్‌ను స్కాన్ చేయండి.

జిల్లా: గుంటూరు
https://egazette.gov.in/
Publication date 08.12.2025
https://egazette.gov.in/
https://morth.gov.in/

[F.No. NHAI/PIU-Amaravati/11014/02/2025/Vol.1/3A2]
SHAIKH AMINKHAN, Director

గమనిక: ఈ ప్రకటన CALA/PIU/RO కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంది మరియు భూ యజమానులు అక్కడ కూడా ఈ ప్రకటనను చూడవచ్చు.

పెదనందిపాడులో గవర్నర్ పర్యటన

సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావుతో భేటీ

విద్యార్థులతో ముచ్చటిస్తున్న గవర్నర్

ప్రత్తిపాడు: ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ శుక్రవారం గుంటూరు జిల్లా పెదనందిపాడులో పర్యటించారు. సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావుతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. సాయంత్రం 4 గంటల వరకూ అక్కడే గడిపారు. తొలుత కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

తిరుగుపయనమైన గవర్నర్‌కు స్థానిక అశోక పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ జెండాలతో నిలబడి ఉన్నారు. గమనించిన గవర్నర్ కాన్వాయ్‌ను ఆపి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

రెండు రోజుల పోలీసు కస్టడీకి పిన్నెల్లి సోదరులు

మాచర్ల రూరల్: పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం, గుండ్లపాడు గ్రామంలో జరిగిన జంట హత్యల అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని రెండు రోజులు పోలీసు కస్టడీకి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీరాం శ్రీనివాస్ కళ్యాణ్ అనుమతించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జిల్లా సెంట్రల్ జైలులో ఉన్న పిన్నెల్లి సోదరులను ఈనెల 29, 30 తేదీల్లో న్యాయవాది సమక్షంలో సెంట్రల్ జైలులోనే పోలీసులు విచారించనున్నారు.

తిరుమల ఘాట్ రోడ్డులో కొండచిలువ

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లో శుక్రవారం కొండచిలువ కలకలం రేపింది. ఘాట్‌రోడ్‌లోని నరసింహస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై ఎనిమిది అడుగుల కొండచిలువ కనిపించడంతో భక్తులు భయపడిపోయారు. స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడు అక్కడికి చేరుకుని కొండ చిలువను చాకచక్యంగా పట్టుకుని అవ్వాచారి కోనలో వదిలిపెట్టారు.

శ్రీశైలం ఘాట్‌లో పెద్దపులి

శ్రీశైలం: శ్రీశైలం మన్ననూరు ఘాట్ రోడ్డులో గురువారం రాత్రి 11గంటల సమయంలో పెద్దపులి రోడ్డు దాటుతూ కనిపించింది. మన్ననూర్ నుంచి శ్రీశైలానికి వస్తున్న వాహనదారులు తమ వాహనం నుంచి వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది వైరల్‌గా మారింది. ప్రత్యక్షంగా అడవిలో పులిని చూడడం ఎంతో ఉత్కంఠ కలిగించిందని వీడియో తీసిన వాహనదారులు తెలిపారు.

ఎరువుల వ్యాపారిపై ఎస్సై దాడి

తండ్రీ కొడుకులను చితకబాదిన వైనం

బాధితుని వీపుపై గాయాలు

పొదిలి (ప్రకాశం) : ఎరువుల వ్యాపారం చేస్తున్న తండ్రీ కొడుకులపై ఎస్సై వేమన జులుం ప్రదర్శించాడు. ఇష్టారీతిన చితకబాది చొక్కా పట్టుకుని పోలీస్ జీపులో వేశాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా పొదిలి పట్టణానికి చెందిన తండ్రీకొడుకులు యాదాల కోటేశ్వరరావు, అవినాష్ ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వ్యాపారం చేస్తున్నారు. పాతూరు ప్రధాన రహదారిలో లారీ ఉంచి ఎరువుల బస్తాలు అన్‌లోడ్ చేస్తున్నారు. ఆ సమయంలో ఎస్సై వేమన అక్కడికి వచ్చి ట్రాఫిక్ ఆగిపోతుందని, బ్లూకోట్స్ పోలీసులు చెప్పినా ఇక్కడే లారీ ఉంచారేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. షాపు యజమాని ఎవరని ప్రశ్నించాడు. ఇంతలో లోపల ఉన్న అవినాష్ బయటకు వచ్చి... లారీ తీసేస్తున్నాం అనే లోపునే డ్రైవర్‌ను ఎస్సై బాదాడు. అవినాష్ నుంచి సమాధానం వచ్చేలోపే ఎస్సై కోపంతో ఊగిపోయిన ఇష్టానుసారంగా బూతులు మాట్లాడారు. లారీ తీస్తున్నాం అని అవినాష్ చెబుతున్నా వినిపించుకోకుండా కొట్టుకుంటూ, చొక్కా పట్టుకుని లాక్కెళ్లి జీపు ఎక్కించి స్టేషన్‌కు తీసుకెళ్లాడు. సమాచారం తెలుసుకున్న తండ్రి యాదాల కోటేశ్వరరావు స్టేషన్‌కు వెళ్లగా ఎస్సై కోపంతో ఊగిపోతూ ఆయన చెంపపై ఇష్టానుసారం కొట్టాడు. తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకున్నారని బాధితులు తెలిపారు. అనంతరం బంధువుల సలహా మేరకు అవినాష్ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లగా... విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి నుంచి అవినాష్‌ను మళ్లీ స్టేషన్‌కు తీసుకెళ్లారు. తానేదో క్రిమినల్‌ను అయినట్లు ఎస్సై విపరీతంగా కొట్టాడని, తన తండ్రిని కూడా కొట్టారని అవినాష్ కన్నీటి పర్యంతమయ్యాడు.

ఖండించిన ఆర్యవైశ్య సంఘం

యాదాల కోటేశ్వరరావు, అతని కుమారుడు అవినాష్‌పై ఎస్సై వేమన దాడి చేయడాన్ని ఆర్యవైశ్య సంఘం పొదిలి పట్టణ అధ్యక్షుడు జీసీ సుబ్బారావు, పలు వ్యాపార సంస్థల అధ్యక్షులు, కార్యదర్శులు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఒక ప్రకటనలో ఖండించారు.

క్వార్టర్ ఇప్పించండి.. లేదంటే సచ్చిపోతా..

- యర్రగొండపాళెంలో ఆర్టీసీ బస్సును అడ్డుకుని ఓ మహిళ వింత ప్రవర్తన
- అంతా చీప్ లిక్కర్ మహత్యం అంటున్న స్థానికులు

ఆర్టీసీ బస్సుకు అడ్డుగా కూర్చున్న మహిళ

యర్రగొండపాలెం: కూలి పనులు చేసుకుని జీవించే గిరిజనులు మద్యానికి బానిసలై వారి కష్టార్జితాన్ని మద్యం దుకాణాల్లో ధార పోస్తున్నారు. చీప్‌లిక్కర్ తాగినవాళ్ల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం తిరుమలగిరి కాలనీకి చెందిన చెంచు మహిళ ప్రవర్తించిన తీరే అందుకు నిదర్శనం. శుక్రవారం బస్టాండ్ నుంచి పుల్లలచెరువుకు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా.. అక్కడే మద్యం షాపు ఎదురుగా కూర్చున్న ఓ మహిళ హఠాత్తుగా బస్సుకు అడ్డుపడి, అక్కడే కూర్చుంది. 'నాకు క్వార్టర్ మందు ఇప్పించండి.. లేకుంటే సచ్చిపోతానయ్యా.. ఓయ్యా.. నాకు మందు ఇప్పించండయ్యా' అంటూ కాళ్లావేళ్ల పడింది. ఆమె పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. శరీరం అంతా వణుకుతోంది. మద్యం లేకుంటే నిజంగా చనిపోయేలా కనిపించింది. ఎంతమంది చెప్పినా ఆమె బస్సుకు అడ్డు తొలగకపోయే సరికి బస్సు డ్రైవర్ దిగివచ్చి మందు ఇప్పిస్తానని చెప్పి ఆమెను మద్యం షాపు వద్దకు తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి చిన్నగా జారుకుని బస్సు నడుపుకుంటూ వెళ్లాడు. తిరుమలగిరి కాలనీలో నివసిస్తున్న ఆమె రోజంతా కష్టపడి వచ్చిన డబ్బులతో మద్యం తాగుతుంటుందని అక్కడి వారు తెలిపారు. ఆమె వద్ద ఉన్న డబ్బులతో చీప్ లిక్కర్ తాగి ఉంటుందని, ఆ మత్తులో ఇంకా మద్యం కావాలని దారిన వెళ్లే వారిని ఇలా అడుగుతుంటుందని చెప్పారు. రోజూ ఇటువంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని, అంతా చీప్ లిక్కర్ ప్రభావమేనని అంటున్నారు.

ఇంజనీరింగ్ చదివి.. వైద్యుడి అవతారం

విశాఖలో నకిలీ డాక్టర్ ఆటకట్టించిన పోలీసులు

మాట్లాడుతున్న డీసీపీ-1 మణికంఠ చందోలు

విశాఖ సిటీ: అతడు చదివింది మెకానికల్ ఇంజనీరింగ్. వృత్తి కార్ డ్రైవర్. ప్రవృత్తి.. మోసం, చోరీలు. బైక్ దొంగతనంతో ప్రారంభించి అనేక జిల్లాల్లో నేర సామ్రాజ్యాన్ని విస్తరించాడు. చివరిగా విశాఖ కేజీహెచ్‌లో నకిలీ డాక్టర్ అవతారమెత్తాడు. కిడ్నీ బాధితుడి తండ్రికి రూ.లక్ష టోకరా వేశాడు. పది నెలల క్రితం నమోదైన ఈ కేసులో నిందితుడు విజయవాడకు చెందిన ఇమ్మంది జ్యోతి శివశ్రీ (37)ని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇతడిపై 33 చీటింగ్, చోరీ కేసులు ఉన్నట్లు విశాఖ డీసీపీ-1 మణికంఠ చందోలు తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన వెల్లడించిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన దూసి రాంజీ కుమారుడు మోక్షిత్‌రాత్ (5) కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యులు కిడ్నీ మార్పిడి సూచించారు. ఆర్థిక పరిస్థితుల రీత్యా మీడియాను సంప్రదించగా పత్రికలో ఫోన్ నెంబర్‌తో ప్రచురించారు. దీంతో ఫిబ్రవరి 25న రాంజీకి ఫోన్ వచ్చింది. తాను డాక్టర్ నరసింహం అని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్నాడు. మోక్షిత్ మెడికల్ రిపోర్టులతో కేజీహెచ్‌కు రావాలని చెప్పాడు. రాంజీ వెళ్లగా... తన అసిస్టెంట్ వస్తున్నాడని వేచి ఉండాలని సూచించాడు. కొంతసేపటికి ఓ వ్యక్తి తెల్ల కోటులో రాంజీని కలిసి తనను పీజీ డాక్టర్ ప్రవీణ్‌గా చెప్పుకొన్నాడు. రూ.లక్ష ఇస్తే కిడ్నీ మార్పిడి చేస్తామని చెప్పి వెళ్లిపోయాడు. తిరిగి సాయంత్రం నరసింహం ఫోన్ చేసి వెంటనే రూ.లక్ష అడగ్గా రాంజీ అందజేశాడు. తర్వాత మోసపోయినట్లు గ్రహించి ఫిబ్రవరి 27న విశాఖ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలించారు. తాజాగా గురువారం విజయవాడ వెళ్లి ఇమ్మంది జ్యోతి శివశ్రీ(37)ని అరెస్టు చేశారు. పలు జిల్లాల్లో బైక్ చోరీలు, షాపుల్లో మొబైల్స్ కొనుగోలు పేరుతో చోరీలు, ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో క్యాష్ ఆన్ డెలివరీ పెట్టి రద్దీ ప్రాంతాల్లో వస్తువులు తీసుకొని పరారవడంపై మొత్తంగా 33 కేసులు ఉన్నట్లు గుర్తించారు. శివశ్రీని అరెస్టు చేసి రూ.30 వేలు నగదు, వైట్ అప్రాన్, స్టెతస్కోప్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు బాలికలపై టీడీపీ నాయకుడి లైంగికదాడి

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

యర్రగొండపాలెం (ప్రకాశం) : ఇద్దరు బాలికలపై టీడీపీ నాయకుడు లైంగికదాడి చేసిన ఘటన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి సమీప గ్రామంలో టీడీపీ నాయకుడు పిక్కిలి ఆంజనేయులు ఓ దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం తినుబండారాల కోసం 8, 9 సంవత్సరాల వయస్సున్న ఇద్దరు బాలికలు ఆ దుకాణం వద్దకు వెళ్లారు. అక్కడ కావాల్సిన వస్తువులన్నీ తీసుకోవచ్చని ఆంజనేయులు ఆ బాలికలను మభ్యపెట్టి వారితో అసభ్యకరంగా ప్రవర్తించి లైంగికదాడి చేశాడు. ఈ విషయం తెలియడంతో టీడీపీ మండల నాయకులు గురువారం రాజీకి ప్రయత్నించినట్లు తెలిసింది. అయితే బాలికల తల్లిదండ్రులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికలను పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలిస్తున్నట్లు సమాచారం. నిందితుడు ఎక్కడ ఉన్నాడన్న విషయం తెలియడం లేదు. అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో పోలీసులు ఈ విషయంపై నోరు మెదపడం లేదు.

నేటి నుంచి విశాఖలో సీఐటీయూ మహాసభలు

మాట్లాడుతున్న నరసింగరావు

డాబాగార్డెన్స్: సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు శనివారం నుంచి వచ్చే నెల 4 వరకు విశాఖలో నిర్వహించనున్నారు. ఏయూ ఎగ్జిబిషన్ గ్రౌండ్ వేదికగా నిర్వహించనున్న మహాసభలను శనివారం విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, సినీ నటుడు ప్రకాష్ రాజ్ ప్రారంభిస్తారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, శ్రామిక్ ఉత్సవ్ ఉపాధ్యక్షుడు కందరావు మురళీ, కన్వీనర్ కె.రమాప్రభ, ఉత్సవ్ ప్రతినిధులు కె.లక్ష్మయ్య, అనిల్, పి.త్రిమూర్తులు రెడ్డి, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎల్లాజీ తెలిపారు. 27న శ్రామిక్ ఉత్సవ్ నిర్వహించనున్నారు. ముగింపు రోజున రైల్వేస్టేషన్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

रजिस्ट्री सं. डी. एल. 33004/99 REGD. No. D. L.-33004/99

భారత రాజపత్రం
The Gazette of India

सी.जी.-डी.एल.-अ.-10122025-268380
CG-DL-E-10122025-268380

असाधारण
అసాధారణం
भाग II - खण्ड 3 - उप-खण्ड (ii)
భాగం-II, సెక్షన్ 3, సబ్- సెక్షన్ (ii)
प्राधिकार से प्रकाशित
అధికారం ద్వారా ప్రచురించడమైనది

सं. 5464] న్యూఢిల్లీ, సోమవారం, డిసెంబర్ 8, 2025/అగ్రహాయణం 17, 1947
No. 5464] NEW DELHI, MONDAY, DECEMBER 8, 2025/AGRAHAYANA 17, 1947

రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ

ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబర్ 8, 2025

SO. 5652(E) – జాతీయ రహదారుల చట్టం, 1956(48 ఆఫ్ 1956) (ఇక ముందు చట్టంగా వ్యవహరించెదరు) లోని సెక్షన్ 3ఎ సబ్ సెక్షన్ (1) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచు కేంద్ర ప్రభుత్వము వారు ప్రజా ప్రయోజనార్థము క్రింద తెలిపిన షెడ్యూల్లో సంక్షిప్తముగా వివరించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాలో కి.మీ. 0.000 నుండి కి.మీ. 189.900 వరకు అమరావతి రాజధాని నగర ఔటర్ రింగ్ రోడ్ కోసం భూమి నిర్మాణం (ఆరు లేన్లు మొదలైనవి) నిర్వాహణ మరియు కార్యకలాపాల కొరకు అవసరమై ఉందని భావించి తృప్తి చెందిన తర్వాత భూమిని సేకరించేందుకు ఉద్దేశించి ఈ ప్రకటన జారీ చేసినారు.

సదరు భూమి పై ఎవరైన వ్యక్తికి ప్రయోజనం ఉన్నట్లయితే అధికారిక గెజిట్లోని ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి ఇరవై ఒక్క రోజులలోగా సదరు చట్టములోని సెక్షన్ 3(సి) సబ్ సెక్షన్ (1) క్రింద పైన తెలిపిన ప్రయోజనార్థము సదరు భూమి వినియోగించుకొనుట పై వారి అభ్యంతరములను తెలియజేయవచ్చును.

అటువంటి ప్రతి అభ్యంతరములను అర్హత కల్గిన అధికారి మరియు జాయింట్ కలెక్టర్, కృష్ణాజిల్లా, వారికి వ్రాతపూర్వకముగా తగిన ఆధారాలను చూపుతూ అందజేయవలెను. సదరు అభ్యంతరములను వ్యక్తిగతంగా లేదా వారి న్యాయవాదుల ద్వారా వాదనలు వినుటకు తగు అవకాశం కల్పించి మరియు అన్ని అభ్యంతరములు విన్న తరువాత సంబంధిత అర్హత కల్గిన అధికారి మరియు జాయింట్ కలెక్టరు వారు, తదుపరి విచారణ అవసరమైనదని భావించినట్లైతే వాటిపై తదుపరి విచారణ జరిపించి సదరు అభ్యంతరములను స్వీకరించుట లేదా నిరాకరించుటకు క్షుణ్ణముగా యోచించి తగిన ఉత్తర్వులను జారీ చేయుదురు.

సదరు చట్టం లోని సెక్షన్ 3 సి లోని సబ్ సెక్షన్ (2) క్రింద సంబంధిత అధికారి జారీ చేసిన ఉత్తర్వులే తుది నిర్ణయము. సదరు భూమి యొక్క ప్లాన్లు మరియు భూమి యొక్క ఇతర వివరములు ఈ ప్రకటనలో లభ్యమగును మరియు ప్రయోజనము గల వ్యక్తి సంబంధిత అధికారి యొక్క పైన తెలిపిన కార్యాలయము వద్ద తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణాజిల్లాలో కి.మీ. 0.000 నుండి కి.మీ. 189.900 వరకు అమరావతి రాజధాని నగర ఔటర్ రింగ్ రోడ్ కోసం భూమి పరిధిలోకి వచ్చే నిర్మాణాలతో లేదా లేకుండా సేకరించాల్సిన భూమి యొక్క సంక్షిప్త వివరణ.

జిల్లా : కృష్ణా
https://egazette.gov.in/
Publication date 08.12.2025
https://egazette.gov.in/
https://morth.gov.in/

[ఫైల్ నెం. NHAI/PIU-Amaravati/11014/02/2025/Vol.1/3A1]
సం/- షేక్ అమీన్‌ఖాన్, డైరెక్టర్

పాక్ గుండెల్లో 'సిందూర్ 2.0' గుబులు

మరో దాడి జరిగితే తిప్పికొట్టడానికి చర్యలు

- నియంత్రణ రేఖ వద్ద భద్రత కట్టుదిట్టం
- పీఓకేలో మూడు సెక్టార్లలో యాంటీ-డ్రోన్ వ్యవస్థల మోహరింపు
- రావల్‌కోట్, కోట్లీ, భింబర్‌లో 30కిపైగా సీ-యూఏఎస్‌లు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు చావుదెబ్బ తగిలింది. పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి మరీ దాడి చేయడంతో పెద్ద సంఖ్యలో ముష్కరులు హతమయ్యారు. ఉగ్రవాద స్థావరాలు, శిక్షణా కేంద్రాలు నేలమట్టమయ్యాయి. పాక్ వైమానిక కేంద్రాలు, యుద్ధ విమానాలు సైతం ధ్వంసమయ్యాయి. ఆపరేషన్ సిందూర్‌తో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదని సాక్షాత్తూ పాకిస్తాన్ సైన్యమే చెబుతోంది. భారత సైన్యం సత్తా ఏమిటో పొరుగు దేశానికి తెలిసొచ్చింది. దాంతో ముందు జాగ్రత్త చర్యగా పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) సరిహద్దు అయిన నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. కీలక ప్రాంతాల్లో కౌంటర్-డ్రోన్ వ్యవస్థలను మోహరించింది.

సఫ్రా యాంటీ-యూఏవీ జామింగ్ గన్

మరో కవ్వింపు చర్యలకు పాల్పడితే సిందూర్ మళ్లీ ప్రారంభమవుతుందని భారత ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరించింది. అందుకే ఆపరేషన్ సిందూర్ 2.0 భయం పాకిస్తాన్‌ను వెంటాడుతోంది. భారత సైన్యం దాడులకు దిగితే తిప్పికొట్టడానికి పీఓకేలోని మూడు సెక్టార్లలో కౌంటర్-అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్(సీ-యూఏఎస్)ను పాక్ సిద్ధం చేసినట్లు భారత నిఘా వర్గాలు తాజాగా గుర్తించాయి. రావల్‌కోట్, కోట్లీ, భింబర్ సెక్టార్లలో వీటిని నెలకొల్పినట్లు పేర్కొన్నాయి. ఎల్‌ఓసీ వద్ద 30కిపైగా యాంటీ-డ్రోన్ యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. గగనతల నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు ఎలక్ట్రానిక్ యుద్ధ సామర్థ్యాలు పెంచుకోవడం పాక్ వ్యూహంగా కనిపిస్తోంది.

శత్రు డ్రోన్లపై నజర్

భారత్‌లోని పూంచ్ సెక్టార్‌కు ఎదురుగా ఉన్న రావల్‌కోట్‌లో యాంటీ-డ్రోన్ల వ్యవస్థలను రెండో ఆజాద్ కశ్మీర్ బ్రిగేడ్ నిర్వహిస్తోంది. రాజౌరీ, నౌషెరా, సుందర్బనీ సెక్టార్లకు ఎదురుగా ఉండే కోట్లీలో వీటి నిర్వహణ బాధ్యతను మూడో ఆజాద్ కశ్మీరీ బ్రిగేడ్‌కు, భింబర్‌లో నిర్వహణను ఏడో ఆజాద్ కశ్మీరీ బ్రిగేడ్‌కు అప్పగించినట్లు తెలిసింది. ఎల్‌ఓసీ వెంట ఎలక్ట్రానిక్, కైనెటిక్ కౌంటర్-యూఏఎస్‌లను పాక్ రంగంలోకి దించినట్లు సమాచారం. ఇందులో కీలకమైన స్పైడర్ వ్యవస్థ కూడా ఉంది. ఇది పది కిలోమీటర్ల దూరంలోని శత్రు డ్రోన్లను కూడా సరిగ్గా గుర్తించగలదు. అంతేకాకుండా పాక్ అమ్ముల పొదిలో సఫ్రా యాంటీ-యూఏవీ జామింగ్ గన్ కూడా ఉంది. దీనిని మనుషులు ఆపరేట్ చేస్తుంటారు. 1.5 కిలోమీటర్ల దూరంలోని డ్రోన్లను కూల్చివేయొచ్చు. తక్కువ ఎత్తులో ఎగిరే శత్రు డ్రోన్లను కూల్చడానికి సంప్రదాయ గగనతల రక్షణ ఆయుధాలను కూడా పాక్ ఉపయోగిస్తోంది. జీడీఎఫ్ 35 ఎంఎం ట్విన్ బ్యారెల్ యాంటీ- ఎయిర్‌క్రాఫ్ట్ గన్స్, అజ్నా ఎంకే-2, ఎంకే-3 మ్యాన్-పోర్టబుల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు పాక్ వద్ద ఉన్నాయి. తక్కువ ఎత్తులో తక్కువ వేగంతో దూసుకొచ్చే డ్రోన్లను వీటితో కూల్చవచ్చు.

యాంటీ డ్రోన్ వ్యవస్థ స్పైడర్

తుర్కియే, చైనాలతో పాక్ చర్చలు

ఇటీవలి కాలంలో పశ్చిమ సరిహద్దుల్లో భారత సైన్యం కదలికలు ముమ్మరమయ్యాయి. సైన్యం, నావికాదళం, వైమానిక దళం తరచుగా విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. గగనతల రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు పాక్ సరిహద్దుల్లో అధునాతన డ్రోన్లను మోహరిస్తున్నారు. ఈ పరిణామాలతో పాక్ అప్రమత్తమైనట్లు భారత నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు నూతన డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కోసం తుర్కియే, చైనాలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కౌంటర్-డ్రోన్ సామర్థ్యాల విషయంలో పాక్ సైన్యం చాలా బలహీనంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ విషయం నిరూపితమైంది. అందుకే డ్రోన్లతో జరిగే దాడిని తట్టుకోవడంపై పాక్ ప్రధానంగా దృష్టి పెట్టినట్లు భారత నిఘా వర్గాలు కనిపెట్టాయి.

ఆదివారం ట్రంప్‌తో భేటీ: జెలెన్‌స్కీ

భద్రతా హామీలపై చర్చ

కీవ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఆదివారం ఫ్లోరిడాలో సమావేశమయ్యే అవకాశముందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శుక్రవారం తెలిపారు. 'మేం ఒక్క రోజు కూడా వృథాగా పోనివ్వడం లేదు. అధ్యక్షుడు ట్రంప్‌తో అతి త్వరలోనే ఉన్నత స్థాయి సమావేశం జరిపేందుకు సిద్ధంగా ఉన్నాం. నూతన సంవత్సరం ప్రవేశించే లోగానే కీలక పరిణామాలు సంభవించొచ్చు'అని ఆయన మీడియాకు తెలిపారు. ట్రంప్ ప్రతిపాదిత 20-సూత్రాల ప్రణాళికలో 90 శాతం మేర ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. ఆదివారం జరిగే సమావేశం సందర్భంగా ఉక్రెయిన్‌కు అమెరికా ఇచ్చే భద్రతా హామీలపై చర్చించనున్నామన్నారు. జెలెన్‌స్కీ వ్యాఖ్యలతో చర్చలు పురోగతిలో ఉన్నట్లు భావించవచ్చని పరిశీలకులు అంటున్నారు. అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నేర్‌తో ఫలవంతమైన చర్చలు జరిగినట్లు జెలెన్‌స్కీ అంతకుముందు గురువారం ప్రకటించారు. పారిశ్రామికంగా కీలకమైన తూర్పు ప్రాంతం తమ బలగాలను ఉపసంహరించుకునేందుకు సిద్ధమని జెలెన్‌స్కీ తెలిపారు. అయితే, రష్యా కూడా ఆ ప్రాంతం నుంచి బలగాలను ఉపసంహరించుకుని, నిస్సైనిక ప్రాంతంగా ప్రకటించేందుకు సిద్ధం కావాలన్నారు.

వీరు దేశానికి గర్వకారణం

- ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము
- ఈ పురస్కారాలు దేశవ్యాప్తంగా చిన్నారులందరికీ స్ఫూర్తినిస్తాయని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలు స్వీకరించిన చిన్నారులు వారి కుటుంబాలకు, మొత్తం దేశానికి గర్వకారణంగా నిలిచారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రశంసించారు. విజేతలకు అభినందనలు తెలియజేశారు. ఈ పురస్కారాలు దేశవ్యాప్తంగా బాలబాలికలందరికీ స్ఫూర్తినిస్తాయని చెప్పారు. రాష్ట్రపతి శుక్రవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 'వీర్ బాల్ దివస్'కార్యక్రమంలో పాల్గొన్నారు. సాహస బాలలతోపాటు సామాజిక, సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీలో అసమాన ఘనతలు సాధించిన 20 మంది చిన్నారులకు 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీర్ బాల్ దివస్ ప్రాముఖ్యతను వివరించారు. 320 ఏళ్ల క్రితం గురు గోవింద్ సింగ్ నలుగురు కుమారులు సత్యం, న్యాయం కోసం పోరాడుతూ ప్రాణత్యాగాలు చేశారని చెప్పారు. చిన్న కుమారులైన బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగ్‌లు ప్రదర్శించిన ధైర్య సాహసాలు దేశ విదేశాల్లో గౌరవాన్ని అందుకుంటున్నాయని తెలిపారు. చిన్నారుల్లోని దేశ భక్తి, ఉన్నత విలువలను బట్టి ఒక దేశం గొప్పతనాన్ని గుర్తించవచ్చని పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో సైనికులకు టీ, పాలు, నీళ్లు అందజేసిన పంజాబ్ బాలుడు శ్రవణ్‌సింగ్‌కు పురస్కారం అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

ఇద్దరు తెలుగు బాలలకు పురస్కారాలు

ఈ ఏడాది ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను 18 మంది పిల్లలకు, మరణానంతరం మరో ఇద్దరి తరఫున వారి తల్లిదండ్రులకు రాష్ట్రపతి ముర్ము అందజేశారు. పురస్కారాల గ్రహీతల్లో ఇద్దరు తెలుగు బాలలు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పడకంటి విశ్వనాథ్ కార్తికేయ క్రీడా విభాగంలో పురస్కారం అందుకున్నారు. కార్తికేయ పర్వతారోహకుడు. 2025లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి సెవెన్ సమ్మిట్ చాలెంజ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అతిపిన్న వయస్కుడిగా ఘనత సాధించాడు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లాకు చెందిన 17 ఏళ్ల పారా అథ్లెట్ శివానీ హోసూరు ఉప్పర సైతం క్రీడా విభాగంలో పురస్కారం అందుకున్నారు. ఈమె షాట్‌పుట్, జావలిన్ త్రోలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎన్నో అవార్డులు సాధించారు. పురస్కార గ్రహీతలకు మెడల్, సర్టిఫికెట్‌తోపాటు రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని రాష్ట్రపతి అందజేశారు.

బాల్ పురస్కార్ గ్రహీతలతో ప్రధాని మోదీ

పురస్కార గ్రహీతలతో ప్రధాని మోదీ భేటీ

బాల పురస్కారాలు అందుకున్న చిన్నారులతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. భారత్ మండపంలో నిర్వహించిన వీర్ బాల్ దివస్ కార్యక్రమంలో భాగంగా వారితో ముచ్చటించారు. చిన్న వయసులోనే ఇతరులకు స్ఫూర్తినిచ్చే విజయాలు సాధించారని ప్రశంసించారు. ఈ విజయాలు ఆరంభం మాత్రమేనని, ఇంకా సుదూర ప్రయాణం చేయాల్సి ఉందని చెప్పారు. ఈ తరంలో జన్మించడం ఈ చిన్నారుల అదృష్టమని, వారి ప్రతిభకు దేశమంతా మద్దతుగా నిలుస్తోందని తెలిపారు. ప్రతిభావంతులైన బాలలను మరింత ముందుకు నడిపించేందుకు ఎన్నో వేదికలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, తాత్కాలిక ప్రజాదరణ, గ్లామర్‌కు ఆకర్షితులు కాకుండా లక్ష్యంపై దృష్టి కేంద్రీకరించాలని చిన్నారులకు ప్రధాని మోదీ సూచించారు.

సిక్కుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- వారి ప్రాణత్యాగం దేశ ధైర్యసాహసాలు, వీరత్వం, శౌర్యానికి ప్రతీక
- 2035 నాటికి వలసవాద మనస్తత్వం పూర్తిగా వదిలించుకోవాలి
- 'వికసిత్ భారత్' లక్ష్య సాధన బాధ్యత యువతపై ఉంది
- 'వీర్ బాల్ దివస్'లో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ: సిక్కుల పదో మత గురువు గురు గోవింద్ సింగ్ వారసులు బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగ్ దేశం కోసం మహోన్నత త్యాగం చేశారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆనాటి మొగల్ పాలకుల క్రూరత్వం, మతోన్మాదం, ఉగ్ర భావజాలానికి వ్యతిరేకంగా వారు చేసిన ప్రాణత్యాగం భారతదేశ అసమాన ధైర్యసాహసాలు, వీరత్వం, శౌర్యానికి అత్యున్నత ప్రతీక అని ఉద్ఘాటించారు. గురు గోవింద్ సింగ్ వారసుల త్యాగాన్ని స్మరిస్తూ శుక్రవారం నిర్వహించిన 'వీర్ బాల్ దివస్'లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. పీడనకు వ్యతిరేకంగా ఇద్దరు యువరాజులు సాగించిన పోరాటాన్ని దేశం ఎప్పటికీ స్మరించుకుంటుందని అన్నారు. వారు మనకు గర్వకారణమని చెప్పారు. వయసు, ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా పోరాడుతూ దేశం కోసం ప్రాణాలు వదిలారని పేర్కొన్నారు. చిన్న వయసులోనే మొగల్ పాలకులకు ఎదురొడ్డి నిలిచారని తెలిపారు. బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగ్‌లను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగితే సాధించలేనిది ఏమీ ఉండదని యువతకు ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

నిజాలను అణచివేశారు

''సిక్కు యువరాజుల త్యాగాల గురించి దేశంలో ప్రతి ఒక్కరికీ తెలిసి ఉండాలి. దురదృష్టవశాత్తూ ఆ పరిస్థితి కనిపించడం లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా వలసవాద ఆలోచనావిధానం కొనసాగుతుండడం విచారకరం. వలసవాద మనస్తత్వానికి బ్రిటిష్ రాజకీయ నాయకుడు మెకాలే ఆద్యుడు. ఇప్పటికీ దాన్ని వదిలించుకోలేకపోతున్నాం. దశాబ్దాలపాటు నిజాలను అణచివేశారు. బ్రిటిష్‌కాలంనాటి ఆలోచనా విధానం నుంచి విముక్తి పొందాలన్నదే మన అసలైన సంకల్పం. భారతీయుల ధైర్య సాహసాలు, త్యాగాలు ఇకపై అణచివేతకు గురికా కూడదు. వారి గురించి అందరూ తెలుసుకోవాలి. వాస్తవాలను గ్రహించాలి. మెకాలే కుట్రకు 2035 నాటికి 200 ఏళ్లు పూర్తవుతాయి. మరో పదేళ్లలో వలసవాద మనస్తత్వం నుంచి పూర్తిగా విముక్తి చెందాలి. అదే మన లక్ష్యం. అప్పుడు మనం స్వదేశీ సంప్రదాయాలు, సంస్కృతులను గర్వకారణంగా భావిస్తాం. 'స్వయం సమృద్ధి'మార్గంలో ముందుకు పయనిస్తాం'' అని మోదీ అన్నారు.

భాషల వైవిధ్యమే మన బలం

జెన్ జెడ్ (1997 నుంచి 2021 మధ్య జన్మించినవారు), జెన్ అల్ఫా(2010 నుంచి 2025 మధ్య జన్మించినవారు) భుజస్కందాలపై పెద్ద బాధ్యత ఉంది. 'వికసిత్ భారత్' అనే లక్ష్య సాధన దిశగా దేశాన్ని ముందుకు నడిపించాలి. వారి నైపుణ్యాన్ని, విశ్వాసాన్ని అర్థం చేసుకున్నా. వారిపై నాకు సంపూర్ణంగా నమ్మకంగా ఉంది. వలసవాద మనస్తత్వాన్ని వదిలించుకుంటే మన భాషల వైవిధ్యమే మనకు బలంగా మారుతుంది. ఇటీవల ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో 160 మంది ఎంపీలు వారి మాతృభాషలో ప్రసంగించారు. తమిళం, మరాఠీ, బంగ్లా వంటి భాషల్లో ప్రసంగాలు సాగాయి. వేర్వేరు కీలక రంగాల్లో అద్భుతమైన ప్రతిభా పాటవాలు ప్రదర్శించినవారికి ప్రతిఏటా ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలు అందజేస్తున్నాం, ఈ ఏడాది 20 మందికి ప్రదానం చేశాం''అని ప్రధానమంత్రి మోదీ చెప్పారు.

బంగ్లాదేశ్‌లో పరిస్థితులపై భారత్ తీవ్ర ఆందోళన

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులకు అడ్డుకట్ట పడకపోవడంపై భారత్ తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. మైమన్‌సింగ్ ప్రాంతంలో గతవారం హిందూ యువకుడిని మూక దాడిలో చంపేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. దాదాపు 17 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నేత తారిఖ్ రెహ్మాన్ తిరిగి స్వదేశానికి చేరుకోవడంపై ఆచితూచి స్పందించింది. ఆ దేశంలో స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా పార్లమెంట్ ఎన్నికలు జరగాలని భారత్ చేస్తున్న ప్రయత్నాల కోణంలోనే దీనిని చూడాలని పేర్కొంది. బంగ్లా విముక్తి పోరాటం దగ్గర్నుంచి ఆ దేశంతో సన్నిహిత, స్నేహ సంబంధాలనే భారత్ కోరుకుంటోందని చెప్పింది. ఫ్యాక్టరీ కార్మికుడు దీపు చంద్ర దాస్‌ను చంపేసిన వారిని కఠినంగా శిక్షించాలని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులతోపాటు క్రైస్తవులు, బౌద్ధులపైనా అతివాదులు పాల్పడుతున్న దాడులు ఆగకపోవడం తీవ్ర ఆందోళన కరమైన అంశమన్నారు. మధ్యంతర ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా మైనారిటీల హత్యలు, భూ ఆక్రమణలు, దాడులకు సంబంధించిన ఘటనలు 2,900కు పైగా నమోదయ్యాయన్నారు. వీటిని మీడియా చేస్తున్న అతి ప్రచారంగానో లేదా రాజకీయ హింసగానో చూడరాదని జైశ్వాల్ తెలిపారు.

'హెచ్-1బీ' కష్టాలపై అమెరికాతో చర్చిస్తాం

- సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం
- భారత విదేశాంగ శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసా ఇంటర్వ్యూలు హఠాత్తుగా వాయిదా పడడం, తద్వారా అమెరికా ప్రయాణాలు ఆగిపోవడం పట్ల భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తంచేసింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెలలో జరగాల్సిన ఇంటర్వ్యూలు నాలుగైదు నెలలపాటు వాయిదా పడ్డాయి. వేలాది మంది భారతీయులు ఇబ్బందులకు గురవుతున్నారు. వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను, వారు చేసిన పోస్టులను నిశితంగా పరిశీలించడానికి వీలుగా ఇంటర్వ్యూలను వాయిదా వేస్తూ అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత వారం జరగాల్సిన ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది మే నెల దాకా వాయిదా వేస్తున్నట్లు దరఖాస్తుదారులకు అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారుల నుంచి ఈ-మెయిల్ సందేశాలు రావడం గమనార్హం. దాంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం స్పందించారు. దరఖాస్తుదారుల కష్టాలను అమెరికా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా సంప్రదింపులు జరుపుతామని వివరించారు. వీసా దరఖాస్తుదారుల నుంచి పెద్ద సంఖ్యలో వినతులు అందుతున్నాయని తెలిపారు. ఇంటర్వ్యూల విషయంలో ఆలస్యాన్ని భారీగా తగ్గించాలన్నదే తమ ప్రయత్నమని వెల్లడించారు. ఇబ్బందులకు త్వరలోనే తెరపడుతుందని రణధీర్ జైస్వాల్ ఆశాభావం వ్యక్తంచేశారు.

విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

అమెరికాలో తాత్కాలికంగా ఉద్యోగాలు చేసుకోవడానికి హెచ్-1బీ వీసాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. మొదట మూడేళ్ల కాలానికి ఈ వీసా జారీ చేస్తారు. తర్వాత మరో మూడేళ్లు పొడిగిస్తారు. హెచ్-1బీ వీసాలు స్వీకరించినవారిలో దాదాపు 70 శాతం మంది భారతీయులే ఉంటున్నారు. హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజును లక్ష డాలర్లకు పెంచేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల సంబంధిత ఉత్తర్వుపై సంతకం చేశారు. రాబోయే రోజుల్లో ఈ వీసాలు పొందడం కష్టతరంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

ఉగ్రదాడులను ఎదుర్కొనేందుకు ఏటీఎస్.. యాంటీ టెర్రర్ గ్రిడ్

ఏకీకృత వ్యవస్థ అవసరముందన్న హోం మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ: దేశంలోని పోలీసు వ్యవస్థ కోసం ఏటీఎస్(అప్లికెంట్ ట్రాకింగ్ సిస్టమ్)ను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. అదేవిధంగా, యాంటీ టెర్రర్ గ్రిడ్‌ను కూడా అందుబాటులోకి తేవడం ద్వారా ఉగ్రదాడులను ప్రతి స్థాయిలోనూ ఉమ్మడిగా వేగంగా, సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలవుతుందని చెప్పారు. 'వ్యవస్థీకృత నేరాలపై 360- డిగ్రీల దాడి'అనే కొత్త పథకాన్ని త్వరలో ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. జీరో టెర్రర్ పాలసీకి ఇది అత్యంత కీలకంగ మారనుందని ఆయన వివరించారు. దేశ రాజధానిలో శుక్రవారం మొదలైన రెండు రోజుల యాంటీ టెర్రరిజమ్ కాన్ఫరెన్స్-2025లో మంత్రి అమిత్ షా ప్రసంగించారు. 'బలవంతంగా డబ్బు వసూలు చేయడమనే ఏకైక లక్ష్యంతో వ్యవస్థీకృత నేరగాళ్ల ముఠాలు ఏర్పడుతాయి. వాటి నేతలు విదేశాలకు పారిపోయి, అక్కడే స్థిరపడిపోయాక.. ఇక్కడుండే నెట్‌వర్క్ ఉగ్ర గ్రూపుల ఆధీనంలోకి వెళ్లిపోతున్నాయి. అటు తర్వాత, ఆ నెట్‌వర్క్ ఉగ్రవాదం వేళ్లూనుకునేందుకు దోహదపడుతోంది'అని అమిత్ షా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఆర్గనైజ్డ్ క్రైం నెట్‌వర్క్ డేటాబేస్, వెపన్స్ డేటా బేస్ ఫర్ లాస్ట్, లూటెడ్ అండ్ రికవరీ ఆర్మ్స్‌కు సంబంధించిన రెండు డేటాబేస్‌లను ఆయన ప్రారంభించారు. జాతీయ దర్యాప్తు విభాగం(ఎన్ఐఏ) రూపొందించిన ఈ డేటాబేస్‌లను దేశవ్యాప్తంగా ఉన్న భద్రతా విభాగాలు ఉపయోగించుకునేందుకు వీలుందన్నారు. వీటితోపాటు ఉగ్రవాదులు, నేరగాళ్లకు సంబంధించిన డేటాబేస్‌లను కూడా రూపొందించాలని సూచించారు.

అది 'పండోర బాక్స్' తెరిచినట్టే!

ఎయిర్ ప్యూరిఫయర్లపై జీఎస్టీ తగ్గింపునకు కేంద్రం 'నో'

- కాలుష్యంతో జనం చస్తుంటే పట్టింపు లేదా?: హైకోర్టు ప్రశ్న
- జనవరి 9కి తదుపరి విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో, ఎయిర్ ప్యూరిఫయర్లపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తగ్గించాలన్న డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టులో కీలక వ్యాఖ్యలు చేసింది. నిబంధనలను పక్కనపెట్టి, కోర్టు ఆదేశాల మేరకు జీఎస్టీని తగ్గిస్తే అది 'పండోర బాక్స్'తెరిచినట్లవుతుందని, దీనివల్ల భవిష్యత్తులో అనేక క్లిష్ట సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఎయిర్ ప్యూరిఫయర్లను 'వైద్య పరికరాల'జాబితాలో చేర్చాలని, ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై శుక్రవారం ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది.

సమాఖ్య వ్యవస్థకు ముప్పు: కేంద్రం

కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకటరామన్ వాదనలు వినిపించారు. జీఎస్టీ కౌన్సిల్ అనేది రాజ్యాంగబద్ధమైన సంస్థ అని గుర్తు చేశారు. పన్ను రేట్ల తగ్గింపు అనేది కేంద్రం, రాష్ట్రాల చర్చల ద్వారా, ఓటింగ్ ద్వారా నిర్ణయించాల్సిన అంశమని స్పష్టం చేశారు. 'ఇప్పుడు కోర్టు ఆదేశాలతో పన్నులు తగ్గిస్తే.. రేపు ప్రతి ఒక్కరూ పిటిషన్లు వేసి పన్నులు తగ్గించమని అడుగుతారు. ఇది ఒక పండోర బాక్స్ తెరిచినట్లవుతుంది. పార్లమెంటరీ కమిటీ సిఫార్సులు ఉన్నాయి, వాటిని పరిశీలిస్తున్నాం. కానీ పద్ధతి ప్రకారం వెళ్లాలి'అని కోర్టుకు నివేదించారు. అసలు ఈ పిటిషన్ వెనుక ఎవరున్నారో ఆరా తీయాల్సి ఉందని, ఇది ప్రజా ప్రయోజన వ్యాజ్యం కాకపోవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

సామాన్యుడు ఎలా కొంటాడు?: హైకోర్టు ఆగ్రహం

జస్టిస్ వికాస్ మహాజన్, జస్టిస్ వినోద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. ఢిల్లీలో పరిస్థితి దారుణంగా ఉందన్న విషయం అందరికీ తెలిసిందేనని వ్యాఖ్యానించింది. 'ఒక ఎయిర్ ప్యూరిఫయర్ ధర రూ.10 వేల నుంచి రూ.15 వేలు వరకు ఉంది. సామాన్యుడు దీన్ని ఎలా కొనగలడు? జీఎస్టీని తగ్గించి సామాన్యుడికి అందుబాటులోకి తేవచ్చు కదా?' అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రజారోగ్యం దృష్ట్యా ఈ విషయాన్ని అత్యవసరంగా జీఎస్టీ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాలని గతంలోనే చెప్పామని గుర్తు చేసింది. దీనిపై సమగ్ర సమాధానం ఇచ్చేందుకు (కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు) కేంద్రం గడువు కోరడంతో, కోర్టు 10 రోజుల సమయం ఇచ్చింది. తదుపరి విచారణను జనవరి 9, 2026కి వాయిదా వేసింది. సెలవుల తర్వాత వెంటనే ఈ అంశాన్ని జీఎస్టీ కౌన్సిల్ ఎప్పుడు చర్చించగలదో తెలపాలని ఆదేశించింది.

విలాసం కాదు.. అవసరం: పిటిషనర్

పిటిషనర్ కపిల్ మదన్ వాదిస్తూ.. ఢిల్లీలో కాలుష్యం ఎమర్జెన్సీ స్థాయికి చేరిందన్నారు. ఎయిర్ ప్యూరిఫయర్ ఇప్పుడు లగ్జరీ కాదని, ప్రాణాలను కాపాడే వైద్య పరికరమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తోందని, దీనివల్ల నగర ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్యూరిఫయర్లను తప్పుడు కేటగిరీలో ఉంచి పన్ను వసూలు చేస్తున్నారని వాదించారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల:ప్రకాశం బ్యారేజీ నుంచి శుక్రవారం పశ్చిమ డెల్టాకు 2,120 క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటిమట్టం స్థిరంగా ఉంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు రావడం లేదు. దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు ప్రస్తుత నిల్వ 41.5360 టీఎంసీలు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన బొర్రా వెంకటేశ్వరరావు కుటుంబం రూ.లక్ష విరాళాన్ని అందజేసింది.

న్యూస్‌రీల్

మిస్ టీన్ ఆంధ్రప్రదేశ్‌గా పొన్నెకల్లు యువతి

తాడికొండ: రాజస్థాన్‌లో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ఫరెవర్ స్టార్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫేవరెట్ మిస్ టీన్ ఇండియా గ్రాండ్ ఫినాలే పోటీల్లో మిస్ టీన్ ఆంధ్రప్రదేశ్‌గా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన పరిటాల దివ్య ఎంపికైంది. మిస్ టీన్ ఇండియా ఎంపిక పోటీల ప్రక్రియ ఏడాది క్రితమే మొదలై ఆన్‌లైన్‌లో అండర్–18 విభాగంలో ఎంపిక కోసం కమిటీ దరఖాస్తులు ఆహ్వానించగా, దేశవ్యాప్తంగా 10 వేల మంది చేసుకున్నారు. వీరిలో అత్యంత ప్రతిభావంతులైన వారికి ఆడిషన్లు, గ్రూమింగ్, మూల్యాంకనాలు.. ఇలా వివిధ దశల్లో వడపోత అనంతరం 101 మందికి రాజస్థాన్‌లోని జైపూర్‌లో జాతీయస్థాయి వేదికపై పోటీలు నిర్వహించారు. వివిధ అంశాలో ప్రతిభ ప్రదర్శించిన పరిటాల దివ్య టైటిల్ హోల్డర్‌గా నిలిచి ఫేవరెట్ మిస్ టీన్ ఆంధ్రప్రదేశ్‌గా ఎన్నికయ్యారు. ఆమెకు కిరీటంతో పాటు గుర్తింపు పతకం ఇచ్చి అభినందించారు.

గణనీయంగా పెరిగిన మల్లేశ్వరస్వామి ఆదాయం

పెదకాకాని: శివాలయంలో మల్లేశ్వరస్వామి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకానిలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం హుండీలు తెరిచి, కానుకలు లెక్కించారు. పర్యవేక్షణాధికారిగా లాలాపేట గ్రూపు దేవస్థానాల సహాయ కమిషనర్ పెళ్లూరి సుభద్ర హాజరయ్యారు. ఆలయ హుండీల ద్వారా 71 రోజులకు 64,18,291 రూపాయల ఆదాయం లభించినట్లు లీలాకుమార్ తెలిపారు. అన్నప్రసాద వితరణ హాల్‌లోని హుండీ ద్వారా 7,80,953 రూపాయలు సమకూరిందన్నారు. బంగారం 0.043 గ్రాముల 190 మిల్లీగ్రాములు, వెండి 364.200 గ్రాములు వచ్చిందన్నారు. మూడు అమెరికన్ డాలర్లు ఉన్నట్టు తెలిపారు.

మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనమే 'సారస్'

గుంటూరు వెస్ట్: సారస్–మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనంగా నిర్వహించడం జరుగుతుందని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సారస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్‌ఆర్టిస్ట్స్ సొసైటీ) ప్రదర్శనశాల ఏర్పాట్లపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలసి సమీక్ష నిర్వహించారు. పెమ్మసాని మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి 600 మందికి పైగా చేనేత, హస్త కళాకారులు, సాంస్కృతిక కళాకారులు వస్తున్నారన్నారు. 250కి పైగా ప్రదర్శన శాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ముఖేష్‌కు రజతం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఢిల్లీలో జరుగుతున్న 68వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో శుక్రవారం గుంటూరుకు చెందిన నేలపల్లి ముఖేష్ రజత పతకం సాధించాడని నేలపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25మీటర్ల రాపిడ్ ఫైర్ జూనియర్ విభాగంలో ముఖేష్ రజత పతకం గెలుపొందాడన్నారు. సీనియర్ జూనియర్ విభాగాల్లో పోటీపడిన ముఖేష్ రిలేలో 600కు గాను 579 పాయింట్లు సాధించి సీనియర్లలో నాలుగో స్థానం జూనియర్లలో ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో జరగనున్న ఏషియన్ షూటింగ్ చాంపియన్ షిప్ జూనియర్ విభాగంలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత,టీం,మిక్స్‌డ్, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్, స్టాండర్డ్ పిస్టల్, రాపిడ్ ఫైర్ పిస్టల్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించనున్నాడన్నారు. ముఖేష్‌ను ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు సలలిత్ తదితరులు అభినందించారు.

పత్తి రైతుపై కత్తి

- పత్తి నాణ్యతగా లేదంటూ బయ్యర్ల తిరస్కారం
- రోడ్డుపై బైఠాయించి రైతుల నిరసన
- సీసీఐ, బయ్యర్ల తీరుపై తీవ్ర ఆగ్రహం, అనుమానాలు
- పోలీసుల రంగప్రవేశం
- చివరకు కొనుగోలుకు అనుమతి

నిబంధనల పేరుతో సీసీఐ బంధనాలు

ప్రత్తిపాడులో సీసీఐ కేంద్రం ఎదుట పాత మద్రాసు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న పత్తి రైతులు

ప్రత్తిపాడు: సీసీఐ సిత్రాలు రోజురోజుకూ పత్తి రైతులకు ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి. తొలుత నిబంధనలకు అనుగుణంగా నాణ్యత లేదంటూ తిరస్కరించిన పత్తిని, గంటల వ్యవధిలోనే రైతుల రాస్తారోకో అనంతరం అనుమతించి, అన్‌లోడ్ చేయించడంలో మతలబు ఏమిటో అర్థం కాని పరిస్థితి చోటుచేసుకుంది. సీసీఐ సిబ్బంది నిబంధనల వంకతో కావాలనే రైతులను ఇబ్బంది పెడుతున్నారా? లేక బ్రోకర్ల కోసం నిబంధనాల మెలిక పెడుతున్నారా? అనే సందేహాలు బయ్యర్లు వ్యవహరిస్తున్న తీరుతో వ్యక్తమవుతున్నాయి.

బయ్యర్ తీరుపై రైతుల ఆగ్రహం

ప్రత్తిపాడులోని సహజానంద కాటన్ మిల్లులోని సీసీఐ కేంద్రానికి శుక్రవారం ఉదయం అమరావతి ప్రాంతానికి చెందిన రైతులు ఇరవై మంది పత్తిని విక్రయించేందుకు ఆటోలు, మినీ లారీలు, ట్రాక్టర్లలో తెచ్చారు. ఉదయం అసిస్టెంట్ బయ్యర్ నవీన్ పత్తిలో కాయ తగులుతుందన్న కారణాన్ని చూపి కొనుగోలు చేయకుండా తిరస్కరించారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ, అసిస్టెంట్ బయ్యర్ తీరుపై మండిపడ్డారు. దీంతో వారు బయ్యర్ భరత్‌కు సమాచారం అందించడంతో మధ్యాహ్నం తరువాత ఆయన ప్రత్తిపాడుకు వచ్చారు. వాహనాల్లో ఉన్న పత్తిని పరిశీలించి రైతులతో మాట్లాడారు. నిబంధనలను వివరించాడు. ఆ తరువాత ఆయన కూడా తిరస్కరించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతుల రాస్తారోకో

బయ్యర్ తిరస్కరించడంతో పాలుపోని పత్తి రైతులు సీసీఐ కేంద్రం ఎదుట ప్రత్తిపాడు–పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎక్కడెక్కడి నుంచి ఇక్కడికి పత్తిని తీసుకుని వస్తున్నామని, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉంచి ఇప్పుడు వెనక్కి పంపితే ఆటో బాడుగలు, ఎత్తుడు, దించుడు కూలీ ఖర్చులు, రవాణా ఖర్చులు ఎవరు భరిస్తారంటూ మండిపడ్డారు. ప్రభుత్వం కూడా కొనుగోలు చేయకుంటే తమ పరిస్థితి ఏమిటంటూ నిలదీస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో రోడ్డుకిరువైపులా పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ కె. నరహరి రైతులతో మాట్లాడారు. కొనుగోలు చేసేలా చూస్తానని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. అనంతరం ఆయన అసిస్టెంట్ బయ్యర్ నవీన్‌తో మాట్లాడారు.

రైతులను సముదాయిస్తున్న ఎస్‌ఐ నరహరి

ఎట్టకేలకు అన్‌లోడింగ్

వాహనాల నుంచి పత్తి అన్‌లోడింగ్

దీంతో అసిస్టెంట్ బయ్యర్, బయ్యర్ తిరస్కరించిన పత్తిని సాయంత్రం ఏడు గంటల సమయంలో అనుమతించి సీసీఐలోకి అనుమతించారు. సుమారు పదిహేనుకు పైగా వాహనాల్లో మూడు వందల టన్నులకు పైగా పత్తిని ఒకేసారి అన్‌లోడ్ చేయించారు. దీంతో రైతులు ఇదెక్కడి చోద్యమంటూ అసహనం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి నాణ్యత వంకతో నానా ఇబ్బందులు పెట్టి, ఇప్పుడు ఉన్నట్లుండి పత్తిని కొనుగోలు చేయడంలో ఉన్న ఆంతర్యం .. మతలబు ఏమిటో అర్థం కాక సీసీఐ, బయ్యర్ల తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి రంగా

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అంబటి

గుంటూరు రూరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాటాలు చేసిన మహనీయుడు వంగవీటి మోహన రంగా అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. వంగవీటి మోహన్‌రంగా 37వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని చిల్లీస్ సెంటర్ వద్దనున్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబటి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, కార్మికుల కోసం ప్రాణాల్ని సైతం అర్పించిన మహా నాయకుడు రంగా అని కొనియాడారు. తెలుగుదేశం ప్రభంజనం వీచిన రోజుల్లో కూడా విజయవాడలో ఘన విజయం సాధించిన వ్యక్తి రంగా అని గుర్తు చేశారు. పేదవాడి కోసం తన ఆఖరి శ్వాస వరకు పోరాటం చేసిన యోధుడు రంగా అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, రాష్ట్ర కుమ్మరి శాలివాహన విభాగ అధ్యక్షులు మండేపూడి పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షులు మామిడి రాము, వడ్డానం శివ, పార్టీ నాయకులు బత్తుల దేవానంద్, రాచకొండ ముత్యాలరాజు, ఇంద్ర, జల్లేపల్లి వేణు, నాగిరెడ్డి, శేషం సుబ్బారెడ్డి, డొక్కు కాటంరాజు యాదవ్, తాళ్ల వీరయ్య, దుంపాల రాధా, వై. కోటి, రజియాబేగం, కొల్లూరు శివప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ముక్కోటికి మంగళాద్రి ముస్తాబు

ఆలయం ముందు వేసిన పందిరి

మంగళగిరి టౌన్ : ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి గోపురం, ముఖ మండపం, కోనేరులకు చారిత్రక నేపథ్యం ఉంది. నాలుగు వందల ఏళ్ల కిందట ముఖ మండపం, 200 ఏళ్ల కిందట గాలి గోపురం నిర్మించారు. వీటికి తోడు 200 ఏళ్ల నాటి దక్షిణావృత బంగారు శంఖం కూడా ఈ ఆలయంలో ఉంది. ఇది ఎంతో విశిష్టమైంది. ఏటా వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తర ద్వార దర్శనాన్ని వైభవంగా నిర్వహిస్తారు. దక్షిణావృత బంగారు శంఖంతో లక్ష్మీ నరసింహస్వామికి అభిషేకం చేస్తారు. పట్టణంలోని శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం వార్షిక వైకుంఠ ఏకాదశి ఉత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. భక్తుల కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ మాడ వీధుల్లో బంగారు దక్షిణావృత శంఖు తీర్థం స్వీకరించేందుకు భక్తుల కోసం క్యూలైన్లు నిర్మించారు. ఈనెల 29న జగన్మోహిని అలంకారం, 30న తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి స్వామి దేవరుల సమేతంగా బంగారు గరుడ వాహనంపై ఉత్తర ద్వారదర్శనం ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

ముక్కోటికి ఆన్‌లైన్ సేవలు

ఈనెల 30న ముక్కోటిని పురస్కరించుకుని స్వామి దర్శనార్థం ఆన్‌లైన్ సేవలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్ కుమార్ తెలిపారు. టికెట్ పొందదలచిన వారు మొబైల్ ద్వారా క్యూ ఆర్ కోడ్‌స్కాన్ చేసి ఏపీ టెంపుల్స్ యాప్ డౌన్‌లోడ్ లేదా www. aptemples. org వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని తెలియజేశారు. ఆన్‌లైన్ టికెట్లను టైమ్ స్లాట్ ప్రకారం బుక్ చేసుకోవాలని, టికెట్‌తో పాటు ఆధార్ లేదా పాన్ కార్డ్ ఫొటోస్టాట్ కాపీలను దర్శనానికి వచ్చే సమయంలో వెంట ఉంచుకోవాలని సూచించారు. వివరాలకు 85001 49595ను సంప్రదించాలని కోరారు.

గుండిమెడలో రాజకీయ కక్ష సాధింపులు

- పదేళ్ల కిందట నిర్మించిన కల్వర్టు తొలగింపు
- న్యాయ పోరాటం చేస్తామంటున్న బాధితులు

కల్వర్టు పగలకొడుతున్న బ్రేకర్

తాడేపల్లి రూరల్ : మండల పరిధిలోని గుండిమెడలో రాజకీయ కక్ష సాధింపులు జరుగుతున్నాయి. దానిలో భాగంగా పదేళ్ల కిందట ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న కల్వర్టును కార్పొరేషన్ అధికారులు శుక్రవారం తొలగించారు. గుండిమెడ, ప్రాతూరు, కుంచనపల్లి పంట పొలాల నుంచి వచ్చిన మురుగు, వర్షపు నీరు బయటకు వెళ్లడం లేదని సాకు చూపిస్తూ తొలగించారు. గుండిమెడకు చెందిన కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు 2005లో తన ఇంటి ముందున్న డ్రైనేజీని ఎనిమిది అడుగుల లోతు తీయించి కాంక్రీట్‌తో నిర్మాణం చేయించారు. దీని పక్కనే గుండిమెడ పంచాయతీగా ఉన్న సమయంలో ప్రధాన రహదారిని కలుపుతూ సీసీ రోడ్డు నిర్మాణాన్ని పంట కాలువ మీదుగా నిర్మించారు. అయితే, రాజకీయ కుట్రల్లో భాగంగా వెంకటేశ్వరరావు ఇంటి ముందు కల్వర్టును తొలగించారు.

టీడీపీ వారిపై ప్రేమ

అధికారులు తొలగించిన కల్వర్టుకు 20 అడుగుల దూరంలో కొత్తగా మరో కల్వర్ట్ నిర్మాణంలో ఉంది. అది టీడీపీ వారికి చెందినది కావడంతో దాన్ని తొలగించకుండా వెళ్లిపోయారు. దీనిపై గ్రామస్తులు, బాధితుడైన వెంకటేశ్వరరావు ప్రశ్నిస్తున్నారు. గత ఐదేళ్లుగా పలుచోట్ల పంట పొలాల్లోని డ్రైనేజీలను ఆక్రమించడంతో గుండిమెడ, ప్రాతూరు, కుంచనపల్లి గ్రామాల్లో పంట పొలాలు నీటిలో మునిగిపోతున్నాయి. రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. కుంచనపల్లి ఆంధ్రరత్న పంపింగ్ స్కీం నుంచి గుండిమెడ మీదుగా మెల్లెంపూడి వరకు వెళ్లే డ్రైనేజీని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల ముసుగులో పూడ్చివేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. అసలు విషయాన్ని ఎంటీఎంసీ అధికారులు పక్కనపెట్టి, టీడీపీ నాయకులు చెప్పిన పనులు మాత్రమే చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంటీఎంసీ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే కుంచనపల్లిలో మాజీ రౌడీషీటర్, కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు పంట పొలాల్లోని డ్రైనేజీలను ఆక్రమించి నిర్మించిన రోడ్డును తొలగించాలని పలువురు కోరుకుంటున్నారు.

ఈసీఐ నెట్‌లో ఓటర్ల మ్యాపింగ్

కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) నెట్ వర్క్ యాప్‌లో ఓటర్ల మ్యాపింగ్ జరుగుతోందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సంఘం రూపొందించిన సమగ్ర యాప్‌లో ఓటర్ల జాబితా మ్యాపింగ్ జరుగుతోందని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 46.96 శాతం పూర్తయ్యిందని తెలిపారు. ఇందులో తాడికొండ నియోజవర్గంలో 56.42 శాతం, మంగళగిరి నియోజవర్గంలో 38.20, పొన్నూరు నియోజవర్గంలో 49.42, తెనాలి నియోజవర్గంలో 40.68 , ప్రత్తిపాడు నియోజవర్గంలో 49.38 , గుంటూరు వెస్ట్ నియోజవర్గంలో 49.44 , గుంటూరు ఈస్ట్ నియోజవర్గంలో 48.51 శాతం జరిగిందని వివరించారు. జిల్లాలోని మొత్తం 17,98,368 మంది ఓటర్లలో 8,44,489 మందిని మ్యాపింగ్ చేశామని తెలిపారు. జనవరి 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో తప్పొప్పులు జరిగితే ఫారం 6,7,8 ద్వారా సరి చేస్తామన్నారు. బీఎల్‌ఓలకు కలర్ ఓటర్ జాబితాలతో గుర్తింపు కార్డులను కూడా అందజేశామని వెల్లడించారు. ఇంటి నంబర్లు లేని ఇళ్లకు నోషనల్ నంబర్లను సంబంధిత మున్సిపాలిటీ, పంచాయతీల సహకారంతో ఏర్పాటు చేయడానికి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. 2009 సంవత్సరానికి ముందున్న ఈవీఎం లను వెనక్కు పంపించాల్సిందిగా ఆదేశాలు ఉన్నాయని, అయితే జిల్లాలో ఏమీ లేవని వివరించారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు కూడా పెండింగ్‌లో లేవని చెప్పారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ఓటర్ నమోదు అధికారులు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, శ్రీనివాస్, చల్ల ఓబులేసు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సమస్యలతో సహజీవనం

టిడ్కో ఇళ్ల సముదాయంలోని ఓ భాగం

- టిడ్కో ఇళ్లలో వసతుల కరువ
- ఆర్భాటంగా ఫ్లాట్ల ప్రారంభోత్సవాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

తెనాలి రూరల్: మండలంలోని జగ్గడిగుంటపాలెం టిడ్కో గృహాల్లో కనీస వసతులు కరువయ్యాయి. నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గృహాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మించకపోవడం, ఇతర సౌకర్యాల కల్పనలో అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో రోజురోజుకీ అవస్థలు పెరిగిపోతున్నాయి.

అసంపూర్తిగానే లబ్ధిదారులకు అప్పగింత

తెనాలి మండలం పెదరావూరు–జగ్గడిగుంటపాలెం వద్ద 12.79 ఎకరాలను 2009–2014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సేకరించారు. ఇందులో 2019లో టీడీపీ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహాలను నిర్మించేందుకు నిర్ణయించింది. అపార్ట్‌మెంట్ తరహాలో నాలుగంతస్తుల భవనాల్లో మొత్తం 1152 ఫ్లాట్లను నిర్మించేందుకు నిర్ణయించారు. అయితే, 848 ఫ్లాట్లను నిర్మించి, 2019 ఫిబ్రవరిలో అసంపూర్తిగా ఉండగానే ప్రారంభించి లబ్ధిదారులకు అప్పగించారు. అప్పటి నుంచి వసతుల లేమితో సమస్యలతో సహవాసం చేస్తున్నారు. వెలగని వీధి దీపాలు, అరకొర తాగునీటి సౌకర్యం, పని చేయని వాటర్ ట్యాంకులు తదితర సమస్యలతో సహవాసం చేస్తున్నారు. మొత్తం 848 ఫ్లాట్లను నిర్మిస్తే అందులో 250 నుంచి 300 కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి. మిగిలిన ఫ్లాట్లు ఖాళీగా ఉండి శిథిలమైపోతున్నాయి. కిటికీల రెక్కలు విరిగిపోయి, తలుపులు చెదలు పట్టి పని కిరాకుండా ఉన్నాయి.

ఇంకా నిర్మాణానికి నోచుకోని అంతర్గత రోడ్డు

వైద్యానికీ ఇబ్బందే !

ఈ గృహ సముదాయంలో నివసించే వారికి వైద్య సేవలు కరువయ్యాయి. ప్రతి చిన్నదానికీ పట్టణానికి రావాల్సి వస్తోంది. ఇక్కడ హెల్త్ సెంటర్, రేషన్ పాయింట్, సచివాలయం ఏర్పాటుతో పాటు మిగిలిపోయిన వాటర్ ట్యాంకు నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు లేక అవస్థలు

గృహ సముదాయానికి వెళ్లేందుకు తెనాలి–చందోలు రహదారి వెంబడి పడమరగా, నిజాంపట్నం కాల్వ మీదుగా వంతెనలు దాటి రావాలి లేదా ఆర్‌ఆర్ నగర్ వెనుక యడ్లపల్లి కాల్వ చీలే వంతెన నుంచైనా వెళ్లొచ్చు. ఆ మార్గంలో రోడ్డు నిర్మాణంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటికీ పట్టించుకోలేదు. వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. టిడ్కో గృహాల వద్ద పడమర, నిజాంపట్నం కాల్వ మీదుగా వంతెన నిర్మించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చర్యలు చేపట్టారు. అధికారులు వచ్చి సర్వే చేసి, అంచనాలనూ సిద్ధం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఈ అంశాన్ని పక్కన పడేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ ప్రాంతాన్ని 2024 ఎన్నికల ప్రచారం సందర్భంలోనూ, గెలిచిన ఈ 18 నెలల్లోనూ అసలు పట్టించుకోలేదని, ఒక్కసారైనా ఇక్కడకు పర్యటనకు రాలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించేలా అధికారులకు మంత్రి ఆదేశాలివ్వాలని స్థానికులు కోరుతున్నారు.

పైపులైను నిత్యం లీకవుతుండడంతో ప్రధాన మార్గంలో తవ్వి వదిలేసిన గుంత

ప్రైవేటు వెంచర్లతో ఇబ్బందులు

టిడ్కో గృహాల వెనుక పలువురు ప్రైవేటు వెంచర్లు వేశారు. వాటికి మెరకలు తోలేందుకు అంతర్గత రోడ్లలో భారీ టిప్పర్లతో మట్టి తోలుతున్నారు.వీటి కారణంగా రోడ్లు దెబ్బతినడంతో పాటు స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు వెంబడి ఉన్న సైడ్ వాల్ దెబ్బతినడంతో పాటు విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది.

టిప్పర్ల ధాటికి ధ్వంసమైన సైడ్ వాల్

అర్జీలు ఇచ్చినా ఫలితం లేదు

సరైన వసతులు లేకపోవడంతో 848 ఫ్లాట్లు ఉన్నా కేవలం 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రధాన రోడ్డు నిర్మాణం జరగలేదు. ఇక అంతర్గత రోడ్లు పూర్తిగా లేవు. వెంచర్లు వేసి భారీ టిప్పర్లను అంతర్గత రోడ్లలో తిప్పుతుండటంతో సీసీ రోడ్లు దెబ్బతింటున్నాయి. పీజీఆర్ఎస్‌లో పలుమార్లు అర్జీలు పెట్టినా అధికారులు పట్టించుకోవడం లేదు.

–కోడె శ్రీనుబాబు, స్థానికుడు

లారీలను కట్టడి చేయాలి

భారీ లారీలను ఇటు ఎందుకు అనుమతిస్తున్నారో తెలియడంలేదు. ఓ టిప్పర్ నాకు తగిలేది. కొంచెంలో ప్రమాదం తప్పింది. ఇరుకు రోడ్లలో భారీ లారీలు వస్తున్నాయి. మా సమస్యల్ని పట్టించుకున్న వారే లేరు. రోడ్లు దెబ్బతిన్నాయి. కరెంటు స్తంభం విరిగింది.

–అప్సర, స్థానికురాలు

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)

వచ్చిన బస్తాలు	33,577
అమ్మకాలు	39,570
నిల్వ	8,285

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-17,000
నంబరు-5	12,000-15,300
273	11,500-14,000
341	11,000-17,000
సూపర్ -10	12000- 16,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-16,700
నంబరు-5	11,000-15,000
341	11,000-16,500
4884	12,000-14,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 16,500
బాడిగ-355	11,000 - 17,000
దేవనూరు డీలక్స్	11,500 - 17,500
ఆర్మూర్	10,000 - 12,700
తాలుకాయలు	5,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,000
బాడిగ - 355	10,000-16,500
దేవనూరు డీలక్స్	10,500-16,200
తాలు	5,200 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

వైద్య రంగంలో పీపీపీ విధానమే పెద్ద స్కాం

- ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ
- జనవరి 9న విజయవాడలో సామూహిక నిరసన దీక్ష

మాట్లాడుతున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, పక్కన వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కొరివి వినయ్‌కుమార్, ధనుంజయరెడ్డి

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్‌లో నేడు వైద్య రంగాన్ని పీపీపీ విధానంలో కొనసాగించడం అతి పెద్ద స్కాంగా మారబోతుందని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ అనుమానాన్ని వ్యక్తం చేసింది. శుక్రవారం గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పది ప్రభుత్వ మెడికల్ కళాశాలల్ని పీపీపీ పద్ధతిలో నిర్మించి, నిర్వహించడం వల్ల ఆ భారం రోగులపై, వైద్య విద్యార్థులపై పడుతుందని చెప్పారు. పీపీపీ విధానంలో నిర్మించే విమానాశ్రయాలు, రహదారులతో వైద్య రంగాన్ని పోల్చకూడదని తెలిపారు. నాలుగు ప్రభుత్వ వైద్య కళాశాలలకు రెండు పర్యాయాలు టెండర్ల ప్రక్రియను నిర్వహించినా కేవలం ఒకే ఒక్క బిడ్ రావడానికి ప్రజా వ్యతిరేకతగా భావించి ముఖ్యమంత్రి పీపీపీ విధానానికి స్వస్తి పలకాలని ఆయన కోరారు. ఉద్యోగాలలో రాజ్యాంగ పరమైన రిజర్వేషన్లను పరోక్షంగా అంత మొందించడానికే సీఎం చంద్రబాబు నాయుడు పీపీపీ విధానంపై అమిత ప్రేమను కనబరుస్తున్నారని విమర్శించారు.

- శాసనమండలి మాజీ సభ్యుడు, కమిటీ రాష్ట్ర కో- కన్వీనర్ కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పీపీపీ పద్ధతిలో నిర్వహించ తలపెట్టిన వైద్య కళాశాలలకు ఇప్పటికే అందిస్తున్న భూములు, వసతులు, సిబ్బందికి రెండేళ్ల పాటు వేతనాలు ప్రభుత్వం చెల్లించిందన్నారు.అంతేకాకుండా అదనంగా వయబిలిటీ గ్యాప్ ఫండ్ పేరుతో అనుయాయులకు లబ్ధి చేకూర్చడం దేశంలో మరెక్కడా లేదని విమర్శించారు.
- జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, కమిటీ కో- కన్వీనర్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ దేశంలో అనుమతి పొందిన ఏ ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాల కూడా పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ యాజమాన్యానికి ఇచ్చిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం మూడు సంవత్సరాల కాల వ్యవధిలోనే 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రారంభించిందన్నారు. ఐదింటిని సంపూర్ణంగా పూర్తి చేసి అమలులోకి తెచ్చిందని తెలిపారు.

మరో రెండిటిని పూర్తి చేందని చెప్పారు. కూటమి ప్రభుత్వం భూసేకరణ జరిగి నిర్మాణంలో ఉన్న పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పూర్తి చేసేందుకు 20 సంవత్సరాలు పడుతుందని పేర్కొనడాన్ని అసమర్థతగా పేర్కొన్నారు.లాభాపేక్షతో ధనార్జన కేంద్రాలుగా మారిన బడా వైద్య సంస్థలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్వహణ బాధ్యత అప్పచెప్పడం భావ్యం కాదని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రంలో 65 మెడికల్ కళాశాలలో ఉండగా, అందులో 38 ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 38 మొత్తం మెడికల్ కళాశాలల్లో ప్రభుత్వ రంగంలో కేవలం 19 మాత్రమే ఉన్నాయని వివరించారు.

- దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు, కమిటీ రాష్ట్ర కో- కన్వీనర్ కొరివి వినయ కుమార్ మాట్లాడుతూ పది ప్రభుత్వ మెడికల్ కళాశాలల విషయంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 9న విజయవాడలోని ధర్నా చౌక్ లో జరిగే సామూహిక నిరసన దీక్షను పెద్దఎత్తున నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. పీపీపీ విధానాన్ని వ్యతిరేకించే అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు, బహుజన సంఘాలు భాగస్వామ్యులై సామూహిక నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరారు.
- జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నిరంతరం నష్టాన్ని, సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రైతులకు కూడా వయబిలిటీ గ్యాప్ ఫండ్ వర్తింప చేయగలరా? అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు.

పోరాటాలు, త్యాగాల చరిత్ర మాది

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : కమ్యూనిస్టులది పోరాటాలు, త్యాగాలతో కూడిన చరిత్ర అని, అటువంటి మమ్మల్ని విమర్శించే అర్హత మతోన్మాదులకు లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య స్పష్టం చేశారు. సీపీఐ శత వసంతాల ముగింపు బహిరంగ సభ గుంటూరు అశోకనగర్‌లో శుక్రవారం జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన జరిగింది.

- సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఈశ్వరయ్య మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టులు కీలక భూమిక పోషించారని, బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమికొట్టడంలో అగ్రభాగాన నిలిచారన్నారు. దోపిడీ సమాజం ఉన్నంతకాలం ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక్కరోజు కూడా పాల్గొనని చరిత్ర ఆర్ఎస్ఎస్‌దని విమర్శించారు. జాతీయ పతాకాన్ని ఆమోదించి ఎగురవేయలేని శక్తిహీనులని, వారు దేశభక్తి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన ఈ 12 సంవత్సరాలలో దేశం ఏ రంగంలో ప్రగతి సాధించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. జనవరి 18న జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు గుంటూరు జిల్లా నుంచి వేలాదిగా తరలిరావాలని ఆయనన పిలుపునిచ్చారు.
- సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వారి రాజకీయ ప్రయోజనాల కోసం శ్రామికవర్గం చెమటోడ్చి సృష్టిస్తున్న సంపద మొత్తంను కార్పొరేట్లకు దోచిపెడుతుందని మండిపడ్డారు.
- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐ అశేష త్యాగాలు చేయడంతో పాటు జమీందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిందని గుర్తుచేశారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బందెల నాసర్ జీ, జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ జిల్లా నాయకులు షేక్ వలి, పుప్పాల సత్యనారాయణ, చిన్ని తిరుపతయ్య పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో పరిశోధన కేంద్రాలు ప్రారంభం

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న చాన్సలర్ పావులూరు సుబ్బారావు, చైర్మన్ లావు రత్తయ్య తదితరులు

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శాస్త్రీయ పరిశోధనలకు రెండు అత్యాధునిక పరిశోధనా కేంద్రాల్ని ప్రారంభించినట్లు వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. నానో సైన్స్, ఎనర్జీ మెటీరియల్స్, సెన్సార్ టెక్నాలజీ రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో ''రామన్ సెన్సర్ సెంటర్'', ''డాక్టర్ లావు రత్తయ్య సెంటర్ ఫర్ ఎనర్జీ మెటీరియల్స్ (డాక్టర్ లారా-సీఈఎం)'' కేంద్రాలను ప్రారంభించామని చెప్పారు. రామన్ సెన్సర్ సెంటర్ ద్వారా నానో సైన్స్‌ను సాంకేతిక అనువర్తనాలుగా మార్చే దిశగా విస్తృత పరిశోధనలు సాగనున్నాయని చెప్పారు. లావు రత్తయ్య సెంటర్ ఫర్ ఎనర్జీ మెటీరియల్స్ ద్వారా ఎనర్జీ సంబంధిత పదార్థాలు, పునరుత్పాదక శక్తి వనరులు, బ్యాటరీ టెక్నాలజీ, ఎనర్జీ స్టోరేజ్ మెటీరియల్స్‌పై లోతైన పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, చాన్సలర్ డాక్టర్ పావులూరు సుబ్బారావు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, పాల్గొన్నారు.

పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 761

కొమ్ములు : 558 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,000	12,650	12,650

కాయలు : 203 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,000	12,650	12,650

మొత్తం అమ్మకాలు : 570.75 క్వింటాళ్లు

-దుగ్గిరాల

265 మొబైల్ ఫోన్లు అప్పగింత

బాధితురాలికి మొబైల్‌ఫోన్ అందిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సుమారు రూ.53 లక్షల విలువైన 265 మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారికి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఎస్పీ వకుల్ జిందాల్ అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.7.53 కోట్ల విలువైన 3,679 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించామని చెప్పారు. బాధితుల ఫిర్యాదుల ఆధారం చేసుకుని సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోయినా, దొంగతనానికి గురైన వెంటనే పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 8688831574 లేదా సీఇఐఆర్ వెబ్‌సైట్ లేదా జిల్లా సైబర్ సెల్ లేదా దగ్గర్లోని పోలీస్ స్టేషన్లల్లో ఫిర్యాదులు చేయాలని ఆయన సూచించారు. ఐటీ కోర్ సీఐ నిషార్ భాషా, కానిస్టేబుళ్లు శ్రీధర్, మానస, ఇమామ్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాను జిల్లా ఎస్పీ అభినందించారు.

వృద్ధుడి నేత్రదానం

రేపల్లె: మండలంలోని నల్లూరుపాలేనికి చెందిన సుఖవాసి సుబ్బారావు(87) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన నేత్రాలను దానం చేశారు. కుటుంబ సభ్యులు నాగాయలంకకు చెందిన సుదర్శి మానవతా సేవా సంస్థకు సమాచారం అందించారు. దీంతో సంస్థ ప్రతినిధులు విజయవాడ ఎల్వీ కంటి ఆసుపత్రి ప్రతినిధులు ఆధ్వర్యంలో నేత్రాలను శుక్రవారం సేకరించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు రఘు శేఖర్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇప్పటికి 253 మంది వద్ద నేత్రాలను సేకరించి ఇతరులకు నేత్రదానం చేసినట్లు చెప్పారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- నకిలీ ఆఫర్ లెటర్‌తో రూ.5 లక్షలు వసూలు
- హైదరాబాద్‌కు చెందిన వ్యక్తుల టోకరా

తాడికొండ: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.5 లక్షలు తీసుకొని మోసం చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె. వాసు తెలిపారు. వివరాల ప్రకారం.. తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన నాగ చైతన్యను మైలా బత్తుల బాబు మహేష్, బాలరామ్, నందాలు కలిసి హైదరాబాద్‌లోని ఎంఎన్ సొల్యూషన్స్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. ఆఫర్ లెటర్ ఇచ్చి రూ.5 లక్షలు తీసుకున్నారు. అయితే, అది నకిలీదని తేలడంతో నాగ చైతన్య మోసపోయానని తెలుసుకొని డబ్బులు తిరిగి ఇవ్వాలని నిందితుల్ని అడిగాడు. వారు ఇవ్వకుండా తనతో పాటు కుటుంబ సభ్యులను బెదిరించారని పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వాసు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

నకరికల్లు: ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని కుంకలగుంట గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లవి (23)కి బెల్లంకొండ మండలం నందిరాజుపాలెం గ్రామానికి చెందిన బూదాటి జయపాల్‌తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు సంతానం ఉన్నారు. కొన్నిరోజులుగా భార్య ప్రవర్తన, వేరేవాళ్లతో ఫోన్ మాట్లాడుతోందనే విషయమై దంపతులు గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీన పల్లవిని భర్త పుట్టింట్లో వదలిపెట్టి వెళ్లాడు. మనస్తాపానికి గురైన పల్లవి గురువారం ఊపిరి బిగబట్టి స్పృహ కోల్పోగా.. నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ శుక్రవారం తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: గుర్తుతెలియని లారీ వెనక నుంచి ఢీకొట్టడంతో బైకుపై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు టోలు ప్లాజా సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ ఎం. మోహన్ తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లి మండలం సారంగపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన సంపతి కోటేశ్వరరావు (43) పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో నిద్ర చేసేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు టోల్ ప్లాజా సమీపంలో గుర్తుతెలియని లారీ వెనకనుంచి ఢీకొట్టింది. ఒక్కసారిగా రోడ్డుపై పడిన అతని తలపైనుంచి లారీ టైర్లు వెళ్లడంతో నుజ్జు నుజ్జు అయింది. అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ వెళ్లి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నాగార్జునసాగర్: ఇటీవల భార్య మరణించగా మనస్తాపం చెందిన భర్త చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నాగార్జునసాగర్ హిల్ కాలనీ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. మాచర్ల పట్టణానికి చెందిన నల్లమల వెంకటేశ్వర్లు(65) భార్య ఇటీవల మృతి చెందింది. మనస్తాపం చెందిన వెంకటేశ్వర్లు శుక్రవారం మాచర్ల సమీపంలోని కాలువలో దూకి చనిపోవడానికి ప్రయత్నించగా అక్కడే స్నానం చేస్తున్న అయ్యప్ప మాలధారులు కాపాడారు. అక్కడి నుంచి బయలుదేరిన వెంకటేశ్వర్లు హిల్ కాలనీ సమీపంలో చెట్టుకు లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సాగర్ ఎస్ఐ ముత్తయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోసగించిన స్వర్ణకారుడిపై కేసు

యడ్లపాడు: ఆభరణాలు చేయించి ఇస్తానని స్వర్ణకారుడు పలువుర్ని నమ్మించి రూ.కోట్లలో వసూలు చేసి మోసానికి పాల్పడిన ఘటన గత మూడు రోజులుగా కలకలం రేపుతున్న విషయం తెలిసిందే. సదరు కేసుకు సంబంధించి ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. యడ్లపాడు గ్రామానికి చెందిన ఇళ్ళ ఊర్మిళ తాను రూ.3 లక్షల నగదును బంగారం ఆభరణా లకోసం అదే గ్రామానికి చెందిన ఏలూరి కామేశ్వరరావుకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కామేశ్వరరావు తనతోపాటు మండల వ్యాప్తంగా పలువురు మోసపోయినట్లు ఆరోపించారు. నిందితుడు పలువుర్ని మోసం చేసినట్లు తెలిపిందని ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీ ఢీకొని టైల్స్ వర్కర్ మృతి

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామ సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవేపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా కురిచేడు మండలం అలవలపాడు గ్రామానికి చెందిన హుస్సేన్ (40) మృతి చెందాడు. హుస్సేన్ విప్పర్ల గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఓ పెట్రోల్ బంకులో టైల్స్ పనికి వచ్చాడు. రాత్రివేళ బంకు సమీపంలో ఉన్న హోటల్‌కి వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా రొంపిచర్ల వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రబీ సీజన్‌కు సరిపడా యూరియా

జేడీఏ పద్మావతి

కొరిటెపాడు(గుంటూరు): రబీ సీజన్‌లో గుంటూరు జిల్లాలో అన్ని పంటలకు 55,840 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అని ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు ఎం.పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల చివరి నాటికి జిల్లాకు 24,996 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే 36,237 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈ నెల చివరి నాటికి మరో 1000 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నట్లు తెలిపారు. రాబోయే 21 రోజులకు గాను 14,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ప్రస్తుతం 13,438 మెట్రిక్ టన్నుల యూరియాను సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, మార్కెటింగ్ గోదాములు, రిటైల్, హోల్‌సేల్ కంపెనీ గోదాముల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రబీ సీజన్‌లో ఇప్పటికే 22,809 మెట్రిక్ టన్నులు రైతులకు విక్రయించినట్లు పేర్కొన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు బస్తాపై ముద్రించిన ఎమ్మార్పీ ధరలు చూసుకుని దాని ప్రకారం చెల్లించి తప్పనిసరిగా డీలరు నుంచి రశీదు పొందాలని ఆమె సూచించారు.

క్లుప్తంగా

రంగాకు నివాళులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో రాధారంగా మిత్రమండలి ఆధ్వర్యంలో శుక్రవారం వంగవీటి మోహనరంగా 37వ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రంగా తనయుడు వంగవీటి రాధా పాల్గొన్నారు. రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వంగవీటి రంగా అభిమానులు, రాధారంగా మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలకు టెండర్ల ఆహ్వానం

పట్నంబజారు: జిల్లాలో ఆర్టీసీ పరిధిలోని పలు స్థలాలకు 15 సంవత్సరాలకు అద్దె ప్రాతిపదికన టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు రీజియన్ మేనేజర్ సామ్రాజ్యం శుక్రవారం తెలిపారు. గుంటూరులోని తిక్కన కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 31న ఔత్సాహికులకు టెండర్ల ఆహ్వాన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2026 జనవరి 8వ తేదీలోగా ఆర్టీసీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో పెదకాకానిలోని బిట్-1,బిట్-2, బిట్-3, తెనాలి ఓల్డ్ బస్సు డిపో బిట్-1, బిట్-2కు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జనవరి 7లోగా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడు చేసుకుని 8న నెల్లూరులోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోన్- 3 కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు దాఖలు చేయాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 9959225421, 9959225422, 9959225418 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'104' యూనిట్లలో ఉద్యోగ అవకాశాలు

సత్తెనపల్లి: 104 మొబైల్ మెడికల్ యూనిట్లలో ఖాళీగా ఉన్న డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈఓ) పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 104 జిల్లా మేనేజర్ వింజమూరి విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. డ్రైవర్ ఉద్యోగానికి 10వ తరగతి చదివి, హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. వేతనం నెలకు రూ. 16 వేలు ఇస్తామని పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి డిగ్రీ చదివి కంప్యూటర్ పరిజ్ఞానం- 25 డబ్ల్యూపీఎం ఉండాలన్నారు. వేతనం నెలకు రూ. 15 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ప్రైవేటు బ్యాంకులు పనితీరు మార్చుకోవాలి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకర్ల పాత్ర చాలా కీలకమని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రుణాలు మంజూరు అయ్యేలా బ్యాంకర్లు పనిచేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో బ్యాంకర్ల జిల్లా సంప్రదింపుల కమిటీ(డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ ఆర్ఎస్)సమావేశంలో పెమ్మసాని మాట్లాడారు.

- కౌలు రైతులకు ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు ప్రైవేటు బ్యాంకులు కూడా రుణాలు అందించాలన్నారు. గత సంవత్సరం కంటే ప్రస్తుతం ప్రభుత్వ పథకాలకు రుణాల మంజూరు మెరుగుపడిందని బ్యాంకర్లను అభినందించారు.
- ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రమే నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో ముందంజలో ఉన్నాయన్నారు. ప్రైవేటు బ్యాంకులు కౌలు రైతు రుణాలతో సహా విద్యా రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలకు రుణాలు మంజూరులో ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.
- రానున్న మూడు నెలలు ప్రైవేట్ బ్యాంకులు రుణాల మంజూరులో పనితీరు మెరుగుపరచుకోకపోతే , ఆ బ్యాంకుల పేర్లతో సహా ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. సంబంధిత బ్యాంకుల్లో ఉన్న ప్రభుత్వ ఖాతాలను, డిపాజిట్లను ప్రభుత్వ రంగ బ్యాంకులకు బదిలీ చేయడం జరుగుతుందన్నారు.

సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హాసన్ బాషా, డీఆర్వో షేఖ్ ఖాజావలి, జిల్లా వ్యవసాయ శాఖ జేడీఏ పద్మావతి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీందర్, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ సత్యనారాయణ, మెప్మా పీడీ విజయలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి, నాబార్డ్ డీడీఎం జి. శరత్ బాబు, ఆర్‌బీఐ ఎల్డీఓ నవీన్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

నీతి, నిజాయతీతో సేవలు అందించిన లక్ష్మీనారాయణ

ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు

లక్ష్మణ చక్రవర్తికి పురస్కార ప్రదానం

నగరంపాలెం: విధి నిర్వహణలో నీతి, నిజాయతీగా సేవలు అందించి, కుటుంబాన్ని క్రమశిక్షణ, విలువలతో తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి చెంచు లక్ష్మీనారాయణ అని ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు కొనియాడారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని పద్మావతి కల్యాణ వేదికపై శుక్రవారం తెలంగాణ విశ్వ విద్యాలయం తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులు డాక్టర్ సీహెచ్.లక్ష్మణ చక్రవర్తికి లక్ష్మీనారాయణ స్మారక సాహితీ పురస్కార ప్రదానం -25, ప్రొఫెసర్ సీహెచ్.సుశీలమ్మ సాహితీ స్వర్ణోత్సవ వేడుక నిర్వహించారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సభకు డాక్టర్ ఎంసీ దాస్ అధ్యక్షత వహించి మాట్లాడారు. మద్రాస్ విశ్వ విద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు మాట్లాడుతూ సాహిత్యం విలువలతో కూడి, సమాజాభివృద్ధికి దోహదం చేసేలా ఉండాలని తెలిపారు. సాహిత్యాన్ని సరైన మార్గంలో నడిపించేందుకు విమర్శ చికిత్స చేసే వైద్యునిగా ఉండాలని సూచించారు. పురస్కార గ్రహీత డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి మాట్లాడుతూ సాహిత్య స్వర్ణోత్సవంలోకి అడుగిడిన డాక్టర్ సుశీలమ్మ తండ్రి స్మారక పురస్కారం స్వీకరించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. సభలో నిర్వాహకురాలు ఆచార్య సీహెచ్.సుశీలమ్మ, విశ్రాంత ఏఈసీ షేక్ అహ్మద్ షరీఫ్, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు, బండ్ల మాధవరావు, డాక్టర్ ఓరుగంటి వెంకటరమణ, మోదుగుల రవికృష్ణ, డాక్టర్ వీవీ రామ్‌కుమార్, పంచమర్తి సుశీల, డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ జిల్లా కేంద్రం నరసరావుపేటలో బైపాస్ రోడ్డుకు దగ్గరగా ఇంటి స్థలాలు లభించును. ఫోన్ : 7386948543

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ 7989731043

WANTED

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును.) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480429

■ వాచ్‌మెన్ కావలెను. గుంటూరులోని కమర్షియల్ కాంప్లెక్స్ నందు పని చేయుటకు 40సం॥లోపు భార్యభర్తలు కావలెను. ఓ.సి లకు ప్రాధాన్యత. గృహవసతి కలదు. 9849983681

■ ఫ్రీ కంప్యూటర్, M.S Office, స్పోకెన్ ఇంగ్లీష్, కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి జాబ్ చూపించబడును. అర్హత: 10th-Degree, 18-28సం॥. 9133444985/89

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జిస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జిస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు : ఇంటర్ నుండి పి.జి వరకు వయస్సు 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 9248713335

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు అకడమిక్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు వివాహితులైన, లోకల్ పురుషులు కావలెను. జీతము: 25,000/- నుండి 30,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: డిగ్రీ నుండి పి.జి వరకు, వయస్సు: 30 నుండి 45సంవత్సరాలు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్:8248722217

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వారికి విజయవాడ, గుంటూరు జిల్లాలలో మార్కెటింగ్ చేయుటకు (M/F) అభ్యర్థులు కావలెను. అర్హత: 10th to Any Degree. జీతం: అర్హత అనుభవమును బట్టి 16 వేల నుండి 35 వేల వరకు. సంప్ర: 9394 66 77 88

■ శాంతి ఎంటర్‌ప్రైజెస్‌లో టెలికాలర్ & డేటా ఆపరేటర్ వర్క్ చేయుటకు యువతీ యువకులు కావలెను. అర్హత:10thపైన వీక్లీ పేమెంట్, వర్క్ ఫ్రం హోం కలదు. 9063910978

■ డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారు చేసి మాకు ఇవ్వండి వీక్లీ పేమెంట్. 9640729906

గమనిక

పేదల పెన్నిధి వంగవీటి రంగా

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రంగా వర్ధంతి

మంగళగిరి టౌన్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు కృషి చేస్తామని పలువురు కాపు సంఘం నాయకులు తెలిపారు. మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట నియోజకవర్గ కాపు సంఘం ఆధ్వర్యంలో రంగా వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా రంగా వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పేదల పెన్నిధి రంగా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాపు సంఘం నాయకులు రంగిశెట్టి నరేంద్ర, బత్తుల గణపతి, చిరంజీవి, విన్నకోట శ్రీనివాసరావు, తిరుమలశెట్టి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రంగా ఆశల సాధనకు కృషి..

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్, పట్టణ పరిధిలో మాజీ ఎమ్మెల్యే, ప్రజా ఉద్యమాల నాయకుడు వంగవీటి మోహనరంగా వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య ఆధ్వర్యంలో కుంచనపల్లిలో పలుచోట్ల రంగా వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. వంగవీటి మోహనరంగా, మహాత్మా గాంధీ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమరా నాగయ్య మాట్లాడుతూ.. యువత రంగాను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. పేదలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ విభాగం రాష్ట్ర నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి, కుంచనపల్లి, కొలనుకొండ పార్టీ అధ్యక్షులు మిరియాల రాంబాబు, నూతక్కి శ్రీనివాసరావు, రాఘవరెడ్డి, కూరపాటి సాంబిరెడ్డి, బిరుదుగడ్డ విజయేంద్రరావు, నాయకులు పాల్గొన్నారు.

నివాళులర్పిలంచిన నాయకులు..

తాడేపల్లి పట్టణ పరిధి మహానాడులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రంగా వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. మహానాడులోని రంగా, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పార్టీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నబోతుల దుర్గారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజేంద్ర, బాలస్వామి, ఫ్రాన్సిస్, బాలశౌరి, శేఖర్, శాంతారావు, తొట్టెంపూడి వికాస్, దాసరి బుజ్జి, సుధ తదితరులు పాల్గొన్నారు. ప్రాతూరు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షులు సంకురు మరియబాబు, మాజీ ఎంపీటీసీ రెడ్డిబత్తుల సత్యనారాయణ రెడ్డి పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, యూత్ నాయకులు కురగంట నాని, మండల కార్యదర్శి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాపు సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి సెంటర్‌లో రాధారంగా మిత్రమండలి ఆధ్వర్యంలో జనసేన నాయకులు నిర్వహించిన రంగా వర్ధంతి కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన యువనేత జొన్నరాజేష్, టీడీపీ నాయకులు జంగాల వెంకటేష్, తోట సాంబశివరావు, అంబటి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. వంగవీటి రాధా తాడేపల్లి, మహానాడు వచ్చిన సందర్భంగా జనసేన నాయకులు జొన్నరాజేష్ వంగవీటి రాధాను కలిసి రాధారంగా మిత్రమండలి ఆధ్వర్యంలో పలుచోట్ల వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం వంగవీటి రాధాను జొన్న రాజేష్ సన్మానించారు.

మహానాడులో వైఎస్సార్, రంగా విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

ప్రాతూరు పార్టీ కార్యాలయం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

వైఎస్ జగన్ సీఎం కావాలని కోరుతూ పాదయాత్ర

పాదయాత్రగా విజయవాడకు వెళుతున్న నరసింహులు

ఫిరంగిపురం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎం కావాలంటూ మార్కాపురం జిల్లా, గిద్దలూరు నియోజకవర్గం కొమ్మమూరు పంచాయతీ ఎగ్గినపల్లి గ్రామానికి చెందిన కొప్పుల నరసింహులు పాదయాత్రగా ఇంద్రకీలాద్రికి బయలుదేరారు. సేకరించిన సమాచారం ప్రకారం.. అయ్యప్ప మాలలో ఉన్న నరసింహులు తన గ్రామం నుంచి ఆరు రోజుల కిందట పాదయాత్రగా బయలుదేరారు. ఇప్పటి వరకు 255 కిలో మీటర్ల పాదయాత్ర చేసినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించాలని.. వైఎస్ జగన్ సీఎం కావాలని కోరుతూ విజయవాడకు పాదయాత్రగా ప్రయనమయ్యారు. 2019లో వైఎస్ జగన్ సీఎం కావాలని కోరుతూ విజయవాడ నుంచి తిరుపతికి పాదయాత్రగా.. 2023లో గిద్దలూరు నుంచి ఇడుపలపాయ, తిరుపతి వరకూ పాదయాత్ర చేశానన్నారు. ఆయన వెంట వాహనంలో శ్రీను, రాము ఉన్నారు.

క్లుప్తంగా

కాలువపై కాంక్రీట్ వాల్

సాక్షి స్పందన

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ఆచార్యుల బావి సమీపంలోని మురుగు కాలువపై పెద్ద గుంత ఏర్పడింది. దీనిపై వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఇటీవల సాక్షి పత్రికలో 'ప్రమాదకర గుంత!' శీర్షికన సమస్య ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మురుగు కాలువపై కాంక్రీట్ పనులు చేపట్టారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా కాంక్రీట్ వాల్ నిర్మించారు. దీంతో వాహన రాకపోకలకు ఇకపై ఎటువంటి ఇబ్బందులు కలుగవని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పాములపాడు(తాడికొండ): రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా జరుగుతున్న 4వ విడత రీ–సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాడికొండ తహసీల్దార్ మెహర్‌కుమార్ సూచించారు. శుక్రవారం తాడికొండ మండలం పాములపాడు, బేజాత్పురం గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. 4వ విడతలో తాడికొండ మండలంలో పాములపాడు, బేజాత్పురం, బండారుపల్లి, దామరపల్లి, లాం గ్రామాల్లో రీ సర్వే జరగనుందన్నారు. ఈ సర్వేలో 5 కమ్యూనికేషన్ బృందాలు, 8 సర్వే బృందాలు పాల్గొనన్నున్నాయని తెలిపారు. రైతులు తమ భూ హక్కు పత్రాలతో సర్వేలో పాల్గొని వారి హద్దురాళ్లు చూపించి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ హనుమంతరావు, సర్వేయర్ సాంబశివరావు, వీఆర్వోలు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

షాదీఖానా ప్రారంభం

తాడేపల్లి రూరల్: నులకపేటలో నిర్మించిన షాదీఖానాను రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ షరీఫ్ మత పెద్దలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు నారా లోకేష్‌కు ముస్లిం నాయకులు తమ ప్రాంతానికి షాదీఖానా కావాలని అడిగారని, స్పందించిన లోకేష్ హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ మేరకు ఆయన స్ఫూర్తితో వీపీఆర్ ఫౌండేషన్ (వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఫౌండేషన్) సహకారంతో షాదీఖానా నిర్మాణాన్ని చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వల్లభనేని వెంకటరావు, పోతినేని శ్రీనివాసరావు, ముమ్మిడి సత్యనారాయణ, దారా దాసు, షేక్ రియాజ్, షేక్ అక్రం, చాంద్ బాషా, వెంకటేష్, నాగుల్ మీరా, షేక్ ఇలియాజ్, షేక్ బాజీ, నూర్జహాన్, కుసుమ, నిర్మల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాచౌక్ సభను జయప్రదం చేయాలి

దుగ్గిరాల: ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద నిర్వహిస్తున్న సభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు అన్నారు. శుక్రవారం దుగ్గిరాల మండలం చిలువూరు, తుమ్మపూడి, పేరుకలపూడి, చుక్కపల్లివారిపాలెం, ఈమని గ్రామాలలో సీపీఎం నాయకులు సంబంధిత కరపత్రాలు పంపిణీ చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా పేద ప్రజలు, కూలీలక ఎంతో లబ్ధి జరుగుతుందని బాలరాజు వివరించారు. నూతన చట్టానికి వ్యతిరేకంగా ధర్నా తలపెట్టినట్లు వివరించారు. ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు, కర్షకులు తరలిరావాలని ఆయన కోరారు. ధర్నా అనంతరం రాష్ట్ర గవర్నర్‌ను కలిసి సమస్యలను తెలియజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వై.బాబురావు, నాగలక్ష్మీ, పి.సుబ్బారావు, బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కాలువలో గుర్తు తెలియని మృతుడు

తెనాలిరూరల్: నిజాంపట్నం కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. స్థానిక వైకుంఠపురం సమీపంలో ఈ పడవల కాలువలో మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుని వయసు సుమారు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని, ఒంటిపై ఎలాంటి అనుమానాస్పద గాయాలు లేవని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ ఎస్. సాంబశివరావు తెలిపారు. ఆనవాళ్లు గుర్తించిన వారు పోలీసులను సంప్రదించాల్సిందిగా కోరారు.

ఫ్లెక్సీలపై పైశాచిక మూక ప్రతాపం

మంగళగిరి టౌన్: క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ మంగళగిరి రత్నాలచెరువు 21వ వార్డులో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలను ఆ వార్డు అధ్యక్షులు బియ్యం శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వైఎస్ జగన్, నియోజకవర్గ ఇన్‌చార్జి వేమారెడ్డి, స్థానిక నాయకులతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గురువారం రాత్రి కొందరు చింపివేశారు. ఘటనపై మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, బియ్యం శ్రీను, స్థానిక నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. ఫ్లెక్సీలపై ప్రతాపం చూపడం సరి కాదని, ప్రతి పార్టీలో రాజకీయ నాయకులకు అభిమానులు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సహజమని అన్నారు. ఫ్లెక్సీలను చించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను పట్టణ సీఐ వీరాస్వామికి అందజేసినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు ఫిరోజ్, మల్లవరపు సుధారాణి, సంకె సునీత, ఊట్లపాల శ్రీనివాసరావు, ఆకాష్, ప్రదీప్, 21వ వార్డు కార్యకర్తలు ఉన్నారు.

పట్టణ సీఐ వీరాస్వామికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాలికలకు ఉచిత హెచ్‌పీవీ టీకా

మంగళగిరి టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కోసం బాలికలకు ఉచిత హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక వీజే జూనియర్ కాలేజీ ఆవరణలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న 9 నుంచి 14 ఏళ్ల లోపు బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించే క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ టీకాను జనవరి 7వ తేదీన ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సుమారు 1000 మందికి పైగా బాలికలకు టీకా వేయనున్నట్లు తెలిపారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో తల్లిదండ్రుల అనుమతితో పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం హెచ్‌పీవీ టీకా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ప్రతినిధులు పారేపల్లి నిరంజన్ గుప్తా, వడ్లపూడి శ్రీనివాస్, జొన్నాదుల భిక్షారావు, ప్రాజెక్ట్ శక్తి చైర్మన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, ప్రాజెక్ట్ కార్యదర్శి గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అమలు కాని జీవోలు

మంగళగిరి టౌన్: ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా కూటమి ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందని.. అమలుకు నోచుకోని జీవోలను ఎందుకు ఇవ్వడం అంటూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్పొరేషన్ కమిటీ అసహనం వ్యక్తం చేసింది. సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. 2024 ఎన్నికలకు ముందు పలు కార్మికుల సమస్యల పరిష్కారానికి 17 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు సమ్మె చేశారన్నారు. నేడు మున్సిపల్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఎన్నికలకు ముందు టీడీపీ నాయకులు కుదుర్చుకున్న ఒప్పందం మేరకు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. కాగా ఎంటీఎంసీ ఎంబుక్ కార్మికులు నైట్ డ్యూటీలను కొనసాగించాలని కోరుతూ చేస్తున్న నిరసన దీక్ష శుక్రవారం నాటిని 8వ రోజుకు చేరుకుంది. ఆయా కార్యక్రమాల్లో నాయకులు వెంకటేశ్వర్లు, బాలాజీ, పార్వతి, వాసంతి, ఆరుద్రారావు, కనకారావు, దుర్గ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సమ్మెకాలపు వేతనాలు వెంటనే చెల్లించాలి

తాడేపల్లి రూరల్: మున్సిపల్ కార్మికులకు సమ్మెకాలపు వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాజధాని డివిజన్ నాయకులు ఎం.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో మున్సిపల్ కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గతేడాది డిసెంబరు 26న మున్సిపల్, ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె బాట పట్టారని, ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరాస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ నేటికీ హామీ అమలు చేయలేదని ఆయన విమర్శించారు. ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరుగుతున్న సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లు, నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎంటీఎంసీ రాజధాని ప్రాంత యూనియన్ నాయకులు స్వర్ణకుమారి, శాంతకుమారి, కుశలరావు, సుందరరావు, మేరి, బాబూరావు, స్వరూపరాణి, శ్రీను, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరావు, రాఘవయ్య, రామకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, మున్సిపల్ కార్మికులు

ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: బి.జి.ఆర్.ఎ ఎంజీ 2025 చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, మున్సిపల్ యూనియన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ అంకారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, కనీస వేతనం రోజుకు రూ.700 తగ్గకుండా ఇవ్వాలని కోరారు. వ్యక్తిగత హక్కుల ఆధారంగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంగయ్య, వెంకటేశ్వర్లు, దుర్గారావు, బాలాజీ, నాగేశ్వరరావు, వెంకటేశ్వరమ్మ, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీంబాషా

మంగళగిరి టౌన్: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యా ప్రమాణాలు ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. మంగళగిరి రూరల్ పరిధి పెదవడ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న 100 రోజుల ప్రణాళిక తీరును పరిశీలించి ప్రశ్నాపత్రాలు తనఖీ చేశారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దాలని.. ఆ స్థాయిలో విద్యాబోధన ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందించి వారి భవిష్యత్తుకు తోడ్పాటును అందించాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీంబాషా

దుకాణాన్ని నేలకూల్చిన అధికారులు

స్వచ్ఛందంగా తీస్తానన్నా సమయమివ్వని వైనం

తాడికొండ: సోడా బండితో జీవనం సాగిస్తున్న తాను బతుకుదెరువు కోసం వేసుకున్న దుకాణాన్ని అధికారులు నేలకూల్చారని తాడికొండకు చెందిన బాధితురాలు రెడ్డి శివ నాగేంద్రం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన సోడా బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నానని, రోజూ బండిని ఇంటికి నెట్టుకుని వెళ్లడం ఇబ్బందిగా మారడంతో ఇటీవల చిన్నపాటి దుకాణం ఏర్పాటు చేసి అందులో పెట్టుకునేందుకు సౌకర్యం కల్పించుకున్నానని తెలిపారు. అయితే తనకు ఎలాంటి హెచ్చరికలు చేయకుండానే పంచాయతీ అధికారులు వచ్చి దుకాణం తొలగించాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 1 గంట సమయం ఇస్తే తానే స్వచ్ఛందంగా తీసేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అయినప్పటికీ వినకుండా ట్రాక్టరుతో పడగొట్టించి దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. కన్నీళ్ల పర్యంతమై కాళ్లు పట్టుకుంటామని అడిగినా సమయం ఇవ్వకుండా పేద కుటుంబమైన తమను ఇబ్బంది పెట్టారని బాధితురాలు వాపోయారు.

కూల్చిన దుకాణం వద్ద బాధితురాలు శివ నాగేంద్రం

సావిత్రి చిరస్మరణీయురాలు

తెనాలి: వివిధ భాషా చిత్రాల్లో నటించి అసమాన ప్రతిభను చాటిన తెనాలి ఆడపడుచు, మహానటి సావిత్రి ప్రేక్షకుల హృదయాల్లో చిర్మసరణీయంగా నిలిచారని శుక్రవారం సాయంత్రం ఇస్కఫ్ హాలులో జరిగిన సావిత్రి వర్ధంతి సభలో పలువురు నివాళులర్పించారు. అభ్యుదయ కళా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు సావిత్రి జీవన సాఫల్య అవార్డు గ్రహీత రంగిశెట్టి రమేష్ అధ్యక్షత వహించారు.

సీపీఎం బృందం వక్ఫ్ భూముల పరిశీలన

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం చినకాకాని గ్రామ పరిధిలోని వక్ఫ్ భూములను శుక్రవారం సీపీఎం నాయకులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావు మాట్లాడుతూ.. వక్ఫ్ చట్టం ప్రకారం వక్ఫ్ భూములను తీసుకునే అవకాశం లేదని, ఇది చట్ట విరుద్ధమని అన్నారు. చాలా కాలంగా రైతులు పండించుకుంటున్న పంట పొలాలపై ప్రభుత్వం పారిశ్రామిక కారిడార్ పేరుతో భూములను లాక్కునే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. చినకాకానిలో సర్వే నంబర్లు 201, 202, 203, 204లోని వక్ఫ్ భూములలో చిన్న, సన్నకారు రైతులు ఏళ్ల తరబడి వ్యవసాయం చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఆయా భూములు తీసుకుంటే వారంతా రోడ్డున పడతారని వాపోయారు. ముస్లింల అభివృద్ధి, సంస్థల అభివృద్ధి, పేద ముస్లింల సంక్షేమానికి భూములు ఉపయోగపడాలి తప్ప కార్పొరేట్ సంస్థలకు కాదని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వద్దంటి దుర్గారావు, ఎం.రవి, భాగ్యరాజు, బాబు వరప్రసాద్, శివశంకరరావు, రైతులు పాలడుగు రవికుమార్, పగడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న నాయకులు

పేదలకు అండ.. సీపీఐ జెండా

తాడేపల్లి రూరల్: పేద ప్రజలకు అండగా సీపీఐ జెండా ఉంటుందని.. ప్రజల కోసమే సీపీఐ 100 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తోందని సీపీఐ నాయకులు తెలిపారు. శుక్రవారం సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద సీపీఐ జెండాను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడింది సీపీఐ అని పేర్కొన్నారు. 1925 డిసెంబర్‌లో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీకి ఘన చరిత్ర ఉందని, దేశ వ్యాప్తంగా కార్మిక, కర్షకుల ఉద్యమాలకు పెట్టింది పేరుగా పార్టీ నిలిచిందని అన్నారు. పేద, మధ్య తరగతి, బడుగు బలహీన వర్గాల కోసం సీపీఐ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు తుడిమెల్ల వెంకటయ్య, మానికొండ డాంగే, మునగాల రామారావు, షేక్ కాశిం, రైతు సంఘం నాయకులు వీరాస్వామి, శీలం శ్యామ్, అనిల్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్లిం ఆస్తులను ఐటీ పార్కుకు ఇవ్వడం హేయం

దుగ్గిరాల: సీఎం చంద్రబాబు అంజుమన్ ఏ ఇస్లామియా సంస్థల ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పే యత్నాన్ని వెంటనే విరమించుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. శుక్రవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐటీ పార్క్ పేరుతో ముస్లింల సంపదలను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేసే ఆలోచనలను తక్షణమే విరమించుకోవాలన్నారు. 1915 సంవత్సరంలో అంజుమన్–ఏ, ఇస్లామియా సంస్థకు చెందిన ఆస్తుల్లో చినకాకానిలో 81.23 ఎకరాల భూమిని ముస్లిం అభ్యున్నతి కోసం దాతలు ఇచ్చారని పేర్కొన్నారు. ముస్లింల స్కిల్ డెవలమ్మెంట్, లైబ్రరీ, ముస్లిం పిల్లల స్కాలర్‌షిప్‌లు, విద్యా సంస్థల వంటి కోసం ఈ భూమిని అప్పగించారని వివరించారు. నేడు కూటమి నాయకులు ఐటీ పార్క్ పేరుతో ముస్లిం హక్కులు, సంప్రదాయాలను కాలరాస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్.హుస్సేన్ సాహెబ్, జిలానీ పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

తెనాలి రూరల్: వివాహేతర సంబంధం ఒక వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడేలా దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్‌కు చెందిన మహిళ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామలింగేశ్వరపేట రైస్ కాలనీలో ఉంటుంది. ఆమె ఆంజనేయులుతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. విషయం తెలుసుకున్న భర్త శుక్రవారం రాత్రి కత్తితో ఆంజనేయులుపై దాడి చేశాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఉత్తమ ఫలితాలకు సాధన చేయాలి

దుగ్గిరాల: విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకమని.. విద్యార్థులు ఉత్తమ ఫలితాల కోసం నిరంతరం సాధన చేయాలని డిప్యూటీ ఎంపీడీవో కె.జె. నెహ్రూ తెలిపారు. శుక్రవారం దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. 10వ తరగతి విద్యార్థుల 100 రోజుల ప్రాణాళికలో భాగంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో అధికారులు వందశాతం ఉత్తీర్ణత సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఆయన పలు సూచినలు చేశారు. పబ్లిక్ పరీక్షల గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

ఆరోగ్య వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీయడమే

మంత్రి సత్యకుమార్ ప్రకటనను ఖండించిన ఏపీఐఎంఏ

సాక్షి, అమరావతి, లబ్బీపేట (విజయవాడతూర్పు): ఆయుర్వేద పీజీ వైద్యులకు శస్త్రచికిత్సలు చేయడానికి అనుమతిస్తున్నామంటూ మంత్రి సత్యకుమార్ చేసిన ప్రకటనను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర శాఖ తీవ్రంగా ఖండించింది. మంత్రి ప్రకటన దేశంలో స్థాపించిన చట్టపరమైన నిబంధనలు, శాస్త్రీయ సూత్రాలు, వైద్య విద్య నియంత్రణ చట్టాన్ని వ్యతిరేకించేలా ఉందని శుక్రవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.బాలరాజు ఒక ప్రకటనలో మండిపడ్డారు. మంత్రి ప్రకటన ప్రజలను తప్పుదారి పట్టించేలా, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

10 యూఎల్బీల్లో 'ప్రత్యేక' పాలన పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 10 మున్సిపాలిటీలు, నగర పంచాయతీ (అర్బన్ లోకల్ బాడీ)ల్లో ప్రత్యేకాధికారుల పాలనను మరో 6 నెలలు పొడిగించారు. ఈమేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కందుకూరు, ఆమదాలవలస, నరసరావుపేట, పొన్నూరు, కావలి, చింతలపూడి, తాడిగడప, పొదిలి, అల్లూరు, బి.కొత్తకోట ఉన్నాయి.

విలువైన భూములను బడా బాబులకు అప్పగిస్తున్న చంద్రబాబు సర్కారు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



తిరుపతి కల్చరల్ : వేలాది ఎకరాల విలువైన భూములను చంద్రబాబు సర్కారు బడాబాబులకు అప్పగిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ధ్వజమెత్తారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. అడవుల్లో ఉన్న నక్సల్స్‌ను చంపి గిరిజనులను తరిమివేసి అటవీ భూములను కార్పొరేట్‌లకు అప్పగించే కుట్ర పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల ఉపాధికి రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు కూడా వెనకాడుతున్న కేంద్రం.. కార్పొరేట్ కంపెనీలకు రూ.28 లక్షల కోట్లు మాఫీ చేసిందని విమర్శించారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు ఉన్నప్పుడు ఎంతోమంది రాజకీయ నాయకులుగా ఎదిగారని, విద్యార్థి సంఘాలకు ఎన్నికలు రద్దుచేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని ఎద్దేవా చేశారు. ప్రాథమిక హక్కులైన విద్య, వైద్యాన్ని ప్రైవేటుకు అప్పగించడం గొర్రెను కసాయికి అప్పగించడమేనన్నారు.

అక్రమ నిర్బంధంలోనూ.. గోవిందమాల వేసుకున్న చెవిరెడ్డి

గోవింద మాల ధారణలో చెవిరెడ్డి (ఫైల్)

తిరుపతి రూరల్: మద్యం అక్రమ కేసులో అరెస్టు చేసి 190 రోజులుగా అక్రమ నిర్బంధంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోర్టు అనుమతితో శుక్రవారం గోవిందమాల ధారణ చేశారు. ఏటా వైకుంఠ ఏకాదశి పర్వదినానికి ఏడు రోజులు ముందుగానే గోవిందమాల వేసుకోవడం ఆయనకు అలవాటు. అయితే చేయని తప్పునకు విజయవాడ జైలులో అక్రమంగా నిర్బంధించినప్పటికీ ఆయన తాను నమ్మిన శ్రీనివాసునిపై భక్తి వీడలేదు. ముందుగానే ఏసీబీ కోర్టులో మాలధారణకు అనుమతించాలని పిటిషన్ ఫైల్ చేయగా గురువారం న్యాయాధికారి భాస్కర్‌రావు అనుమతించారు. దీంతో ఆయన శుక్రవారం వేకువజామున జైలులోని ఆలయంలో గోవింద మాలధారణ చేసి తన భక్తిని చాటుకున్నారు. ఆయనకు కోర్టు అనుమతి మేరకు అవసరమైన సౌకర్యాలను జైలు అధికారులు కల్పిస్తున్నారు.

11 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

సాక్షి, అమరావతి: పురపాలక పట్టణాభివృద్ధిలో 11 మంది కమిషనర్లు బదిలీ అయ్యారు. గ్రేడ్–1, 2, 3 మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీ అన్‌ఫిట్ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ పోస్టులు

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 21 కేటగిరీల్లో మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ల ద్వారా ఇతర ప్రభుత్వ విభాగాల్లో ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పిస్తారు. ఈ నిర్ణయంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు ఎన్ఎంయూ, ఈయూ, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ హర్షం వ్యక్తం చేశాయి.

31నే పింఛన్లు పంపిణీ

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సాక్షి, అమరావతి: నూతన సంవత్సరం సందర్భంగా పింఛన్లు ఒక రోజు ముందుగా ఈ నెల 31న అందించనున్నట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 31న పంపిణీ చేయకుండా మిగిలిపోయే వారికి జనవరి 2న పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

మన బ్రాండ్.. స్విచ్ ఆఫ్!

భారత స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో విదేశీ కంపెనీలదే హవా

చైనా దెబ్బకు కనుమరుగైన ఇండియన్ బ్రాండ్స్

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద విపణిలో విభిన్న పరిస్థితులు

సాక్షి, స్పెషల్ డెస్క్

మొబైల్ ఫోన్ల తయారీలో చైనా తర్వాతి స్థానం భారత్‌దే. యూఎస్, యూఏఈ, నెదర్లాండ్స్, యూకే, ఆస్ట్రియా, ఇటలీ వంటి దేశాలకు మేడ్ ఇన్ ఇండియా ట్యాగ్‌తో ఐఫోన్లు ఎగుమతి అవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ల విక్రయాల్లో భారత్ రెండవ స్థానంలో ఉంది. ఏటా 15 కోట్లకుపైగా స్మార్ట్‌ఫోన్లు వినియోగదారుల చేతుల్లోకి వెళ్తున్నాయి. ఈ స్థాయిలో అమ్మకాలు జరుగుతున్నా ఇండియన్ బ్రాండ్స్ కనిపించకపోవడం గమనార్హం.

మైక్రోమ్యాక్స్ వంటి దేశీ బ్రాండ్స్ వచ్చినా..

భారత మొబైల్ ఫోన్ల విపణిలో 2010కి ముందు వరకు నోకియా (ఫిన్లాండ్), మోటరోలా (యూఎస్), ఎరిక్సన్ (స్వీడన్), సీమెన్స్ (జర్మనీ), సామ్‌సంగ్ (దక్షిణ కొరియా), సోనీ ఎరిక్సన్ (జపాన్/స్వీడన్), బ్లాక్‌బెర్రీ (కెనడా), ఎల్జీ (దక్షిణ కొరియా) కంపెనీలు రాజ్యమేలాయి. 2003లో చెన్నైకి చెందిన వీకే మునోత్‌తోపాటు పలు కంపెనీలు ఎంట్రీ ఇచ్చినప్పటికీ పెద్దగా రాణించలేదు. కానీ 2008లో మైక్రోమ్యాక్స్ రాకతో భారతీయ చవక హ్యాండ్‌సెట్స్ యుద్ధం మొదలైంది. క్రమంగా కార్బన్, లావా, సెల్‌కాన్, ఇంటెక్స్ వంటి దేశీ బ్రాండ్ల రాకతో 2010–12 మధ్య మొబైల్ ఫోన్ల కంపెనీల మధ్య పోటీ తారస్థాయికి చేరింది. దేశీయ మొబైల్ కంపెనీల దెబ్బకు ఒక దశలో నోకియా, సామ్‌సంగ్ మార్కెట్ వాటా తగ్గింది.

ఏకంగా 230 బ్రాండ్స్..

భారత మొబైల్స్ రంగంలో ఒకానొక దశలో 50%పైగా వాటాను దేశీయ కంపెనీలు చేజిక్కించుకున్నాయంటే అతిశయోక్తి కాదు. 230 దాకా భారతీయ బ్రాండ్స్ అమ్మకాలు సాగించాయి. ఫీచర్ ఫోన్లతోపాటు స్మార్ట్‌ఫోన్స్, ట్యాబ్లెట్ పీసీలు, టీవీల తయారీలోకి సైతం ప్రవేశించాయి. 2010లో చైనా కంపెనీ హువావే భారత్‌లో అడుగుపెట్టగా షావోమీ, వివో, ఒప్పో ప్రవేశంతో 2014 నుంచి అసలైన యుద్ధం మొదలైంది. చైనా బ్రాండ్ల ముందు మన కంపెనీలు నిలవలేకపోయాయి. కొన్ని భారతీయ కంపెనీలు ఇప్పుడు ఫీచర్ ఫోన్లతో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నా స్మార్ట్‌ఫోన్ల విభాగం పోటీలో మాత్రం విదేశీ కంపెనీల దరిదాపుల్లో కూడా లేవు.

ఎలా సాధ్యమైందంటే..

చవక ధరలో విక్రయించాలన్న లక్ష్యంతో ప్రవేశించిన దేశీయ బ్రాండ్స్ రిటైలర్ల మార్జిన్లపై దృష్టిపెట్టలేదనేది మార్కెట్ వర్గాల మాట. పైగా రూ. 10 వేలలోపు ధరల విభాగంలోనే ఇవి ప్రధానంగా దృష్టిపెట్టాయి. ఇక్కడే చైనా కంపెనీలు చక్రం తిప్పాయి. అధిక ఫీచర్లు, నాణ్యతకుతోడు రిటైలర్లకు అధిక లాభాలను అందించాయి. పైగా సొంత పరిశోధన, అభివృద్ధి విభాగాలతోపాటు స్మార్ట్‌ఫోన్ల తయారీ సైతం వాటి చేతుల్లోనే ఉండటంతో ధరలను శాసించాయి. విక్రయానంతర సేవలను చిన్న పట్టణాలకూ విస్తరించాయి. క్రమంగా చైనా బ్రాండ్లు భారతీయ మార్కెట్‌ను కైవసం చేసుకున్నాయి. ప్రస్తుతం మార్కెట్ పరిమాణం పరంగా దాదాపు 70% వాటా చైనా కంపెనీలదే. ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశీయ బ్రాండ్లకు అవకాశమే లేదన్నది నిపుణుల మాట.

ఇదీ భారత మార్కెట్..

- 2025 జూలై–సెప్టెంబర్ మధ్య 4.8 కోట్ల స్మార్ట్‌ఫోన్లు అమ్ముడయ్యాయి.
- రూ.72 వేలు, ఆపై ఖరీదు చేసే మోడళ్ల అమ్మకాలు ఏడాదిలో 53 శాతం పెరిగాయి.
- టాప్–10లోని సామ్‌సంగ్, యాపిల్, మోటరోలా మినహా మిగిలినవన్నీ చైనావే.
- మన దేశంలో అమ్ముడవుతున్న స్మార్ట్‌ఫోన్ సగటు ధర రూ. 26,400 పైమాటే.
- విక్రయాల్లో ఆఫ్‌లైన్ వాటా 48.3 నుంచి 56.4 శాతానికి దూసుకెళ్లగా ఆన్‌లైన్ విభాగం 51.7 నుంచి 43.6 శాతానికి తగ్గింది.
- ఈ ఏడాది స్మార్ట్‌ఫోన్ మార్కెట్ రూ. 4.34 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా.

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్న వారి సంఖ్య **70 కోట్లు**



సెప్టెంబర్ నాటికి పరిమాణం పరంగా భారత్‌లో టాప్–10 బ్రాండ్స్ మార్కెట్ వాటా (శాతాల్లో)

(ఆధారం: ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్)

చంద్రబాబును అరెస్టు చేసే దమ్ముందా ?

- బ్యాంకు రుణాలు ఎగ్గొట్టినవాళ్లు, క్రిమినల్స్‌కు రాజ్యాంగ పదవులు కట్టబెడతారు
- చంద్రబాబులాగా గంటకు రూ.కోట్లు వెచ్చించి లాయర్లను పెట్టుకునే స్తోమత మా పార్టీకి లేదు
- సీపీఎం నేత అప్పలరాజు అరెస్ట్ దుర్మార్గం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

మాట్లాడుతున్న సీపీఎం నేత శ్రీనివాసరావు

నక్కపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో క్రిమినల్స్, మర్డర్లు చేసిన వాళ్లు, కాల్‌మనీ సెక్స్ రాకెట్‌లో ఉన్నవారు, భూ కబ్జాలకు పాల్పడినవారు, వందల కోట్ల రూపాయలు బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన వారే నిస్సిగ్గుగా రాజ్యాంగ పదవులను అనుభవిస్తున్నారని, ప్రజాసమస్యలపై పోరాటం చేసే వారిని మాత్రం జైలుకు పంపిస్తున్నారంటూ సీపీఎం రాష్ట్రకార్యదర్శి వి. శ్రీనివాసరావు తీవ్రంగా మండిపడ్డారు. అనకాపల్లి జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజుపై కలెక్టర్ పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, జైలుకు పంపిన ఘటనపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన అడ్డరోడ్డులో అప్పలరాజు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 24 కేసులు ఉన్న చంద్రబాబును అరెస్టు చేసే దమ్ముందా ? పీడీ యాక్ట్ కేసులు పెట్టగలరా ? అని నిలదీశారు. అప్పలరాజు బల్క్‌డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి అండగా నిలిచారన్న అక్కసుతో మరో ఐదు కేసులు నమోదు చేశారన్నారు. అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారిలో 95 మంది అధికార పార్టీ నేతలు క్రిమినల్స్, అత్యాచారం కేసులు ఉన్నవారే అన్నారు. వందల కోట్లు బ్యాంకు రుణాలు ఎగ్గొట్టి సీబీఐ కేసులున్న వారు రాజ్యాంగ పదవుల్లో ఉంటూ చట్టసభలను నడిపిస్తున్నారని విమర్శించారు. కందుకూరు సభలో పలువురు చనిపోయినప్పుడు, గోదావరి పుష్కరాల సమయంలో చంద్రబాబు ప్రచార యావ వల్ల దాదాపు పాతిక మందికిపైగా చనిపోతే ఎందుకు కేసులు నమోదు చేయలేదని ప్రశ్నించారు. చంద్రబాబు మాదిరిగా గంటకు కోట్లు వెచ్చించి న్యాయవాదులను పెట్టుకునే స్తోమత సీపీఎంకు లేదన్నారు. తక్షణం అప్పలరాజుపై పెట్టిన కేసులు ఎత్తివేయకపోతే ప్రజాన్యాయవాదుల ద్వారా న్యాయపోరాటం చేస్తామన్నారు. సమావేశంలో సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లానాయకులు కోటేశ్వరరావు, ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకూ జీతాలివ్వరా!

- గ్రామాల్లో జీతాలందక పారిశుధ్య కార్మికుల ఇక్కట్లు
- జనరల్ ఫండ్ నిధులనూ నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 20 రోజులుగా సీఎఫ్ఎంఎస్‌లో ఆగిపోయిన బిల్లులు
- ఇప్పటికే స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చిన నిధులపైనా ఆంక్షలు

గ్రామాల్లో ఆగిపోయిన పనులు..

సాక్షి, అమరావతి: ఇప్పటికే స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను తొక్కిపెడుతూ, వినియోగంపై ఆంక్షలు విధించిన చంద్రబాబు సర్కారు తాజాగా గ్రామాల్లో పారిశుధ్యం, బ్లీచింగ్ పౌడర్ కొనుగోళ్ల బిల్లులను నిలిపివేసింది. దీంతో కనీసం క్రిస్మస్ పండుగ సమయంలోనూ జీతాలు అందక పారిశుధ్య కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీలు ఇంటి పన్ను రూపంలో వసూలు చేసుకునే జనరల్ ఫండ్స్ నిధులపై సైతం చంద్రబాబు సర్కారు ఆంక్షలు విధించడం పట్ల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు మండిపడుతున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని, ఇప్పుడు 20 రోజులుగా బిల్లులు రాష్ట్ర ఆర్థిక శాఖ పరిధిలోని సీఎఫ్ఎంఎస్‌లో నిలిచిపోయినట్లు సర్పంచుల సంఘం ప్రతినిధులు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో మురుగు కాల్వలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, కాంట్రాక్టు లేదా ఔట్ సోర్సింగ్ కార్మికులు తదితర పంచాయతీ సిబ్బందికి జనరల్ ఫండ్స్ నిధుల నుంచే వేతన చెల్లింపులు జరుగుతుంటాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు దాదాపు రూ.450 కోట్ల మేర జనరల్ ఫండ్ నిధులున్నట్లు సమాచారం. అవి పంచాయతీల సొంత నిధులే అయినప్పటికీ ఖర్చు చేయాలంటే ఆర్థిక శాఖ పరిధిలోని సీఎఫ్ఎంఎస్ ద్వారానే జరగాలి. అయితే పారిశుధ్య కార్మికుల వేతనాలతో పాటు బ్లీచింగ్ కొనుగోలు తదితరాలకు సంబంధించిన బిల్లులు కొద్ది రోజులుగా సీఎఫ్ఎంఎస్‌లో పాస్ కావడం లేదు. దీంతో గ్రామాల్లో చిన్న చిన్న పనులు సైతం జరిగే పరిస్థితి లేదని సర్పంచుల సంఘం ప్రతినిధులు వాపోతున్నారు.

బిల్లులు వెంటనే పాస్ చేయాలి..

రాష్ట్రవ్యాప్తంగా జనరల్ ఫండ్స్ నిధుల బిల్లులు పాస్ కాకపోవడంతో సర్పంచులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ, సీఎఫ్ఎంఎస్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఏ.గౌతమ్‌ను కలసి వెంటనే బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేసిన కార్మికులు, ఇతర అవసరాల కోసం 20 రోజులుగా నిధులు చెల్లించే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల గ్రామ సర్పంచ్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందు వెంకట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల బరి వద్ద జూదం(ఫైల్)

బరి వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లు

కృష్ణా జిల్లా కంకిపాడులో కోడి పందేల బరులు (ఫైల్)

కూటమి నేతల 'బరి'తెగింపు

కోడి పందేలు, జూద క్రీడలకు హైటెక్ ఏర్పాట్లు

ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరిలో భారీగా బేరాలు

- మూడు రోజుల్లో చేతులు మారనున్న రూ.వందల కోట్లు
- రూ.కోట్లు దండుకోనున్న కూటమి ప్రజాప్రతినిధులు
- కేసరపల్లి బరి కోసం నియోజకవర్గ ప్రజాప్రతినిధికి రూ.2 కోట్లు
- పెనమలూరు నియోజకవర్గంలో క్యాసినోకు రూ.70 లక్షలు
- పెద్దఎత్తున బరులు... బేరం పెట్టి రేటు నిర్ణయం
- సంక్రాంతి సంప్రదాయం మాటున డబ్బు లూటీ
- చక్రం తిప్పుతున్న కూటమి పార్టీల నాయకులు
- అడ్వాన్సులు చెల్లిస్తున్న జూదాల నిర్వాహకులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ, సాక్షి భీమవరం: కత్తులు దూసే కోళ్లు... దానివెనుక జూద క్రీడలు.. చుట్టూ గ్యాలరీలు, ఎల్ఈడీ స్క్రీన్లు... వేలల్లో సందర్శకులు..! పెద్దమొత్తంలో చేతులు మారనున్న నగదు..! ఇదీ ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సంక్రాంతి సంప్రదాయం మాటున అధికార కూటమి నేతల 'బరి'తెగింపు. కార్పొరేట్ హంగులతో భారీ ప్రాంగణాల్లో బరులు ఏర్పాటు చేస్తూ కోడి పందేలు, జూదం నిర్వహించేందుకు వీరంతా సిద్ధమవుతున్నారు. కోడి పందేలపై నిషేధం ఉన్నా పండుగ ముసుగులో 20 రోజుల ముందే బరులకు బేరాలు పెట్టి రేట్లు ఖరారు చేశారు. వీవీఐపీల కోసం ఏసీల వంటి హైటెక్ సదుపాయాలూ కల్పిస్తున్నారు. సాధారణంగా కోడి పందేలు, జూదం సాయంత్రం చీకటి పడే వరకే జరుగుతాయి. ఈసారి ఏకంగా మూడు రోజులు రేయింబవళ్లు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

కూటమి నేతలతో నిర్వాహకులకు సిఫార్సులు

సంక్రాంతికి మూడు వారాలు మాత్రమే ఉండడంతో కోడిపందేలకు పెట్టింది పేరైన పశ్చిమ గోదావరి జిల్లాలో సన్నాహాలు మొదలయ్యాయి. కోడిపందేలు చూసేందుకు వచ్చినవారి జేబులు ఖాళీ చేయించడంలో గుండాట, పేకాట, కోతాట, జూదం నిర్వహణలో ఆరితేరినవారిదే ప్రధాన పాత్ర. దీంతో బరుల కోసం కూటమి నేతలతో నిర్వాహకులకు సిఫార్సు చేయించుకునే పనిలో ఉన్నారు. బరి ప్రత్యేకత, జనం రద్దీని బట్టి రూ.25 లక్షల నుంచి రూ.కోటిపైగా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. భీమవరం చుట్టుపక్కల రూ.కోటి పైనే పలుకుతుండగా, ఇతరచోట్ల రూ.25 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఇస్తామని ముందుకొస్తున్నారు. భీమవరం దగ్గర పెద్ద బరిలో గుండాటకు రూ.70 లక్షలు, పేకాటకు రూ.40 లక్షలు, కోతాటకు రూ.20 లక్షలు ఇచ్చేందుకు అడ్వాన్సులు చెల్లించినట్లు తెలిసింది.

మద్యం, పేకాట శిబిరాలకు తలుపులు బార్లా

సంక్రాంతికి ముందు మద్యం, పేకాట శిబిరాలకు చంద్రబాబు ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. దీంతో పెద్దఎత్తున కోడి పందేలు, క్యాసినో, గుండాట, పేకాట, మద్యం దుకాణాలు, వ్యాపార సముదాయాలు నెలకొల్పేందుకు ఆశావహులు పోటీ పడుతున్నారు. కొన్నిచోట్ల ఎంట్రీ ఫీజు రూ.5 వేలుగా నిర్ణయించారు. ఏ ఇబ్బందీ రాదని బరుల నిర్వాహకులకు ప్రజాప్రతినిధులు భరోసా ఇస్తున్నట్లు సమాచారం. జూదరుల కోసం హోటల్ రూమ్‌లను బుక్ చేస్తున్నారు. పండుగ మూడు రోజుల్లో రూ.వంద కోట్లు చేతులు మారనున్నాయి. ఈ ఏడాది ప్రత్యేకంగా క్యాసినో నిపుణులను దించుతున్నారు. 'అందర్–బాహర్, తీన్‌పత్తి, బ్లాక్ జాక్, నంబరింగ్, బకారత్'తో పాటు కోత ముక్క, స్లైక్ తదితర జూద క్రీడలకు బేరాలు మాట్లాడారు. ఈ ఆటల్లో నిపుణులైన నార్త్, గోవా, నేపాల్ డీలర్లతో బరుల నిర్వాహకులు ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. ఇందుకు సంబంధించి మహిళలను రప్పించేందుకూ అధికార పార్టీ నేతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

జూదాలతోనే జనం జేబులు గుల్ల

కోడి పందేలతో పోలిస్తే బరుల వద్ద జరిగే జూదాలే నిర్వాహకులకు ఆదాయ వనరు. పెద్ద బరిలో రోజుకు 20–25 పందేలు మాత్రమే జరుగుతాయి. ఒక్కోదానికి రూ.25 వేల వరకు వసూలు చేస్తే మూడు రోజుల్లో వచ్చే మొత్తం రూ.20 లక్షలు. చిన్న బరుల్లో రూ.5 లక్షలలోపు ఉంటుంది. రెండు, మూడు ఎకరాలలో టెంట్లు, పందెం బరి, గ్యాలరీలు, కుర్చీలు, ఎల్ఈడీ స్క్రీన్లు తదితరాలతో పెద్ద బరికి రూ.40 లక్షలు, చిన్న, మధ్యస్థాయి వాటికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుంది.

పోలీసు పోస్టుకు గిరాకీ

గన్నవరం నియోజకవర్గంలో పెద్దఎత్తున బరులు, జూద క్రీడలు జరగనున్న నేపథ్యంలో అక్కడి ఓ పోలీసు సర్కిల్ అధికారి పోస్టుకు గిరాకీ నెలకొంది. మూడు నెలలుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టుకు ఉన్నత స్థాయిలో భారీగా ముడుపులు తీసుకుని, అనుకూలమైన వారికి పోస్టింగ్ వేయించుకున్నట్లు టీడీపీ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.పశ్చిమ గోదావరి జిల్లాలో కోడి పందేల మాటున చట్టవిరుద్ధంగా జరిగే కార్యకలాపాల వైపు ఎవరూ కన్నెత్తి చూడకుండా నేతలు, సంబంధిత వర్గాలకు భారీగా మామూళ్లు ముట్టజెప్పాలి. వారికి పంపే కోజాలు (పందెం పుంజులు), బౌన్సర్లు, సిబ్బంది జీతాలు, అతిథులకు భోజనాలు తదితర రూపాల్లో బరిని బట్టి రూ.20 లక్షల నుంచి రూ.కోటి పైనే అవుతుంది. జూదాలు, అశ్లీల నృత్యాలు, మద్యం, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నుంచి ఈ మొత్తాన్ని రాబట్టనున్నారు.

రూ.కోట్లు దండుకోనున్న కూటమి ప్రజాప్రతినిధులు

- ఉమ్మడి కృష్ణాలో ఒక్కో నియోజకవర్గంలో పదిపైగా బరులు ఏర్పాటు చేస్తున్నారు. స్థాయిని బట్టి రూ.30 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు టీడీపీ ప్రజాప్రతినిధులకు ఇవ్వాలి. ఇలా కేసరపల్లి బరికి నియోజకవర్గ ప్రజాప్రతినిధికి రూ.2 కోట్లు ఇవ్వనున్నారు. గన్నవరం, పెనమలూరు, గుడివాడ, పామర్రు, అవనిగడ్డల్లో టీడీపీ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు రూ.కోట్లు దండుకోనున్నారు.
- 30 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా విజయవాడ, పరిసర ప్రాంతాలైన రామవరప్పాడు, ఎనికేపాడుల్లో సంక్రాంతి సంబరాల పేరుతో బరులు ఏర్పాటు చేస్తున్నారు.
- పెనమలూరు నియోజకవర్గం ఉప్పులూరులో క్యాసినో ఆడించేందుకు ప్రజాప్రతినిధితో రూ.70 లక్షలకు ఒప్పందం కుదిరింది. క్యాసినో ఆడించడంలో దిట్టగా పేరొందిన వ్యక్తితో పాటు, గంజాయి కేసులో నిందితుడికి ఈ బరిని అప్పజెప్పారు.
- నున్న ప్రాంతంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో హైటెక్ బరిలో పెద్దఎత్తున క్యాసినో ఆడించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా సరిహద్దులో ఉన్న ఆగిరిపల్లిలో పేకాట ఆడించడంలో కృష్ణా జిల్లా వారే కీలక పాత్ర పోషించడం గమనార్హం.
- పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, పరిసరాల్లో జరిగే కోడి పందేలను చూసేందుకు తెలుగు రాష్ట్రాల రాజకీయ, సినీ ప్రముఖులు వస్తుంటారు. బరుల వద్ద గుండాట, పేకాట, కోతాట తదితర జూద క్రీడలు పెద్దఎత్తున జరుగుతాయి. జిల్లాలో వందపైనే బరులు రానున్న నేపథ్యంలో గుండాట, పేకాట, కోతాట, మద్యం బెల్టు షాపులు నెలకొల్పేందుకు బేరాలు సాగుతున్నాయి. బరిని బట్టి రూ.కోటి పైనే చెల్లించేలా ఒప్పందాలు చేసుకుంటున్నట్టు సమాచారం.

భీమవరంలోని గొల్లవానితిప్ప, ఉండి, తాడేరు రోడ్డుతో పాటు ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లులో పెద్ద బరులు ఏర్పాటు కానున్నాయి. చాలాచోట్ల టీడీపీ-జనసేన నేతలు సంయుక్తంగా, కొన్నిచోట్ల వేర్వేరుగా సిద్ధం చేస్తున్నారు.

బై బై 2025... వెల్‌కమ్ 2026.
మరో నాలుగు రోజుల్లో అందరూ ఇదే అనబోతున్నారు.
న్యూ ఇయర్‌లో చేయాల్సిన పనులు,
అందుకోవాల్సిన విజయాల గురించి ఆరాటపడుతున్నారు.
ఈ పెద్దల ప్రపంచం ఎప్పుడూ ఇలాగే ఉంటుంది.
మరి పిల్లలూ... మన సంగతి?
2025 ఘటనలు, పరిణామాలు మనకు ఏం చెప్పాయి?
ఎలా స్ఫూర్తినిచ్చాయి? ఏం నేర్పాయి? ఏమి హెచ్చరికలు చేశాయి?
ఒకసారి అలా ఒక రౌండేసి చూద్దామా?

పిల్లలూ ప్రపంచమూ

2025లో పిల్లలూ... పరిణామాలు

సోషల్ మీడియా

ఈ ఏడాది జరిగిన పరిశోధనల్లో సోషల్ మీడియా ప్రభావం చిన్నారుల పైనా పడుతోందని గుర్తించారు. చాలామంది తల్లిదండ్రులు తమ 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను ఎలా వాడుతున్నారు, ఎందుకోసం వాడుతున్నారనేది గమనించడం లేదు. అయితే కొందరు చిన్నారులు అనైతిక చర్యల కోసం సోషల్ మీడియాను వాడుతున్నారని, మరికొందరు మానసిక సంబంధిత సమస్యలకు గురవుతున్నారని తెలడంతో ఆస్ట్రేలియా ఇటీవల చిన్నారుల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించింది. తమ పిల్లలకు డిజిటల్ వ్యవహారజ్ఞానం అందించాలని అనుకోవడం మంచిదే కానీ, దానిపైనా పెద్దల అజమాయిషీ అవసరం అని 2025లో నిపుణులు తేల్చారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్

2025లో ఏఐ బలంగా దూసుకుపోయింది. రాబోయే కాలంలో దీని ప్రభావం మరింత పెరుగనుంది. ఈ నేపథ్యంలో పిల్లల హక్కులపై దాని ప్రభావం తప్పకుండా పడుతుందని నిపుణులు అంటున్నారు. 16 ఏళ్లలోపు పిల్లలు ఏఐ మీద నమ్మకంతో అన్ని విషయాలు దాంతో పంచుకుంటున్నారు. కొందరు తమ ఆస్తిపాస్తుల వివరాలు, తమ వ్యక్తిగత విషయాలు, తన లైంగికేచ్ఛలు కూడా వాటితో చెప్పడం ఆందోళన కలిగిస్తోంది. ఒంటరితనం నుంచి వారు దూరమవడానికి చేసే క్రమంలో జరుగుతున్న పరిణామం ఇది. దీనివల్ల దీర్ఘకాలికంగా చాలా నష్టాలు ఉన్నాయనేది నిపుణుల మాట. ముఖ్యంగా పిల్లలు బయటి ప్రపంచంతో సంబంధాలు తెంచేసుకొని, కేవలం ఏఐతోనే అనుబంధం పెంచుకోవడం భారీ ముప్పుగా మారుతుందని అంటున్నారు.

వీరే మన ఇన్‌స్పిరేషన్

2025లో మెరిసిన తారలు బాలల్లో ఉన్నారు.
బాలలకు స్ఫూర్తినిచ్చేలా వార్తల్లో నిలిచినవారూ ఉన్నారు.

టైమ్ పత్రిక 'కిడ్ ఆఫ్ ది ఇయర్'

అమెరికన్ టీనేజర్ తేజస్వి మనోజ్ ప్రోగ్రామర్‌గా, వెబ్‌సైట్ డెవలపర్‌గా వార్తల్లో నిలిచింది. కాలిఫోర్నియాలో జన్మించిన తేజస్వి టెక్సాస్‌లో పెరిగింది. సైబర్ నేరాల నుండి వృద్ధులను రక్షించడానికి ఒక యాప్‌ను కనిపెట్టింది. ఆమె చొరవకు 2025లో టైమ్ పత్రిక వారి 'కిడ్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకుంది. ఆమె ఫ్రిస్కోలోని లెబనాన్ ట్రైల్ హైస్కూల్‌లో చదువుకుంటోంది.

'సర్కాడియావి' యాప్..

ఎన్‌ఆర్‌ఐ విద్యార్థి అయిన సిద్ధార్థ్ నంద్యాలకు 14 ఏళ్లు. అంత చిన్న వయసులోనే గుండె జబ్బులను గుర్తించడానికి ఏఐను ఉపయోగించి 'సర్కాడియావి' అనే యాప్‌ను అభివృద్ధి చేశాడు. సిద్ధార్థ్ ఆవిష్కరణ గురించి తెలుసుకున్న రాష్ట్రనేతలు అతన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ యాప్ ద్వారా గుండె జబ్బులను నియంత్రించడంతో పాటు మరణాలను అరికట్టవచ్చు.

గుకేష్... ది గ్రాండ్‌మాస్టర్..

2025లో భారతీయ చదరంగంలో డి.గుకేశ్ పేరు మారుమోగింది. 2025లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచి ప్రపంచాన్ని తనవైపు తిప్పుకున్నాడు. 12 ఏళ్ల వయసులోనే గ్రాండ్‌మాస్టర్‌గా మారి, ఆ తర్వాత క్యాండిడేట్స్ టోర్నమెంట్‌ను గెలుచుకున్న అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. గుకేశ్ తన ఆట శైలికి, ఆత్మవిశ్వాసానికి ప్రసిద్ధి చెందాడు. కష్టపడితే కలలెలా నిజమవుతాయో చెప్పడానికి అతను నిదర్శనంగా మారాడు. గుకేష్ చాలా మంది పిల్లలకు నేడు ఐడెల్‌గా కనిపిస్తున్నాడు.

క్రికెట్ స్టార్... వైభవ్ సూర్యవంశీ

14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ క్రికెట్‌లో దూసుకుపోతున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్నాడు. జనవరి 2024లో అరంగేట్రం చేసి ఇండియన్ లిస్ట్ ఏలో కెరీర్ మొదలుపెట్టిన అతి పిన్న వయస్కుడిగా పేరుపొందాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అరంగేట్రం చేసిన అతి చిన్నవయసు ఆటగాడిగా మారాడు. ఇటీవల రాష్ట్రపతి భవన్‌లో వైభవ్ సూర్యవంశీకి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్‌ను అందజేశారు.

రికార్డ్స్

కామిక్ పుస్తకం ఖరీదు రూ.81.8 కోట్లు



2025 నవంబర్‌లో అత్యంత అరుదైన ఓ కామిక్ పుస్తకం 9.12 మిలియన్ డాలర్ల (రూ.81.8 కోట్ల)కు అమ్ముడుపోయింది. సూపర్‌మ్యాన్ కథలుండే 'సూపర్‌మ్యాన్' కామిక్ పుస్తకాల శ్రేణిలో ఇది మొదటి సంచిక. ఒక అటకపై కనుగొన్న ఈ పుస్తకాన్ని ఆ ఇంటివారు వేలం వేయగా ఇంత భారీ ధర పలికింది. ఇప్పుడిది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కామిక్ పుస్తకంగా నిలిచింది.

80 ఏళ్ల వయసు ఐరన్‌మ్యాన్

అక్టోబర్ 11న, 2025 ఐరన్‌మ్యాన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ట్రయాథ్లాన్‌లో 1,600 మందికి పైగా అథ్లెట్లు ఈత కొట్టారు. అనంతరం వారు 100 మైళ్లకు పైగా సైకిల్ తొక్కారు. ఆ తర్వాత ఒక మారథాన్ పరుగును పూర్తి చేశారు. ఇందులో 80 ఏళ్ల నటాలీ గ్రాబో ఈ మొత్తం రేసును పూర్తి చేశారు. ఈ పోటీని పూర్తి చేసిన అత్యంత వృద్ధ మహిళగా రికార్డు సృష్టించింది.

ఓటీటీ స్పెషల్

'అడాలసెన్స్' సైకలాజికల్ క్రైమ్ డ్రామా సిరీస్

2025లో విడుదలైన 'అడాలసెన్స్' సైకలాజికల్ క్రైమ్ డ్రామా సిరీస్ అనేకమందికి కనువిప్పుగా మారింది. 13 ఏళ్ల పిల్లాడు తన పాఠశాలలో ఒక అమ్మాయి హత్య చేసి అరెస్టయిన ఉదంతం ఇందులోని కథ. కథంతా అతని చుట్టూ, అతని ఆలోచనల చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ప్రతి ఎపిసోడ్‌ను ఒకే టేక్‌లో చిత్రీకరించడం విశేషం. మార్చి 13, 2025న నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ విడుదలైంది.

వాతావరణంలో మార్పులు..

వాతావరణ మార్పు పిల్లల భవిష్యత్తుకు అత్యంత తీవ్రమైన ముప్పుగా మారుతోందని 2025 హెచ్చరించింది. పర్యావరణానికి జరుగుతున్న నష్టం వల్ల ఆహార అభద్రత ఏర్పడి ఆరోగ్య సంక్షోభాలు లక్షలాది మంది పిల్లల భవితను ప్రశ్నార్థకంగా మార్చవచ్చు. అందుకే 2025లో పలు దేశాల్లో చిన్నారులు బృందాలుగా ఏర్పడి పర్యావరణ పరిరక్షణ కోసం తమ వాణి వినిపించారు. భూమిని కాపాడాలని, తమ భవితకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలని కోరారు. 2026 నుంచి ప్రపంచమంతా ఈ విషయంపై బలమైన దృక్పథం ఏర్పరచుకోవాలని నిపుణులు అంటున్నారు.

ఆరోగ్యం

పిల్లలకు తినడానికి ఆహారం ఇచ్చి స్కూళ్లకు పంపితే చాలని తల్లిదండ్రులు అనుకుంటున్నారు. అయితే శ్రమ లేని జీవనశైలి, మానసిక ఒత్తిడి, ఆటపాటలకు దూరమవడం, రసాయనిక ఆహార పదార్థాలు, వేళ కాని వేళల్లో నిద్ర వంటి అంశాలన్నీ కలిసి చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తున్నాయి. పెరుగుతున్న ఊబకాయం రేట్లు ఒకపక్క, ప్రపంచ పోషకాహార లోపం మరో పక్క 2025ను ఆందోళనకు గురి చేశాయి. ఈ ప్రభావం చిన్నారుల మీద వెంటనే పడకపోయినా, రానున్న కాలంలో మరింత గడ్డు పరిస్థితిని తేనుందని నిపుణులు అంటున్నారు. జంక్ ఫుడ్ ఉత్పత్తులను చిన్నారుల దాకా చేరకుండా అడ్డుకోవడం తల్లిదండ్రులకు సవాలే అని తేల్చారు.

బాల కార్మికులుగా చాకిరీలో..

2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా బాల కార్మిక వ్యవస్థను అంతం చేయాలని 2015లో ఐక్యరాజ్యసమితి లక్ష్యంగా పెట్టుకుంది. అయితే 2025 వచ్చి వెళ్లిపోతున్నా ఇంకా 138 మిలియన్ల మంది పిల్లలు బాల కార్మికులుగా ఉన్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ, యూఎన్ బాలల నిధి విడుదల చేసిన బాల కార్మిక నివేదికలో పేర్కొంది. అతి త్వరలో ప్రపంచంలో బాల కార్మిక వ్యవస్థ రూపుమాసిపోతుందని తెలిపింది. అందరూ సమష్టిగా కృషి చేసి ఎక్కడా బాలకార్మికులు లేకుండా చూడాలని పిలుపునిచ్చింది.

పరిశోధనలూ హెచ్చరికలూ

జన్యు-సవరణ విధానం

పిల్లలూ... ఈ సంవత్సరం వైద్య రంగంలో ఒక మంచి జరిగింది. జన్యుపరమైన అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడే చిన్నారుల కోసం శాస్త్రవేత్తలు మొట్టమొదటిసారి జన్యు-సవరణ విధానాన్ని సృష్టించారు. తన డీఎన్ఏలో సమస్య కారణంగా అనారోగ్యంతో ఉన్న ఓ చిన్నారిపై అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఈ CRISPR (Clustered Regularly Interspaced Short Palindromic Repeats) విధానంతో చికిత్స అందించారు. ఆ చిన్నారి ఇప్పుడు చాలా వరకు కోలుకున్నాడు. త్వరలోనే ఇతర పిల్లల్లాగే అతనూ ఎదుగుతాడని, వైద్యశాస్త్రంలో ఇది కీలక పరిణామని శాస్త్రవేత్తలు అంటున్నారు.

2025 పుస్తకాలు

2025లో పిల్లల కోసం అనేక పుస్తకాలు మార్కెట్లోకి వచ్చాయి. అందులో కొన్ని మాయలు, మంత్రాలతో కూడిన ఊహా ప్రపంచం కాగా, మరికొన్ని వారిలో మంచిని పెంచి, ఆసక్తికరంగా చదివించే విషయాలు ఉన్నాయి. ఇవి బాగా అమ్ముడుపోయాయి.

ది లాస్ట్ బుక్‌స్టోర్ ఆన్ ఎర్త్
– లిల్లీ బ్రౌన్-ఆర్నాల్డ్

ఒక వినాశకరమైన తుఫాను లిజ్ ప్రపంచాన్ని ఛిన్నాభిన్నం చేసి ఏడాది సంవత్సరం గడిచింది. ఇప్పుడు మరో ప్రళయం రాబోతోంది. ఈ సమయంలో ఆమె సురక్షితంగా భావించిన ఏకైక ప్రదేశంలో ఆమె గతంలో పని చేసిన పుస్తకాల దుకాణం ఉంది. అక్కడ ఏం జరిగిందనేది ఇందులోని కథ.

ది డే మై స్కూల్ గాట్ ఫేమస్
– జెన్ కార్నీ

పాఠశాలకు మంచి డిజైన్ సూచించాలని ప్రధాన ఉపాధ్యాయుడు సవాలు విసిరారు. గెలిచినవారికి బహుమతి ఇస్తానని ప్రకటించాడు. ఫెర్రిస్ తన సోదరుడు నైల్‌తో కలిసి ఆ డిజైన్ కోసం ప్రయత్నించాలనుకున్నాడు. కానీ అతను ఎక్కడికి వెళ్ళినా అల్లరి చేస్తాడు. బహుమతిని గెలుచుకోవడానికి వారిద్దరూ తమ విభేదాలను పక్కన పెట్టారా అనేది ఇందులోని కథ.

పీపుల్ లైక్ స్టార్స్
– పాట్రిస్ లారెన్స్



13 ఏళ్ల ముగ్గురు అపరిచితులకు నడుమ ఒక పెద్ద రహస్యం ముడిపడి ఉంది. అదేమిటనేదే ఇందులోని కథ. వారెవరు? వారికీ, ఆ రహస్యానికీ సంబంధం ఏమిటి అనే ఆసక్తికరంగా సాగుతుంది. విచ్ఛిన్నమైన కుటుంబాలు తిరిగి కలవడం, చరిత్రలోని రహస్యాలు తెలుసుకోవడం ఇందులో చూడొచ్చు.

పులోమా అండ్ ది బేర్ – జస్బిందర్ బిలాన్



పులోమా అనే బాలికకు సవాల్ ఎదురైంది. ఓ ప్రమాదం నుంచి ఒకేసారి నైలా అనే ఎలుగుబంటిని, తనను తాను రక్షించుకోవాలి. అది సాధ్యమేనా? అప్పుడు ఆమె ఏం చేసింది? ఎటువంటి మార్గాలు అన్వేషించింది? ఉత్కంఠభరితమైన ఈ సాహసయాత్ర చిన్నారుల్ని విశేషంగా అలరిస్తోంది. బందీగా ఉన్న ఎలుగుబంటిని రక్షించడానికి పులోమా ధైర్యాన్ని చదివి తీరాలి.

స్మార్ట్ కుకింగ్

చాలామందిలో ఆరోగ్య స్పృహతో పాటు ఫిట్‌గా ఉండాలనే ఆలోచన కూడా పెరిగింది. వారాంతాల్లో, ప్రత్యేకమైన రోజుల్లోనూ వంటకాల వైపు దృష్టి పెడుతున్నారు. వాటిలో... అధిక ప్రోటీన్ ఉండేవి, మొక్కల ద్వారా లభించే పదార్థాలు... కూరగాయలు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, వివిధ రకాల పండ్లు... మొదలైన వాటిని కుండ లేదా పాన్ పైన నిమిషాల్లో తయారుచేసుకొని తినడం అనేది ట్రెండ్‌గా నడిచింది. ఇది మాంసాహార వంటకాలకూ వర్తించింది. సులభంగా తయారు చేయగల వంటకాలలో కొన్ని...

ఈ యేడాది క్విక్‌గా, హెల్తీగా ఉండే వంటకాలపై చాలా మంది దృష్టి పెట్టారు. ఆరోగ్యకరమైన భోజనంతో పాటు సమయాన్ని ఆదా చేయడం కూడా దీని వెనక ముఖ్య ఉద్దేశ్యం. క్విక్ అండ్ హెల్తీ, టేస్టీగా ఉండే వంటకాల తయారీ గురించి చెఫ్ గోవర్ధన్ ఇచ్చిన రెసిపీస్‌తో వంటిల్లు.

వంటిల్లు

తడ్కా స్ప్రౌట్స్

కావలసినవి: మొలకలు (పెసలు లేదా శనగలు) – కప్పు; **ఉల్లిపాయ** – 1 (సన్నగా తరిగినది); **పచ్చిమిర్చి** – 2–3 (సన్నగా తరిగినవి); **ఆవాలు** – 1/2 టీస్పూన్; **జీలకర్ర** – 1/2 టీస్పూన్; **కరివేపాకు** – 2 రెమ్మలు; **కొబ్బరి తురుము** – 2 టేబుల్ స్పూన్లు; **నూనె** – టేబుల్ స్పూన్; **ఉప్పు** – రుచికి సరిపడా;

తయారీ: ● మొలకలను కొద్దిగా ఉప్పు వేసి కాస్త పలుకుగా ఉండేలా ఉడికించాలి. ● పాన్‌లో నూనె వేడి చేసి, ఆవాలు, జీలకర్ర, పచ్చిమిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించాలి. ● తాలింపులో ఉడికించిన మొలకలు, కొబ్బరి తురుము, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపాలి. ●ఈ వంటకాన్ని సలాడ్ రూపంలో తినచ్చు. లేదా కొంచెం మసాలా వేసి, వడ లేదా రెసిపీ కూడా చేసుకోవచ్చు.

ఎగ్ రోల్

కావలసినవి: చపాతీ/పరాతా – 2–3; **గుడ్లు** – 2 లేదా 3; **ఉల్లిపాయ** – సన్నగా తరిగినది; **పచ్చిమిర్చి** – 2 (సన్నగా తరిగినవి); **అల్లం, వెల్లుల్లి పేస్ట్** – టీస్పూన్; **క్యారెట్ తురుము** – తగినంత; **పసుపు** – చిటికెడు; **కారం** – అర టీ స్పూన్; **కొత్తిమీర** – కొద్దిగా; **ఉప్పు** – రుచికి సరిపడా; **నూనె** – వేయించడానికి సరిపడా; **టొమాటో కెచప్, మయోనైజ్** – తగినంత.

తయారీ: ● ఒక గిన్నెలో గుడ్ల సొన, ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలపాలి. ● పాన్ లో కొద్దిగా నూనె వేసి, సన్నగా తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి వేయించాలి. ● అల్లం-వెల్లుల్లి పేస్ట్, క్యారెట్ తురుము వేసి, వేయించాలి. పసుపు, కారం, కొత్తిమీర వేసి కలపండి. ● ఈ మిశ్రమంలో గుడ్డు మిశ్రమాన్ని పోసి, స్పూన్‌తో వెడల్పుగా అని, ఆమ్లెట్‌లాగా సిద్ధం చేసుకోవాలి. ● వేడి చపాతీని ఒక ప్లేట్ లో పెట్టి, దానిపై టొమాటో కెచప్, మయోనైజ్ రాయాలి. ● తయారుచేసుకున్న ఆమ్లెట్ ను చపాతీ మధ్యలో పెట్టి, సన్నగా తరిగిన ఉల్లిపాయలు చల్లాలి. ● చపాతీని గట్టిగా రోల్ చేసి సర్వ్ చేయాలి.

చెఫ్ గోవర్ధన్
హైదరాబాద్

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) డిసెంబర్ 26న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,42,610	బంగారం (24 క్యారెట్లు)	1,41,880	బంగారం (24 క్యారెట్లు)	1,40,020	బంగారం (24 క్యారెట్లు)	1,41,880	బంగారం (24 క్యారెట్లు)	1,42,800	బంగారం (24 క్యారెట్లు)	1,40,620
బంగారం (22 క్యారెట్లు)	1,27,740	బంగారం (22 క్యారెట్లు)	1,28,350	బంగారం (22 క్యారెట్లు)	1,28,350	బంగారం (22 క్యారెట్లు)	1,37,880	బంగారం (22 క్యారెట్లు)	1,31,380	బంగారం (22 క్యారెట్లు)	1,28,900
వెండి	2,27,000	వెండి	2,37,800	వెండి	2,54,000	వెండి	2,26,000	వెండి	2,35,500	వెండి	2,54,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

తెగే బంధానికి ఈజీ.. రాజీ

> 'ఒకప్పుడు దంపతులు కలిసి ఉండటానికి రాజీ కుదర్చాల్సిన పరిస్థితులు కనిపించేవి. ఇప్పుడు జంటలు విడిపోవడానికి అధిక శాతం రాజీ పడుతున్నారు' అంటున్నారు న్యాయ నిపుణులు. అంతేకాదు, చిన్న చిన్న విషయాలు భూతద్దంలో చూసి, విడాకులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది అంటున్నారు. భార్య కుక్కలు పెంచుతోందని భర్త విడాకులకు వెళ్లడం, బ్యూటీ పార్లర్ ఖర్చు కోసం భరణం ఎక్కువ ఇవ్వాలని భార్య తిరిగి కోర్టును ఆశ్రయించడం, ఇవన్నీ ఇప్పుడు పెద్ద సమస్యలే అయ్యాయని అంటున్నారు. వైవాహిక బంధంలో వస్తున్న ఈ పెనుమార్పులు రాబోయే కాలానికి ఈ యేడాది చెబుతున్న కొత్త భాష్యం..

''ఈ యేడాది న్యాయపరంగా చూస్తే విడాకుల సంఖ్య బాగా పెరిగింది. సెక్షన్ 490ఎ కింద వరకట్న కేసులు కోర్టులలో చాలా సులువుగా వీగిపోతున్నాయి. ఇప్పుడు జాతీయ లోక్ అదాలత్‌లో చాలావరకు ఈ కేసులను నిర్వహిస్తున్నారు. ఇరువైపుల వాళ్లు ఈ విషయంలో రాజీ కుదుర్చుకొని, డబ్బు విషయాలలో ఒక ఒప్పందానికి వచ్చి, త్వరగా విడాకులు తీసుకుంటున్నారు. దీని వల్ల కోర్టులకు పనిభారం కూడా తగ్గింది'' అంటున్నారు న్యాయనిపుణులు ఈమని పార్వతి.

సమయానికే ప్రాధాన్యత

చిన్న వయసు జంటలు విడాకులకు లాయర్లను సంప్రదించే వారి శాతం బాగా పెరిగింది.

దంపతులలో మనస్పర్ధలు వచ్చినప్పుడు ఇద్దరిలోనూ ఒక ఖాళీ ఏర్పడుతుంది. ఆ గ్యాప్‌ని పూరించడానికి చాలా సమయం పట్టవచ్చు. సమయం వృథా అయ్యేలా కోర్టుల చుట్టూ తిరగడం వల్ల మళ్లీ పెళ్లి చేసుకునే అవకాశాలు తగ్గుతాయి అనుకుంటున్నారు. డబ్బు, సమయం, పనులు మానేసి కోర్టుల చుట్టూ తిరగడం.. నవతరానికి నచ్చడం లేదు. అందుకే విడాకులు తీసుకునే సందర్భంలో డబ్బు పంపకాలలో ఒక కచ్చితమైన ధోరణి ఉండేది. ఉదాహరణకు... ఒక విడాకుల కేసులో అమ్మాయి తనకు పది లక్షలు ఇవ్వాలని ముందు పంతం పట్టినా రెండు మూడు సిట్టింగ్‌లలో 5–6 లక్షలకు రాజీకి వచ్చేస్తుంది.

విడాకులకు ఏదైనా కారణమే...!

ఇంత చిన్న విషయానికే బంధాన్ని విడగొట్టుకుంటారా అనిపించే హాస్యాస్పదమైన కేసులు ఇటీవల బాగా పెరుగుతున్నాయి. ఉదాహరణకి.. 'ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భార్య వీధి కుక్కలను ఇంట్లోకి తీసుకొచ్చి, వాటికి ఆహారం పెడుతూ, వాటితో ఆడుతూ–పాడుతూ ఆనందంగా ఉంటోంది. దీంతో ఖర్చు ఎక్కువైపోయింది, ఆ వాసన భరించలేకపోతున్నాను అని ఆ భర్త 'నా భార్య నన్ను మానసికంగా టార్చర్ చేస్తుంది, విడాకులు కావాలని' కోర్టును ఆశ్రయించాడు. అది సుప్రీం కోర్టు దాకా వెళ్లింది. అతని ఆరోగ్యంపై చెడు ప్రభావం పడుతోందని ఆమెను హెచ్చరించిన కోర్టు విడాకులు మంజూరు చేయడానికి ఇంకాస్త టైమ్ ఇచ్చింది.

ఒక కేసులో జంటలో ఒకరు మాంసాహారులు, మరొకరు శాకాహారులు. తమ భాగస్వామి నుంచి వచ్చే ఉల్లి, వెల్లుల్లి వాసన నచ్చడం లేదు. ఈ కారణంగా విడాకులకు అప్లై చేశారు. అస్తమానం ల్యాప్‌ట్యాప్ ముందు కూర్చొని తనను పట్టించుకోవడం లేదని మరొక కేసు ఫైల్ అయ్యింది. ఇలాంటివన్నీ క్రూయల్టీ కింద అంటే మానసిక వేదనకు కారణం అవుతుందనే విషయంగా ఆలోచిస్తున్నారు.

ఒక ఎన్‌ఆర్‌ఐ కేసు విషయంలో... భర్త అమెరికాలో ఉన్నాడు, భార్య ఇండియాకు వచ్చింది. ఆమె తిరిగి వెళ్లడం లేదు. ఆ భర్త అమెరికా నుంచి కేసు ఫైల్ చేశాడు భార్య తిరిగి రావాలని. ఆమెకు ఇష్టం లేక 'క్రూయల్టీ అమౌంట్' అనే విషయం మీద కేసు వేసింది. అదేమింటంటే, భర్త తాను పంపే డబ్బుకు ప్రతీ పైసాకు లెక్క అడుగుతున్నాడనేది ఆమె అభియోగం. అతనిపైన క్రిమినల్ కేసు నమోదయ్యింది. హైకోర్టులో కూడా అతనికి అనుకూలంగా తీర్పు రాలేదు. దీంతో అతను సుప్రీం కోర్టు దాకా వెళ్లాడు. సుప్రీంకోర్టు అతనికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. విడాకులు తీసుకున్న ఒకామె భరణం పెంచాలని కోర్టును ఆశ్రయించింది. ఆమె చెప్పిన విషయాలు.. బ్యూటీపార్లర్‌కు వెళ్లడానికి, షాపింగ్ చేయడానికి డబ్బులు సరిపోవడం లేదని కేసు ఫైల్ చేసింది.

సర్దుబాటు ధోరణి దంపతుల్లో లోపించడం, డబ్బులు, ఇతరుల పట్ల ఆకర్షణ, అవసరాలు పెరగడంతో బంధాలు చాలా సులువుగా విచ్ఛిన్నమవుతున్నాయి. బంధాలు నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తేనే అవి మనుగడ సాధిస్తాయి. విడిపోవడానికి రాజీ చేసుకునేవాళ్లు, కలిసుండే విషయంలో ప్రయత్నిస్తే దాంపత్య జీవనం సామాజికంగానూ పటిష్టంగా ఉంటుంది.

పిల్లలు ఉన్నా.. ఒత్తిడి లేదు..

విడాకులు తీసుకోవాలనుకున్న జంటలకు పిల్లలు ఉంటే, వారిపై తమ ప్రభావం ఏ విధంగా ఉంటుందో అనే ఒత్తిడి ఈ రోజుల్లో లేదు. ఇరువైపుల ఇద్దరికీ తల్లిదండ్రులు ఉంటున్నారు. వారు కూడా సంతానం నిర్ణయాన్నే ఆమోదిస్తున్నారు. విడాకులు తీసుకున్న జంటలకు పిల్లల కస్టడీ గురించి పెద్ద సమస్యలు లేవు. విజిటింగ్ రైట్స్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఎవరికి వారు తమ వ్యక్తిగత జీవితం చూసుకుంటూ, తమ పిల్లల విషయంలో సమాన బాధ్యతలు నిర్వర్తించేందుకు మొగ్గు చూపుతున్నారు.

పెరిగిన సహజీవనాలు

2022లో దీపక్ శర్మ కేసులో వచ్చిన జడ్జిమెంట్ ప్రకారం వివాహేతర సంబంధాలలో సమాజం ప్రకారం అనైతికం కానీ, చట్టరీత్యా శిక్ష పడేటటువంటి నేరం కాదు అనేది వచ్చింది. అయితే, అందరి విషయాల్లో కాదు, కొన్ని సందర్భాలలో మాత్రమే అని కూడా చెప్పారు. కానీ, చట్టాన్ని ఒక సాకుగా చూపుతున్నారు. లివింగ్ రిలేషన్ కూడా పెరిగింది. సమస్య వచ్చినప్పుడు కోర్టును ఆశ్రయిస్తున్నారు. దూరం అయినప్పుడు లైంగిక హింస, రేప్ వంటి కేసులు వస్తున్నాయి. ఇద్దరు ఒక ఇష్ట ప్రకారం ఉండి, ఎవరో ఒకరికి నష్టం జరిగినప్పుడు తట్టుకోలేక కేసులు ఫైల్ అవుతున్నాయి. అయితే, ఈ కేసులు అంతగా నిలబడటం లేదు.

– ఈమని పార్వతి, హైకోర్టు న్యాయవాది

Rewind 2025 రౌండప్

ఫిట్‌నెస్ ట్రెండ్స్

2025వ సంవత్సరం డిసెంబర్ చివరి వారంలో ఉన్నాం మనం. ఈ సందర్భంగా వివిధ రంగాలలో జీవన శైలి పరంగా ముఖ్యంగా ఫిట్‌నెస్ కోసం అత్యధికులు అనుసరించిన ట్రెండ్స్ ఏమిటో తెలుసుకుందాం..

ఈ ఏడాది ఎక్కువమంది ఫాలో అయిన ఫిట్‌నెస్ సూత్రాలివే

ఫిట్‌గా ఉండాలని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. అయితే ఫిట్‌గా ఉండేందుకు ఎంచుకునే విధానాలే రకరకాలుగా ఉంటాయి. కొందరు జిమ్ మెంబర్‌షిప్ తీసుకుని ఫిట్ అవుతారు. మరికొందరు యోగా చేయడాన్ని ఇష్టపడతారు. ఇంకొంతమంది తమ ఆహారపు అలవాట్లను మార్చుకుని ఫిట్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తారు. ఈ నేపథ్యంలో 2025 సంవత్సరంలో ఫిట్‌గా ఉండేందుకు ఎక్కువమంది దేనిని అనుసరించారో ఓసారి రివైండ్ చేసుకుందాం.

మొబైల్ ఫిట్‌నెస్ యాప్స్

ఈ సంవత్సరంలో ప్రజలు తమ ఫిట్‌నెస్‌ను ట్రాక్ చేయడానికి ట్రాకింగ్ యాప్స్‌ను విస్తృతంగా ఉపయోగించారు. ధరించే పరికరాలు, ఆటోమేటెడ్ అలర్ట్‌లు ఇచ్చే ఫిట్‌నెస్ ట్రాకర్స్, స్మార్ట్ వాచ్‌లు, హార్ట్ రేట్ మానిటర్ల వంటి పరికరాలు ఈ సంవత్సరం బాగా చర్చలో నిలిచాయి. పర్సనల్ ట్రైనర్‌ను నియమించుకోవడం కంటే ప్రజలు ఈ సంవత్సరం తమ ఫిట్‌నెస్‌ను సొంతంగా ట్రాక్ చేసుకున్నారు.

మితంగా తినే మినిమల్ ఈటింగ్ హ్యాబిట్

ఈ సంవత్సరంలో ఎక్కువ మంది సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నారు. దీనిపై సోషల్ మీడియా ప్రభావం కూడా ఉందని చెప్పవచ్చు. రోజూ ప్రొటీన్ అధికంగా ఉండే హెల్తీ స్నాక్స్ రీల్స్ చూసి చూసీ చూసీ ఈ ఆరోగ్యకరమైన ఆహారాలను తినడం ప్రారంభించి, తమ డైట్‌లో మంచి మార్పులు చేసుకున్నారు.

ఔట్‌డోర్ యోగా

2025లో అధిక సంఖ్యాకులు ఫిట్‌నెస్‌ను సీరియస్‌గా తీసుకుని ఔట్‌డోర్ యాక్టివిటీస్ పైనా దృష్టి పెట్టారు. ముఖ్యంగా ఔట్‌డోర్ యోగా చేయడం ద్వారా తమను తాము ఫిట్‌గా ఉంచుకున్నారు. వీటితో పాటు వాకింగ్ చేయడం, పరుగెత్తడం, హైకింగ్, స్కీయింగ్ వంటి యాక్టివిటీస్ కూడా ప్రజల ఫిట్‌నెస్ రొటీన్‌లో భాగమయ్యాయి.

కలిసి మెలిసి..

2025లో వైరల్ అయిన వాటిలో గ్రూప్ ట్రైనింగ్ యాక్టివిటీ ఒకటి. అదేంటంటే... ఇంట్లో ఒంటరిగా వ్యాయామం చేయడం కంటే స్నేహితులు లేదా భాగస్వామితో కలిసి వ్యాయామం చేయడం మరింత మెరుగ్గా ఉంటుందనిపించి చాలామంది తమకు తోడుగా ఎవరైనా ఉంటే జిమ్‌కి వెళ్లడం లేదా వర్కవుట్ చేయడంలో మునిగిపోయారు.

మార్నింగ్ వర్కవుట్స్

సాయంత్రం సమయాన్ని బయట తిరగడానికి కేటాయించడం కోసం చాలామంది తమ ఉదయం రొటీన్‌లో వ్యాయామాన్ని చేర్చుకున్నారు. కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా యోగా లేదా వాక్ చేయడానికి కూడా ఉదయం సమయం సరైనదిగా నిలిచింది.

సాక్షి సినిమా

● చిరంజీవి, వెంకటేశ్

మాస్ సాంగ్ కమింగ్

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అగ్ర హీరోలైన చిరంజీవి, వెంకటేశ్ కలిసి ఓ మాస్ సాంగ్‌లో చిందేశారు. మరి... వారి డ్యాన్స్‌లు ఏ రేంజ్‌లో ఉన్నాయో తెలియాలంటే ఈ నెల 30 వరకూ వేచి చూడాల్సిందే. చిరంజీవి హీరోగా నటించిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్‌లైన్. ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్ హీరోగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో బ్లాక్ బస్టర్ అందుకున్న అనిల్ రావిపూడి ఈ మూవీకి దర్శకత్వం వహించారు. నయనతార హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో హీరో వెంకటేశ్ ముఖ్య పాత్ర పోషించారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మించారు. సంక్రాంతి సందర్భంగా 'మన శంకరవరప్రసాద్‌గారు' 2026 జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ మూవీ నుంచి ఇప్పటికే 'మీసాల పిల్ల...', 'శశిరేఖ..' పాటలు విడుదలైన సంగతి తెలిసిందే. ఈ చిత్రం కోసం చిరంజీవి, వెంకటేశ్ ఓ మాస్ నంబర్‌కి డ్యాన్స్ చేశారు. ఈ పాట ప్రోమోని నేడు రిలీజ్ చేసి, పూర్తి పాటని ఈ నెల 30న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, 'మెగా విక్టరీ మాస్ సాంగ్' కమింగ్ అంటూ చిరంజీవి, వెంకటేశ్ డ్యాన్స్ చేస్తున్న పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి.

రాజుగారి పెళ్లిరో...

● నవీన్ పొలిశెట్టి, మీనాక్షీ చౌదరి

నవీన్ పొలిశెట్టి, మీనాక్షీ చౌదరి జోడీగా నటించిన చిత్రం 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం జనవరి 14న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రాజుగారి పెళ్లిరో... ఊరు వాడ లొల్లిరో...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. 'టాలీవుడ్ డీజే కొట్టు, బాలీవుడ్ బట్టలు కట్టు... హాలీవుడ్ బడ్జెట్ పెట్టు... టు..టు..టు.., అంబరాన డ్రోనులు చుట్టు, బంగారాల ప్లేటులు పెట్టు... అంబానీయే కుల్లుకునేట్టు... టు..టు...' అంటూ ఈ పాట సాగుతుంది. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి, సమీరా భరద్వాజ్ ఆలపించారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ వహించారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

మంగాపురంలో ప్రేమకథ

సూపర్ స్టార్ కృష్ణ పెద్ద కుమారుడు, రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా నటిస్తున్న తొలి చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ప్రేమకథతో రూపొందుతున్న ఈ చిత్రంలో రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని హీరోయిన్‌గా నటిస్తున్నారు. అజయ్ భూపతి దర్శకత్వంలో అశ్వినీ దత్ సమర్పణలో పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తయింది. ''మధ్య ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు లొకేషన్స్‌లో కీలక సన్నివేశాలు, పాటలను చిత్రీకరించాం. దీంతో 30 శాతం షూటింగ్ పూర్తయింది'' అని చిత్రబృందం పేర్కొంది.

● జయకృష్ణ

పాండిచ్చేరిలో పాట పూర్తి



● హవీష్

హవీష్, కావ్య థాపర్ జోడీగా నటిస్తున్న చిత్రం 'నేను రెడీ'. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. మిక్కీ జె. మేయర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలోని ఓ పాటని పాండిచ్చేరిలో హీరో హీరోయిన్లపై చిత్రీకరించారు. విజయ్ పోలాకి కొరియోగ్రఫీ అందించిన ఈ పాట చిత్రీకరణ పూర్తయినట్లు పేర్కొని, హవీష్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''నేను రెడీ' సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి'' అని చిత్రబృందం తెలియజేసింది.

ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది

– 'మన ప్యానల్' కమిటీ నిర్మాతలు

● చదలవాడ శ్రీనివాసరావు, సి. కల్యాణ్, ప్రసన్నకుమార్

''తెలుగు పరిశ్రమ గత పదేళ్లుగా అదుపు తప్పింది. ప్రొడ్యూసర్స్ గిల్డ్ అని పెట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫిల్మ్‌చాంబర్ సభ్యుల పేరిట ముఖ్యమంత్రులతో ఫొటోలు దిగాలనే ఆలోచన తప్ప చిత్రపరిశ్రమ బాగు అనేది వారికి పట్టదు. చిన్న హీరోలను బతకనివ్వరు'' అని పేర్కొన్నారు నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు. తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి ఎన్నికలు ఈ నెల 28న జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 'మన ప్యానల్' సభ్యులు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''క్యూబ్, యుఎఫ్‌ఓల వల్ల ఇబ్బంది పడుతున్నా గిల్డ్ పట్టించుకోవడం లేదు. చిత్రపురి కాలనీకి సమస్య వస్తే చిన్న నిర్మాతలమే సపోర్ట్‌గా నిలిచాం. అందరికీ అందుబాటులో ఉండే 'మన ప్యానల్' సభ్యులను గెలిపించాలని కోరుకుంటున్నాను'' అని చెప్పారు. నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''విభజించు... పాలించు అన్నట్టుగా గిల్డ్ సభ్యుల వ్యవహార శైలి ఉంది. దామోదర ప్రసాద్ కార్మికుల కోసం ఏం చేయలేకపోయాడు. కానీ, గిల్డ్ ప్రొడ్యూసర్స్ కోసం మాత్రం చాలా చేశాడు'' అని పేర్కొన్నారు. తుమ్మల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ– ''డబ్బున్న గిల్డ్ సభ్యులు గిల్డ్ డబ్బుతోనే నామినేషన్లు వేశారు. గిల్డ్ నిర్మాతలు లేబర్ కమిషనర్ వద్దకు వెళ్లటం దారుణం'' అని తెలిపారు. నిర్మాతలు రవిచంద్ యలమంచిలి, ఎత్తరి గురురాజ్, ప్రతాని రామకృష్ణ గౌడ్, రామసత్యనారాయణ, సాయివెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న చిత్రాలను ప్రోత్సహించడానికే అవార్డులు

2025లో విజయం సాధించిన చిన్న చిత్రాలకు 'ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్' (ఎఫ్‌ఎన్‌సీసీ) తరపున అవార్డులు ఇవ్వనున్నట్లు ఎఫ్‌ఎన్‌సీసీ అధ్యక్షుడు, నిర్మాత కేఎస్ రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''రూ. పది కోట్లలోపు బడ్జెట్‌తో తీసిన చిన్న సినిమాలను ప్రోత్సహించాలన్నదే మా ఆలోచన. ఈ ఏడాదికి 'కోర్ట్'ని ఉత్తమ చిత్రంగా ఎంపిక చేశాం. ఉత్తమ హీరోగా అఖిల్ రాజ్ (రాజు వెడ్స్ రాంబాయి), హీరోయిన్‌గా తేజస్విని (రాజు వెడ్స్ రాంబాయి), దర్శకుడిగా సాయిలు కంపాటి (రాజు వెడ్స్ రాంబాయి) ఎంపికయ్యారు. అలాగే నిర్మాతలుగా 50ఏళ్లు పూర్తి చేసుకున్న అల్లు అరవింద్, అశ్వినీదత్‌గార్లను సన్మానించనున్నాం. 'ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్' అభివృద్ధికి కృషి చేసిన ఖాజా సూర్యనారాయణని సత్కరిస్తాం. అలాగే బొప్పన విష్ణు ఆధ్వర్యంలో టీవీ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. ఈ నెల 31న ఈ అవార్డుల పంపిణీ, సత్కారాలు జరుగుతాయి'' అని చెప్పారు.



● కేఎస్ రామారావు

మారెమ్మ ముగిసింది

'మారెమ్మ' షూటింగ్ ముగిసింది. హీరో రవితేజ సోదరుడు, నటుడు రఘు తనయుడు మాధవ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మారెమ్మ'. ఈ చిత్రంలో దీపా బాలు హీరోయిన్‌గా నటించారు. మంచాల నాగరాజ్ దర్శకత్వంలో బండారు మయూర్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయిన విషయాన్ని వెల్లడించి, కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. వినోద్ కుమార్, వికాస్ వశిష్ఠ, దయానంద్ రెడ్డి కీలక పాత్రల్లో నటించిన ఈ రూరల్ మూవీకి సంగీతం: ప్రశాంత్ ఆర్. విహారి.



● మాధవ్

ఓటీటీ – ఇది చూడొచ్చు

హత్యలు చేస్తున్నదెవరు?

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం ఆర్యన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మన జీవితంలో ఎన్నో నేరాలను విని ఉంటాం, చూసి ఉంటాం. వాటిలో కొన్ని నేరాలు మాత్రం విస్మయానికి గురి చేస్తాయి. కానీ నేరం చేయడం అనేది ఓ ఆర్ట్. ఆ నేరం చేసేవాడు ఓ ఆర్టిస్ట్ అన్న స్టేట్‌మెంట్ ఓ సినిమా రూపంలో చెప్పాలంటే మాత్రం దర్శకుడికి బాగా ధైర్యం కావాలి. ఆ ధైర్యంతోనే తమిళ దర్శకుడు ప్రవీణ్ ఇటీవల ఓ సినిమా తీశారు. అదే 'ఆర్యన్'. విష్ణు విశాల్ లీడ్ రోల్‌లో నటించి, నిర్మించిన చిత్రం ఇది. దర్శకుడు తాను చెప్పాలనుకున్న పాయింట్‌ని సినిమా మొదట్లోనే చెప్పి, ప్రేక్షకుడిని కదలకుండా చేస్తాడు. అంతలా ఏముందో ఈ సినిమాలో ఓసారి చూద్దాం. కైలాష్ అనే సినిమా హీరోని లైవ్‌లో జనాల మధ్య నయన అనే ఫేమస్ జర్నలిస్ట్ తన ఛానల్‌లో ఇంటర్వ్యూ చేస్తుంటుంది. ఈ ప్రోగ్రాం మొదలవగానే ఆర్యన్ అనే వ్యక్తి ప్రేక్షకుల నుండి లేచి ఓ తుపాకీ చూపించి, తాను ఈ షోను హైజాక్ చేస్తున్నానని బెదిరించి కైలాష్ కాలి మీద కాలుస్తాడు. అంతేకాదు... వచ్చే ఐదు రోజులలో ఐదు మందిని తాను ప్రపంచానికి పేర్లు చెప్పి మరీ చంపుతానని చెప్పి లైవ్‌లోనే ఆత్మహత్య చేసుకుంటాడు. ఇక అక్కడి నుండి ప్రధాన పాత్రలో ఉన్న నంబి దగ్గరకు ఈ కేసు విచారణకు వస్తుంది. ఆర్యన్ చెప్పినట్టే వివిధ మాధ్యమాలలో చనిపోయే వారి పేర్లు ముందు తెలియపరుస్తూ రోజుకొకరు హత్య చేయబడుతుంటారు. ఓ దశలో చనిపోయిన శవం ఐదు హత్యలు చేస్తోందా? అన్న సందిగ్ధంలో పడేస్తుంది ఈ సినిమా స్క్రీన్‌ప్లే. ఈ మిస్టరీని నంబి ఎలా ఛేదిస్తాడో నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ఆర్యన్' సినిమాలోనే చూడాలి. పైన చెప్పుకున్నట్టు ఈ సినిమాకి స్క్రీన్‌ప్లే ఆయువుపట్టు. తాను చెప్పాలనుకున్న పాయింట్‌ని మొదటే తన పాత్ర ద్వారా చెప్పించి ప్రేక్షకులను లాక్ చేస్తాడు దర్శకుడు. సినిమా ఆద్యంతం థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఓ దశలో కొన్ని సీన్లు సాగదీతలా అనిపించినా థ్రిల్లింగ్ జోనర్ ఇష్టపడేవాళ్ళకు ఈ సినిమా మంచి కాలక్షేపం. పిల్లలతో కాకుండా పెద్దవాళ్లు వీకెండ్‌లో చూడదగ్గ సినిమా ఇది.

– హరికృష్ణ ఇంటూరు

స్టాక్‌ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▽	నిఫ్టీ ▽
367	100
85,041	26,042

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్‌	23,605	▽	9
డోజోన్స్‌	48,663	▽	97
ఎఫ్‌టీఎస్‌ఈ 100 (మంగళవారం ముగింపు)	9,889	△	24
డాక్స్‌ (మంగళవారం ముగింపు)	24,412	△	128
షాంఘై	3,964	△	4
నికాయ్‌	50,750	△	343

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	82.20	86.22
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	114.60	117.56
€	యూరో	ఎస్‌బీఐ	96.38	99.09
¥	జపాన్‌ యెన్‌ (100)	ఎస్‌బీఐ	58.43	59.96
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	54.84	57.06
S$	సింగపూర్‌ డాలర్‌	థామస్‌కుక్‌	64.11	68.78
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	21.93	23.44
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	22.41	24.19
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	11.03	12.86

ప్రాంతీయ భాషలే ప్లస్‌
ఏఐతో హైరింగ్‌ స్పీడ్‌ అప్‌

స్టార్టప్‌ల కొత్త బాట

- సేల్స్, కస్టమర్‌ సర్వీస్‌ తదితర విభాగాల్లో రిక్రూట్‌మెంట్‌
- 40 శాతం వరకు సమయం ఆదా

సాక్షి, బిజినెస్‌డెస్క్‌

రోజువారీ ఉద్యోగ విధుల్లో భాగంగా కస్టమర్లతో మాట్లాడాల్సిన ఫ్రంట్‌లైన్‌ ఉద్యోగులను తీసుకునేందుకు అంకుర సంస్థలు కొత్త పంథాను ఎంచుకుంటున్నాయి. ప్రాథమికంగా దరఖాస్తులను మదింపు చేయడంలాంటి పనుల కోసం ప్రాంతీయ భాషల్లోని కృత్రిమ మేధ (ఏఐ) సాధనాలను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నాయి. ఈ టూల్స్‌ వినియోగంతో నియామకాలకు పట్టే సమయం దాదాపు 40% వరకు ఆదా అవుతోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. షెఫ్‌లు, స్టోర్‌ ఆపరేటర్లలాంటి ఉద్యోగాలకు చాలా మంది దరఖాస్తుదారులు, ఇంగ్లిష్‌ కన్నా, ప్రాంతీయ భాషల్లోనే మాట్లాడటమే సౌకర్యవంతంగా భావిస్తున్నారనే విషయం గ్రహించిన క్లౌడ్‌ కిచెన్‌ ఆపరేటరు క్యూర్‌ఫుడ్స్‌ ఈ ఏడాది నుంచి నియామకాల ప్రక్రియ కోసం నేటివ్‌ ల్యాంగ్వేజ్‌ ఏఐ సాధనాలను ఉపయోగించడం ప్రారంభించింది. ప్రస్తుతం తొలి దశ స్క్రీనింగ్‌ను ఆటోమేటెడ్‌ వాయిస్‌బాట్స్‌తో నిర్వహిస్తోంది. దీని వల్ల రిక్రూట్‌మెంట్‌ విభాగం సిబ్బందిపై ఒత్తిడి, అలాగే నియామకాలకు పట్టే సమయం తగ్గుతోందని కంపెనీ పేర్కొంది. తెలుగు, తమిళం, హిందీ తదితర ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యమిచ్చే, ద్వితీయ..తృతీయ శ్రేణి పట్టణాల్లో నివసించే ప్రతిభావంతులైన దరఖాస్తుదార్లనూ పరిగణనలోకి తీసుకునేందుకు వీలవుతోందని తెలిపింది. వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు తోడ్పడుతోందని పేర్కొంది.

వాహన్‌ ఏఐ తదితర థర్డ్‌ పార్టీ ప్లాట్‌ఫాంలు

కొన్ని ఈ–కామర్స్, టెక్‌ స్టార్టప్‌లలో సిబ్బంది సంఖ్య 70 శాతం పైగా పెరిగే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. చాలా అంకుర సంస్థలు తమ మానవ వనరుల విభాగంలో సిబ్బందిని పెంచుకోవాల్సిన అవసరం లేకుండా, ప్రాంతీయ భాషల్లో హైరింగ్‌ సొల్యూషన్స్‌ అందించే థర్డ్‌ పార్టీ ప్లాట్‌ఫాంల సర్వీసులను వినియోగించుకుంటున్నాయి. దీంతో వాహన్‌ ఏఐ, బోల్నా ఏఐ, సంవాదిని లాంటి కంపెనీల సేవలకు డిమాండ్‌ పెరుగుతోంది. స్టార్టప్‌లు చిన్న పట్టణాల్లోని ప్రతిభావంతులను కూడా తీసుకునేందుకు ఈ తరహా హైరింగ్‌ విధానం ఉపయోగపడుతోందని ఇన్‌స్టాహైర్‌ వర్గాలు వివరించాయి. దేశీయంగా ఏఐ ప్రొఫెషనల్స్‌ 23.5 లక్షల మంది పైగా ఉన్నప్పటికీ వివిధ కార్యకలాపాల నిర్వహణకు తగినంత మంది దొరకడం లేదు. డిమాండ్, సరఫరాకి మధ్య 51% పైగా వ్యత్యాసం ఉంటోంది. దీనితో ఎక్కువగా సంక్లిష్టత ఉండని, పెద్ద స్థాయిలో నిర్వహించాల్సిన ప్రాథమిక స్క్రీనింగ్, రొటీన్‌గా వచ్చే ప్రశ్నలకు సమాధానాలివ్వడం, ఇంటర్వ్యూలను ఫిక్స్‌ చేయడంలాంటి పనుల కోసం అంకురాలు ఏఐ టూల్స్‌ని ఎంచుకుంటున్నాయి. ప్రాంతీయ భాషల్లోని వాయిస్‌ బాట్స్‌ ఏకకాలంలో పెద్ద సంఖ్యలో కాల్స్‌ని హ్యాండిల్‌ చేయగలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్నాలాంటి జాబ్స్‌ మార్కెట్‌ప్లేస్‌ అంకుర సంస్థ అంతర్గతంగా రూపొందించిన ఏఐ కాలింగ్‌ ఏజెంటును వినియోగిస్తోంది. తొలి దశ స్క్రీనింగ్‌కి దీన్ని ఉపయోగిస్తోంది. రిక్రూటర్లు నిర్దిష్టంగా ప్రశ్నలను తయారు చేసి సిస్టమ్‌లో ఫీడ్‌ చేస్తారు. ఆ తర్వాత సదరు సిస్టమే, దరఖాస్తుదార్లకు కాల్‌ చేసి, వారి సమాధానాలను విశ్లేషించుకుని, షార్ట్‌లిస్ట్‌ చేస్తుంది. దీని వల్ల మాన్యువల్‌గా స్క్రీనింగ్‌కి పట్టే సమయం సగానికి పైగా తగ్గింది. ఈ టూల్‌ని అప్నా తమ క్లయింట్‌ కంపెనీలకూ ఆఫర్‌ చేస్తోంది.

మెరుగ్గా అంచనా వేసేందుకు వీలు ..

అలాగే దేశవ్యాప్తంగా చిన్న, మధ్యతరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) రుణ సేవలందించే ఫ్లెక్సిలోన్స్‌ కూడా ఇదే తరహాలో నియామకాలకు ఏఐ టూల్స్‌ని ఉపయోగిస్తోంది. దీనితో ఫ్రంట్‌లైన్‌ సిబ్బంది నియామకాల ప్రక్రియకు పట్టే సమయం 30–40 శాతం మేర తగ్గిందని కంపెనీ వివరించింది. అభ్యర్థులు తమకు సౌకర్యవంతంగా ఉండే భాషలో మాట్లాడటం వల్ల వారి సామర్థ్యాలను మరింత మెరుగ్గా అంచనా వేసేందుకు వీలవుతోందని తెలిపింది. ఇలాంటి సిస్టమ్స్‌ ఇచ్చే విశ్లేషణల వల్ల పక్షపాత ధోరణి తగ్గి, అభ్యర్థుల షార్ట్‌లిస్టింగ్‌ ప్రక్రియ వేగవంతమవుతుందని ఫ్లెక్సిలోన్స్‌ వివరించింది. ముఖ్యంగా రాతపరమైన ఇంగ్లిష్‌ నైపుణ్యాల కన్నా స్థానిక భాషల్లో మాట్లాడే నైపుణ్యాలు ఎక్కువగా అవసరమయ్యే సేల్స్, కలెక్షన్‌ మొదలైన ఉద్యోగాలకు ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొంది.

సిల్వర్‌ హిట్‌

- వెండి మరో రూ.9,350 అప్‌ రూ.2,36,350కి చేరిక
- రూ.1,42,300కి బంగారం ధర

న్యూఢిల్లీ: వెండి ధరల రికార్డులు కొనసాగుతున్నాయి. శుక్రవారం కిలోకి మరో రూ.9,350 పెరగడంతో, రూ. 2,36,350కి చేరుకుంది. వెండికి ఇది కొత్త జీవిత కాల గరిష్ట స్థాయి. గత నాలుగు సెషన్లలోనే వెండి ధర కిలోకి రూ.32,250 (15.8 శాతం) పెరగడం గమనార్హం. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకు కిలోకి నికరంగా రూ.1,46,650 (163 శాతం) లాభపడింది. మరోవైపు బంగారం ధర 10 గ్రాములకు రూ.1,500 పెరిగి రూ.1,42,300 (పన్నులు సహా) స్థాయికి చేరింది. ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధర 10 గ్రాములకు రూ.63,350 (80 శాతం) లాభపడింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం స్పాట్‌ ధర ఔన్స్‌కు 51 డాలర్లు ఎగసి 4,530 డాలర్లకు చేరింది. స్పాట్‌ వెండి ధర మొదటిసారి 75 డాలర్ల మార్క్‌ను అధిగమించింది. 5 డాలర్లకు పైగా పెరిగి 75.63 డాలర్ల స్థాయికి చేరింది. ఫెడ్‌ రేట్ల కోత అంచనాలు, కమోడిటీ మార్కెట్లలో నెలకొన్న సానుకూల ధోరణితో బులియన్‌ ధరల్లో రికార్డులు కొనసాగుతున్నట్టు మిరే అసెట్‌ షేర్‌ ఖాన్‌ కమోడిటీస్‌ హెడ్‌ ప్రవీణ్‌సింగ్‌ తెలిపారు. వెండి సరఫరా కొన్నేళ్ల కనిష్టానికి చేరినట్టు రిలయన్స్‌ సెక్యూరిటీస్‌ సీనియర్‌ రీసెర్చ్‌ అనలిస్ట్‌ జిగర్‌ త్రివేది పేర్కొన్నారు. సరఫరా మరింత కఠినంగా మారితే అది గరిష్ట స్థాయిలో ధరలకు మద్దతునిస్తుందన్నారు.

మూడోరోజూ నష్టాలే

- సెన్సెక్స్‌ 367 పాయింట్లు పతనం
- నిఫ్టీకి 100 పాయింట్ల నష్టం

ముంబై: ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఫలితంగా దేశీయ స్టాక్‌ మార్కెట్‌ మూడోరోజూ నష్టాలు మూటగట్టుకుంది. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్‌ 367 పాయింట్లు కోల్పోయి 85,041 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 100 పాయింట్లు నష్టపోయి 26,042 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఉదయమే బలహీనంగా మొదలైన సూచీలు.. రోజంతా స్వల్ప శ్రేణిలో ట్రేడయ్యాయి. సంవత్సరాంతం కావడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ఇంట్రాడేలో సెన్సెక్స్‌ 471 పాయింట్లు కోల్పోయి 84,938, నిఫ్టీ 135 పాయింట్లు పతనమై 26,009 వద్ద కనిష్టాన్ని తాకింది. ఆసియా మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. క్రిస్మస్‌ సెలవులు కావడంతో యూరప్‌ మార్కెట్లు పనిచేయలేదు. అమెరికా స్టాక్‌ ఫ్యూచర్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- బీఎస్‌ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో ఐటీ 1.04%, టెలికమ్యూనికేషన్‌ 0,59%, క్యాపిటల్‌ గూడ్స్‌ 0,54%, ఆటో 0,54%, నష్టపోయాయి. స్మాల్, మిడ్‌ క్యాప్‌ సూచీలు 0.34%, 0.18 శాతం పడిపోయాయి. కమోడిటీస్, మెటల్‌ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- వేదాంత కంపెనీ షేరు 0.50% లాభపడి రూ.601 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 2% పెరిగి రూ.608 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. వరుసగా 13 ట్రేడింగ్‌ సెషన్లలో ఈ షేరు 17.44% లాభపడింది. ఈ ఏడాదిలో 35.29% ర్యాలీ చేసింది.

కోఫోర్జ్‌ చేతికి ఎన్‌కోరా

2.35 బిలియన్‌ డాలర్ల డీల్‌

న్యూఢిల్లీ: అమెరికన్‌ కృత్రిమ మేధ (ఏఐ) సంస్థ ఎన్‌కోరాను కొనుగోలు చేయనున్నట్లు ఐటీ సర్వీసుల దిగ్గజం కోఫోర్జ్‌ వెల్లడించింది. 100% వాటాల కోసం 2.35 బిలియన్‌ డాలర్లని (సుమారు రూ. 21,133 కోట్లు) తెలిపింది. పూర్తి స్టాక్స్‌ లావాదేవీ రూపంలో ఈ డీల్‌ ఉంటుందని వివరించింది. ఎన్‌కోరా ప్రస్తుత షేర్‌హోల్డర్లకు 1.89 బిలియన్‌ డాలర్ల ప్రిఫరెన్షియల్‌ షేర్లను జారీ చేయనున్నట్లు కోఫోర్జ్‌ పేర్కొంది. ప్రైవేట్‌ ఈక్విటీ దిగ్గజాలు అడ్వెంట్‌ ఇంటర్నేషనల్, వార్‌బర్గ్‌ పింకస్‌ మొదలైనవి ఎన్‌కోరాలో వాటాదార్లుగా ఉన్నాయి. తమ ఏఐ ఆధారిత ఇంజనీరింగ్‌ సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని కోఫోర్జ్‌ సీఈవో సుధీర్‌ సింగ్‌ చెప్పారు. ఎన్‌కోరా కలయికతో 2.5 బిలియన్‌ డాలర్ల టెక్‌ సేవల దిగ్గజం ఆవిర్భవిస్తుందని కోఫోర్జ్‌ పేర్కొంది. 2027 ఆర్థిక సంవత్సరంలో ఏఐ ఆధారిత ఇంజనీరింగ్, డేటా, క్లౌడ్‌ సర్వీసుల విభాగం ఆదాయమే ఏకంగా 2 బిలియన్‌ డాలర్ల పైగా ఉంటుందని తెలిపింది. ఏఐ ఆధారిత ఇంజనీరింగ్‌ వ్యాపారం 1.25 బిలియన్‌ డాలర్లపైగా, క్లౌడ్‌ సేవలు 500 మిలియన్‌ డాలర్లు, డేటా ఇంజనీరింగ్‌ 250 మిలియన్‌ డాలర్ల స్థాయిలో ఉంటుందని కోఫోర్జ్‌ పేర్కొంది.

పీఎన్‌బీలో రూ. 2,434 కోట్ల ఫ్రాడ్‌

శ్రేయి గ్రూప్‌ మాజీ ప్రమోటర్లపై ఆర్‌బీఐకి రిపోర్ట్‌

న్యూఢిల్లీ: శ్రేయి గ్రూప్‌ మాజీ ప్రమోటర్లు రూ. 2,434 కోట్ల రుణాలకు సంబంధించి మోసానికి పాల్పడినట్లు రిజర్వ్‌ బ్యాంక్‌కి పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ (పీఎన్‌బీ) తెలియజేసింది. శ్రేయి ఎక్విప్‌మెంట్‌ ఫైనాన్స్‌ (ఎస్‌ఈఎఫ్‌ఎల్‌), శ్రేయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ఫైనాన్స్‌ (ఎస్‌ఐఎఫ్‌ఎల్‌) ప్రమోటర్లు వరుసగా రూ. 1,241 కోట్లు, రూ. 1,193 కోట్ల మేర మోసగించినట్లు పేర్కొంది. ఇప్పటికే ఈ మొత్తానికి 100 శాతం ప్రొవిజనింగ్‌ చేసినట్లు వివరించింది. ఆర్థిక అవకతవకల ఆరోపణలతో కోల్‌కతాకి చెందిన కనోడియాల సారథ్యంలోని ఎస్‌ఐఎఫ్‌ఎల్, దాని అనుబంధ సంస్థ ఎస్‌ఈఎఫ్‌ఎల్‌ బోర్డులను 2021లో ఆర్‌బీఐ రద్దు చేసి, దివాలా చట్టం కింద చర్యలు చేపట్టింది. రూ. 32,700 కోట్ల పైచిలుకు రుణాలతో సంక్షోభంలో చిక్కుకున్న ఈ రెండు సంస్థలను ఆ తర్వాత వేలంలో ఎన్‌ఏఆర్‌సీఎల్‌ దక్కించుకుంది.

సాక్షి స్పోర్ట్స్‌

అజేయంగా అర్జున్‌

దోహా: ప్రపంచ ర్యాపిడ్‌ చెస్‌ చాంపియన్‌షిప్‌ ఓపెన్‌ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్‌ ఇరిగేశి అర్జున్‌ తొలి రోజు అజేయంగా నిలిచాడు. ఆడిన ఐదు గేముల్లో నాలుగింటిలో గెలిచిన అర్జున్‌ నార్వే దిగ్గజం మాగ్నస్‌ కార్ల్‌సన్‌తో జరిగిన ఐదో గేమ్‌ను 101 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకున్నాడు. అంతకుముందు మార్కో మటేరియా (ఫ్రాన్స్‌), సందీపన్‌ చందా (భారత్‌), జిన్‌షి బాయ్‌ (చైనా), అరామ్‌ హకోబ్యాన్‌ (అర్మేనియా)లతో జరిగిన గేముల్లో అర్జున్‌ గెలుపొందాడు. ఐదో రౌండ్‌ ముగిశాక కార్ల్‌సన్, అర్జున్, మాక్సిమి లాగ్రెవ్‌ (ఫ్రాన్స్‌), వ్లాదిస్లావ్‌ అర్తెమియెవ్‌ (రష్యా), దొమ్మరాజు గుకేశ్‌ (భారత్‌) 4.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నారు. మరోవైపు మహిళల విభాగంలో నాలుగు రౌండ్లు ముగిశాక హైదరాబాద్‌ గ్రాండ్‌మాస్టర్‌ ద్రోణవల్లి హారిక 3.5 పాయింట్లతో మరో ఆరుగురితో కలిసి ఉమ్మడిగా రెండో స్థానంలో ఉంది. డిఫెండింగ్‌ చాంపియన్, ఆంధ్రప్రదేశ్‌ గ్రాండ్‌మాస్టర్‌ కోనేరు హంపి 3 పాయింట్లతో 30వ స్థానంలో ఉంది.

సూర్య చరిష్మా సంచలనం

టాప్‌ సీడ్‌ ఉన్నతిపై గెలుపుతో సెమీస్‌లోకి

సూర్య చరిష్మా

సాక్షి, విజయవాడ: జాతీయ సీనియర్‌ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌ మహిళల సింగిల్స్‌ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌ అమ్మాయి తమరి సూర్య చరిష్మా సంచలన ప్రదర్శన కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ ఫైనల్లో ఐదో సీడ్‌ సూర్య చరిష్మా 21–12, 21–15తో టాప్‌ సీడ్, ప్రపంచ 23వ ర్యాంకర్‌ ఉన్నతి హుడా (హరియాణా)ను బోల్తా కొట్టించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. 36 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఆమె తొలి గేమ్‌లో ఒకసారి వరుసగా నాలుగు పాయింట్లు, మరోసారి వరుసగా ఆరు పాయింట్లు గెలిచి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. రెండో గేమ్‌లో స్కోరు 10–8 వద్ద సూర్య చరిష్మా ఒక్కసారిగా విజృంభించి వరుసగా ఐదు పాయింట్లు సాధించి 15–8తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్న ఆంధ్ర షట్లర్‌ విజయాన్ని ఖాయం చేసుకుంది. సెమీఫైనల్‌ చేరే క్రమంలో సూర్య చరిష్మా తన ప్రత్యర్థులకు ఒక్క గేమ్‌ కూడా కోల్పోకపోవడం విశేషం. నేడు జరిగే సెమీఫైనల్లో రక్షిత శ్రీ (తమిళనాడు)తో ఆమె ఆడుతుంది. ఇతర క్వార్టర్‌ ఫైనల్స్‌లో రక్షిత శ్రీ 16–21, 21–14, 21–18తో తన్వీ శర్మ (పంజాబ్‌)పై, తన్వీ పత్రి (ఒడిశా) 21–16, 12–21, 22–20తో ఆకర్షి కశ్యప్‌ (ఎయిర్‌పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా)పై, శ్రుతి ముందాడ (మహారాష్ట్ర) 22–20, 21–12తో రెండో సీడ్‌ అనుపమ (ఢిల్లీ)పై గెలిచారు.

తరుణ్‌ జోరు

పురుషుల సింగిల్స్‌ విభాగంలో తెలంగాణ ప్లేయర్, రెండో సీడ్‌ తరుణ్‌ మన్నేపల్లి సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. మన్‌రాజ్‌ సింగ్‌ (హరియాణా)తో 42 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్‌ ఫైనల్లో ప్రపంచ 43వ ర్యాంకర్‌ తరుణ్‌ 21–13, 22–20తో గెలుపొందాడు. నేడు జరిగే సెమీఫైనల్లో భరత్‌ రాఘవ్‌ (హరియాణా)తో తరుణ్‌ ఆడతాడు. ఇతర క్వార్టర్‌ ఫైనల్స్‌లో టాప్‌ సీడ్‌ కిరణ్‌ జార్జి (కేరళ) 21–18, 21–18తో రౌనక్‌ చౌహాన్‌ (ఛత్తీస్‌గఢ్‌)పై, రిత్విక్‌ సంజీవి (తమిళనాడు) 21–13, 22–20తో సతీశ్‌ కుమార్‌ కరుణాకరన్‌ (తమిళనాడు)పై, భరత్‌ రాఘవ్‌ 21–17, 21–13తో జిన్‌పాల్‌ సోనా (ఢిల్లీ)పై గెలిచారు. మహిళల డబుల్స్‌లో కలగోట్ల వెన్నెల (తెలంగాణ)–రేషిక (తమిళనాడు) జోడీ... మిక్స్‌డ్‌ డబుల్స్‌లో సాత్విక్‌ రెడ్డి (తెలంగాణ)–రాధిక శర్మ (పంజాబ్‌) జంట సెమీఫైనల్లోకి ప్రవేశించాయి.

మరిన్ని క్రీడా వార్తలు
సాక్షి ప్లస్‌ స్పోర్ట్స్‌ ఈ–పేపర్‌లో

రేణుక నిప్పులు షఫాలీ మెరుపులు

121/6... 128/9... 112/7... ఇప్పటివరకు జరిగిన మూడు టి20ల్లోనూ శ్రీలంక మహిళల జట్టు స్కోర్లివి... భారత బౌలింగ్‌ ప్రతాపానికి మచ్చుతునకలు. ప్రతీ మ్యాచ్‌లోనూ మనమ్మాయిలు ప్రత్యర్థి బ్యాటర్లను కట్టిపడేస్తున్నారు. దీంతో 20 ఓవర్ల కోటా పూర్తి చేసినా... ఆలౌట్‌ కాకపోయినా కూడా కనీసం 130 పరుగులైనా చేయకుండా శ్రీలంకను తమ బౌలింగ్‌ బంధనాలతో కట్టడి చేస్తున్నారు. దీంతో హర్మన్‌ప్రీత్‌ బృందం రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌ను 3–0తో వశం చేసుకుంది.

మూడో టి20లో 8 వికెట్లతో భారత్‌ జయభేరి

విజయాల ‘హ్యాట్రిక్‌’తో భారత్‌కే సిరీస్‌
ఆడిన మూడూ ఓడిన లంక ● రేపు నాలుగో టి20

హర్మన్, రేణుక, షఫాలీ

తిరువనంతపురం: భారత్, శ్రీలంకల మధ్య ఈ వేదికపై ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. కానీ ఇక్కడ ఆడిన తొలి (మూడో టి20) మ్యాచ్‌తోనే భారత మహిళల జట్టు ఐదు టి20ల సిరీస్‌ను 3–0తో కైవసం చేసుకుంది. భారత పేసర్‌ రేణుక సింగ్‌ (4/21), సీనియర్‌ స్పిన్నర్‌ దీప్తి శర్మ (3/18) కోలుకోలేని దెబ్బతీయడంతో... మొదట శ్రీలంక మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 112 పరుగులే చేసింది. ఆతిథ్య బౌలింగ్‌ ధాటికి సింహళ బ్యాటర్లలో ఏ ఒక్కరు కనీసం 30 పరుగులైనా చేయలేకపోయారు. ఇమిషా దులానీ (32 బంతుల్లో 27; 4 ఫోర్లు) టాప్‌స్కోరర్‌! అనంతరం సులువైన లక్ష్యాన్ని హర్మన్‌ప్రీత్‌ సేన 13.2 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్‌ షఫాలీ వర్మ (42 బంతుల్లో 79 నాటౌట్‌; 11 ఫోర్లు, 3 సిక్సలు) మెరుపు ఇన్నింగ్స్‌తో గెలిపించింది. ఆమె దూకుడు వల్లే ఇంకా 6.4 ఓవర్లకు ముందే భారత్‌ లక్ష్యాన్ని చేరుకుంది. ఇదే వేదికపై రేపు నాలుగో టి20 మ్యాచ్‌ జరుగుతుంది.

షఫాలీ మళ్లీ ధనాధన్‌ ‘షో’

తొలుత లంక ఇన్నింగ్స్‌ రేణుక, దీప్తి చావు దెబ్బ తీశారు. దీంతో 45/4 స్కోరు వద్దే ప్రధాన బ్యాటింగ్‌ బలగాన్ని కోల్పోయింది. హసిని (25), మిడిలార్డర్‌లో కవిషా దిల్హరి (20), కౌషిని (19) చేసిన పరుగులతో కష్టంగా జట్టు స్కోరు వంద దాటింది. తర్వాత గత మ్యాచ్‌ల కంటే తక్కువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత జట్టులో షఫాలీ వర్మ మళ్లీ ధనాధన్‌ షో రెచ్చిపోయింది. చూడచక్కని బౌండరీలు, భారీ సిక్సర్లతో లంక బౌలర్లపై విరుచుకుపడింది. 24 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేసుకుంది. దీంతో స్మృతి మంధాన (1), జెమీమా (9)లు సింగిల్‌ డిజిట్‌లకు అవుటైనా... రవ్వంత ప్రభావం లేకుండానే లక్ష్యం వైపు భారత్‌ నడిచింది. హర్మన్‌ప్రీత్‌ (21 నాటౌట్; 2 ఫోర్లు), షఫాలీ అబేధ్యమైన మూడో వికెట్‌కు 48 పరుగులు జోడించి మ్యాచ్‌ను ముగించారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్‌: హసిని (సి) దీప్తి శర్మ (బి) రేణుక 25; చమరి (సి) హర్మన్‌ప్రీత్‌ (బి) దీప్తిశర్మ 3; హర్షిత (సి అండ్‌ బి) రేణుక 2; ఇమిషా దులానీ (సి) జెమీమా (బి) రేణుక 27; నీలాక్షిక (ఎల్బీడబ్ల్యూ) (బి) రేణుక 4; కవీషా (సి) అమన్‌జోత్‌ (బి) దీప్తిశర్మ 20; కౌషని (నాటౌట్‌) 19; శేషని (బి) దీప్తిశర్మ 5; మాల్కి మదర (నాటౌట్‌) 1; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 112. వికెట్ల పతనం:** 1–25, 2–31, 3–32, 4–45, 5–85, 6–90, 7–98. **బౌలింగ్‌:** రేణుక 4–1–21–4, క్రాంతి 4–0–22–0, దీప్తిశర్మ 4–0– 18–3, వైష్ణవి 3–0–14–0, అమన్‌జోత్‌ 4–0– 23–0, శ్రీచరణి 1–0–11–0. **భారత ఇన్నింగ్స్‌:** షఫాలీ వర్మ (నాటౌట్‌) 79; స్మృతి (ఎల్బీడబ్ల్యూ) (బి) కవిషా 1; జెమీమా (బి) కవిషా 9; హర్మన్‌ప్రీత్‌ (నాటౌట్‌) 21; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (13.2 ఓవర్లలో 2 వికెట్లకు) 115. వికెట్ల పతనం:** 1–27, 2–67. **బౌలింగ్‌:** శేహాని 2.2–0–28–0, మాల్కి మదర 2–0–11–0, నిమష మీపగె 2–0–29–0, కవిషా దిల్హారి 3–0–18–2, ఇనోక 4–0–28–0.

151 అంతర్జాతీయ మహిళల టి20ల్లో దీప్తి శర్మ తీసిన వికెట్లు. ఈ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా మేగన్‌ షుట్‌ (ఆస్ట్రేలియా) పేరిట ఉన్న రికార్డును దీప్తి సమం చేసింది.

కోహ్లి, పంత్‌

కోహ్లి 77 రోహిత్‌ 0

విజయ్‌ హజారే వన్డే టోర్నీ

బెంగళూరు: టీమిండియా స్టార్‌ బ్యాటర్‌ విరాట్‌ **కోహ్లి (61 బంతుల్లో 77; 13 ఫోర్లు, 1 సిక్స్‌) దేశవాళీల్లో కూడా** అద్భుత ఫామ్‌ కొనసాగిస్తున్నాడు. విజయ్‌ హజారే ట్రోఫీ తొలి మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుపై శతకంతో కదంతొక్కిన కోహ్లి... గుజరాత్‌తో శుక్రవారం జరిగిన రెండో మ్యాచ్‌లో హాఫ్‌ సెంచరీతో రాణించాడు. ఎలైట్‌ గ్రూప్‌ ‘డి’లో భాగంగా జరిగిన ఈ పోరులో రిషభ్‌ పంత్‌ సారథ్యంలోని ఢిల్లీ జట్టు 7 పరుగుల తేడాతో గుజరాత్‌పై విజయం సాధించింది. మొదట ఢిల్లీ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. ‘ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌’ కోహ్లి చక్కటి షాట్లతో అర్ధశతకంతో ఆకట్టుకోగా... రిషభ్‌ పంత్‌ (70; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా హాఫ్‌ సెంచరీ నమోదు చేశాడు. అనంతరం ఛేదనలో గుజరాత్‌ 47.4 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటైంది.

రోహిత్‌ ‘డకౌట్‌’

జైపూర్‌: సిక్కింతో జరిగిన తొలి మ్యాచ్‌లో భారీ సెంచరీతో చెలరేగిన ‘హిట్‌మ్యాన్‌’ రోహిత్‌ శర్మ (0) ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌లో ‘గోల్డెన్‌ డకౌట్‌’ అయ్యాడు. ఎదుర్కొన్న తొలి బంతికే వెనుదిరిగి నిరాశ పరిచాడు. అయినా శుక్రవారం జరిగిన ఎలైట్‌ గ్రూప్‌ ‘సి’ మ్యాచ్‌లో ముంబై జట్టు 51 పరుగుల తేడాతో ఉత్తరాఖండ్‌పై గెలిచింది. మొదట ముంబై 50 ఓవర్లలో 7 వికెట్లకు 331 పరుగులు చేసింది. ‘ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌’ హార్దిక్‌ తమోర్‌ (93 నాటౌట్‌; 7 ఫోర్లు, 2 సిక్సలు) టాప్‌ స్కోరర్‌ కాగా... సర్ఫరాజ్‌ ఖాన్‌ (55; 5 ఫోర్లు, 1 సిక్స్‌), ముషీర్‌ ఖాన్‌ (55; 7 ఫోర్లు), షమ్స్‌ ములానీ (48; 4 ఫోర్లు, 1 సిక్స్‌) రాణించారు. ఛేదనలో ఉత్తరాఖండ్‌ 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులకు పరిమితమైంది.

క్లుప్తంగా...

జనవరి 5 నుంచి ఎఫ్ఏ-3 పరీక్షలు

సాక్షి, అమరావతి: ఫార్మెటివ్ అసెస్‌మెంట్-3 పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. జనవరి 5 నుంచి 8 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. 1-5 తరగతులకు ఉదయం 9.30 నుంచి 10.45 గంటల వరకు, మధ్యాహ్నం 1.15 నుంచి 2.30 గంటల వరకు, 6, 7, 8 తరగతులకు ఉదయం 9.30 నుంచి 10.45 గంటల వరకు, మధ్యాహ్నం 1.15 నుంచి 2.30 గంటలకు పరీక్షలు జరుగుతాయి. 9, 10 తరగతులకు ఉదయం 11 నుంచి 12.15 వరకు, మధ్యాహ్నం 2.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఒకే విడతలో ప్రశ్నాపత్రాలు ఇవ్వాలి

ఒక రోజు జరిగే పరీక్షలకు ప్రశ్నపత్రాలను ఒకే విడతలో పాఠశాలలకు అందేలా చూడాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఓ ప్రకటనలో కోరారు. పరీక్ష పత్రాల పంపిణీకి పాఠశాల స్థాయిలో ప్రధాన ఉపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులతో కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు రూ.90.50కోట్లు

సాక్షి, అమరావతి: పీఎం యశస్వి పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో చదువుతున్న బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం రూ.90.50కోట్లు మంజూరు చేసినట్టు మంత్రి ఎస్.సవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి రెండో విడతగా పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు రూ.69.40 కోట్లు , ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు రూ.21.10 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

కేజీబీవీల్లో నియామకాలకు మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,095 ఉద్యోగాలకు ఇటీవల నోటిఫికేషన్ ఇవ్వగా, తాజాగా సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మార్గదర్శకాలను విడుదల చేశారు. ఇందులో టైప్-3, టైప్-4 కేజీబీవీల్లో ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, అకౌంటెంట్, ఏఎన్ఎం, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, డే అండ్ నైట్ వాచ్ ఉమెన్, అటెండర్, స్వీపర్, స్కావెంజర్, టీచింగ్, హాస్టల్ వార్డెన్స్, పార్ట్ టైమ్ టీచింగ్ స్టాఫ్ తదితర పోస్టులు ఉన్నాయి. జిల్లా కలెక్టర్, డీఈవో నేతృత్వంలోని ఎంపిక కమిటీల ద్వారా నియామకాలు చేపట్టాలనివివరించారు. జనవరి 3 నుంచి దరఖాస్తులు స్వీకరించి, జనవరి 31 నాటికి భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని ఎస్పీడీ ఆదేశించారు.

గజగజ వణికిస్తున్న చలి

- అరకు, పాడేరు ఏరియాల్లో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఉత్తర భారతం వైపు నుంచి నేరుగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్న శీతల గాలులు
- వచ్చే వారం రోజులూ మరింత పెరిగే అవకాశం

సాక్షి, అమరావతి : రాష్ట్రాన్ని చలి గజగజ వణికిస్తోంది. గతానికి భిన్నంగా చలి తీవ్రత పెరిగిందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గత మూడు, నాలుగేళ్లుగా రాష్ట్రంలో శీతాకాలం ఓ మోస్తరుగా ఉండేది. కానీ ఈ సంవత్సరం పరిస్థితి అందుకు భిన్నంగా మారిపోయింది. ఏజెన్సీ ప్రాంతాల్లో 4 నుంచి 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం కిలగూడలో 7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అరకు, పెదబయలు, పాడేరు, చింతపల్లి, వై.రామవరం, హుకుంపేట మండలాల్లో గత 20 రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. కొన్నిచోట్ల 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం నుంచి కోస్తా, రాయలసీమ జిల్లాల్లోనూ చలి తీవ్రత పెరిగింది. 2021 నుంచి 2024 వరకు ఎల్‌నినో ప్రభావం వల్ల సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో చలికాలంలోనూ సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ ఏడాది పరిస్థితి మారింది.

లానినా ప్రభావంతోనే..

ఈ మార్పులకు ప్రధానంగా లానినా ప్రభావమే కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఈ పరిస్థితుల వల్ల ఉత్తర భారతం నుంచి వీచే అతి శీతల గాలులు నేరుగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నాయి. దీనికితోడు హిమాలయాల్లో ఈ ఏడాది భారీగా కురుస్తున్న మంచు వల్ల అక్కడ ఏర్పడిన శీతల తరంగాలు ఒడిశా మీదుగా మన రాష్ట్రంపై ప్రభావం చూపుతున్నాయి. ఈసారి పొడి వాతావరణం ఉండడం వల్ల భూమి త్వరగా చల్లబడి రాత్రి వేళల్లో చలి తీవ్రత బాగా పెరుగుతోంది. వాతావరణ అధ్యయనాల ప్రకారం భూతాపం (గ్లోబల్ వార్మింగ్) పెరగడం వల్ల కేవలం ఎండలే కాకుండా శీతాకాలంలో చలి తీవ్రత కూడా పెరుగుతోంది. వాతావరణంలోని జెట్ స్ట్రీమ్స్ బలహీనపడడం వల్ల ధృవ ప్రాంతాల్లో ఉండాల్సిన చల్లని గాలులు దక్షిణాది వైపు మళ్లుతున్నాయి. అందుకే రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం చలి పెరిగింది. భవిష్యత్తులోనూ ఇలాంటి చలి పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశం ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

శుక్రవారం నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

జిల్లా	గ్రామం	ఉష్ణోగ్రత డిగ్రీల్లో..
అల్లూరి సీతారామరాజు	కిలగూడ	7
అల్లూరి సీతారామరాజు	అరకు	8.2
అల్లూరి సీతారామరాజు	పెదబయలు	8.4
కర్నూలు	బనవసి	12.1
అనకాపల్లి	గొలుగొండ	12.1
శ్రీ సత్యసాయి	మడకశిర	12.4
చిత్తూరు	కాగిత	13.1
విశాఖ	అక్కిరెడ్డిపాలెం	13.9
ఎన్టీఆర్	నున్న	16.2
ఎన్టీఆర్	విజయవాడ	19.4
తిరుపతి	తిరుపతి	17.7

హరీ.. హరా..!
సర్కారు వైఫల్యానికి ని'దర్శనం'

తిరుమల, శ్రీశైల క్షేత్రాలకు పోటెత్తుతున్న భక్తులు

- సౌకర్యాల కల్పనలో విఫలమైన ప్రభుత్వం, పాలకవర్గాలు

ఇనుప కంచెల మధ్య చిక్కుకుని అవస్థలు పడుతున్న భక్తులు (ఇన్‌సెట్‌లో)ఏడుస్తున్న చిన్నారి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: సెలవుల నేపథ్యంలో తిరుమల, శ్రీశైల క్షేత్రాలకు పోటెత్తుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో చంద్రబాబు సర్కారు ఘోరంగా విఫలమైంది. ఫలితంగా భక్తులు నరకయాతన అనుభవిస్తున్నారు. దేవదేవుల దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షిస్తున్నారు. తిరుమలలో భక్తుల రద్దీకి అనుగుణంగా వసతుల కల్పన, దర్శనం కల్పనలో ప్రభుత్వం, టీటీడీ ఘోరంగా విఫలమయ్యాయి. పైగా శ్రీవాణి ఆఫ్‌లైన్ టికెట్లను టీటీడీ రద్దు చేసింది. ఆన్‌లైన్ శ్రీవాణి దర్శన టికెట్లు పొందిన భక్తులకు యథావిధిగా దర్శనం కొనసాగుతోంది. తిరుపతిలో శుక్రవారం ఉదయం చేపట్టిన దివ్యదర్శనం టోకెన్ల పంపిణీ కొద్దిసేపటికే ముగిసింది. ఉదయం 9 గంటలకే టోకెన్లు అయిపోవడంతో భూదేవి కాంప్లెక్స్ క్యూలైన్లకు అధికారులు తాళాలు వేశారు. దీంతో భక్తులు ఉసూరుమన్నారు. తిరుపతి అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద గురువారం తోపులాట చోటుచేసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం కూడా భక్తులు భారీగా తరలిరావడంతో అలిపిరి టోల్ గేట్, తిరుపతి ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాసం, విష్ణునివాసం వద్ద రద్దీ భారీగా కనిపించింది. తిరుమలలో సర్వదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సర్వదర్శనానికి 30 గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి 8 గంటలు సమయం పడుతోంది. 30 నిముషాల్లో 15 వేల టికెట్లు ఎలా పూర్తవుతాయని ప్రశ్నిస్తున్నారు.

మల్లన్న సన్నిధిలోనూ అదే తీరు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలోనూ మల్లికార్జున స్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు అవస్థలు పడుతున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో దేవస్థానం చేతులెత్తేసింది. వీఐపీల సేవలో తరిస్తున్న అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యుల తీరూ తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సామాన్య భక్తులకు కనీసం తాగునీరూ అందించలేని దుస్థితి నెలకొంది. బిస్కెట్లు, అల్పాహారం, చంటిపిల్లలకు పాలూ ఇవ్వలేక దేవస్థానం చేతులెత్తేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది భక్తులు గంటల తరబడి కంపార్ట్‌మెంట్లలో ఉండలేక గోడలు దూకి బయటికి వచ్చేయడం గమనార్హం. భక్తుల రద్దీ దృష్ట్యా సీఆర్‌వో కార్యాలయం వద్ద వీఐపీ బ్రేక్ టికెట్ల కేటాయింపును దేవస్థానం తాత్కాలికంగా రద్దు చేసింది.

తిరుపతిలో తోపులాట చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యమే

- వైఎస్సార్‌సీపీ నేత, మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: తిరుపతిలో భక్తుల తోపులాట చంద్రబాబు ప్రభుత్వ పాలన వైఫల్యానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. చంద్రబాబు పాలనలో టీటీడీ.. టీడీపీ కార్యాలయంలా మారిపోయిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడల్లా టీటీడీని రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలలో సామాన్య భక్తులకు దర్శనం కష్టంగా మారిందన్నారు. గురువారం క్రిస్మస్, తరువాత శుక్ర, శని, ఆదివారం సెలవులు ఉంటే భారీగా భక్తులు తిరుమలకు వస్తారని పాలక మండలికి తెలియదా? అని నిలదీశారు. సెలవు రోజుల్లో టీటీడీ ఎలా వ్యవహరించాలో కూడా తెలియని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.

భక్తుల భద్రతపై అప్రమత్తంగా ఉండండి

సీఎం చంద్రబాబు

తిరుపతి క్రైమ్ : తిరుమల-తిరుపతికి దేశ విదేశాల నుంచి లక్షలాది భక్తులు వస్తారని.. వారి భద్రత, రక్షణకు పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారు. తిరుపతిలో నూతనంగా నిర్మించిన జిల్లా పోలీసు కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎక్కడా చిన్న ఘటన కూడా జరగకుండా టెక్నాలజీ, డ్రోన్లతో నిఘా పెంచాలని ఆదేశించారు.

అవుట్ సోర్సింగ్‌లోనే ఒకేషనల్ ట్రైనర్స్ నియామకాలు

- కాంట్రాక్ట్ ఉద్యోగాలని నమ్మి దళారులను ఆశ్రయించవద్దు
- సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ యాజమాన్యంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు స్కిల్ శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన ఒకేషనల్ ట్రైనర్స్, ఒకేషనల్ కో ఆర్డినేటర్స్ నియామకాల్లో సమగ్ర శిక్ష విభాగానికి సంబంధం లేదని ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. ట్రైనర్స్ నియామకాల బాధ్యత ఆరు ప్రైవేటు సంస్థలకు అప్పగించినట్టు చెప్పారు. మొత్తం 11 కోర్సులకు దాదాపు 500 మంది బోధకులను ఆ సంస్థలు నియమించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దళారులు రంగప్రవేశం చేసి సమగ్రశిక్షలో కాంట్రాక్టు పోస్టులు ఇప్పిస్తామని అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు రావడంతో ఎస్పీడీ స్పందించారు. థర్డ్ పార్టీ ఏజెన్సీలే నియామకాలు చేయడంతో పాటు జీతభత్యాలు చెల్లిస్తాయని స్పష్టం చేశారు. సమగ్ర శిక్షతో అభ్యర్థులకు సంబంధం ఉండదని.. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

అభ్యర్థుల ఆందోళన

కాగా అభ్యర్థుల ఎంపిక కోసం శుక్రవారం 4 ప్రైవేటు సంస్థలు పరీక్షలు నిర్వహించాయి. కాగా చాలామంది అభ్యర్థులు హాల్‌టికెట్లు అందలేదని సెంటర్ల వద్ద ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీడీ శ్రీనివాసరావు స్పందించారు. అర్హత ఉండి పరీక్ష రాయలేకపోయిన అభ్యర్థులకు వారం రోజుల్లో పరీక్ష నిర్వహించేలా సదరు సంస్థలను ఆదేశిస్తామన్నారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించాలి: బీటీఏ

సాక్షి, అమరావతి: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పునరుద్ధరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. దేశంలో తొలి మహిళా టీచర్‌గా గుర్తింపు పొందిన సావిత్రిబాయి పూలే జయంతిని జనవరి 3న పాఠశాలల్లో నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి, కార్యదర్శి, డైరెక్టర్లకు లేఖలు రాసినట్టు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతి రామారావు, చిట్టేటి రమేష్ పేర్కొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తియ్యటి ముప్పు!

- గర్భిణులకు డయాబెటిక్ ప్రమాదం
- తల్లితో పాటు బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం
- చాపకింద నీరులా విస్తరిస్తున్న షుగర్ వ్యాధి

అనంతపురం జిల్లాలో మధుమేహం సోకిన గర్భిణుల వివరాలు		
సంవత్సరం	పరీక్షించిన గర్భిణుల సంఖ్య	షుగర్ నిర్ధారణ సంఖ్య
2021-22	11,979	37
2022-23	44,496	115
2023-24	42,787	183
2024-25	39,913	210

రాయదుర్గం: ప్రపంచ వ్యాప్తంగా మధుమేహం విస్తరిస్తోంది. ఆడ, మగ, వయసు తేడా లేకుండా ఎన్నో అనర్థాలకు కారణమవుతోంది. భూమిపై జీవించే వారికే కాదు.. ఇంకా భూమిపై పడని గర్భస్థ శిశువులపైనా ప్రభావం చూపిస్తోంది. జెస్టేషనల్ డయాబెటిస్ తల్లికే కాదు బిడ్డకూ హాని కలిగిస్తోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గర్భం ధరించకముందు కొందరికి, ఆ తర్వాత మరికొందరికి మధుమేహం లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి నిర్ధారణ అయిన తక్షణం కంగారు పడాల్సిన పనిలేదు. తగు చికిత్స తీసుకుంటే, జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యవంతమైన, పండంటి శిశువులకు జన్మనివొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అనంతపురం జిల్లాలోనూ ఈ వ్యాధి లక్షణాలతో బాధపడేవారి సంఖ్యతో పాటు గర్భిణుల్లోనూ నానాటికి ఎక్కువవుతోంది. జిల్లాలో 2021–22 నుంచి 2024–25 వరకు 1,39,175 మంది గర్భిణులకు డయాబెటిక్ పరీక్షలు నిర్వహించగా, 545 మందికి వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి.

మారిన ఆహారపు అలవాట్లతోనే విజృంభణ

మారిన ఆహారపు అలవాట్ల కారణంగా షుగర్ వ్యాధి విజృంభిస్తోంది. ఈ వ్యాధి లక్షణాలతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మేల్కొనపోతే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాబోయే తల్లులు జాగ్రత్తలు పాటిస్తేనే బిడ్డల భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తారు. లేకుంటే జీవితాంతం ఈ 'తీపి' గుర్తు చెరగని ముద్రగా వేధిస్తుంది. గర్భం దాల్చి 24 వారాలు నిండిన తర్వాత ఓరల్ గ్లూకోజ్ టోలరెన్స్ (ఓజీటీ) చేయించుకోవాలి. ఫాస్టింగ్ షుగర్ పరీక్షల్లో రక్తంలో గ్లూకోజ్ స్థాయి 90 కన్నా ఎక్కువ, పోస్ట్ ప్రాండియల్ షుగర్ పరీక్షల్లో 140 కన్నా ఎక్కువగా ఉంటే జస్టేషనల్ డయాబెటిస్ అంటారు. కేవలం గర్భధారణ సమయంలో మాత్రమే కనిపించినా.. సరైన చికిత్స తీసుకోకుంటే ప్రమాదకరంగా పరిణమిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భయపెడుతున్న డయాబెటిస్

గర్భధారణ సమయంలో హార్మోన్ల మార్పుల వల్ల రక్తంలో గ్లూకోజ్ లెవెల్స్ బాగా పెరుగుతాయి. ప్రధానంగా గర్భధారణ సమయంలో షుగర్‌వ్యాధి బారినపడితే గర్భస్థ శిశువు పరిమాణం, బరువు పెరుగుతుంది. దీనివల్ల ప్రసవ సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయి. అలాగే గర్భంలోనే శిశువుకు షుగర్ అలవాటు కావడం వల్ల ప్రసవం తర్వాత శిశువు శరీరంలో షుగర్ లెవెల్స్ పడిపోతాయి. పాపాయిని ఐసీయూలో ఉంచాల్సిన పరిస్థితి వస్తుంది. గర్భధారణ సమయంలో షుగర్ వ్యాధి నిర్ధారణ అయితే బిడ్డకు డయాబెటిస్ వస్తుందని చాలామంది భయపడుతుంటారు. అయితే ఇది అపోహ మాత్రమేనని వైద్య నిపుణులంటున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

గర్భధారణ సమయంలో ఆహారపు అలవాట్లతో డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. ప్రసవం తర్వాత సరైన ఆహారం తీసుకోని వారిలో, ఆహారపు నియమాలు పాటించని వారిలో నాలుగైదేళ్ల తర్వాత డయాబెటిస్ బయటపడుతుంది. ప్రసవం తర్వాత సాధారణంగా తల్లులు బరువు తగ్గుతారు. కొంత మంది మొదటి మూడు నెలలు బరువుతగ్గి ఆ తర్వాత క్రమంగా బరువు పెరుగుతారు. ఇది ఆరోగ్యకరమైన లక్షణం కాదు. ప్రసవం తర్వాత బరువు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటే డయాబెటిస్ గురించి భయపడాల్సిన పనిలేదు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

గర్భిణులే కాదు ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. మారుతున్న ఆహారపు అలవాట్లు, వ్యాయామం లాంటివి లేక బీపీ, షుగర్ బాధితులు పెరుగుతున్నారు. ముఖ్యంగా గర్భిణులు తప్పక షుగర్ పరీక్షలు చేయించుకోవాలి. నిర్ధారణ అయితే బిడ్డకు సోకకుండా రక్షించుకోవచ్చు. జాగ్రత్తలు తీసుకోవచ్చు. గర్భం ధరించినప్పుడు షుగర్ లెవెల్స్ పెరిగినట్లు కనిపించినా ప్రసవం తర్వాత చాలామందిలో మటుమాయం అవుతుంది. ముఖ్యంగా ఆహారపు నియమాలతో పాటు వ్యాయామం చేయాలి.

– ఈబీ దేవి,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

సిరుల ట్యూనా.. దళారులకేనా?

విశాఖ, కాకినాడ తీరాల్లో భారీగా లభిస్తున్న ట్యూనా సంపద

- రోజుకు 200 టన్నుల వరకు వలకు చిక్కుతున్న చేపలు
- కేరళతో పాటు వియత్నాం, థాయ్‌లాండ్ తదితర దేశాల్లో భారీ డిమాండ్
- కిలో రూ.120 నుంచి రూ.180కే కొనుగోలు చేస్తున్న దళారులు
- విదేశీ మార్కెట్‌లో కిలో రూ.350 నుంచి రూ.800 పైగా ధర
- మార్కెటింగ్, ప్రాసెసింగ్ సౌకర్యం లేక నష్టపోతున్న మత్స్యకారులు

విదేశాల్లో విపరీతమైన డిమాండ్

దేశీయ మార్కెట్‌లో అయితే ఎక్కువగా విశాఖ నుంచి కేరళకు ట్యూనా ఎగుమతి జరుగుతోంది. శుద్ధి చేసిన ట్యూనాలు అమెరికా, థాయ్‌లాండ్, హాంకాంగ్, మలేసియా, వియత్నాం, చైనా తదితర దేశాలకు అధిక సంఖ్యలో ఎగుమతి అవుతున్నాయి. ఈ చేపల్లో ముళ్లు తక్కువగా ఉంటాయి. అధికశాతం ప్రొటీన్లు, ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్లు ఎక్కువగా ఉండటంతో డిమాండ్ పెరుగుతోంది. కేరళలో ప్రాసెస్ చేసిన తర్వాత.. కిలో రూ.350 నుంచి రూ.800 వరకూ విక్రయిస్తున్నారు. కానీ.. శ్రమకోర్చి చేపలు పట్టిన మత్స్యకారుడు మాత్రం దోపిడీకి గురవుతున్నాడు.

సాక్షి, విశాఖపట్నం: వలకు చిక్కితే సిరులు కురిపిస్తుంది.. తింటే పుష్కలంగా ఆరోగ్యాన్ని అందిస్తుంది.. ఎగుమతి చేస్తున్నామంటే చాలు, కొనుగోలు చేసేందుకు విదేశాలు క్యూ కడతాయి. అలాంటి అపారమైన మత్స్య సంపద తూర్పు తీరానికి సొంతం. ఆరోగ్య ప్రయోజనాలు, ఎగుమతి డిమాండ్ పరంగా అంతా సానుకూలంగా ఉన్నా.. సిరులు కురిపించే విషయంలో మాత్రం మత్స్యకారులకు అన్యాయమే జరుగుతోంది, వారి శ్రమ దోపిడీకి గురవుతోంది. వందల కిలోమీటర్ల దూరం వెళ్లి, గంటల తరబడి వేచి చూస్తే గానీ చిక్కని ట్యూనా చేపలకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడంతో దళారులకే లబ్ధి చేకూరుతోంది. జాతీయ మత్స్య పరిశోధన సంస్థ(ఎఫ్‌ఎస్‌ఐ) సర్వే ప్రకారం .. విశాఖ, కాకినాడ నుంచే ట్యూనా అత్యధికంగా ఎగుమతి అవుతున్నా, గంగపుత్రులకు మాత్రం ఆశించిన లాభం చేకూరడం లేదు.

అపారమైన సంపద

ఎఫ్‌ఎస్‌ఐ విశాఖ జోన్ ఇన్‌చార్జి సి.ధనుంజయరావు నేతృత్వంలో శాస్త్రవేత్త జి.వి.ఎ.ప్రసాద్ ట్యూనా సంపదపై సుదీర్ఘ పరిశోధనలు నిర్వహించారు. 2024 అక్టోబర్ నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు విశాఖ ఫిషింగ్ హార్బర్, పెదజాలారిపేట, పూడిమడక, కాకినాడ కేంద్రాలుగా లభ్యమైన సముద్ర ఉత్పత్తులపై సర్వే చేసిన సమయంలో ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. విదేశీయులకు అత్యంత ఇష్టమైన, డిమాండ్ ఉన్న ట్యూనా చేపలు ఎక్కువ శాతం ఇక్కడే లభ్యమవుతున్నట్లు తేలింది. తూర్పు ఎగువ తీరంలో ట్యూనా చేపల దిగుబడి అధికంగా ఉన్నట్లు గుర్తించారు. విశాఖపట్నం, కాకినాడ తీరాల్లో మత్స్యకారులు జరిపే వేటలో 50 నుంచి 60 రకాల చేపలు లభ్యమైతే.. వాటిల్లో ట్యూనాల వాటా 50 శాతానికి పైగా ఉంటోందంటే.. ఇక్కడ వీటి దిగుబడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఎల్లో ఫిన్ ట్యూనా(పసుపు రెక్కల సూర), బిగ్ ఐ ట్యూనా(పెద్దకన్ను సూర), స్కిప్‌జాక్ ట్యూనా (నామాల సూర) తదితర రకాలు విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు రోజుకు 100 నుంచి 120 టన్నుల వరకు వస్తున్నాయి. కాకినాడ తీరంలోనూ 100 టన్నుల వరకు లభ్యత ఉన్నట్లు ఎఫ్‌ఎస్‌ఐ శాస్త్రవేత్త ప్రసాద్ సర్వేలో స్పష్టమైంది.

దండిగా వలకు చిక్కిన ట్యూనా చేపలు

శ్రమకు తగిన ధర ఎక్కడ?

ఇంత కష్టపడి రోజుల తరబడి సముద్రంలో వేటాడి వస్తే.. ట్యూనా విషయంలో మాత్రం మత్స్యకారులకు ఆశించిన రాబడి రావడం లేదు. స్థానిక ప్రజలు ట్యూనాను తినేందుకు అంతగా ఆసక్తి చూపించరు. దీంతో లోకల్ మార్కెట్‌లో గిరాకీ ఉండదు. ఇక చేసేది లేక.. దళారులు ఎంత ధర ఇస్తామంటే అంత ధరకు అప్పగించాల్సి వస్తోంది. ఫలితంగా ఇక్కడ ట్యూనా మార్కెట్‌పై దళారులే పెత్తనం చెలాయిస్తున్న పరిస్థితులు దాపురించాయి. మత్స్యకారులకు కిలోకు రూ.120 నుంచి గరిష్టంగా రూ.180 వరకూ మాత్రమే ముట్టజెబుతున్నారు. ఇక వేట నిషేధ సమయంలో పెదజాలరిపేటకు చెందిన మత్స్యకారులు చిన్న పడవలపై వందల కిలోమీటర్లు వెళ్లి ట్యూనా తీసుకొస్తుంటే.. దళారులు మాత్రం అన్ సీజన్ అంటూ కిలోకి రూ.90 నుంచి రూ.100 మాత్రమే చేతుల్లో పెడుతున్నారని వారు వాపోతున్నారు.

1000 మీటర్ల లోతు వరకు వేట

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి ప్రతి రోజూ 300 బోట్ల వరకు ట్యూనా వేట కోసం బయలుదేరుతుంటాయి. తీరం నుంచి 70 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించిన తర్వాత, 700 నుంచి 1000 మీటర్ల లోతులో ట్యూనా సంపద విస్తృతంగా ఉంది. కాకినాడ, విశాఖకు చెందిన మత్స్యకారులు పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్, శ్రీలంక సముద్ర జలాల వరకూ వెళ్లి వేటను సాగిస్తుంటారు. వేట కోసం సుమారు 90 బాస్కెట్లను సముద్రంలో విడిచిపెడతారు. ఒక్కో బాస్కెట్‌లో 6 హుక్స్(గాలాలు) ఉంటాయి. 4 గంటల పాటు హుక్స్‌ని నీటిలో ఉంచి, తర్వాత ఒక్కో బాస్కెట్‌ని బయటికి తీసి ట్యూనాలను పట్టుకొని తిరిగి వస్తుంటారు. ఇంజిన్ బోట్లతో పాటు సంప్రదాయ మరపడవలపై వెళ్లి మరీ ఈ వేట సాగిస్తుంటారు. ట్యూనా తర్వాత ఎక్కువగా కొమ్ముకోనాం చేపలు ఇక్కడి మత్స్యకారులకు చిక్కుతున్నాయి.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

ట్యూనా చేపలు హార్బర్‌కు ఎక్కువగా వస్తున్నాయి. అయితే కష్టానికి సరిపడా ధర అందడం లేదు. ఇక్కడ మార్కెట్ సదుపాయాన్ని కల్పిస్తే మత్స్యకారులంతా లాభపడతారు. అదేవిధంగా కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులోకి తీసుకురావాలి. అప్పుడు నేరుగా ఇక్కడి నుంచే విదేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశం ఉంటుంది. అమెరికా, జపాన్, యూరప్, దక్షిణ ఆసియా దేశాల్లో ట్యూనాల వినియోగం అధికంగా ఉంది. అక్కడకు ఎగుమతి చేస్తే మంచి ధర లభిస్తుంది. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయాలని డిమాండ్ చేస్తున్నాం. –సూరాడ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు, వైశాఖి మరపడవల సంఘం

కొన్ని సందర్భాల్లో ట్యూనాయే దిక్కు

వేట విరామ సమయంలో చిన్న పడవలు వేసుకొని వెళ్తున్నాం. అప్పుడు ట్యూనా చేపలే మాకు దిక్కవుతున్నాయి. కానీ.. ఇంత కష్టపడి తీసుకొస్తున్నా ఆశించిన ధర రావడం లేదు. ఎంత చెబితే అంతకు ఇవ్వాల్సిన పరిస్థితి. ఎందుకంటే స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేదు. అందుకే తక్కువ ధరకు అమ్ముకుంటున్నాం.
– మేరుగు ఎల్లాజీ, మత్స్యకారుడు, మంగమారిపేట

పోలీసు స్టేషన్ ముందు టీడీపీ నేత భార్య నిరసన

మదనపల్లె రూరల్ : టీడీపీ నాయకుడైన తన భర్త మహబూబ్‌ఖాన్ వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని, తమను పట్టించుకోకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని.. అయితే, టీడీపీ నేతనైన తనపైనే కేసు పెడతావా అంటూ తనను వేధిస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నాడని మహబూబ్‌ఖాన్ భార్య జోయాఖాన్ శుక్రవారం ఆవేదన వ్యక్తంచేసింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ కుమార్తెతో కలిసి అన్నమయ్య జిల్లా మదనపల్లి టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆమె నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా జోయాఖాన్ మాట్లాడుతూ.. తన కనీస అవసరాలకు కావాల్సిన ఆర్థిక వనరులను తన భర్త సమకూర్చకపోగా, బాధ్యత లేకుండా తిరుగుతూ తనను నిత్యం మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడని ఆరోపించింది. ఈ విషయమై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనప్పటికీ అతడిలో మార్పు రాలేదని ఆమె ఆరోపించింది. రెండ్రోజుల క్రితం అర్ధరాత్రి వేళ ఆయన తన ఇద్దరు స్నేహితులతో ఇంటిపైకి వచ్చి దాడిచేశాడని.. దీంతో తాను 112 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశానని తెలిపింది. అయినప్పటికీ పోలీసులు తనకు న్యాయం చేయకపోవడంతో కుమార్తెను తీసుకుని స్టేషన్ ఎదుట నిరసన చేపట్టినట్లు చెప్పింది.

మదనపల్లి టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న జోయాఖాన్

● గంగమ్మా.. చల్లగ చూడమ్మా

సునామీ వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విశాఖ నగరంపెదజాలరిపేట గ్రామస్తులు శుక్రవారం గంగమ్మ తల్లికి పూజలు చేశారు. పూట గడవడానికి తమకు వేటే ఆధారమని, తమ బతుకులు సముద్రంతోనే ముడిపడి ఉన్నందున తమను చల్లగా చూడాలని గంగమ్మతల్లిని వేడుకున్నారు.

అనారోగ్యంతో పోలీస్ జాగిలం టైగర్ మృతి

బాపట్ల టౌన్: పోలీస్ శాఖలో విశేష సేవలందించిన పోలీస్ జాగిలం టైగర్ మృతి చెందడం బాధాకరమని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. మృతిచెందిన టైగర్‌కు శుక్రవారం పోలీస్‌లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసు భద్రతా విభాగంలో 2017 నుంచి విశేష సేవలు అందించిన పోలీసు స్నిఫర్ జాగిలం ''టైగర్'' అనారోగ్యంతో మృతి చెందింది. మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎస్పీ వెదుళ్లపల్లి గ్రామంలో డాగ్ కెన్నెల్ భవనంలో ఉంచిన ''టైగర్''కు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ బి. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ, జిల్లా పోలీస్ శాఖకు ''టైగర్'' జాగిలం విశేష సేవలు అందించిందన్నారు. టైగర్ మృతి చెందడం బాధాకరమన్నారు.

మృతిచెందిన పోలీస్‌జాగిలానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

హైటెక్ దాసులు

- మారుతున్న కాలంతో ముమ్మందుకు
- సంస్కృతిని, వారసత్వాన్ని కొనసాగిస్తున్న వైనం
- ఆదాయాన్ని వదులుకుని ఆచారానికి పెద్దపీట
- ఎంతటి వారైనా గజ్జెకట్టి అక్షయ పాత్ర పట్టాల్సిందే
- భక్తి శ్రద్ధలతో.. హరినామ సంకీర్తనతో కఠోర దీక్ష

కోనసీమ జిల్లా వానపల్లిపాలెంలో మోటారు సైకిల్‌పై అక్షయపాత్ర పెట్టి భిక్షాటన చేస్తున్న హరిదాసు

ఉప్పలగుప్తం: ధనుర్మాసం వస్తూనే వేకువ జామునే శిరస్సున అక్షయ పాత్ర.. మెడలో చామంతుల మాల.. ఓ చేతిన చిడతలు.. మరో చేతిన తంబుర.. పాదాలకు మంజీరాలు.. నోట సుస్వర హరినామ సంకీర్తనలు.. పెద్దపెద్ద అంగలతో ఇంటింటికీ తిరిగి వారిచ్చిన స్వయంపాకాన్ని స్వీకరించి నమస్కరించి నవారిని దీవించి వడివడిగా ముందుకు సాగే హరిదాసు ఓ నాటి దృశ్యకావ్యం. తెలుగువారి సంస్కృతిని తరతరాలుగా కొనసాగిస్తూ.. మారిన కాలంతో పోటీ పడి తానూ మారుతూ వాహనధారియై.. దాని హెడ్‌లైట్‌పై అక్షయ పాత్ర.. హ్యాండిల్‌కి మైక్.. దాని నుంచి హరినామ సంకీర్తనలు.. ఇదీ ఆధునిక హరిదాసు జీవన చిత్రం. ముమ్మందు ఇంకెంత ఆధునీకత సంతరించుకుంటారో చూడాలి మరి. వీరికీ ఓ ఘన చరిత్ర.. కఠోర దీక్ష.. సంప్రదాయాన్ని ముందు తరాలకు తీసుకువెళ్లాలనే అంకితభావం ఉండడం చెప్పుకోదగ్గ విషయం.

వైష్ణవులలో ఓ వర్గం నియమ నిబద్ధతలతో కూడిన మహావిష్ణు దీక్షను భక్తితో స్వీకరిస్తారు. కృష్ణ బలిజలు, శాతానాలు, వైష్ణవులు, దాసరులు పూర్వీకుల నుంచి వచ్చిన ఆచారాన్ని కాపాడటానికి అవలంబించే 41 రోజుల కఠోర దీక్ష ఇది.

ఈ దీక్షలను కార్తికం, ధనుర్మాసం, మాఘ మాసాల్లో సంబంధిత గురువుల వద్ద స్వీకరిస్తారు. ఈ హరిదాసు దీక్షలకు సంబంధించి భద్రాచలంలో ప్రత్యేక శిక్షణ క్షేత్రం ఉంది. దీక్ష ఆరంభం నుంచి విరామం వరకూ వారి తమ పూర్వీకులు తిరిగిన గ్రామాల్లో పీఠం పెట్టుకుని భక్తిశ్రద్ధలతో కుటుంబాలకు దూరంగా ఉంటూ ఇల్లిల్లూ హరి నామ కీర్తన చేసుకుంటూ భిక్షాటన చేస్తారు. కటిక నేలపై పడుకుని నిత్యం ఉదయం, సాయంత్రం తలస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేసుకుని అక్షయపాత్రకు అభిషేకం చేస్తారు. గ్రామాల్లో తిరుగుతూ సాయంత్రానికి పీఠం వద్దకు చేరుకుంటారు. ఉదయం వేళ అల్పాహారం తీసుకుంటూ సాయంత్రం ఒంటిపూట భోజనం చేస్తుంటారు. నెత్తిన అక్షయపాత్ర పెట్టుకుంటే అది దింపే వరకూ దైవ సంకీర్తన తప్ప వేరే మాట నోటి నుంచి రాకూడదన్నది నియమం. దీక్షాకాలం అనంతరం విష్ణు, శివాలయాల్లో దీక్షను విరమిస్తారు. దీక్షలో స్వీకరించిన భిక్షను తమ అవసరాలకు కొంత మిగుల్చుకుని భద్రాచలం రాముల వారి కల్యాణంలో జరిగే అన్నదానానికి పంపిస్తారు. సాధారణ సమయంలో ఉద్యోగాలు, వ్యాపారాలు, చేతి వృత్తులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటారు.

ఇంత కఠిన దీక్షను నేటి తరం ఆచరించే శారీరక సామర్థ్యం లేక ఆధునిక వసతులను వినియోగించుకుంటూ సంస్కృతిని ముందు తరాలకు అందజేస్తున్నారు. ఈ పయనంలో భాగంగా మోటారు సైకిళ్లను వారి ఆహార్యానికి అనుగుణంగా మార్పులు చేసుకుని చకచకా సాగిపోతున్నారు. వీరు సుమారు 4, 5 గ్రామాలను ఎంపిక చేసుకుంటారు. ఈ గ్రామాల్లో సంచరిస్తే వచ్చేది రోజుకు కేవలం నాలుగైదు కుంచాల బియ్యం మాత్రమే. ప్రస్తుతం మోటారు సైకిల్‌పై తిరగటంతో దాని ఇంధనంతో పాటు ఇతర ఖర్చులకు 3 నుంచి 4 వందలు ఖర్చవుతుంది.

ఇంతటి పురాతన సంస్కృతిని ముందు తరాలకు అందిస్తున్న ఈ వృత్తి కళాకారులకు ప్రభుత్వాల పరంగా ఎటువంటి గుర్తింపూ లేకపోవడం గమనార్హం. కొంతమంది దృష్టిలో వీరు భక్తులా, లేక ఒక వృత్తినే నమ్ముకున్న వారా అనే సందేహాలు కొంతమంది వ్యక్తం చేస్తుంటారు. కృష్ణ బలిజలు, శాతానాలు, వైష్ణవులు, దాసరి సామాజిక వర్గాలకు చెందిన వీరు బీసీ–డీ కేటగిరీగా పరిగణించబడుతున్నారు. వీరు ఎక్కువగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో, కృష్ణ, అనకాపల్లి జిల్లాలో నివసిస్తుంటారు. వీరికి రిజర్వేషన్ కోటాలో తక్కువగా ప్రాధాన్యత ఉండి వారి పిల్లలు విద్యారంగంలో అవకాశాలు కోల్పోతున్నప్పటికీ బీసీ–ఏ గా మార్చాలని ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తూ వారి గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వారిని బీసీ–ఏగా మార్చడానికి సన్నాహాలు చేసినప్పటికీ కొందరి అభ్యంతరాలతో పిటిషన్‌లు పెట్టి అడ్డుకున్నారని ఆ సామాజిక వర్గాల వారు ఆవేదన చేస్తున్నారు.

నాన్న ఆదేశాలతో దీక్ష స్వీకరించా

నాపేరు అన్యం రాం బాబు. మాది కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలోని అముజూరు గ్రామం. నేను డిగ్రీ వరకూ చదువుకున్నాను. ప్రస్తుతం బట్టల వ్యాపారం చేస్తున్నాను. మా ముత్తాత, మాతాత, మానాన్న ఈ దీక్ష స్వీకరించి కొన్ని గ్రామాల్లో సంచరించారు. మా నాన్నకు మోకాళ్ల గుజ్జు అరిగిపోయి ఆరోగ్యం క్షీణించింది. అందుకే వారసత్వం, సాంప్రదాయం కాపాడటానికి ఆయన ఆదేశాలతో ఈ దీక్షను స్వీకరించి నేను మోటారు సైకిల్‌పై కొనసాగిస్తున్నాను. మా ఈ ఆచారంలో చాలా ఉన్నతమైన ఉద్యోగం చేసుకునే వారు సైతం వారి అవకాశాన్ని బట్టి కనీసం రెండు రోజులైనా ఈ దీక్షను స్వీకరిస్తారు. రేపటి తరంలో నా కుమారుడు సైతం ఏ హోదాలో ఉన్న మా పూర్వీకులు తిరిగిన ప్రాంతాల్లో ఈ దీక్షను ఆచరించాలి. నేను కార్తికమాసంలో దీక్షను తీసుకున్నాను. సుబ్రహ్మణ్య షష్టికి దీక్షను విరమిస్తాను.

ఉద్యానవనంలో షెడ్డు ఏర్పాటుకు మార్కింగ్ వేసిన దృశ్యం

పార్క్ పోయి షెడ్డు వచ్చే..!

శ్రీశైల మహాక్షేత్రంలో ఎన్నో సంవత్సరాలుగా పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉండే ఉద్యానవనం భక్తులు సేద తీరుతారు. అయితే మంత్రి ఆదేశించారని ఉద్యానవనాన్ని తొలగించి షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. శివరాత్రిని పురస్కరించుకుని శివమాలను స్వీకరించిన భక్తులు శివదీక్షను విరమించేందుకు ప్రస్తుతం ఉన్న శివదీక్షా విరమణ షెడ్డు సరిపోకపోవడంతో అదనంగా నూతన షెడ్డును ఏర్పాటు చేయాలని గత శివరాత్రి సమయంలో శివదీక్షా శిబిరాలను సందర్శించిన దేవదాయశాఖ మంత్రి ఆదేశించారు. ఈ క్రమంలో దేవస్థాన అధికారులు శివదీక్షా శిబిరాల వెనుక ఉన్న ఉద్యానవనంలో ఈ షెడ్డును ఏర్పాటు చేస్తున్నారు. పచ్చని గడ్డి, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఉద్యానవనంలో చెట్లను నరికివేసి, భారీ గోతులు తీసి షెడ్డు నిర్మాణ పనులు షురూ చేశారు. శివరాత్రికి ఈ షెడ్డును పూర్తి చేసి శివదీక్షా విరమణ భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని దేవస్థాన అధికారులు భావిస్తున్నారు. సుమారు రూ.1.80 కోట్లతో టెంజైల్‌తో షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఉద్యానవన పార్క్‌ను తొలగించి షెడ్డును ఏర్పాటు చేయడంపై పర్యావరణ ప్రేమికులు, పలువురు భక్తులు మండిపడుతున్నారు.
– శ్రీశైలం టెంపుల్



భారీ గోతులు తవ్విన దృశ్యం

మీ వెంటే మేము...

ఒకే రోజు 20 వికెట్లు

రెండు జట్ల తొలి ఇన్నింగ్స్ పూర్తి

ఆస్ట్రేలియా 152 ఆలౌట్
జోష్ టంగ్‌కు 5 వికెట్లు ● ఇంగ్లండ్ 110 ఆలౌట్
మెరిసిన నెసెర్, బోలాండ్, స్టార్క్ ● 'బాక్సింగ్ డే' టెస్టు

స్టీవ్ స్మిత్ బౌల్డ్

నెసెర్

జోష్ టంగ్

94,199 ఈ మ్యాచ్‌కు తొలి రోజు ప్రత్యక్షంగా వీక్షించిన అభిమానుల సంఖ్య. మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియంలో ఇదే అత్యధికం. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య 2015 వన్డే ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు 93,013 మంది హాజరయ్యారు. తాజాగా ఆ రికార్డు బద్దలైంది.

4 మెల్‌బోర్న్ మైదానంలో ఇప్పటి వరకు జరిగిన టెస్టుల్లో తొలి రోజే 20 అంతకంటే ఎక్కువ వికెట్లు నేలకూలడం ఇది నాలుగోసారి. 1894లో ఆస్ట్రేలియా–ఇంగ్లండ్ టెస్టు తొలి రోజు 20 వికెట్లు... 1902లో ఆస్ట్రేలియా–ఇంగ్లండ్ టెస్టు తొలి రోజు 25 వికెట్లు...1932లో ఆస్ట్రేలియా–దక్షిణాఫ్రికా టెస్టు తొలి రోజు 20 వికెట్లు పడ్డాయి.

3468 టెస్టు క్రికెట్‌లో 3000 వేల పరుగులు పూర్తి చేసుకునేందుకు హ్యారీ బ్రూక్‌కు అవసరమైన బంతులు. ఆస్ట్రేలియా మాజీ ప్లేయర్ గిల్‌క్రిస్ట్ 3610 బంతుల్లో ఈ మార్క్ అందుకున్నాడు.

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న 'యాషెస్' సిరీస్ నాలుగో టెస్టులో బౌలర్ల జోరు కొనసాగుతోంది. పచ్చికతో కూడిన పిచ్‌పై ఆట తొలి రోజే 20 వికెట్లు నేలకూలి రెండు జట్ల తొలి ఇన్నింగ్స్‌లు ముగిశాయి. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ దాదాపు లక్ష మంది అభిమానుల సమక్షంలో జరిగిన పోరులో... ఇరు జట్ల బౌలర్లు బంతితో నిప్పులు చెరిగారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇప్పటికే ఆడిన తొలి మూడు టెస్టుల్లో నెగ్గిన ఆస్ట్రేలియా సిరీస్‌ను 3–0తో సొంతం చేసుకుంది. శుక్రవారం ప్రారంభమైన 'బాక్సింగ్ డే' టెస్టులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 45.2 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. నెసెర్ (49 బంతుల్లో 35; 7 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... ఉస్మాన్ ఖ్వాజా (29), అలెక్స్ కేరీ (20) తలా కొన్ని పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్ 5 వికెట్లు పడగొట్టగా... అట్కిన్సన్ 2 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ కూడా ప్రత్యర్థి పేస్‌కు దాసోహమైంది. 29.5 ఓవర్లలోనే 110 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (34 బంతుల్లో 41; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్కడే కాస్త పోరాడగా... అట్కిన్సన్ (28), కెప్టెన్ బెన్ స్టోక్స్ (16) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ఆసీస్ బౌలర్లలో నెసెర్ 4 వికెట్లు పడగొట్టగా... బోలాండ్ 3, స్టార్క్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ శుక్రవారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక ఓవర్‌లో వికెట్ నష్టపోకుండా 4 పరుగులు చేసింది. స్కాట్

బోలాండ్ (4 బ్యాటింగ్), ట్రావిస్ హెడ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 10 వికెట్లు ఉన్న ఆస్ట్రేలియా... ఓవరాల్‌గా 46 పరుగుల ఆధిక్యంలో ఉంది.

ఒకరి వెంట ఒకరు...

గత మూడు మ్యాచ్‌ల్లో గెలిచి ఫుల్ జోష్‌లో ఉన్న ఆస్ట్రేలియాకు... ఈ మ్యాచ్‌లో శుభారంభం దక్కలేదు. ట్రావిస్ హెడ్ (12), జేక్ వెదరాల్డ్ (10) పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. లబుషేన్ (6) విఫలం కాగా... కెప్టెన్ స్టీవ్ స్మిత్ (31 బంతుల్లో 9) క్రీజులో నిలిచే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఆసీస్ 51 పరుగులకే 4 ప్రధాన వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఖ్వాజా, కేరీ కాస్త ప్రతిఘటన కనబర్చారు. క్రీజులో పాతుకుపోయి పరుగులు రాబట్టే ప్రయత్నం చేశారు. అయితే పిచ్ నుంచి లభిస్తున్న సహకారాన్ని వినియోగించుకున్న ఇంగ్లండ్ బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొడుతూ... కంగారూలపై ఒత్తిడి పెంచారు. ఇటీవల ఐపీఎల్ వేలంలో రికార్డు ధర దక్కించుకున్న కామెరాన్ గ్రీన్ (17) కూడా ప్రభావం చూపలేకపోగా... ఆఖర్లో నెసెర్ ధాటిగా ఆడాడు. గ్రీన్, నేసెర్ ఏడో వికెట్‌కు 52 పరుగులు జోడించడంతో ఆసీస్ ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. ఈ క్రమంలో ఇంగ్లండ్ పేసర్ జోష్ టంగ్ కెరీర్ అత్యుత్తమ గణాంకాలు (5/45) నమోదు చేసుకున్నాడు.

తీరు మారని ఇంగ్లండ్...

చక్కటి బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసి సిరీస్‌లో తొలిసారి ఆధిపత్యం కనబర్చే అవకాశాన్ని ఇంగ్లండ్ వినియోగించుకోలేకపోయింది. జాక్ క్రాలీ (5), బెన్ డకెట్ (2), జాకబ్ బెథెల్ (1), జో రూట్ (0) ఇలా ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్ బాట పట్టడంతో ఇంగ్లండ్ జట్టు 16 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో డకెట్‌ను అవుట్ చేసిన స్టార్క్... తన తదుపరి ఓవర్‌లో క్రాలీని బుట్టలో వేసుకున్నాడు. ఈ మధ్య డకెట్‌ను నెసెర్ అవుట్ చేయగా... 15 బంతులాడి ఖాతా తెరవలేకపోయిన రూట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఈ దశలో బ్రూక్ కౌంటర్ ఎటాక్‌కు ప్రయత్నించి కొంత ఫలితం సాధించాడు. కెప్టెన్ స్టోక్స్‌తో కలిసి చక్కటి షాట్‌లతో ఐదో వికెట్‌కు 50 పరుగులు జోడించాడు. బోలాండ్ బౌలింగ్‌లో బ్రూక్ వికెట్ల ముందు దొరికిపోగా... తక్కినవాళ్లు అతడిని అనుసరించారు. ఆఖర్లో అట్కిన్సన్ కొన్ని షాట్స్ ఆడి జట్టు స్కోరును వంద పరుగులు దాటించాడు. దీంతో ఆసీస్‌కు 42 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

రఫ్ఫాడించిన రింకూ సింగ్

60 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సులతో 106 నాటౌట్

● చండీగఢ్‌పై ఉత్తరప్రదేశ్ భారీ విజయం
● విజయ్ హజారే వన్డే టోర్నీ

రాజ్‌కోట్: భారత ఆటగాడు రింకూ సింగ్ (60 బంతుల్లో 106 నాటౌట్; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. వచ్చే ఏడాది జరగనున్న ఐసీసీ టి20 ప్రపంచ కప్ కోసం ప్రకటించిన భారత జట్టులో చోటు దక్కించుకున్న రింకూ సింగ్... మిడిలార్డర్‌లో మెరుపులు మెరిపించాడు. ఫలితంగా ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా జరిగిన పోరులో ఉత్తర ప్రదేశ్ జట్టు 227 పరుగుల భారీ తేడాతో చండీగఢ్‌ను చిత్తు చేసింది. మొదట ఉత్తర ప్రదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 367 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆర్యన్ జుయల్ (118 బంతుల్లో 134; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీతో జట్టుకు గట్టి పునాది వేయగా... దానిపై రింకూ సింగ్ భారీ స్కోరు నిలబెట్టాడు. ధ్రువ్ జురెల్ (57 బంతుల్లో 67; 11 ఫోర్లు) హాఫ్ సెంచరీతో రాణించాడు. అనంతరం లక్ష్యఛేదనలో చండీగఢ్ 29.3 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మనన్ వోహ్రా (32; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లంతా విఫలమయ్యారు. ఉత్తరప్రదేశ్ బౌలర్లలో జీషాన్ అన్సారీ 4 వికెట్లు పడగొట్టాడు. ఇదే గ్రూప్‌లో భాగంగా జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో జమ్మూ కశ్మీర్ 142 పరుగుల తేడాతో అస్సాంపై... బరోడా 4 వికెట్ల తేడాతో బెంగాల్‌పై విజయాలు సాధించాయి.

కరుణ్ నాయర్, పడిక్కల్ సెంచరీలు

భారత ఆటగాళ్లు కరుణ్ నాయర్ (130 బంతుల్లో 130 నాటౌట్; 14 ఫోర్లు), దేవదత్ పడిక్కల్ (137 బంతుల్లో 124; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కడంతో విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో కర్ణాటక జట్టు వరుసగా రెండో విజయం ఖాతాలో వేసుకుంది. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా శుక్రవారం జరిగిన పోరులో డిఫెండింగ్ చాంపియన్ కర్ణాటక 8 వికెట్ల తేడాతో కేరళపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కేరళ జట్టు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. మొహమ్మద్ అజహారుద్దీన్ (58 బంతుల్లో 84; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), బాబా అపరాజిత్ (62 బంతుల్లో 71; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు సాధించారు. అనంతరం లక్ష్యఛేదనలో కర్ణాటక జట్టు 48.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 285 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కరుణ్ నాయర్, దేవదత్ పడిక్కల్ ఆడుతూ పాడుతూ పరుగులు రాబట్టారు. ఇదే గ్రూప్‌లో భాగంగా జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో మధ్యప్రదేశ్ జట్టు 2 వికెట్ల తేడాతో తమిళనాడుపై, జార్ఖండ్ 73 పరుగుల తేడాతో రాజస్తాన్‌పై... త్రిపుర 7 వికెట్ల తేడాతో పుదుచ్చేరిపై గెలుపొందాయి.

అన్‌మోల్, హర్‌నూర్ శతకాలు

ఎలైట్ గ్రూప్ 'సి'లో పంజాబ్ జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసుకుంది. శుక్రవారం జరిగిన పోరులో పంజాబ్ 9 వికెట్ల తేడాతో ఛత్తీస్‌గఢ్‌పై నెగ్గింది. మొదట ఛత్తీస్‌గఢ్ 48.4 ఓవర్లలో 253 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ అమన్‌దీప్ ఖరే (76; 4 ఫోర్లు, 1 సిక్స్), మయాంక్ వర్మ (64; 8 ఫోర్లు) హాఫ్ సెంచరీలు సాధించారు. అనంతరం పంజాబ్ 42.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 254 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్‌నూర్ సింగ్ (114 బంతుల్లో 115 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు), అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (96 బంతుల్లో 105 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ శతకాలతో జట్టును గెలిపించారు. ఇదే గ్రూప్‌లో భాగంగా జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో మహారాష్ట్ర 8 వికెట్ల తేడాతో సిక్కింపై... గోవా 8 పరుగుల తేడాతో హిమాచల్ ప్రదేశ్‌పై విజయాలు సాధించాయి. ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా జరిగిన మ్యాచ్‌ల్లో హరియాణా 6 వికెట్ల తేడాతో సౌరాష్ట్ర పై... ఒడిశా 4 వికెట్ల తేడాతో సర్వీసెస్‌పై గెలుపొందాయి. ప్లేట్ గ్రూప్‌లో బిహార్ జట్టు 15 పరుగుల తేడాతో మణిపూర్‌పై నెగ్గింది. బిహార్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' అందుకోవడానికి ఢిల్లీ వెళ్లడంతో ఈ మ్యాచ్‌లో ఆడలేదు.

వైభవ్ సూర్యవంశీకి 'రాష్ట్రీయ బాల పురస్కార్'

న్యూఢిల్లీ: ఐపీఎల్ అరంగేట్రంలోనే క్రికెట్ ప్రపంచం కంటపడిన టీనేజ్ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రతిష్టాత్మక 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' అవార్డుకు ఎంపికయ్యాడు. ఏడేళ్లకే చదరంగం గళ్లను తన మునివేళ్లతో ఆడిస్తున్న వాకా లక్ష్మీ ప్రాగ్నిక, స్విమ్మింగ్‌లో రాణిస్తున్న ధినిధి డేసింగులకు కూడా ఈ అవార్డు లభించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సీజన్ ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగిన వైభవ్ జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ కేవలం 35 బంతుల్లోనే మెరుపు శతకాన్ని సాధించాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఇది రెండో వేగవంతమైన సెంచరీ కావడం విశేషం. ఆ తర్వాత బరిలోకి దిగిన లిస్ట్ 'ఎ', ఆసీస్‌తో అండర్–19 క్రికెట్లోనూ పరుగుల తుఫాన్‌తో తన ఐపీఎల్ శతకం గాలివాటం కానేకాదని ఈ ఏడాదంతా నిరూపించుకున్నాడు. ఇటీవలే విజయ్ హజారే ట్రోఫీలో 84 బంతుల్లోనే 16 ఫోర్లు, 15 సిక్స్‌లతో 190 పరుగులు బాదాడు. తద్వారా లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో 14 ఏళ్లలోనే శతక్కొట్టిన పిన్న క్రికెటర్ (పురుషుల కేటగిరీ)గా ఘనతకెక్కాడు. ఇక సూరత్‌కు చెందిన లక్ష్మీ ప్రాగ్నిక సెర్బియాలో జరిగిన అండర్–7 బాలికల కేటగిరీలో ఫిడే ప్రపంచ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ నెగ్గింది. 9 గేమ్‌లకు తొమ్మిది గెలిచి 9 పాయింట్లు సాధించడం విశేషం. కర్ణాటక మహిళ స్విమ్మర్ ధినిధి 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో గతేడాది పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ప్రపంచ చాంపియన్‌షిప్ (దోహా)లోనూ పోటీపడింది. గోవా జాతీయ క్రీడల్లో ఏడు స్వర్ణ పతకాలు గెలిచింది.

ఆంధ్ర గెలుపు బోణీ

రాణించిన హేమంత్, నితీశ్, రికీ భుయ్

హేమంత్

నితీశ్

రికీ భుయ్

బెంగళూరు: విజయ్ హజారే ట్రోఫీ తొలి మ్యాచ్‌లో ఓడిన ఆంధ్ర జట్టు... రెండో పోరులో గెలుపుబాట పట్టింది. ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా జరిగిన పోరులో ఆంధ్ర 6 వికెట్ల తేడాతో రైల్వేస్‌ను ఓడించింది. మొదట రైల్వేస్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 266 పరుగులు చేసింది. రవి సింగ్ (76; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), అన్ష్ యాదవ్ (59; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు సాధించారు. ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు, కలిదిండి రాజు చెరో 3 వికెట్లు పడగొట్టగా... హేమంత్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. అనంతరం ఛేదనలో ఆంధ్ర జట్టు 44.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసి గెలిచింది. రికీ భుయ్ (74 బంతుల్లో 76; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ నితీశ్ కుమార్ రెడ్డి (41 బంతుల్లో 55 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. మారంరెడ్డి హేమంత్ రెడ్డి (35 బంతుల్లో 41 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), షేక్ రషీద్ (53 బంతుల్లో 40; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), అశ్విన్ హెబ్బర్ (42 బంతుల్లో 30; 3 ఫోర్లు), శ్రీకర్ భరత్ (23 బంతుల్లో 25; 5 ఫోర్లు) కూడా తలా కొన్ని పరుగులు చేశారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన హేమంత్ రెడ్డికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. సోమవారం జరిగే మూడో లీగ్ మ్యాచ్‌లో ఒడిశా జట్టుతో ఆంధ్ర తలపడుతుంది.

మళ్లీ ఓడిన హైదరాబాద్

వరుణ్ గౌడ్

రాజ్‌కోట్: విజయ్ హజారే ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు వరుసగా రెండో పరాజయం చవిచూసింది. విదర్భ జట్టుతో శుక్రవారం జరిగిన ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 89 పరుగుల తేడాతో ఓడిపోయింది. మొదట విదర్భ 50 ఓవర్లలో 5 వికెట్లకు 365 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ధ్రువ్ షొరే (77 బంతుల్లో 109 నాటౌట్; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించాడు. లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో ధ్రువ్‌కిది వరుసగా ఐదో సెంచరీ. నారాయణ్ జగదీశన్ పేరిట ఉన్న రికార్డును ధ్రువ్ సమం చేశాడు. అమన్ మోఖడె (82; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), యశ్ రాథోడ్ (68; 6 ఫోర్లు), సమర్థ్ (63; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో కార్తికేయ 3 వికెట్లు తీశాడు. అనంతరం ఛేదనలో హైదరాబాద్ 49.2 ఓవర్లలో 276 పరుగులకు ఆలౌటైంది. వరుణ్ గౌడ్ (68 బంతుల్లో 85; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... అభిరథ్ రెడ్డి (43; 8 ఫోర్లు), కెప్టెన్ రాహుల్ సింగ్ (37; 4 ఫోర్లు) తలాకొన్ని పరుగులు చేసినా ఫలితం లేకపోయింది.

నేడు సీడబ్ల్యూసీ సమావేశం

- జీ రామ్ జీ బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలపై చర్చించే అవకాశం
- దేశ రాజకీయ పరిస్థితులు, వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కూడా..

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక విభాగం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శనివారం భేటీ కానుంది. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (వీబీ జీ రామ్ జీ) పేరుతో తెచ్చిన కొత్త చట్టంతో పాటు దేశ రాజకీయ పరిస్థితులపై చర్చించనుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ భేటీకి అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీలతో పాటు అన్ని రాష్ట్రాల పీసీసీల అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్టీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కానున్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత జరుగుతున్న మొదటి **సమావేశం కావడంతో అక్కడి వైఫల్యాలపైనా** చర్చించే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది జరుగనున్న పశ్చిమబెంగాల్, అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ వ్యూహాన్ని సమావేశంలో ఖరారు చేసే అవకాశం ఉందని నేతలు చెబుతున్నారు. ఆయా రాష్ట్రాల్లో స్థానిక పార్టీలతో పొత్తుల అంశంపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పలు రాష్ట్రాలు ఇటీవల వెల్లడైన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను భేటీలో విశ్లేషించనున్నారు. దీంతో పాటే యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన నరేగా పథాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కొత్తగా తెచ్చి జీ రామ్ జీ చట్టాన్ని అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో, దీనిపై. దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన నిరసన కార్యక్రమాలపై భేటీలో చర్చించనున్నట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. నిరసనలపై రోడ్‌మ్యాప్‌ను రూపొందించడానికి సభ్యుల నుంచి ప్రతిపాదనలు కోరనున్నట్లు తెలిసింది. కొత్త చట్టంపై కేంద్రప్రభుత్వం నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ తీసుకునే కార్యాచరణ కీలకం కానుంది. ఈ భేటీలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు **దామోదర రాజనర్సింహ ఢిల్లీకి చేరుకున్నారు.**

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో పొరుగునే ఉన్న పశ్చిమబెంగాల్ రాష్ట్రం సిలిగురిలోని ఓ హోటల్‌లో బంగ్లాదేశీయులకు ప్రవేశం లేదు అంటూ ఏర్పాటు చేసిన నోటీసు

ఐఎస్ స్థావరాలపై దాడులు

పలువురు ముష్కరులు మృతి చెందారన్న అమెరికా ఆర్మీ

- ఉగ్రవాదులకు 'హ్యాపీ క్రిస్మస్' అంటూ ట్రంప్ వ్యాఖ్య
- ఇవి ఉమ్మడి దాడులన్న నైజీరియా ప్రభుత్వం

వెస్ట్ పామ్ బీచ్: ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) లక్ష్యంగా అమెరికా వాయవ్య నైజీరియాలోని పలు ప్రాంతాలపై వైమానిక దాడులు జరిపింది. నైగర్–నైజీరియా సరిహద్దుల్లో ఉన్న సొకొటొ రాష్ట్రంలో ఐఎస్ నడుపుతున్న క్యాంపులపై ఈ దాడులు జరిగాయి. ఈ ప్రాంతంలో ప్రాబల్యం కోసం ఐఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. నైజీరియా యంత్రాంగం వినతి మేరకు గురువారం తమ దాడుల్లో పలువురు మృతి చెందినట్లు ప్రాథమికంగా సమాచారముందని అమెరికా మిలటరీ ప్రకటించింది. అమాయక క్రైస్తవులను అమానుషంగా చంపుతున్నందుకే ఐఎస్ శిబిరాలపై భీకర, శక్తివంతమైన దాడులు చేపట్టామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అయితే, ఇది అమెరికా బలగాలతో కలిసి చేపట్టిన ఉమ్మడి ఆపరేషన్ అని, నైజీరియా ప్రజలను చంపుతున్న ఉగ్రవాదులే తమ లక్ష్యమని నైజీరియా విదేశాంగ మంత్రి యూసుఫ్ మైతామాని అన్నారు. అదేవిధంగా, దాడులకు మతం ప్రాతిపదిక కాదని, క్రిస్మస్‌తో సంబంధం లేదని యూసుఫ్ స్పష్టం చేశారు. నైజీరియా నిఘా విభాగం అందించిన సమాచారం మేరకు ముందస్తు పథకం ప్రకారమే ఈ దాడులు జరిగాయన్నారు. మరిన్ని దాడులకు అవకాశం లేకపోలేదని పేర్కొన్నారు. అయితే, జిహాదీ గ్రూపుల దాడుల నుంచి క్రైస్తవులను కాపాడటంలో నైజీరియా ప్రభుత్వం విఫలమైందంటూ కొంతకాలంగా అధ్యక్షుడు ట్రంప్ ఆరోపణలు చేస్తున్నారు. 'ప్రత్యేకంగా ఆందోళనకరంగా మారిన దేశం'గా నైజీరియాపై అమెరికా ప్రభుత్వం ముద్ర వేసింది. దీని ప్రకారం.. మత స్వేచ్ఛ ఉల్లంఘనలు చోటుచేసుకున్న ఇలాంటి దేశాలపై ఆంక్షలు విధించే అవకాశముంది. ఈ నేపథ్యంలోనే అమెరికా మిలటరీ నవంబర్ నుంచే నైజీరియాలోని ఐఎస్ గ్రూపు స్థావరాలపై దాడులకు పథకం సిద్ధం చేసినట్లు చెబుతున్నారు.

ఐఎస్ అనుబంధ గ్రూపుల హింస

నైజీరియాలోని వాయవ్య ప్రాంతంలోని రెండు రాష్ట్రాల్లో ఐఎస్ అనుబంధ గ్రూపులు ఆధిపత్యం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఐఎస్‌కు సంబంధించిన ఓ గ్రూపు ఇప్పటికే బోర్నో రాష్ట్రంలో గట్టి పట్టు సాధించింది. ఈశాన్య నైజీరియాలో **బోకోహరామ్, ఐఎస్ అనుబంధ గ్రూపులు గత పదేళ్లుగా వేలాది మందిని పొట్టనబె**ట్టుకున్నాయి. బాధితుల్లో ఎక్కువ మంది ముస్లింలేనని ఆక్లెడ్ అనే మానవ హక్కుల విభాగం తెలిపింది. ఈ గ్రూపు ప్రపంచవ్యాప్తంగా జరిగే రాజకీయ పరమైన హింసను విశ్లేషిస్తుంది. ఐఎస్ అనుబంధ 'నైజీరియా–ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్'ఈశాన్య ప్రాంతంలో నడుస్తున్న అతిపెద్ద గ్రూపని విశ్లేషకుడు బులామా బుకాటి చెప్పారు. అదే వాయవ్య సొకొటొ, కెబ్బి రాష్ట్రాల్లో ప్రాబ**ల్యం కోసం స్థానికంగా లకురమా అని పిలిచే గ్రూపు ప్రయత్నిస్తోందన్నారు. ఈ గ్రూపునే** తాజాగా అమెరికా లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. గత ఏడాదిన్నర కాలంలో ఈ గ్రూపు సొకొటొలోని ప్రజలపై సామాజిక ఆంక్షలను అమలు చేస్తోందని చెప్పారు. అదే సమయంలో, సెంట్రల్ నైజీరియా ప్రాంతంలో క్రైస్తవులైన రైతులు, ముస్లింలైన పశువుల కాపరుల మధ్య నీళ్ల, పచ్చిక బయళ్ల విషయమై తరచూ ఘర్షణలు జరుగుతున్నాయని బుకాటి వివరించారు.

ట్రంప్ ఆరోపణల్లో నిజముందా?

నైజీరియాలోని వివిధ జిహాదీ గ్రూపులు జరుపుతున్న దాడుల్లో ముస్లింల కంటే క్రైస్తవులే ఎక్కువ మంది చనిపోయారనేందుకు ఎలాంటి ఆధారాలు లేవని మానవ హక్కుల సంస్థలంటున్నాయి. బాధితుల్లో రెండు మతాల వారూ దాదాపు సమానంగానే ఉంటున్నారన్నాయి. క్రిస్మస్ రోజు రాత్రి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎక్స్ వేదికగా..'నైజీరియాలో రాడికల్ ఇస్లామిక్ ఉగ్రవాదం పెచ్చుమీరడాన్ని మేం జరగనీయం. హ్యాపీ క్రిస్మస్'అంటూ వ్యాఖ్యానించారు. దాడులకు మద్దతు, సహకారం అందించిన నైజీరియా ప్రభుత్వానికి రుణపడి ఉంటామని అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ పేర్కొన్నారు. ఓ యుద్ధ నౌక నుంచి క్షిపణిని ప్రయోగిస్తున్న ఫొటోను రక్షణ శాఖ విడుదల చేసింది. నైజీరియా జనాభా 22 కోట్లు కాగా, వీరిలో క్రైస్తవులు, ముస్లింలు సమాన సంఖ్యలో ఉన్నారు.

వార్తల వెం'బడి'!

యూపీ బడుల్లో పత్రికా పఠనం తప్పనిసరి

స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్ల మధ్య నలిగిపోతున్న బాల్యాన్ని అక్షరాల వైపు మళ్లించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఒక గొప్ప ముందడుగు వేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో 'వార్తాపత్రిక పఠనం' తప్పనిసరి చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కేవలం చదవడమే కాదు.. విశ్లేషించడం, నేర్చుకోవడం లక్ష్యంగా ఈ 'పఠన ప్రచారం' సాగనుంది. నూతన మార్గదర్శకాల ప్రకారం పాఠశాలల్లో జరిగే మార్పులివే..

అసెంబ్లీలో 10 నిమిషాల పఠనం

రోజూ ఉదయపు ప్రార్థన సమయంలో కనీసం 10 నిమిషాలు వార్తాపత్రికలు చదవాలి. జాతీయ, అంతర్జాతీయ, క్రీడా వార్తలతో పాటు ముఖ్యమైన సంపాదకీయాలను విద్యార్థులు అందరికీ చదివి వినిపించాలి.

పద సంపద ప్రదర్శన

రోజూ దినపత్రికల్లోని ఐదు కఠిన పదాలను ఎంపిక చేసి, వాటిని నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తారు. దీనివల్ల విద్యార్థుల పద సంపద మెరుగుపడుతుంది. పాఠశాల గ్రంథాలయాల్లో మాతృభాష హిందీతో పాటు ఆంగ్ల దినపత్రికలను కూడా అందుబాటులో ఉంచాలి. పువ్వులు వద్దు.. పుస్తకాలే ముద్దు.. నినాదంతో పాఠశాల వేడుకల్లో ట్రోఫీలకు బదులు పుస్తకాలను బహుమతిగా ఇవ్వాలని నిర్ణయించారు. తొమ్మిది నుంచి 12వ తరగతి విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్లు, సంపాదకీయ వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. పాఠశాల మ్యాగజైన్లు లేదా సొంతంగా పత్రికల నిర్వహణ, సుడోకు, క్రాస్ వర్డ్ పోటీలను ప్రోత్సహిస్తారు. చిన్న పిల్లల కోసం వార్తల కటింగ్స్‌తో స్క్రాప్ బుక్ తయారు చేయిస్తారు.

ఫోన్లకు బానిస కాకుండా..

విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు బానిసలు కాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి పార్థసారథి సేన్ శర్మ తెలిపారు. 'వార్తాపత్రికలు చదవడం వల్ల పిల్లల్లో జనరల్ నాలెడ్జ్ పెరగడమే కాకుండా, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన పెరుగుతుంది. పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి సహాయపడుతుంది. ఏది నిజమైన వార్త, ఏది నకిలీ వార్త అనే తేడాను గుర్తించే పరిణతి వారిలో వస్తుంది'.. అన్నారాయన. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించి.. విద్యార్థులను అక్షరాల వైపు మళ్లించేందుకు యూపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తమవుతోంది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

ఏఐ పొట్ట కొట్టింది.. డిజైనర్ దారి తప్పాడు

దొంగగా మారిన గ్రాఫిక్ డిజైనర్!

ఒకవైపు ఆధునిక ప్రపంచం 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' విజయాలను వేడుక చేసుకుంటుంటే.. అదే టెక్నాలజీ ఒక 18 ఏళ్ల కుర్రాడి పొట్ట కొట్టింది. చేతిలోని పనిని ఏఐ లాగేసుకోవడంతో, ఆకలి తట్టుకోలేక ఆ యువకుడు తన స్నేహితురాలితో కలిసి చోరీ చేసి పోలీసులకు పట్టుబడ్డారు.

ఏం జరిగిందంటే?

ఇండోర్‌లోని రావు పోలీస్ స్టేషన్ పరిధిలో డిసెంబర్ 22వ తేదీ రాత్రి ఒక నగల దుకాణంలో సుమారు రూ.16 లక్షల విలువైన బంగారం, వెండి, వజ్రాభరణాలు చోరీ అయ్యాయి. ఈ కేసును ఛేదించిన పోలీసులు, భోపాల్‌లో తలదాచుకున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారిలో ఒకరు 18 ఏళ్ల గ్రాఫిక్ డిజైనర్ కాగా, మరొకరు డాక్టర్ కావాలని కలలు కంటూ 'నీట్' పరీక్షకు సిద్ధమవుతున్న యువతి. 'బంటీ ఔర్ బబ్లీ' సినిమా స్ఫూర్తితో.. డీసీపీ శ్రీకృష్ణ లాల్‌చందాని తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఇద్దరూ చిన్నప్పటి స్నేహితులు. మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు. 2005లో వచ్చిన 'బంటీ ఔర్ బబ్లీ' సినిమా చూసి స్ఫూర్తి పొందారు. ఎలాగైనా సులభంగా డబ్బు సంపాదించాలని ప్రణాళిక వేసుకుని ఈ చోరీకి పాల్పడ్డారు.

బతకడం కష్టమై తప్పు చేశా..

పోలీసుల విచారణలో.. 'నేను ఒక ఐటీ కంపెనీలో పార్ట్ టైమ్ గ్రాఫిక్ డిజైనర్‌గా పని చేసేవాడిని. కానీ కంపెనీ వాళ్లు ఏఐ టెక్నాలజీని వాడటం మొదలుపెట్టి, నా ఉద్యోగం తీసేశారు. చేతిలో పైసా లేక, బతకడం కష్టమై ఈ దారి ఎంచుకున్నాను'.. అని ఆ యువకుడు కన్నీళ్లు పెట్టుకోవడం కలచివేసింది. దొంగతనం చేసిన నగలను అమ్మడానికి వారు ప్రయత్నించారు కానీ, చూడ్డానికి చిన్నపిల్లల్లా ఉండటంతో ఎవరూ వాటిని కొనడానికి ముందుకు రాలేదు. తక్కువ ధర కోట్ చేయడంతో, క్రిస్మస్ సెలవుల తర్వాత నిదానంగా అమ్ముదామని వేచి చూస్తుండగా పోలీసులకు చిక్కారు. ప్రస్తుతం పోలీసులు వారి దగ్గర నుండి నగలను స్వాధీనం చేసుకున్నారు. సాంకేతికత తెచ్చిన మార్పు ఒక యువకుడిని నేరస్తుడిగా మార్చడం.. నేటి సామాజిక సంక్షోభానికి అద్దం పడుతోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

అవినీతి కేసులో మలేసియా మాజీ ప్రధానికి 15 ఏళ్ల జైలు

పుత్రజయ: ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో మలేసియా మాజీ ప్రధాని నజీబ్ రజాక్(72)కు 15 ఏళ్ల జైలు శిక్ష పడింది. దీంతోపాటు రూ.2,500 కోట్ల భారీ జరిమానా విధిస్తూ శుక్రవారం దేశ అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పు వెలువరించింది. ప్రభుత్వ పెట్టుబడి నిధి 1ఎంబీడీ నుంచి కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టిన అతిపెద్ద అవినీతి కేసులో ఆయన్ను కోర్టు దోషిగా నిర్ధారించింది. 1 ఎంబీడీ నిధి నుంచి తన సొంత ఖాతాకు రూ.6,500 కోట్లను మళ్లించారంటూ దాఖలైన కేసులో అధికార దుర్వినియోగం, మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు ఆయనపై 25 ఆరోపణలున్నాయి. ప్రస్తుతం 1ఎంబీడీ అవినీతి కేసులోనే నజీబ్ రజాక్ జైలులో ఉన్నారు. ఈ శిక్షాకాలం ముగిశాక, తాజా తీర్పు ప్రకారం జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుందని జడ్జి ప్రకటించారు. జరిమానా చెల్లింపులో విఫలమైన పక్షంలో ఆయన మరో 10 ఏళ్లు జైలులోనే గడపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అయితే, తానెలాంటి తప్పూ చేయలేదని రజాక్ అంటున్నారు. ఈ నిధులన్నీ సౌదీ అరేబియా నుంచి అందిన రాజకీయ విరాళాలని అంటున్నారు. లౌ టెక్ ఝో అనే ఫైనాన్షియర్ వల్లే కుంభకోణంలో ఇరుక్కోవాల్సి వచ్చిందంటున్నారు. లౌ టెక్ ఝో మాత్రం ఇప్పటికీ పోలీసులకు దొరకలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద 1 ఎంబీడీ ఆర్థిక కుంభకోణంలో ఈ తీర్పును మైలురాయిగా భావిస్తున్నారు.

తిరువనంతపురం మేయర్‌గా రాజేశ్ ఎన్నిక

101 వార్డులకు గాను 50 చోట్ల బీజేపీ విజయం

- కేరళలో కాషాయ దళం మొట్టమొదటి మేయర్‌గా రాజేశ్ రికార్డు
- 40 ఏళ్లుగా అధికార ఎల్డీఎఫ్‌కు కంచుకోటగా ఉన్న రాజధాని నగరం

తిరువనంతపురం: కేరళలో కాషాయదళం చారిత్రక విజయం సొంతం చేసుకుంది. రాజధాని తిరువనంతపురం స్థానిక ఎన్నికల్లో నాలుగు దశాబ్దాలుగా అప్రతిహతంగా అధికారం నిలుపుకుంటూ వస్తున్న వామపక్ష ఎల్డీఎఫ్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తిరువనంతపురం మేయర్‌గా మొట్టమొదటిసారిగా బీజేపీకి చెందిన వీవీ రాజేశ్ ఎన్నికయ్యారు. అంతేకాదు, కేరళలో కాషాయ దళం నుంచి ఎన్నికైన మొట్టమొదటి మేయర్‌గానూ రికార్డు నెలకొల్పారు. రాజేశ్ ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతల్లో ఉన్నారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో కార్పొరేషన్‌లోని 101 మంది సభ్యులకు గాను సగాని కంటే ఎక్కువగా 51 ఓట్లు రాజేశ్‌కు పడ్డాయి. విఝింజంలోని ఒక వార్డు మినహా మొత్తం 100 సీట్లకు ఎన్నికలు జరిగాయి. రాజేశ్‌కు ఒక స్వతంత్ర కౌన్సిలర్ మద్దతునిచ్చారు. ఎల్డీఎఫ్ అభ్యర్థి శివాజీకి 29 ఓట్లు, యూడీఎఫ్ నామినీ శబరినాథన్‌ను 19 ఓట్లు దక్కాయి. ఒక కౌన్సిలర్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. పోలైన రెండు ఓట్లను చెల్లనివిగా ప్రకటించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 101 వార్డులకు 50 వార్డుల్లో గెలిచిన బీజేపీ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నిక అనంతరం రాజేశ్ మేయర్‌గా ప్రమాణం చేశారు. డిప్యూటీ మేయర్‌గా కౌన్సిలర్‌గా మూడుసార్లు ఎన్నికైన బీజేపీ నేత జీఎస్ ఆశానాథ్ ప్రమాణం చేశారు. అభివృద్ధి విషయంలో దేశంలోని టాప్ 3 మున్సిపాలిటీల్లో తిరువనంతపురంను నిలపడమే తమ లక్ష్యమని రాజేశ్ ప్రకటించారు.

అభిమానులకు అభివాదం చేస్తున్న మేయర్ రాజేశ్, డిప్యూటీ మేయర్ ఆశా నాథ్

ఎల్డీఎఫ్‌కు ఎదురుదెబ్బ

కంచుకోట వంటి తిరువనంతపురం చేజారడం ఎల్డీఎఫ్‌కు గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. దాదాపు 40 ఏళ్లుగా ఇక్కడ ఎల్డీఎఫ్ అభ్యర్థులే విజయం సాధిస్తూ వస్తున్నారు. అయితే, ఇక్కడ ఎల్డీఎఫ్ ప్రాబల్యం చెక్కుచెదరలేదు. కోజికోడ్ కార్పొరేషన్‌లో అత్యధిక స్థానాలను ఎల్డీఎఫ్ అభ్యర్థులే కైవసం చేసుకున్నారు. కేరళలోని ఆరు మున్సిపల్ కార్పొరేషన్లకుగాను నాలుగింటిలో యూడీఎఫ్‌కు మేయర్ పోస్టులు దక్కాయి. అదేవిధంగా, బీజేపీ పాలక్కడ్, త్రిపునిధుర మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థులు విజయాలను నమోదు చేసుకున్నారు. పాలా మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా యూడీఎఫ్ మద్దతుతో 21 ఏళ్ల దియా బినూ పులిక్కంకండమ్ ఎన్నికయ్యారు. కేరళలో పిన్న వయస్కురాలైన మున్సిపల్ చైర్మన్‌గా రికార్డు సాధించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగిన ఈమె అనంతరం యూడీఎఫ్‌కు మద్దతు తెలిపారు.

హురియత్ చీఫ్ హోదా వదులుకున్న మిర్వాయిజ్

తీవ్ర ఒత్తిళ్ల వల్లేనంటూ ఎక్స్‌లో వ్యాఖ్య

శ్రీనగర్: కశ్మీర్ వేర్పాటువాద నేత, ముస్లిం మత పెద్ద మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ తన ఆల్ పార్టీస్ హురియత్ కాన్ఫరెన్స్(ఏపీహెచ్‌సీ) చైర్మన్ హోదాను వదిలేసుకున్నారు. ఆయన ఎక్స్ ప్రొఫైల్‌లో ఇప్పుడు పేరు, ప్రాంతం, ఇతర ప్రాథమిక వివరాలు మాత్రమే కనిపిస్తున్నాయి. గురువారం సాయంత్రం నుంచి ఆయన ఎక్స్ అకౌంట్‌లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. అధికార యంత్రాంగం తీవ్ర ఒత్తిళ్ల నేపథ్యంలో మరో మార్గం లేకనే ఏపీహెచ్‌సీ చైర్మన్ హోదాను తొలగించినట్లు మిర్వాయిజ్ తెలిపారు. 'బహిరంగ వేదికలు, సమాచార మార్గాలపై తీవ్ర ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ సమయంలో ప్రజలను చేరుకునేందుకు నాకున్న కొన్ని మార్గాల్లో ఇదొకటి. ఇలాంటి పరిస్థితుల్లో, మరో పరిష్కారం కనిపించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది'అని తెలిపారు. తన సారథ్యంలోని అవామీ యాక్షన్ కమిటీతోపాటు ఏపీహెచ్‌సీ విభాగాలపై అధికారులు నిషేధం విధించినందున తన హోదాను తొలగించాల్సి వచ్చిందని, లేకుంటే ఏకంగా తన అకౌంటే మూతబడుతుందని ఆయన వివరించారు. మిర్వాయిజ్ నిర్ణయం ఏపీహెచ్‌సీకి గొడ్డలి పెట్టువంటిదని పరిశీలకులు అంటున్నారు. మిర్వాయిజ్‌కు ఎక్స్‌లో 2.32లక్షల మంది ఫాలోయెర్లున్నారు. కశ్మీర్ ప్రజల స్వయం పాలనాధికారం లక్ష్యంగా 1993లో వేర్పాటువాద గ్రూపులన్నీ కలిసి ఏపీహెచ్‌సీ వేదికపై ఒకటయ్యాయి.

ప్రధాన కార్యదర్శుల సదస్సు ప్రారంభం

సాక్షి, న్యూఢిల్లీ: దేశరాజధాని వేదికగా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సహకార సమాఖ్య స్ఫూర్తి బలోపేతం, దేశ విస్తృతిపై ప్రధానంగా చర్చించే ఈ సదస్సు 28వ తేదీ వరకు కొనసాగుతుంది. శుక్రవారం ఢిల్లీలోని ఎన్ఏఎస్సీ కాంప్లెక్స్(పూసా)లో ప్రారంభమైన 5వ జాతీయ సదస్సులో 'వికసిత భారత్ కోసం మానవ మూలధనం(విద్య, ఆరోగ్యం, శిక్షణ, పరిశ్రమ)' అనే అంశంపై చర్చించారు. శని, ఆదివారాలు ప్రధాని మోదీ అధ్యక్షత వహిస్తారు. నాలుగేళ్లుగా ఈ సదస్సులను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్రానికి చెందిన పలు శాఖల కార్యదర్శులు దాన కిశోర్, జయేశ్ రంజన్, సందీప్ కుమార్ సుల్తానియా, సర్ఫరాజ్ అహ్మద్, యోగితా రాణా, ఆంధ్రప్రదేశ్ సీఎస్ విజయానంద్, కోన శశిధర్ తోపాటు ఆయా శాఖల కార్యదర్శులు సదస్సుకు హాజరయ్యారు.

పాక్‌లో ఇంకా 20 లక్షల మంది అఫ్గాన్లు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఇప్పటికీ 20 లక్షల మందికి పైగా అఫ్గాన్లు నివసిస్తున్నారని ఐరాస శరణార్థి విభాగం తెలిపింది. 2025లో 10 లక్షల మంది ఆ దేశం నుంచి తిరిగి స్వదేశానికి చేరుకున్నారంది. ఒక్క నవంబర్‌లోనే 1.71 లక్షల మంది అఫ్గానిస్తాన్‌కు వచ్చారని తెలిపింది. పాక్ అధికారులు చమన్, తోర్ఖామ్, బారాబ్చా బోర్డర్ పాయింట్ల మీదుగా మరో 37, 899 మందిని వెనక్కి పంపించివేశారని పేర్కొంది. నవంబర్‌లో రెండు దేశాల సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా మానవతా సాయం పంపిణీపై ప్రభావం చూపాయని తెలిపింది. తమ దేశంలో పెద్ద సంఖ్యలో ఉంటున్న అఫ్గాన్లను పంపించి వేసేందుకు పాకి**స్తాన్ ప్రభుత్వం** 2023 సెప్టెంబర్ నుంచి ప్రయత్నాలను ప్రారంభించింది. స్వదే**శంలో అస్థిర ప**రిస్థితులు, అణచివేత చర్యల కారణంగా వీరంతా పొరుగుదేశంలో **తలదాచుకుం**టున్నారు.

త్రిపుర అసెంబ్లీ స్పీకర్ బిశ్వ కన్నుమూత

అగర్తలా: త్రిపుర అసెంబ్లీ స్పీకర్ బిశ్వ బంధుసేన్(72) **శుక్రవారం** ఉదయం బెంగళూరులోని ఓ ప్రైవేట్ **ఆస్పత్రిలో తు**దిశ్వాస విడిచారు. తీవ్రమైన సెరిబ్రల్ **స్ట్రోక్‌కు గురైన** సేన్ కొంతకాలంగా ఆస్పత్రిలో చికిత్స **పొందుతున్నా**రు. ఈయనకు భార్య, కుమారుడు, **కుమార్తె ఉన్నా**రు. త్రిపురలోని ధర్మానగర్ నియోజకవర్గం నుంచి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన బిశ్వ బంధు సేన్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవముంది. మొదటిసారి కాంగ్రెస్ టిక్కెట్‌పై 2016 ఎన్నికల్లో గెలిచారు. అనంతరం 2018లో బీజేపీలో జాయినై ఎమ్మెల్యే అయ్యారు. సేన్ మృతిపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు. స్పీకర్ మరణంతో త్రిపుర ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను మూసివేశారు.

టొరంటో స్కార్‌బోరో క్యాంపస్‌లో కాల్పులు

భారత విద్యార్థి మృతి



టొరంటో: కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ టొరంటో స్కార్‌బోరో క్యాంపస్‌లో జరిగిన కాల్పుల ఘటనలో భారతీయ విద్యార్థి ప్రాణాలు కోల్పోయారు. ఓల్డ్ కింగ్స్టన్ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఓ వ్యక్తి గాయాలతో పడి ఉన్నట్లు సమాచారం అందిందని పోలీసులు తెలిపారు. తాము వచ్చి చూసేసరికే బుల్లెట్ గాయంతో అతడు మృతి చెంది ఉన్నాడన్నారు. వర్సిటీలో చదువుకుంటున్న శివాంక్ అవస్థి(20)గా అతడిని గుర్తించామని చెప్పారు. హత్య ఘటనగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన సమాచారం తెలిస్తే అందజేయాలని కోరారు.

బ్లీచింగ్ చల్లి..కత్తితో పొడిచి..

జపాన్‌లో 15 మందికి గాయాలు

టోక్యో: జపాన్‌లోని షిజుఒకా ప్రిఫెక్చర్‌లో వ్యక్తి కత్తితో దాడి చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లిన ఘటనలో కనీసం 15 మందికి గాయాలయ్యాయి. రాజధాని టోక్యోకు పశ్చిమాన ఉన్న మిషిమా నగరంలోని యోకోహమ రబ్బర్ కంపెనీలో శుక్రవారం ఘటన చోటుచేసుకుంది. 38 ఏళ్ల ఓ వ్యక్తి ముందుగా వెంట తెచ్చుకున్న బ్లీచింగ్ పౌడర్ చల్లడంతోపాటు కనిపించిన వారినల్లా కత్తితో పొడుచుకుంటూ పోయాడని పోలీసులు తెలిపారు. రసాయన గాఢత కారణంగా ఏడుగురు గాయపడ్డారు. కత్తి పోట్లతో గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఇందుకు కారణమైన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతర వివరాలను వెల్లడించలేదు.

రేపు జలాంతర్గామిలో రాష్ట్రపతి ప్రయాణం

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము(67) ఈ నెల 28వ తేదీన సబ్ మెరీన్ ద్వారా సముద్రం అడుగున ప్రయాణం చేయనున్నారు. కర్ణాటకలోని కర్వార్ నౌకాశ్రయం నుంచి ఆమె జలాంతర్గామిలో ప్రయాణించనున్నారు. తద్వారా సబ్‌మెరీన్‌లో ప్రయాణించిన రెండో భారత రాష్ట్రపతి ముర్ము కానున్నారు. మొదటిసారిగా దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 2006లో విశాఖ తీరం నుంచి సబ్‌మెరీన్ ద్వారా ప్రయాణించారు. రఫేల్, సుఖోయ్ 30 ఎంకేఐ యుద్ధ విమానాల్లో ప్రయాణించిన రాష్ట్రపతి ముర్ము, రెండు యుద్ధ విమానాల్లో ప్రయాణించిన మొదటి రాష్ట్రపతిగా నిలిచారు. మూడు రాష్ట్రాల్లో నాలుగు రోజులపాటు కొనసాగే రాష్ట్రపతి పర్యటన శనివారం గోవా నుంచి మొదలుకానుంది.

రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని భేటీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సమావేశమయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ సమావేశం ఫొటోలను రాష్ట్రపతి భవన్ అనంతరం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో షేర్ చేసింది. ఇతర వివరాలను వెల్లడించలేదు.

తుర్కియేలో ఐఎస్ ఉగ్రవాది అరెస్ట్

ఇస్తాంబుల్: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనే వారిపై దాడులకు కుట్ర పన్నిన ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాది ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు శుక్రవారం తుర్కియే అధికారులు తెలిపారు. మలాట్యా నగరంలో పోలీసులు, జాతీయ నిఘా విభాగం అధికారులు చేపట్టిన ఉమ్మడి ఆపరేషన్‌లో ఇబ్రహీం బుర్తాకుసిన్‌ను పట్టుబడ్డాడన్నారు. తుర్కియేతో ఇతర దేశాల్లో ఉన్న ఐఎస్ ఉగ్రవాదులతో బుర్తాసిన్‌కు సంబంధాలున్నాయని, సంక్షోభాలున్న ప్రాంతాల్లో పోరాడేందుకు ఇతడు సిద్ధమయ్యాడని వివరించారు. అతడుంటున్న ఇంట్లో దొరికిన నిషేధిత ఐఎస్ సాహిత్యం, డిజిటల్ పరికరాలను సీజ్ చేశామని అధికారులు తెలిపారు. క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల్లో రక్తపాతం సృష్టించేందుకు సిద్ధమైన వందలాది ఐఎస్ ఉగ్రవాదులను రెండు రోజుల క్రితం తుర్కియే అధికారులు దేశవ్యాప్తంగా జరిపిన సోదాల్లో అరెస్ట్ చేయడం తెల్సిందే.

మసీదుపై బాంబు దాడి..ఆరుగురు మృతి

బీరుట్: సిరియాలోని హోమ్స్ నగరంలో శుక్రవారం ప్రార్థనల సమయంలో జరిగిన బాంబు దాడిలో ఆరుగురు చనిపోయారు. మరో 21 మంది గాయాలపాలయ్యారు. నగరంలోని అలావైట్ వర్గం ప్రధానంగా ఉన్న వాడి అల్ ధాహబ్ ప్రాంతంలో ఉన్న మసీదులో ఘటన చోటుచేసుకుంది. బషర్ అస్సద్ పాలన ముగిశాక దేశంలో వివిధ వర్గాల మధ్య పోరు తీవ్రరూపం దాల్చింది. అస్సద్ కూడా అలావైట్ వర్గానికి చెందిన వాడే. మార్చిలో అస్సద్ వర్గం భద్రతా బలగాలపై దాడులు జరిపిన దగ్గర్నుంచి వర్గపోరు కొనసాగుతోంది. ఈ దాడుల్లో వందలాదిగా జనం ప్రాణాలు కోల్పోయారు. సోమవారం నుంచి సిరియా ప్రభుత్వ బలగాలు, కుర్దిష్ సాయుధులకు మధ్య అలెప్పో చుట్టుపక్కల ప్రాంతాల్లో పోరు మొదలైంది.

మానవ సేవే మాధవ సేవ

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మత, సాంఘిక సంస్కరణ ఉద్యమాలు

పాశ్చాత్య దేశాల్లో మేధాసంపత్తి, వ్యక్తి వాదం ఆధిక్యంలో ఉన్నప్పుడు భారతీయులకు పశ్చిమ దేశాలతో సాన్నిహిత్యం ఏర్పడింది. తొలి దశలో పాశ్చాత్య విద్యను అభ్యసించిన భారతీయులు విదేశీ సంస్కృతిపై వ్యామోహంతో వారి వేషధారణ, అలవాట్లు, మత భావాల పట్ల ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలోనే 19వ శతాబ్దంలో భారతీయుల్లో జాతీయ భావం అంకురించింది. రాజా రామ్మోహన్‌రాయ్ తదితరులు మత, సాంఘిక సంస్కరణోద్యమాలు సాగించారు. ఫలితంగా హిందూ సమాజంలో సంస్కరణలొచ్చాయి. ఈ సంస్కర్తల ప్రభావం జాతీయోద్యమంపై ప్రసరించింది.

రాజా రామ్మోహన్‌రాయ్

హిందూ మత సాంస్కృతిక పునరుజ్జీవనానికి రాజా రామ్మోహన్‌రాయ్ (1772–1833) నాంది పలికాడు. ఈయన బెంగాల్‌లోని రాధానగరంలో ఉన్నత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఇతడి తండ్రి రమాకాంత్ రాయ్ జమీందారు. రాయ్ చిన్నతనంలోనే బెంగాలీ, అరబిక్, పర్షియన్, సంస్కృత భాషలను నేర్చుకున్నాడు. తర్వాత ఇంగ్లిష్, ఫ్రెంచ్, లాటిన్, గ్రీకు, హిబ్రూ భాషలపై పట్టు సాధించాడు. హిందూ, ముస్లిం, క్రైస్తవ గ్రంథాలను కూలంకషంగా చదివాడు. రాయ్ 1805లో ఈస్టిండియా కంపెనీలో చేరి తొమ్మిదేళ్లు ఉద్యోగం చేశాడు. కానీ ఉద్యోగంలో సంతృప్తి కలగలేదు. సనాతన హిందూ ఆచారాల్లోని దోషాలు నశించి, సమాజం అభివృద్ధి చెందాలంటే ఆంగ్ల విద్య నేర్చుకోవాలని, తద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడం సాధ్యమవుతుందని భావించాడు.

బ్రహ్మ సమాజ స్థాపన (1828)

రాయ్ 1828లో బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. దేవుడొక్కడేనని, ఉపనిషత్తుల్లో పేర్కొన్న మార్గమే మోక్షసాధన అని బోధించాడు. విగ్రహారాధను నిరసించాడు. సర్వమానవ సమానత్వాన్ని బోధించాడు. పరమత సహనం చూపాలని, మానవ కోటిని ఉద్ధరించాలని ప్రబోధించాడు. ఈ మతం హిందూ మతాన్ని వదల్లేకపోయినా పాశ్చాత్య ఉదార వైఖరి అవలంబించిందని మెకనాల్డ్ విశ్లేషించాడు.

సాంఘిక దురాచారాలపై..

మత బోధనలే కాకుండా హిందూ మతంలోని సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి రాయ్ నడుం బిగించాడు. 1811లో తన సోదరుడు జగన్ మోహన్ రాయ్ మరణించినప్పుడు ఆయన భార్యను కూడా చితిపై ఉంచి దహనం చేయడం చూసి రాయ్ హృదయం ద్రవించింది. సతీసహగమనం, బాల్యవివాహాలను నిర్మూలించాలని భావించాడు. ఉపన్యాసాలు, పత్రికల ద్వారా తన భావాలను ప్రచారం చేశాడు. విలియం బెంటింగ్ 1829లో సతీసహగమన నిషేధ చట్టాన్ని రూపొందించడంలో రాజా రామ్మోహన్‌రాయ్ కృషి దాగి ఉంది. బాల్యవివాహాలను రద్దు చేయడానికి, కుల వ్యవస్థ నిర్మూలనకు, స్త్రీ జనోద్ధరణకు నిర్విరామ కృషి చేశాడు.

విద్యాసేవ

ఆంగ్ల విద్యను అభ్యసించనిదే దేశం బాగుపడదని భావించిన రాయ్ ఆంగ్ల విద్యను ప్రోత్సహించాడు. 1830లో అలెగ్జాండర్ డఫ్ ఆంగ్ల పాఠశాలను నెలకొల్పినప్పుడు, మెకాలే ఇంగ్లిష్ విద్యను ప్రవేశపెట్టినప్పుడు సమర్థించాడు. తన భావాలను ప్రచారం చేయడానికి సంబంధకౌముది అనే బెంగాలీ వార పత్రికను, మీరట్- ఉల్- అక్బర్ అనే పారశీక పత్రికను నడిపాడు. పత్రికా స్వాతంత్ర్యం కోసం పాటుపడ్డాడు. విలియం బెంటింగ్ రాయ్ ఘనతను గుర్తించి 'రాజా' బిరుదుతో సత్కరించి ఇంగ్లండ్‌కు పంపాడు. 1833లో బ్రిస్టల్ నగరంలో రాయ్ మరణించాడు. అతడి మరణానంతరం దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవచంద్రసేన్ బ్రహ్మ సమాజ ఆశయాలను కొనసాగించారు.

స్వామి దయానంద సరస్వతి

ఆర్య సమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి (1824–1883). ఈయన గుజరాత్‌లోని మోర్వి గ్రామంలో జన్మించాడు. ఇతణ్ని హిందూ సాంస్కృతిక పునరుజ్జీవనానికి మూల పురుషుడిగా పేర్కొంటారు. దయానంద సరస్వతి అసలు పేరు మూల్‌శంకర్ తివారి. ఇతడికి చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఇది వయస్సుతో పాటు పెరగడంతో వివాహాన్ని తిరస్కరించి ఇల్లు వదిలివెళ్లాడు. అనేక పుణ్యక్షేత్రాలు, పుణ్య పురుషులను దర్శించి సన్యాసాశ్రమం స్వీకరించాడు. చివరకు మధురలో విరజానందుడనే గురువు వద్ద వేదాలు అభ్యసించాడు. సత్యార్థ ప్రకాశ్ అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులో తన భావాలను ప్రకటించాడు. అవి..

1) దేవుడొక్కడే 2) విగ్రహారాధన పనికిరాదు 3) వేదాలు విజ్ఞాన గనులు. వేదోక్తమయిన హిందూ మతం అన్నిటికన్నా మిన్న 4) మోక్షానికి సత్ప్రవర్తన అవసరం 5) జాతి ఐక్యతకు ఏకమతం ఉండాలని భావించాడు. వేరే మతాల్లో చేరిన హిందువులను తిరిగి సొంత మతంలోకి మార్చడానికి శుద్ధి అనే పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ సిద్ధాంతాలే ఆర్య సమాజానికి మూల సూత్రాలయ్యాయి. తన సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి 1875లో ఆర్య సమాజాన్ని స్థాపించాడు.

కులభేదం, అంటరానితనం, బాల్య వివాహాలను ఖండించి స్త్రీ జనోద్ధరణ, వెనుకబడిన జాతుల అభివృద్ధి కోసం కృషి చేశాడు. 1883లో ఆయన మరణించాక స్వామి శ్రద్ధానందుడు, లాలా లజపతి రాయ్, లాలా హంసరాజ్ మెదలైనవారు ఆర్యసమాజాన్ని ప్రచారం చేశారు.

రామకృష్ణ పరమహంస

భారతీయ ఆధ్యాత్మిక తత్వానికి మారో రూపం రామకృష్ణ పరమహంస. ఈయన అసలు పేరు గదాధర్ చటోపధ్యాయ్. 1833లో బెంగాల్‌లోని కామర్‌స్కూర్ గ్రామంలో జన్మించాడు. ఈయన గొప్ప భక్తుడు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. కలకత్తాలోని దక్షిణేశ్వర్‌లో ఇతడి సోదరుడు రామ్ కుమార్ ఛటర్జీ అర్చకుడిగా పనిచేసేవాడు. దీంతో రామకృష్ణుడు కూడా దక్షిణేశ్వర్‌లో నివసించేవాడు. కొద్ది కాలానికి రామకృష్ణ పరమహంస అక్కడి కాళీమాత ఆలయానికి అర్చకుడయ్యాడు. ఆమెను ధ్యానం చేస్తూ ధ్యాన సమాధిలో మునిగిపోయేవాడు. 'తోతాపురి' అనే యోగి ఆయన సమాధి స్థితిని సరి చేయడంతో రామకృష్ణుడు పరిపూర్ణుడయ్యాడు. తర్వాత..

1) దేవుడొక్కడే, అతడు సర్వాంతర్యామి 2) భగవంతుణ్ని తెలుసుకోవడమే జ్ఞానం 3) అన్ని మతాలు భగవంతుణ్ని చేరే మార్గాలను చూపుతాయి 4) మోక్ష సాధనకు కోర్కెలను విసర్జించాలి 5) మానవ సేవే మాధవసేవ అని బోధించాడు. తన బోధనలను వ్యాప్తం చేసే బాధ్యతను ప్రియ శిష్యుడైన స్వామి వివేకానందుడికి అప్పగించి 1886లో పరమపదించాడు.

ప్రభావం: భారతదేశ సంస్కృతిపై రామకృష్ణ పరమహంస ప్రభావం పరోక్షంగా ఉంది. ఆయన వివేకానందుణ్ని తీర్చిదిద్దాడు. వివేకానందుడు ప్రపంచానికి భారతదేశ గొప్పతనాన్ని చాటాడు. అతడి వల్ల ప్రపంచం భారతదేశ ఔన్నత్యాన్ని గ్రహించింది.

స్వామి వివేకానంద (1863-1902)

19వ శతాబ్దం నాటి సంస్కర్తలందరూ దేశంలో హిందూ మత సంస్కరణకు పూనుకున్నారు. అయితే స్వామి వివేకానంద హిందూ మత ఔన్నత్యాన్ని, భారతీయ మత శాస్త్ర లోతులను ప్రపంచానికి చాటాడు. వివేకానందుడి అసలు పేరు నరేంద్ర నాథ్ దత్తా. ఇతడు 1863లో కలకత్తాలో జన్మించాడు. మొదట బ్రహ్మసమాజం పట్ల ఇతడికి అభిమానం ఏర్పడింది. కానీ కుటుంబంలో వచ్చిన కొన్ని కల్లోలాల కారణంగా భగవంతుడిపై నమ్మకం పోయింది. ఆ సందర్భంలో రామకృష్ణ పరమహంస గురించి తెలుసుకున్నాడు. ఆయనను చూడటానికి వచ్చి 'నీవు భగవంతుణ్ని చూశావా? నాకు చూపిస్తావా? అని ప్రశ్నించాడు. రామకృష్ణుడు చూపిస్తానని తన బొటన వేలితో వివేకానందుణ్ని తాకాడు. దీంతో వివేకానందుడు అనిర్వచనీయమైన అనుభూతి పొందాడు. తర్వాత నాస్తిక భావాన్ని వదిలి రామకృష్ణుడికి శిష్యుడయ్యాడు. సన్యాసిగా, గొప్ప వేదాంతిగా మారాడు. వివేకానందుడు గొప్ప వక్త, మధుర గాయకుడు. రామకృష్ణుడి భావాలను ప్రచారం చేసేందుకు అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల సదస్సుకు హాజరయ్యాడు. తన ఉపన్యాసంతో కొద్ది నిమిషాల్లోనే సభికులను ఆకట్టుకున్నాడు. సభికుల కోరికపై ఉపన్యాసాన్ని కొనసాగించి అద్వైత సిద్ధాంతాన్ని 5 గంటల పాటు వివరించాడు. భారతీయ ఆధ్యాత్మిక తత్వబోధనలను వారికి తెలియజేశాడు. రామకృష్ణుడి బోధనలు ప్రచారం చేయడానికి కలకత్తాలోని బేలూరు వద్ద మఠం నిర్మించాడు. అందులో రామకృష్ణుడి విగ్రహం ప్రతిష్ఠించి 'రామకృష్ణ' అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. నేటికీ రామకృష్ణుడి బోధనలను ప్రచారం చేస్తూ సంఘ సేవలో పాలుపంచుకుంటోంది. నిర్వీర్యమవుతున్న భారత జాతిని మేల్కొలుపుతూ వివేకానందుడు అనేక బోధనలు చేశాడు.

వివేకానందుడు ప్రచారం చేసిన సిద్ధాంతాలు

1) సర్వమతాల వేదాంతానికి మూలం హిందూ మతం.
2) హిందూ మతంలో జీవముంది. దాన్ని పునరుద్ధరించడమే మన కర్తవ్యం.
3) పాశ్చాత్యులను అనుసరించడం నాగరికత కాదు. అది దుర్బలుల లక్షణం. నీ సంస్కృతి గొప్పది. దానికి దూరం కావొద్దు.
4) నువ్వు నీ దేశానికి దూరం కావొద్దు.
5) మానవ సేవే మాధవసేవ. కాబట్టి సాటి మనుషులకు సేవ చేయి.
6) భారతదేశం నశిస్తే ప్రపంచంలో ఆధ్యాత్మిక తత్వం నశిస్తుంది.

ఇంకా దేశభక్తికి దృఢ దీక్ష అవసరమని బోధించాడు. ఆకలితో అల్లాడే సాటి భారతీయులను ఆదుకోండని దేశ ప్రజలను కోరాడు. ఇలా అభ్యర్థిస్తూ మైసూరు మహారాజుకు ఒక ఉత్తరం రాశాడు. హిందూ సంస్కృతి వ్యాప్తికి అహోరాత్రాలు కృషి చేసి 1902లో తన 39వ ఏట మరణించాడు.

దివ్యజ్ఞాన సమాజం - అనిబిసెంట్

మేడమ్ బ్లావట్‌స్కీ, కల్నల్ ఆల్‌కాట్ 1875లో అమెరికాలో థియోసోఫికల్ సొసైటీని స్థాపించారు. ఐర్లాండ్‌కు చెందిన అనిబిసెంట్ ఈ సొసైటీ శాఖను 1893లో మన దేశంలో ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనిబిసెంట్ హిందూ మత గ్రంథాలన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి, హిందూ మత గొప్పదనాన్ని తెలుసుకున్నారు. హిందూ సంస్కృతిని కాపాడి ఆ మతాన్ని పునరుద్ధరించాలని నిశ్చయించుకున్నారు. దివ్యజ్ఞాన సమాజం సర్వసమాన సౌభ్రాతృత్వం, పరమత సహనం, సర్వమత సమానత్వాలను ప్రచారం చేసింది. కులవ్యవస్థను ఖండించి సంఘంలోని వెనుకబడిన జాతుల సంక్షేమానికి పాటు పడింది. భారతీయులకు విద్యాబుద్ధులు నేర్పడానికి అనిబిసెంట్ కాశీలో హిందూ కళాశాలను స్థాపించారు. కొద్ది కాలం తర్వాత మదన్‌మోహన్ మాలవ్య ఈ కళాశాలను హిందూ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేశారు.

హోమ్ రూల్ లీగ్

అనిబిసెంట్ సంఘ సేవ చేయడమే కాకుండా భారత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1916 సెప్టెంబర్‌లో మద్రాసులో 'హోమ్‌రూల్ లీగ్' ప్రారంభించారు. 27,000 మందితో దేశమంతా దీని శాఖలు ఏర్పడ్డాయి. వారి సహాయంతో ఆమె దేశమంతా హోమ్‌రూల్ ఉద్యమాన్ని నడిపారు. చాలా పట్టణాల్లో బహిరంగ సభల్లో ఉపన్యాసాలు ఇచ్చి దేశభక్తిని ప్రబోధించారు. ఆమె కృషి వల్ల దేశమంతటా జాతీయభావం బలపడింది. ఆమె విదేశీ వనిత అయినా భారతదేశాన్ని మతృభూమిగా భావించి గొప్ప సేవ చేశారు. 1917లో బ్రిటిష్ ప్రభుత్వం ఆమెను జైల్లో నిర్బంధించింది. అనిబిసెంట్ గొప్ప పండితురాలు. ఆమె తొలి పేరు మిస్ ఉడ్. ఐర్లాండ్‌లో చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి దివ్యజ్ఞాన సమాజ సభ్యురాలిగా భారత్‌కు వచ్చారు.

ఈశ్వర చంద్ర విద్యాసాగర్

రాజా రామ్మోహన్‌రాయ్ తర్వాత హిందూ సమాజానికి అంతటి సేవ చేసిన మహనీయుడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్. ఇతడి అసలు పేరు ఈశ్వర చంద్రుడు. హిందూ శాస్త్రాల్లో విద్యాసాగర్ అనే పట్టాను పొందడంతో విద్యాసాగర్ అని పేరుతో కలిసిపోయింది. ఈయన 1820లో బెంగాల్‌లో వీరశింఘ అనే గ్రామంలో జన్మించాడు. ధర్మ, వేదాంత, జ్యోతిష శాస్త్రాల్లో గొప్ప పండితుడు. ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి విద్యాశాఖాధికారి అయ్యాడు. కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశాడు. విద్యావ్యాప్తి కోసం విశేష కృషి చేశాడు. విద్యాశాఖాధికారిగా ఉన్న కాలంలో 40 పాఠశాలలను, కలకత్తాలో మెట్రోపాలిటన్ కాలేజీని స్థాపించాడు. స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. ఈయన కృషి వల్ల చాలామంది బెంగాలీ స్త్రీలు విద్యావంతులయ్యారు. సత్పురుషుల చరిత్ర, బెంగాల్ చరిత్ర, సీతావనవాసం అనే గ్రంథాలను రచించాడు. సులభంగా సంస్కృతం నేర్చుకోవడానికి వీలుగా అనేక సంస్కృత పుస్తకాలు రాశాడు.

సంఘ సంస్కరణలు

రాజా రామ్మోహన్‌రాయ్‌లా ఈశ్వరచంద్రుడు స్త్రీ జనోద్ధరణకు విశేష కృషి చేశాడు. బాల్యవివాహాలు, బహుభార్యత్వం, వరకట్న దురాచారాలను ఖండించాడు. వితంతు వివాహాలను చట్టబద్ధం చేయాలని ప్రచారం చేసి వితంతు వివేకం అనే గ్రంథాన్ని రాశాడు. తన కుమారుడికి వితంతువును ఇచ్చి వివాహం చేసి ఆదర్శప్రాయుడయ్యాడు. ఈయన కృషి వల్ల 1856లో డల్హౌసీ వితంతు పునర్వివాహ చట్టం చేశాడు. తన సంపాదనంతా సంఘ సంస్కరణలకు ఖర్చు చేశాడు. ఈశ్వరచంద్రుడు 1891లో మరణించాడు..

ద్వీపకల్ప భారతదేశంలో ఎత్తయిన పర్వత శిఖరం?

ద్వీపకల్ప ప్రాంతం.. భారతదేశ నైసర్గిక విభాగాల్లో అతి పెద్దది. పశ్చిమాన సహ్యాద్రి కొండలు, తూర్పున తూర్పు కనుమలు, ఉత్తరాన గంగా మైదానం, సరిహద్దులుగా ఉన్న ద్వీకల్ప ప్రాంతం.. దక్షిణాన కన్యాకుమారి వరకు విస్తరించి ఉంది. ఇది వివిధ పీఠభూములు, కొండలు, నదీలోయలతో కూడి ఉంది. ద్వీపకల్ప భారతదేశ ఉత్తర భాగాన్ని మధ్యమెట్టభూములుగా, దక్షిణ భాగాన్ని దక్కన్ పీఠభూమిగా వ్యవహరిస్తారు. మధ్య మెట్టభూముల ప్రాంతం.. మాళ్వా, బుందేల్‌ఖండ్, బాగేల్‌ఖండ్, ఛోటా నాగ్‌పూర్, మైకాల పీఠభూములు, వింధ్య, సాత్పూరా, అజంతా, బాలాఘాట్, చందేరి, క్రైమూరు, ఆరావళి మొదలైన కొండలతో కూడి ఉంది!!

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భూగోళశాస్త్రం

ద్వీపకల్ప భారతదేశం - నైసర్గిక స్వరూపం

దక్కన్ పీఠభూమి

మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ల్లో దక్కన్ పీఠభూమి విస్తరించి ఉంది. దక్కన్ పీఠభూమిలో బసాల్ట్ రకానికి చెందిన లావాతో ఉన్న ప్రాంతాన్ని దక్కన్ నాపలు అంటారు. పశ్చిమ మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణాల్లో దక్కన్ నాపలు విస్తరించి ఉన్నాయి. బసాల్టిక్ లావా ఘనీభవించి ఏర్పడ్డ అగ్నిపర్వత శిలలు శిథిలమవడంతో దక్కన్ నాపల ప్రాంతంలో నల్లరేగడి నేలలు ఏర్పడ్డాయి.

ఆరావళి పర్వత శ్రేణులు

ఇవి ద్వీపకల్ప పీఠభూమికి వాయవ్య సరిహద్దులో నైరుతి–ఈశాన్య దిశలో విస్తరించాయి. ఈ శ్రేణులు గుజరాత్‌లోని పాలంపూర్ నుంచి ఢిల్లీ వరకు వ్యాపించి ఉన్నాయి. ఆరావళి పర్వతాలు పురాతన ముడుత పర్వతాల కోవకు చెందుతాయి. ఇవి ప్రీ కాంబ్రియన్ భౌమ్యయుగంలో ఏర్పడ్డాయి. ఆ కాలంలో ఇవి ప్రస్తుత హిమాలయాల కంటే విశిష్టంగా ఉండేవని నిపుణుల అంచనా. తర్వాత ఇవి శిథిలమై.. ప్రస్తుతం అవశిష్ట పర్వతాలకు ఉదాహరణగా మిగిలాయి. వింధ్య–సాత్పూరా పర్వతశ్రేణుల మధ్య ఉన్న విదరణ లోయ (Rift valley) ద్వారా నర్మదా నది ప్రవహిస్తోంది. వింధ్య–సాత్పూరా పర్వతశ్రేణులు భ్రంశ/ఖండ పర్వతాలకు మంచి ఉదాహరణలు. వింధ్య పర్వతశ్రేణులను ఆనుకొని ఉన్న మాళ్వా పీఠభూమి గిరిపద పీఠభూములకు మంచి ఉదాహరణ. మైకాల పీఠభూమిలోని అమర్‌ఖంటక్ శిఖర ప్రాంతం నుంచి నర్మదా నది ప్రవహిస్తోంది. పశ్చిమ తీరంలోని పశ్చిమ కనుమలు(సహ్యాద్రి కొండలు) మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళల్లో విస్తరించి ఉన్నాయి. కేరళలోని పాల్‌ఘాట్ కనుమను మినహాయిస్తే ఇవి దాదాపు అవిచ్ఛిన్నంగా విస్తరించి ఉన్నాయి.

పశ్చిమ కనుమలు

కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అన్నామలై, పళని, ఏలకుల కొండల రూపంలో పశ్చిమ కనుమలు వ్యాపించి ఉన్నాయి. పాల్‌ఘాట్ కనుమ వద్ద నీలగిరి కొండలు, పశ్చిమ-తూర్పు కనుమలను అనుసంధానిస్తున్నట్లుగా కనిపిస్తాయి. ఇవి శంఖు ఆకార శిఖరాలను పోలి ఉంటాయి. ఇవి పశ్చిమాన అరేబియా సముద్రం వైపు నిట్రవాలుగా ఉంటాయి. దక్కన్ పీఠభూమి వైపు మెట్లలా తిన్నని వాలులను కలిగి ఉంటాయి. వీటిని 'ట్రిపియన్ నైసర్గిక స్వరూపం'గా అభివర్ణిస్తారు.

తూర్పు కనుమలు

మహారాష్ట్రలోని సహ్యాద్రి కొండల్లో ఉన్న సన్నని థాల్‌ఘాట్, భోర్‌ఘాట్ కనుమల ద్వారా ముంబై-పుణే, ముంబై-ఇండోర్ రైలు, రహదారి మార్గాలు నిర్మించారు. పశ్చిమ కనుమలతో పోలిస్తే తూర్పు కనుమల సగటు ఎత్తు తక్కువ. తూర్పు కనుమలు కూర్చొని ఉన్న ఏనుగుల ఆకారంలో కనిపిస్తాయి. విస్తారమైన వికోషీకరణం వల్ల వీటి శిఖర భాగాలు బోర్లించిన మూకుళ్ల మాదిరిగా ఉంటాయి. తూర్పు కనుమలు మహానది-కృష్ణానది డెల్టాల మధ్య మాత్రమే అవిచ్ఛిన్న పర్వత శ్రేణిగా వ్యాపించాయి. ఇవి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా-గోదావరి డెల్టా ప్రాంతంలో సుమారు 150 కిలోమీటర్ల మేర దాదాపు అదృశ్యమవుతాయి. కృష్ణానది డెల్టాకు దక్షిణంగా నల్లమలై, ఎర్రమలై, వెలికొండ పర్వతాలుగా తూర్పు కనుములు విస్తరించాయి.

నీలగిరి కొండలకు దక్షిణంగా దక్షిణ తమిళనాడులోని షెవరాయి, జావ్వో కొండలను తూర్పు కనుమల విస్తరణలుగా పరిగణిస్తారు. మేఘాలయలోని షిల్లాంగ్ పీఠభూమి ఒకప్పుడు ద్వీపకల్ప భారతదేశంలో భాగంగా ఉండేది. గారో- రాజ్‌మహల్ కొండల మధ్య భూఅవనతం జరగడంతో ఈ భాగం ద్వీపకల్ప భారత ప్రాంతం నుంచి విడిపోయి ఈశాన్య భారతదేశం వైపు వెళ్లింది. అందువల్ల షిల్లాంగ్ పీఠభూమిని ద్వీపకల్ప భారతదేశ అవుట్‌పోస్ట్ అంటారు. ద్వీపకల్ప భారతదేశ పీఠభూములుప్రపంచంలోనే అతి ప్రాచీనమైన శిలలు కలిగి ఉన్నాయి. ఆర్కియన్ (ప్రీ కాంబ్రియన్) భౌమ్య యుగానికి చెందిన శిలలు వీటి పునాదులు. వీటి వయసు దాదాపు 2500 మిలియన్ ఏళ్లకు పైనే. ద్వీపకల్ప పీఠభూముల శిలలు అతి కఠినమైన రూపాంతర, అగ్నిశిలల తరగతికి చెందినవి. ద్వీపకల్ప పీఠభూమి పటలం ఏ రకమైన భౌమ్య చలనాలకు గురికాకుండా సుస్థిరంగా ఉండటంతో ఇక్కడ భూకంప ప్రక్రియ జరగడం అరుదు..

మాదిరి ప్రశ్నలు

1. ద్వీపకల్ప భారతదేశంలో ఎత్తయిన పర్వత శిఖరం?
ఎ) వావుల్‌మాలా బి) అనైముడి
సి) మహేంద్రగిరి డి) హరిశ్చంద్ర
2. దొడబెట్ట కింది ఏ పర్వతశ్రేణుల్లో ఎత్తయిన శిఖరం?
ఎ) తూర్పు కనుమలు బి) పళని కొండలు
సి) నీలగిరి కొండలు
డి) అన్నామలై కొండలు
3. రాంచీ పీఠభూమి ఏ నైసర్గిక స్వరూపంలో భాగం?
ఎ) మైకాల పీఠభూమి
బి) మాళ్వా పీఠభూమి
సి) బుందేల్‌ఖండ్ పీఠభూమి
డి) ఛోటానాగపూర్ పీఠభూమి
4. ఆరావళి పర్వతశ్రేణులు ఏయే నదీ లోయలను వేరు చేస్తున్నాయి?
ఎ) గంగా–సింధు బి) గంగా–యమున
సి) గంగా–చంబల్ డి) గంగా–సట్లెజ్
5. దక్కన్ నాపల ప్రాంతం ఏ తరగతికి చెందిన శిలలతో ఉంది?
ఎ) గ్రానైట్ బి) సున్నపురాయి
సి) బసాల్ట్ డి) ఇసుకరాయి
6. పచ్‌మాడి వేసవి విడిది కేంద్రం ఏ పర్వత శ్రేణుల్లో ఉంది?
ఎ) సాత్పురా బి) మహాదేవ
సి) వింధ్య డి) బాలాఘాట్
7. గోదావరి, కృష్ణా నదులు ఏ పర్వతాల్లో ఉద్భవిస్తున్నాయి?
ఎ) తూర్పు కనుమలు
బి) అజంతా కొండలు
సి) నీలగిరి కొండలు
డి) సహ్యాద్రి కొండలు
8. దక్కన్ పీఠభూమి ఏ దిశ వైపు వాలి ఉంది?
ఎ) తూర్పు–ఆగ్నేయ బి) ఉత్తర
సి) ఈశాన్య డి) తూర్పు–ఈశాన్య
9. కింది ఏ పర్వతశ్రేణులు భారతదేశాన్ని ఉత్తర దక్షిణాలుగా విభజిస్తాయి?
ఎ) వింధ్య పర్వతాలు
బి) సాత్పురా పర్వతాలు
సి) మైకాల డి) అజంతా కొండలు
10. బస్తర్ పీఠభూమి ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
ఎ) ఒడిశా బి) మధ్యప్రదేశ్
సి) ఛత్తీస్‌గఢ్ డి) కర్ణాటక
11. ద్వీపకల్ప భారతదేశంలోని ఏ ప్రాంతంలో బ్యాడ్ ల్యాండ్ భూ దృశ్యం ఏర్పడింది?
ఎ) మాళ్వా పీఠభూమి
బి) బీగల్ ఖండ్ పీఠభూమి
సి) చంబల్ లోయ డి) సోన్ లోయ
12. ద్వీపకల్ప భారతదేశంలో తీవ్ర స్థాయిలో భూకంపాలు సంభవించే ప్రాంతం?
ఎ) మరఠ్వాడ బి) విదర్భా
సి) బుందేల్ ఖండ్ డి) కచ్
13. దక్కన్ నాపలు సుమారు ఎన్ని సంవత్సరాల క్రితం ఏర్పడ్డాయి?
ఎ) 100 బిలియన్ సంవత్సరాలు
బి) 150 బిలియన్ సంవత్సరాలు
సి) 200 బిలియన్ సంవత్సరాలు
డి) 250 బిలియన్ సంవత్సరాలు
14. షేన్ కొట్టా కనుమ ఏ పర్వత శ్రేణుల్లో ఉంది?
ఎ) తూర్పు కనుమలు
బి) పశ్చిమ కనుమలు
సి) బాలాఘాట్ పర్వత శ్రేణులు
డి) అజంతా కొండలు
15. ద్వీపకల్ప భారతదేశంలోకెల్లా నిట్రవాలులు కలిగిన పీఠభూమి?
ఎ) కర్ణాటక బి) మహారాష్ట్ర
సి) తెలంగాణ డి) అమరఖంఠక్
16. ఆంధ్రప్రదేశ్‌లో సుప్రసిద్ధ శ్రీశైలం పుణ్య క్షేత్రం ఏ కొండల్లో ఉంది?
ఎ) ఎర్రమలై బి) నల్లమలై
సి) శేషాచలం డి) వెలిగొండ
17. గురు శిఖర్ ఏ పర్వత శ్రేణుల్లో ఎత్తయిన శిఖరం?
ఎ) వింధ్య బి) సాత్పూరా
సి) ఆరావళి డి) తూర్పు కనుమలు
18. భారతదేశంలోని ఏ ప్రాంతంలో అతి పురాతన శిలలు లభ్యమవుతున్నాయి?
ఎ) హిమాలయాలు
బి) పూర్వాంచల్ కొండలు
సి) గంగా మైదానం
డి) ద్వీపకల్ప పీఠభూమి
19. మాళ్వా పీఠభూమి ఏ దిశగా వాలి ఉంది?
ఎ) ఉత్తర బి) దక్షిణ
సి) తూర్పు డి) పడమర
20. పెండ్రా పీఠభూముల్లో ఏ నది ఉద్భవిస్తోంది?
ఎ) చంబల్ బి) సోన్
సి) దామోదర డి) తపతి
21. సహ్యాద్రి కొండల్లో ఎత్తయిన పర్వత శిఖరం?
ఎ) అనైముడి బి) త్రయంబక్
సి) వావుల్ మలై డి) హరిశ్చంద్ర
22. రాజమహల్ కొండలు ఏ పీఠభూమిలో భాగం?
ఎ) ఛోటా నాగపూర్ బి) దక్కన్
సి) షిల్లాంగ్ డి) బస్తర్

సమాధానాలు

1) బి; 2) సి; 3) డి; 4) ఎ; 5) సి; 6) డి; 7) డి; 8) ఎ; 9) ఎ; 10) సి; 11) సి; 12) డి; 13) ఎ; 14) బి; 15) ఎ; 16) బి; 17) సి; 18) డి; 19) ఎ; 20) బి; 21) సి; 22) ఎ.

అష్ట సూత్ర పథకం నుంచి తెలంగాణ ఏర్పాటు దాకా..

కాంగ్రెస్.. దేశంలోనే ప్రాచీనమైన రాజకీయ పార్టీ. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటులో, ఆ తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరిట ఆంధ్రప్రదేశ్ రూపుదిద్దుకోవడంలో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం పురుడు పోసుకోవడంలోనూ కాంగ్రెస్‌ది కీలకపాత్ర. రాష్ట్ర విభజన విషయంలో తొలుత ఊగిసలాట ధోరణిని అవలంబించినా.. ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చడానికే ఆ పార్టీ మొగ్గు చూపింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ ఉద్యమం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో వివిధ రాజకీయ పార్టీల పాత్ర

కాంగ్రెస్ పార్టీ

కాంగ్రెస్ పార్టీ 1885 డిసెంబర్ 28న ఆవిర్భవించింది. దేశంలోనే పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ భారత్‌ను ఎక్కువ కాలం పాలించింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సుమారు 38 ఏళ్లపాటు పరిపాలన సాగించారు.

- జవహర్‌లాల్ నెహ్రూ 16 సంవత్సరాల 286 రోజులు, ఇందిరా గాంధీ 15 సంవత్సరాల 350 రోజులు(రెండు పర్యాయాలు), రాజీవ్ గాంధీ 5 సంవత్సరాల 32 రోజులు ప్రధానిగా పనిచేశారు.
- కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. తెలంగాణను ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేసి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లోనూ సుమారు 42 ఏళ్లపాటు (1956-83, 1989-94, 2004-14) అధికారంలో ఉంది.
- 1971లో పీవీ నరసింహారావు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఈయనే తెలంగాణకు చెందిన తొలి ముఖ్యమంత్రి. పీవీ తర్వాత మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వీరెవరూ పూర్తి కాలం పదవిలో కొనసాగలేదు.

ఉద్యమంలో కాంగ్రెస్ పాత్ర

- 1956-83 వరకు ఏపీ కాంగ్రెస్‌లో వైరివర్గాల ఆధిపత్యమే కొనసాగింది. 1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆ ప్రాంత కాంగ్రెస్ నేతలు కీలక పాత్ర పోషించారు.
- ఉద్యమాన్ని శాంతింపజేసేందుకు 1969 ఏప్రిల్ 11న ఢిల్లీలో అష్టసూత్ర పథకాన్ని ప్రకటించారు. 1971లో చెన్నారెడ్డి అధ్యక్షత వహించిన తెలంగాణ ప్రజాసమితి పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో అద్భుత ఫలితాలు సాధించింది. తెలంగాణలోని 14 పార్లమెంట్ స్థానాల్లో పదింటిని టీపీఎస్ అభ్యర్థులు గెలుచుకున్నారు. కాంగ్రెస్ దారుణంగా ఓటమిపాలైంది.
- ముల్కీ నిబంధనలు చెల్లుబాటు అవుతాయని 1972 అక్టోబర్ 3న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దీంతో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం ప్రారంభమైంది.

కాంగ్రెస్ (ఐ) ఏర్పాటు

- ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని 1972 నవంబర్ 27న ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటించారు. వెంటనే పంచసూత్ర పథకాన్ని విడుదల చేశారు. అత్యవసర పరిస్థితి విధించిన కాలంలో కాసు బ్రహ్మానందరెడ్డికి ఇందిరా గాంధీతో అభిప్రాయభేదాలు వచ్చాయి. పార్టీని చీల్చేందుకు ప్రయత్నించారు. ఇందిరా గాంధీ 1978 జనవరి 1న కాంగ్రెస్ (ఐ)ను స్థాపించారు.
- అదే సమయంలో కాసు బ్రహ్మానందరెడ్డి 'రెడ్డి కాంగ్రెస్'ను స్థాపించారు.
- 2000లో జి.చిన్నారెడ్డి నాయకత్వంలో 41 మంది ఎమ్మెల్యేలు తెలంగాణకు అనుకూలంగా సోనియా గాంధీకి వినతిపత్రం ఇచ్చారు.
- 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్, వామపక్ష పార్టీలు కలిసి పోటీ చేసి విజయం సాధించాయి. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో తెలంగాణ అంశాన్ని చేర్చింది. కామన్ మినిమమ్ ప్రోగ్రాంలోనూ యూపీఏ ప్రభుత్వం ఈ అంశాన్ని పొందుపర్చింది.
- 2004 జూన్ 7న రాష్ట్రపతి ప్రసంగించారు. యూపీఏ ప్రభుత్వం ఆ ప్రసంగంలోనూ తెలంగాణ అంశాన్ని చేర్చింది. తెలంగాణపై విస్తృత అంగీకారం కోసం ప్రణబ్ ముఖర్జీ అధ్యక్షతన 2004 నవంబర్‌లో కేంద్రం ఒక ఉపసంఘాన్ని నియమించింది.
- ఉద్యమం తీవ్రం కావడంతో తెలంగాణ ఏర్పాటుపై అభిప్రాయాలు స్వీకరించడానికి వైఎస్ ప్రభుత్వం 2008లో రోశయ్య కమిటీని నియమించింది.
- 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా బరిలో దిగింది. అధికారంలోకి వస్తే తెలంగాణ ఇస్తామని ఆ పార్టీ ప్రచారం చేసింది.
- ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 156 స్థానాల్లో విజయం సాధించింది. వైఎస్ రాజశేఖర రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు.
- రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తూ 2009 సెప్టెంబర్ 2న నల్లమల అటవీ ప్రాంతంలోని పావురాల గుట్ట వద్ద హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్ మరణించారు.
- 2009 సెప్టెంబర్ 3న రోశయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.
- 2009 అక్టోబర్ 9న హైదరాబాద్ ఫ్రీజోన్ అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పుతో తెలంగాణవాదుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. 2009 అక్టోబర్ 13న రోశయ్య అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు.
- 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించారు. తెలంగాణలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. 2009 డిసెంబర్ 7న సచివాలయంలో రోశయ్య అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సీపీఎం, ఎంఐఎం తప్ప ఈ సమావేశంలో పాల్గొన్న మిగిలిన పార్టీలన్నీ తెలంగాణకు మద్దతిచ్చాయి.

అఖిలపక్ష సమావేశం

- 2009 డిసెంబర్ 9న రాత్రి 11.30 గంటలకు హోంమంత్రి చిదంబరం తెలంగాణపై ప్రకటన చేశారు. 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించి, అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడతారు' అని చిదంబరం పేర్కొన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసిన తర్వాతే తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని డిసెంబర్ 23న మరో ప్రకటనలో పేర్కొన్నారు.
- రెండో ప్రకటనతో తెలంగాణలో ఆందోళనలు మొదలయ్యాయి.
- తెలంగాణకు మద్దతుగా కాంగ్రెస్ నేతలు రాజీనామా చేయకపోవడం పట్ల ఆగ్రహంతో ఉన్న విద్యార్థులు, జేఏసీ నేతలు 2010 ఫిబ్రవరి 14న మంత్రులు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇళ్లపై దాడి చేశారు.

- కేంద్ర హోం మంత్రి ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణ తరఫున ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆంధ్రా తరఫున కావూరి సాంబశివరావు హాజరయ్యారు.

శ్రీకృష్ణ కమిటీ

- 2010 ఫిబ్రవరి 3న జస్టిస్ శ్రీకృష్ణ కమిటీని నియమించారు. 2010 ఫిబ్రవరి 19న రాజకీయ జేఏసీ నుంచి కాంగ్రెస్ బయటకు వచ్చింది. రాష్ట్రంలో ఆందోళనల నేపథ్యంలో కేంద్రం రోశయ్యను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించింది. 2010 నవంబర్‌లో ఆయన స్థానంలో స్పీకర్ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని ముఖ్యమంత్రిగా నియమించింది.
- విద్యార్థులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు 2010 డిసెంబర్ 26న గన్‌పార్క్ వద్ద దీక్ష చేశారు. అదే నెల 30న శ్రీకృష్ణ కమిటీ తన నివేదికను కేంద్ర హోంశాఖకు సమర్పించింది.
- 2011 జనవరి 6న కేంద్ర ప్రభుత్వం శ్రీకృష్ణ కమిటీ నివేదికను బహిర్గతం చేసింది.
- శ్రీకృష్ణ కమిటీ సమైక్యాంధ్రకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చింది. దీంతో తెలంగాణలో ఆందోళనలు కొనసాగాయి. తెలంగాణ ఏర్పాటుపై ఆలస్యానికి నిరసనగా జూపల్లి కృష్ణారావు 2011 మార్చి 3న మంత్రి పదవికి రాజీనామా చేశారు.
- 2011 జూన్‌లో పీసీసీ అధ్యక్షుడిగా డి. శ్రీనివాస్ స్థానంలో బొత్స సత్యనారాయణను నియమించారు. ఈ ఘటనతో సీఎం, స్పీకర్, పీసీసీ అధ్యక్షుడి లాంటి మూడు కీలక పదవులు ఆంధ్రా ప్రాంతానికే దక్కాయి.
- 2011 అక్టోబర్ 1న నల్లగొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేశారు.
- 2012 డిసెంబర్ 28న హోంమంత్రి సుశీల్ కుమార్ షిండే నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. 2013 జూన్ 30న హైదరాబాద్‌లో తెలంగాణ సాధన సభ పేరుతో కాంగ్రెస్ బహిరంగ సభ నిర్వహించింది.

రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం

- 2013 జూలై 11న ఢిల్లీలో కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో తెలంగాణపై చర్చ జరిగింది. 2013 జూలై 30న హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణ ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ప్రకటించింది. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని 2013 ఆగస్టు 5న చిదంబరం పార్లమెంటులో ప్రకటించారు. ఆగస్టు 6న ఆంటోని నేతృత్వంలో అంతర్గతంగా విభజన కమిటీ ఏర్పాటైంది. దిగ్విజయ్ సింగ్, వీరప్ప మొయిలీ, అహ్మద్ పటేల్ ఈ కమిటీలో సభ్యులు. 2013 అక్టోబర్ 8న ఎ.కె. ఆంటోనీ చైర్మన్‌గా కేంద్ర మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారు.
- 2013 డిసెంబర్ 5న 'తెలంగాణ ముసాయిదా బిల్లు 2013'ను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ బిల్లు డిసెంబర్ 12న రాష్ట్రానికి చేరింది. డిసెంబర్ 15న బిల్లు ప్రతులను ఎమ్మెల్యేలకు అందజేశారు. తర్వాతి రోజు చర్చ ప్రారంభమైంది. 2014 జనవరి 22న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.
- సభలో 87 మంది ఎమ్మెల్యేలు మాట్లాడారు. మిగతా సభ్యులు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా తెలిపారు. దీనిపై చర్చ ముగిసిందంటూ 2014 జనవరి 30న స్పీకర్ ప్రకటించారు.
- పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా ఫిబ్రవరి 9న ఆంధ్రాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అవిశ్వాసానికి కారణమైన పదకొండు మంది ఎంపీలను ఫిబ్రవరి 11న కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. ఫిబ్రవరి 14న కాంగ్రెస్ ఎంపీ లగడపాటి రాజగోపాలరెడ్డి లోక్‌సభలో పెప్పర్ స్ప్రేతో దాడిచేశారు.
- ఈ సందర్భంగా 16 మంది ఆంధ్రప్రదేశ్ ఎంపీలను స్పీకర్ మీరాకుమార్ లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. 2014 ఫిబ్రవరి 13న యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది.
- 2014 ఫిబ్రవరి 18న తెలంగాణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఫిబ్రవరి 20న యూపీఏ ప్రభుత్వం రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టగా, ఆ రోజే బిల్లు ఆమోదం పొందింది. 2014 మార్చి 1న బిల్లుపై రాష్ట్రపతి సంతకం చేశారు. మార్చి 2న కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.
- జూన్ 2ను అపాయింటెడ్ డేగా కేంద్రం 2014 మార్చి 4న ప్రకటించింది.
- దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది.

ఎంఐఎం

- హైదరాబాద్ కేంద్రంగా ఎంఐఎం రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.
- ప్రస్తుత అసెంబ్లీలో ఈ పార్టీకి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు.
- తెలంగాణ ఉద్యమానికి ఎంఐఎం దూరంగానే ఉంది.
- 2010 జనవరి 5న ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశానికి ఎంఐఎం అగ్రనేతలు అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు.
- తెలంగాణ ఏర్పడితే మతతత్వ శక్తులు విజృంభిస్తాయనే భయాన్ని వారు వెలిబుచ్చారు.
- 2013 నవంబర్ 12, 13 తేదీల్లో రాష్ట్ర విభజనపై ఏర్పాటు చేసిన మంత్రుల బృందానికి ఎంఐఎం తన సూచనలు, సలహాలు అందజేసింది.
- 2014 జనవరి 20న ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ విభజన బిల్లుపై అసెంబ్లీలో మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధిలో కోస్తాంధ్ర పాత్ర ఏమీలేదని, నిజాం కాలం నుంచే హైదరాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని గణాంకాలతో సహా వివరించారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణకు మొగ్గు చూపారు..

Another term for hyperlink is..

BANK EXAMS
COMPUTER AWARENESS

The Internet is a worldwide network of networks. It can be defined as a global network of over millions of smaller heterogeneous computer networks consists of a set of national, regional and private. The internet is the common language where by dissimilar computers with various operating systems, are able to communicate with each other using a standard set of protocols.

The Internet is the world's largest computer network, a distinction it has earned by virtue of being a "network of networks." The Internet is an outgrowth of a network (ARPANET) established roughly a quarter-century ago to meet the needs of researchers working in the defense industry in the United States and a few of their colleagues in other countries.

The ARPANET grew slowly, from a handful of computers in 1971 to more than 1000 in 1984. Working with the ARPANET researchers came to regard high-speed computer networks as an indispensable tool for academic research in all fields and in 1986 the US National Science Foundation established NSFNET to provide network connections to more research institutions and improve international network cooperation. In 1987, the Internet served more than 10,000 computers. By 1989 the network had grown to more than 100,000.

Evolution of Internet

- The origin of Internet can be traced to a U.S. Department of Defense (DoD) organization called Advanced Research Projects Agency (ARPA).
- ARPA developed a four node packet switching network called ARPANET in 1969. The network was intended to support the military research on fault tolerant computer networks. DoD wanted to ensure a reliable data transfer in the event of a nuclear war, even if parts of the network has been destroyed.
- As the years pass by, the network grew in size and by 1st January 1983, the ARPANET no longer remained an experimental network but its control was passed over to Defense Communications Agency (DCA).
- The network then became available for the academic research, government employee and contractors.
- The world's fastest and most powerful computers were made available to an academic and scientific community.
- In 1990 the ARPANET was officially decommissioned.

Some of the major networks contributing to the growth of the internet are as follows:

- ARPANET
- USENET (User's network)
- CSNET (Computer science network)
- BITNET (Because it's time network)
- NSFNET (National science foundation network)
- WWW (World Wide Web)
- NREN (National research and education network)
- Intranet

It is said that the Internet is growing at a rate of 20% per month. The data speeds have gone up considerably, which makes the access even faster.

- The event which started as a military assistance program is now largely a private enterprise.

Services on the Internet

The services that are available on the Internet can be classified into two categories:

- Communication services (electronic mail (e-mail))
- Information retrieval services (Web (pages with links and multimedia content of its Web sites))

Applications of Internet

Traditionally the internet has the following applications.
1) E-mail 2) News
3) Remote login
4) File transfer
5) World wide web (www).

MODEL QUESTIONS

1. A ______ is a named location on a disk where files are stored.
   1) Folder 2) Pod 3) Version
   4) Bag 5) None of the above
2. The ______ allows you to choose where to go and is located below the Standards Buttons toolbar.
   1) System menu
   2) Address bar 3) Menu bar
   4) Tool bar
   5) None of the above
3. A _____ is a set of computer instructions that carry out a task on the computer.
   1) Program 2) Database
   3) Memory file 4) Folder
   5) None of the above
4. An operating system version designed for home use is Microsoft Windows XP______
   1) Home Edition
   2) Media Center Edition
   3) Tablet PC Edition
   4) All of the above 5) None
5. A user-interface that is easy to use is considered to be______
   1) user-happy 2) user-simple
   3) user-friendly 4) Interface
   5) None of the above
6. When you press and release the secondary mouse button you are______
   1) Right-clicking
   2) Left-clicking
   3) Either 1 or 2
   4) All of the above
   5) Neither 1 nor 2
7. Another term for hyperlink is_______
   1) Link 2) Source
   3) Bar 4) All of the above
   5) None of the above
8. A graphical user interface displays_________
   1) Graphics 2) Text
   3) Both 1 and 2
   4) Neither 1 nor 2 5) None
9. The ______ program compresses larger files into a smaller file.
   1) Win Zip 2) Win Shrink
   3) Win Style 4) Win small
   5) None of the above
10. The efficient data structure to insert/delete a number in a stored set of numbers is _________.
    1) Queue 2) Linked list
    3) Doubly linked list
    4) Binary tree
    5) None of the above
11. Caps lock, Num-lock are known as _______.
    1) Modifier key 2) Toggle key
    3) Function key 4) Numeric key
    5) None of these
12. Which of the following memories must be refreshed many times per second?
    1) Static RAM
    2) Dynamic RAM 3) EPROM
    4) ROM 5) None of these
13. Anurag is a supercomputer developed in _____
    1) China 2) USA 3) India
    4) England 5) None of these
14. A result of a computer virus can not lead to_______
    1) Disk Crash
    2) Mother Board Crash
    3) Corruption of program
    4) Deletion of files
    5) None of these
15. Choose the correct way to indicate that a line in a C++ program is a comment line, that is/a line they will not be executed as an instruction.
    1) Begin the line with a # sign
    2) Begin the line with double slashes (/ /)
    3) Begin and end the line with double hyphens (-_-)
    4) Indent the line
    5) None of these
16. Programming language built into user programs such as Word and Excel are known as_____
    1) 4GLs 2) Macro languages
    3) Procedure-oriented languages
    4) Visual programming languages
    5) None of these
17. Firewalls are used to protect against _______.
    1) Unauthorized Attacks
    2) Virus Attacks
    3) Data Driven Attacks
    4) Fire Attacks
    5) All of these
18. System software is the set of programs that enables your computer's hardware devices and ______software to work together.
    1) Management 2) Processing
    3) Utility 4) Application
    5) None of these
19. RAM can be thought of as the ________ for the computer's processor.
    1) Factory 2) Operating room
    3) Waiting room
    4) Planning room
    5) None of these
20. The CPU and memory are located on the ________.
    1) Expansion board
    2) Motherboard
    3) Storage device
    4) Output device
    5) None of these
21. Word processing, spreadsheet and photo-editing are examples of ________.
    1) Application software
    2) System software
    3) Operating system software
    4) Platform software
    5) None of the above
22. To hyperlink on the web page through HTML language, _____ tag is used.
    1) <ahref> 2) <a> 3) <link>
    4) <hlink> 5) <href>
23. Drop cap option found in which menu?
    1) Insert 2) Format 3) Edit
    4) Tools 5) None of these
24. A half byte is known as ________.
    1) Data 2) Bit 3) Half byte
    4) Nibble 5) All of these
25. A piece of computer hardware that is physically placed between two devices each of which manages data in a different way is called_______.
    1) Modern 2) Interface
    3) Clue 4) Data bus
    5) All of these
26. ______ tags, when placed on an animal, can be used to record and track in a database all of the animals movements.
    1) POS 2) RFID 3) PPS
    4) GPS 5) None of these
27. Format for musical data communication between two devices such as computer and synthesizer is called_______.
    1) HTML 2) MP3 3) MPEG
    4) MIDI 5) None of these

KEY

1) 1 2) 2 3) 1 4) 1 5) 3
6) 1 7) 1 8) 3 9) 1 10) 3
11) 2 12) 2 13) 3 14) 2 15) 2
16) 4 17) 1 18) 4 19) 3 20) 2
21) 1 22) 1 23) 1 24) 4 25) 2
26) 2 27) 4